
'సంక్షేమ పథకాల అమలే సర్కారు పని తీరుకు కొలమానం'

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 237

శుక్రవారం 12-5-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL





**జై జైస్వాల్..**

98 పరుగులు చేసిన జైస్వాల్.. కోల్‌కతాపై రాజస్తాన్ గెలుపు - 12లో



**స్వల్ప నష్టాల్లో మార్కెట్లు**

సెన్సెక్స్ 36 పాయింట్లు క్షీణత.. నిఫ్టీ 18 పాయింట్లు డౌన్ - 13లో



**ఉద్ధవ్‌ను సీఎంగా నియమించలేం**

బలపరీక్షకు ముందే ఉద్ధవ్ స్వచ్ఛందంగా రాజీనామా చేశారని, ఆయనను తిరిగి సీఎంగా నియమించలేమని సుప్రీంకోర్టు పేర్కొంది.

వివరాలు 6లో ▸



**ఇమ్రాన్ అరెస్ట్ చట్టవిరుద్ధం**

పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్ అరెస్ట్ పూర్తిగా చట్ట విరుద్ధమని.. ఆయన్ని వెంటనే విడుదల చేయాలని ఆ దేశ సుప్రీం కోర్టు ఆదేశించింది.

వివరాలు 6లో ▸



**పాలనాధికారం ఢిల్లీ ప్రభుత్వానిదే**

ఢిల్లీలో పరిపాలనా వ్యవహారాలపై శాసన, కార్యనిర్వాహక అధికారాలు స్థానిక ఢిల్లీ ప్రభుత్వానికే ఉంటాయని సుప్రీం తేల్చిచెప్పింది.

వివరాలు 6లో ▸



**'అమెరికా పౌరసత్వ చట్టం-23'**

గ్రీన్‌కార్డులు, హెచ్-1బీ వీసాల జారీలో మార్పుల కోసం ఉద్దేశించిన పౌరసత్వ చట్టం-2023ను డెమొక్రాటిక్ పార్టీ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టింది.

వివరాలు 6లో ▸

# ఇళ్లు ఫుల్ స్పీడ్!

## 50,000 మంది నిరుపేదలకు అమరావతిలో ఇళ్ల పట్టాలు

### మౌలిక సదుపాయాల కల్పనను వెంటనే పూర్తి చేయాలన్న సీఎం జగన్



- ఫేజ్ 1 టిడ్కో ఇళ్లలో ఇప్పటికే 51,564 పంపిణీ.. జూన్‌లో మరో 87 వేలు
- రెండో విడతలో 1,12,092 గృహాలు సెప్టెంబరు నుంచి లబ్ధిదారులకు
- గుడివాడలో 8,912 టిడ్కో ఇళ్లు జూన్‌లో పంపిణీకి ఏర్పాట్లు
- విశాఖ బీచ్‌లు, బెజవాడ రివర్ బెడ్‌పై ప్రత్యేకంగా దృష్టిపెట్టాలన్న సీఎం
- పురపాలక, పట్టణాభివృద్ధి శాఖలపై ముఖ్యమంత్రి జగన్ సమీక్ష

సాక్షి, అమరావతి: సీఆర్డీఏ పరిధిలో గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాలకు చెందిన దాదాపు 50 వేల మంది నిరుపేదల సొంతింటి కల సాకారం అవుతోంది. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకం కింద వీరికి ఇళ్ల పట్టాల జారీ ప్రక్రియ వేగం పుంజుకుంది. ఇది ఇళ్లు లేని నిరుపేదల చిరకాల వాంఛను నెరవేర్చే బృహత్తర కార్యక్రమమని సీఎంజగన్ పేర్కొన్నారు. మౌలిక సదుపాయాల కల్పన పనులను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖపై గురువారం తన క్యాంపు కార్యాలయంలో సీఎం సమీక్ష నిర్వహించారు.

**హైకోర్టుకు అదనపు భవనం..**

అమరావతిలో 50,004 మంది పేదలకు 1,402.58 ఎకరాల్లో ఇళ్ల పట్టాలకు సంబంధించి

మిగతా 2వ పేజీలో ▶

## ఫ్యాక్ట్ చెక్

### మళ్లీ గురివింద నిందలే!

**ఖజానాకు ఆదా చేస్తే అక్రమమా రామోజీ?**

- నాడు నవయుగకు నామినేషన్‌పై ఇస్తే నచ్చిందా?
- నేడు టెండర్ ద్వారా మేఘాకు ఇస్తే తప్పా?
- పోలవరంలో చంద్రబాబు పాపాలను సరిదిద్దేందుకు రూ.1,615.75 కోట్లతో టెండర్లు
- ఆర్థిక బిడ్‌లో రూ.1,665.84 కోట్లకు కోట్ చేసిన ఓ సంస్థ
- రివర్స్ టెండర్లలో మేఘా, రిత్విక్ (సీఎం రమేష్‌ది) పోటాపోటీ
- రూ.1,599.21 కోట్లకే మేఘా రెడీ.. ఖజానాకు రూ.66.63 కోట్లు ఆదా

- వివరాలు 14లో



## అప్పులంటూ అబద్ధాలా?



- ఆర్టిస్ట్ జీవీ రావుకు ఆర్థిక నిపుణుడి ముద్ర
- అలాంటి వ్యక్తి నోటితో బాబు కోసం తప్పుడు లెక్కలు
- అవే వాస్తవాలంటూ 'ఈనాడు'లో ప్రముఖంగా ప్రచురణ
- సీఎం ప్రత్యేక కార్యదర్శి దువ్వూరి కృష్ణ మండిపాటు
- వైఎస్ జగన్ ప్రభుత్వ ప్రతిష్టను దిగజార్చడమే లక్ష్యం
- రాష్ట్రం అంధకారం అట.. శ్రీలంక, పాకిస్తాన్ అయిపోయిందట!
- అప్రకటిత రుణాలట.. రూ.పది లక్షల కోట్ల అప్పులట!
- ఇలా చెప్పడం ఆర్‌బీఐ, కాగ్, కేంద్ర ఆర్థిక శాఖలను అపహాస్యం చేయడం కాదా?
- ఎక్కువ ఏళ్లకు అప్పు తీసుకుంటే భావితరాలపై భారమని ఎలా రాస్తారు?
- ఈ విషయంలో కేంద్రం సక్రమమైతే, రాష్ట్రం అక్రమమా?
- బడ్జెట్, బడ్జెట్ బయట, ప్రభుత్వ రంగ సంస్థల అప్పులన్నీ రూ.6,51,789.07 కోట్లే
- మిగతా అప్పులెక్కడో సీఏగా సస్పెన్షన్‌కు గురైన జీవీ రావు, ఈనాడు చెప్పాలి
- గత టీడీపీ సర్కారు కంటే జగన్ సర్కారులోనే తక్కువ అప్పులు
- ఎన్ని కష్టాలున్నప్పటికీ డీబీటీ ద్వారా ప్రజల ఖాతాల్లో రూ.2.10 లక్షల కోట్లు
- విద్యుత్‌పై కూడా బాబు, ఎల్లో మీడియా వంకర రాతలు

5లో

## క్రీడలకు ప్రోత్సాహం

- విశాఖ పర్యటనలో క్రీడాకారులతో సీఎం జగన్ ఆత్మీయ భేటీ
- రాష్ట్రం నుంచి మరింత మంది రాణించాలి
- అపోలో క్యాన్సర్ ఆసుపత్రిని ప్రారంభించిన సీఎం
- సీ హారియర్ యుద్ధ విమానాల మ్యూజియం, స్పోర్ట్స్ ఎరీనాకు ప్రారంభోత్సవం.. భీమిలి ఫిష్ ల్యాండింగ్ సెంటర్‌కు శంకుస్థాపన

3 లో



విశాఖలోని వైఎస్సార్ వీసీఏ-వీడీసీఏ స్టేడియంలో ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న సీఎం జగన్

## సీఎం రేసులో లేను

**టీడీపీతో పొత్తు ఖాయమని జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ సంకేతాలు • సీఎం పదవి కావాలని అడగాలంటే ఆ స్థాయి ఉండాలి కదా అంటూ వ్యాఖ్య**



- నాకు సీఎం పదవి ఇస్తానని టీడీపీ ఎలా చెబుతుంది?
- జనసేన బలం తెలిశాక టీడీపీ అధ్యక్షుడి స్థానంలో నేనున్నా ఆ మాట చెప్పను
- పొత్తు కండిషన్ కేవలం వైఎస్సార్‌సీపీ దిగాలి అంతే
- అభిమానులు నిరాశ పడడానికి ఇదేమీ సినిమా కాదు

5 లో

# కన్ను తెరిచిన మానవత్వం

## అంధులకు అండగా నిలుస్తోన్న సుదర్శి మానవతా సేవా సంస్థ

**కన్ను తెరిస్తే జననం..** కన్ను మూస్తే మరణం.. ఇది నగ్న సత్యమే అయినా మూసిన కన్నును తెరిపించడం, చీకటి కమ్ముకున్న కనుపాపకు వెలుగును ప్రసాదించడం నిజంగా గొప్ప కార్యమే. అటువంటి పుణ్యకార్యక్రమాన్ని నిర్వహిస్తోంది దివిసీమలోని సుదర్శి మానవతా సేవా సంస్థ. చనిపోయిన వ్యక్తుల నుంచి కార్నియాలను సేకరించి అంధత్వ నివారణ దిశగా అడుగులు వేస్తోంది. ప్రత్యేక శిబిరాలతో ఉచితంగా శుక్లాల ఆపరేషన్లు నిర్వహిస్తూ ఎందరికో వెలుగులను నింపుతోంది.

నాగాయలంక(అవనిగడ్డ): నాగాయలంకకు చెందిన తలశిల రఘుశేఖర్, కనిగంటి వెంకట నారాయణ అనే వ్యక్తులు 2008లో సుదర్శి మానవతా సేవా సంస్థ ప్రారంభించారు. కొందరు స్థానికులు, సామాజిక చైతన్యం ఉన్న పలువురితో కలిసి నేత్రదానమంటేనే అదేదో పాపం అనే మూఢనమ్మకం ప్రజల్లో ఉంది. దానిని తొలగించి, ఇద్దరు వ్యక్తులకు అంధత్వం తొలగించే పుణ్యకార్యం నేత్రదానం అని భావించేలా చేయగలిగారు. దీనికి తోడు జిల్లా అంధత్వ నివారణ సంస్థ సూచనలు, శంకర నేత్రాలయం, ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి సహకారంతో ఇప్పటి వరకూ 175 మంది కళ్ల నుంచి కార్నియాలను సేకరించారు. నేత్రాల సేవనే సామాజిక కోణంలో ఎంచుకున్న కారణంగా సంస్థ నిరంతర కృషితో నేత్రదానాలే కాకుండా ఇప్పటికి 30కిపైగా నేత్ర వైద్య శిబిరాలతో 4,700మందికి ఉచిత ఐఓఎల్(శుక్లాల) ఆపరేషన్లు చేయించడం సీనియర్ సిటిజన్‌ల ఆదరణను అమితంగా చూరగొంది. ఎన్నో ప్రశంసలు సత్కారాలు అందుకున్న ఈ సంస్థ నిర్వాహకులు గత డిసెంబర్‌లో మహానటి సావిత్రి కళాపీఠం నుంచి ఉత్తమ సామాజిక సేవా పురస్కారం పొంది పలువురి ప్రముఖుల అభినందనలు అందుకున్నారు.

**ఇది కూడా..**

శేఖర్, నారాయణల సేవలో మరోకోణం ఉంది. వివిధ ఫంక్షన్‌లలో మిగిలిపోయిన ఆహార పదార్థాలు వృథా కాకుండా సేకరించి అవసరమైన పేదలకు అందించడం, ఆశ్రమంలో ఎవరైనా అనాథ వృద్ధులు చనిపోతే ఖర్మకాండలు జరపడం లాంటి సమాజహిత కార్యక్రమాలు వీరు చేస్తుంటారు.

**నేత్రదానానికి ఎవరు అర్హులు..**

నేత్రదానం చేయడానికి వయస్సుతో నిమిత్తం లేకుండా ఎవరైనా అర్హులే అని నిపుణులు చెబుతున్నారు. నేత్రదానానికి కనిష్ట వయస్సు ఆరు నెలల కాగా గరిష్ట వయస్సుకు పరిమితి లేదు. చూపు మందగించినవారు కళ్లజోడు ధరించేవారు, శుక్లాల శస్త్రచికిత్స చేయించుకున్నవారు ఎవరైనా అర్హులే.

**మరణానంతరం 12గంటల లోపు..**

ఎవరైనా వ్యక్తులు మరణించిన సందర్భాలలో ఆ



కుటుంబ సభ్యులలో త్వరితగతిన నేత్రదానంపై ఏకాభిప్రాయానికి వచ్చి సాధ్యమైనంత త్వరగా కార్నియాలు సేకరించే సంస్థలు లేదా ఆస్పత్రులకు ఫోన్‌కాల్‌లో సమాచారం అందించాల్సి ఉంటుంది. చనిపోయిన వ్యక్తి నుంచి 12గంటల లోపు, లేదా భౌతిక కాయం ఫ్రీజర్‌లో ఉంటే 24గంటల లోపు కార్నియాల సేకరణ చేయవచ్చని నిపుణులు చెబుతున్నారు.

**ఆనందాన్నిచ్చింది..**

మా నానమ్మ పొనమాల సోవమ్మ మే 4న చనిపోయింది. ఆమె నేత్రాలు దానం చేయాలని భావించి నాగాయలంకలోని సుదర్శి సంస్థ ద్వారా విజయవాడలోని ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి దానం చేశాం. 102 ఏళ్ల జీవించిన ఆమె నేత్రాలను దానం ద్వారా ఇరువురికి చూపు ఇచ్చే అవకాశం రావడం ఆనందాన్నిచ్చింది.

- పొనమాల నరసింహస్వామి, కానిస్టేబుల్, నాగాయలంక

**అంధులకు చూపు ఇవ్వాలనే..**

సమాజంలో కొంత మంది అంధులకైనా దృష్టిని ఇవ్వాలనే సంకల్పం నుంచే సుదర్శి మానవతా సేవా సంస్థ వచ్చింది. సమీప బంధువు వెంకట నారాయణతో కలసి ఈవిధమైన సామాజిక సేవ కొంతైనా చేయగల్గుతున్నాం. అందరి ప్రోత్సాహంతో కార్నియాలు సేకరిస్తున్నాం. దాతల సహకారంతో నేత్ర వైద్య శిబిరాలు నిర్వహిస్తూ శుక్లాల ఆపరేషన్లు నిర్వహిస్తున్నాం.

- తలశిల రఘుశేఖర్, సుదర్శి మానవతా సేవాసంస్థ


# బ్రిటన్ ఎత్తుకెళ్లిన వస్తువులు 8 మిలియన్లు

- ఇండియా సహా వివిధ దేశాల నుంచి బ్రిటన్ దోచుకుపోయిన విలువైన సంపద
- ఆ జాబితాలో కోహినూర్ వజ్రం, టిప్పుసుల్తాన్ ఉంగరం, షాజహాన్ వైన్ జార్
- ప్రాచీన ఈజిప్ట్‌కు చెందిన విలువైన రోసెట్టా స్టోన్ బ్రిటన్ పరం
- బ్రెజిల్ నుంచి 70 వేల రబ్బరు విత్తనాల చోరీ
- విక్టోరియా మ్యూజియంలో భద్రంగా ఉన్న విలువైన సాంస్కృతిక, వారసత్వ కళాఖండాలు

సాక్షి, అమరావతి

బ్రిటిష్ సామ్రాజ్యం.. దాని కాలనీలు మన దేశం సహా ప్రపంచంలోని వివిధ దేశాల నుంచి లెక్కలేనన్ని విలువైన కళాఖండాలను దోచుకెళ్లింది. 16వ శతాబ్దం చివరి నుంచి 20వ శతాబ్దం వరకు బ్రిటిష్ సామ్రాజ్యం ప్రపంచవ్యాప్తంగా తన కాలనీలు, వలస రాజ్యాలు, రక్షిత ప్రాంతాలను స్థాపించింది. బ్రిటన్‌లోని పలు మ్యూజియాలలో ప్రస్తుతం ప్రదర్శనలో ఉన్న అనేక సాంస్కృతిక కళాఖండాలు వలస రాజ్యాల ప్రజల నుంచి దోచుకున్నవే. వాటిని తిరిగి ఇచ్చేయాలని ఆ దేశాలు కోరుతున్నా.. బ్రిటన్ పట్టించుకోవడం లేదు. కోహినూర్ వజ్రం నుంచి బెనిన్ కాంస్యాలు, పార్థినాన్ మార్బుల్స్ వంటి 8 మిలియన్లకుపైగా కళాఖండాలు బ్రిటిష్ మ్యూజియంలలో ఉన్నట్టు అంచనా. వాటిలో అత్యంత విలువైనవి కొన్ని ఇవే.

### టిప్పుసుల్తాన్ ఉంగరం



ఈస్టిండియా కంపెనీతో 1799లో జరిగిన యుద్ధంలో టిప్పు సుల్తాన్ ఓడిపోయిన తర్వాత.. బ్రిటిష్ దళాలు సుల్తాన్‌ను చంపి ఆయన ఖడ్గం, బొమ్మ పులి, చేతి వేలి నుంచి ఉంగరాన్ని తీసుకెళ్లారు. సుల్తాన్ ఉంగరంపై దేవనాగరి లిపిలో రాముడి పేరు చెక్కి ఉండేది. ఖడ్గాన్ని భారతదేశానికి తిరిగి రప్పించారు. 41 గ్రాముల ఈ ఉంగరాన్ని 2014లో వేలం వేయగా.. అంచనా ధర కంటే పది రెట్లు ఎక్కువ ధర చెల్లించి ఒక వ్యక్తి కొనుగోలు చేశారు. టిప్పుసుల్తాన్‌కు చెందిన వేసవి రాజభవనం నుంచి తీసుకెళ్లిన బొమ్మ పులి ప్రస్తుతం విక్టోరియా ఆల్బర్ట్ మ్యూజియంలో ఉంది.

### కోహినూర్ వజ్రం



ప్రపంచంలోనే అత్యంత విలువైన కోహినూర్ వజ్రాన్ని భారతదేశం నుంచి బ్రిటిషర్లు తీసుకుపోయారు. 105.6 క్యారెట్లు, 21.6 గ్రాముల బరువున్న కోహినూర్ వజ్రాన్ని ప్రస్తుత ఏపీలోని కొల్లూరు గనిలో సేకరించారు. మొఘల్ చక్రవర్తులు నెమలి సింహాసనంపై దీన్ని ఉంచేవారు. మొదట దీన్ని సేకరించినప్పుడు 793 క్యారెట్లతో ఉండేది. ఆ తర్వాత దాన్ని కట్ చేశారు. 1849లో బ్రిటిషర్లు దాన్ని విక్టోరియా రాణికి అప్పగించారు. ఆమె దాన్ని పలు సందర్భాల్లో తన కిరీటంపై ధరించేవారు. ప్రస్తుతం ఇది లండన్ టవర్‌కి చెందిన జ్యువెల్ హౌస్ మ్యూజియంలో ఉంది. కోహినూర్ ప్రపంచంలోనే పురాతన, అత్యంత ప్రసిద్ధ వజ్రాలలో ఒకటి.

### ఎల్గిన్ మార్బుల్స్


ఎల్గిన్ మార్బుల్స్ పురాతన గ్రీకు శిల్పాల సమాహారం. గ్రీస్‌లోని పార్థినాన్ నుంచి 1801–1805 సంవత్సరాల మధ్య బ్రిటిషర్లు ఎథీనా దేవతకు అంకితం చేసిన ఈ శిల్పాలను తీసుకెళ్లారు. ఈ శిల్పాలు గ్రీకుల గొప్పతనం, వారి వారసత్వం, చరిత్రను తెలుపుతాయి. 1453 నుండి దాదాపు 400 సంవత్సరాల పాటు ఒట్టోమన్ సామ్రాజ్యం గ్రీకును పాలించింది. ఆ సమయంలో బ్రిటిష్ రాయబారి లార్డ్ ఎల్గిన్, పార్థినాన్ శిథిలాల నుంచి ఈ శిల్పాలను సేకరించి తీసుకెళ్లారని చెబుతారు.

### బ్రెజిల్ రబ్బరు విత్తనాలు

బ్రెజిల్‌కే సొంతమైన హెవియా బ్రాసిలియెన్సిస్ (రబ్బరు చెట్టు) 70 వేల విత్తనాలను 1876లో బ్రిటిష్ యాత్రికుడు హెన్రీ విక్హామ్ దొంగిలించాడు. ఇది చరిత్ర గతిని మార్చిన ఘటనగా పేర్కొంటారు. బ్రెజిల్‌లోని శాంటారెమ్ ప్రాంతంలోని 140 అడుగుల ఎత్తుకు పెరిగిన రబ్బరు చెట్టు విత్తనాలవి. అప్పటివరకు రబ్బరు పరిశ్రమపై బ్రెజిల్‌కు ఉన్న ఆధిపత్యం ఈ ఘటనతో చెదిరిపోయింది. ఈ విత్తనాలు ప్రస్తుతం లండన్ మ్యూజియంలో ఉన్నాయి.

### బెనిన్ కాంస్యాలు

ఒకప్పటి బెనిన్ రాజ్యమే ఇప్పటి నైజీరియా. 1897లో బ్రిటిషర్లు బెనిన్‌పై దాడిచేసి ఆ నగరాన్ని దోచుకుంది. అక్కడి రాజ భవనంలో ఉన్న చారిత్రాత్మక వస్తువులు, 200కిపైగా కాంస్య ఫలకాలు ఇప్పుడు బ్రిటిష్ మ్యూజియంలో ఉన్నాయి. 1960లో స్వాతంత్ర్యం పొందినప్పటి నుంచి నైజీరియా పలుసార్లు ఈ కాంస్యాలను తిరిగి ఇవ్వాలని కోరినా ఫలితం లేదు.





### రోసెట్టా స్టోన్

ఈజిప్టులోని రోసెట్టా ప్రాంతంలో దొరికిన పురాతన శాసనం ఇది. ఈజిప్టును పాలించిన టోలెమీ 196 బీసీలో నల్లటి బసాల్ట్ గ్రానైట్ రాయిపై ఈ శాసనాన్ని చెక్కించారు. మూడు విభిన్న ఈజిప్టియన్ భాషల్లో రాసిన ఈ శాసనం తన సామ్రాజ్యం, తాను చేసిన పనుల గురించి ఇందులో రాయించారు. 1799లో ఈ రాయిని కనుగొన్నారు. నెపోలియన్ బోనపార్టీ ఈజిప్టు నుంచి దీన్ని స్వాధీనం చేసుకున్నారు. 1800 సంవత్సరంలో ఫ్రెంచ్ సైన్యం ఓడిపోయిన తర్వాత బ్రిటిషర్లు దీన్ని స్వాధీనం చేసుకుని బ్రిటన్‌కు తరలించారు. ప్రాచీన ఈజిప్టు సామ్రాజ్యం, గ్రీకుల సంస్కృతి, వారసత్వం గురించి తెలిపే అత్యంత విలువైన శాసనంగా దీన్ని పరిగణిస్తారు. అందుకే దీన్ని తిరిగి ఇవ్వాలని ఈజిప్టు దేశం బ్రిటన్‌ను కోరినా పట్టించుకోలేదు.

### షాజహాన్ వైన్ జార్



మొఘల్ చక్రవర్తి షాజహాన్ వైన్ తాగే జార్‌ను కూడా బ్రిటిషర్లు తీసుకెళ్లి అక్కడి మ్యూజియంలో పెట్టుకున్నారు. తెల్లటి కప్పలా ఉండే ఈ జార్ దిగువ భాగంలో కమలం, ఆకులను పోలి ఉండేది. హ్యాండిల్‌పై కొమ్ము, గడ్డంతో ఉన్న జంతువు ఉండేది. 19వ శతాబ్దంలో ఈ అందమైన వైన్ జార్‌ను కల్నల్ చార్లెస్ సెటన్ గుత్రీ దొంగిలించి బ్రిటన్‌కు పంపినట్టు చెబుతారు. 1962 నుంచి ఇది లండన్‌లోని విక్టోరియా మ్యూజియంలో ఉంది.

## క్లుప్తంగా...

### జన సైనికులకు, ఫ్యాన్స్‌కు పవన్ వెన్నుపోటు

రామ్ గోపాల్ వర్మ ట్వీట్



సాక్షి, అమరావతి: సొంత ఫ్యాన్స్‌నే కాకుండా, తన కాపుల్ని, తనని తానే జనసేన అధ్యక్షుడు, సినీ నటుడు పవన్ కళ్యాణ్ వెన్నుపోటు పొడిచేసుకున్నారని ప్రముఖ సినీ దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ ట్విటర్‌లో వ్యాఖ్యానించారు. ఆ రోజు ఎన్టీఆర్‌ను చంద్రబాబు వెన్నుపోటు పొడిచిన దానికన్నా దారుణంగా ఈరోజు పవన్ కళ్యాణ్ తన జన సైనికులను, ఫ్యాన్స్‌ని వెన్నుపోటు పొడిచి చంపేశారని గురువారం రాత్రి అయన ట్వీట్ చేశారు.

### కేంద్రం అనుమతించాకే ఆ రిజర్వాయర్లు నిర్మించాలి

- ఏపీ ప్రభుత్వానికి ఎన్జీటీ ఆదేశాలు
- రూ.100 కోట్లు కేఆర్ఎంబీకి చెల్లించాలని ఆదేశం
- బాధ్యులైన ఎస్ఈఐఏఏ అధికారులపై విచారణ చేయాలి

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర పర్యావరణ అనుమతులు తీసుకున్నాకే ఆవులపల్లి, ముదివేడు, నేతిగుంటపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ల నిర్మాణం చేపట్టాలని జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్జీటీ) చెన్నై ధర్మాసనం స్పష్టంచేసింది. నిర్మాణ పనులు తక్షణమే నిలిపివేయాలని, 25లోగా సమ్మతి అఫిడవిట్ దాఖలు చేయాలని ఏపీ ప్రభుత్వాన్ని ఆదేశించింది. రిజర్వాయర్ల నిర్మాణాలకు వ్యతిరేకంగా చిత్తూరు జిల్లాకు చెందిన గుత్తా గుణశేఖర్ తదితరులు దాఖలు చేసిన పిటిషన్లపై జస్టిస్ పుష్ప సుబ్రహ్మణ్యం, విషయ నిపుణుడు సత్యగోపాల్‌ల ధర్మాసనం విచారించి ఏప్రిల్ 11న తీర్పు రిజర్వు చేసి గురువారం దానిని వెల్లడించింది. బహిరంగ విచారణ, పర్యావరణ ప్రభావ మదింపు తప్పించడానికి బీ2 కేటగిరీ కింద ఈసీని పొందడానికి యత్నించిన కారణంగా ప్రాజెక్టు ప్రతిపాదకులకు రూ.100 కోట్లు జరిమానా విధించింది. ఈ మొత్తాన్ని మూడు నెలల్లోగా కృష్ణానది యాజమాన్య నిర్వహణ బోర్డుకు చెల్లించాలంది. ఈ మొత్తాన్ని కృష్ణా నదిలో కాలుష్య నివారణకు వినియోగించొచ్చని సూచించింది. ఇక ప్రాజెక్టు ఫేజ్-1 నిమిత్తం ముందస్తు ఈసీ ప్రతిపాదనగా చూపడానికి సాక్ష్యాల రూపకల్పనకు యత్నించిన ఎస్ఈఐఏఏ అధికారులను గుర్తించడానికి విచారణకు ఆదేశించాలని కేంద్ర పర్యావరణ శాఖకు సిఫార్సు చేసింది. ఎస్ఈఐఏఏ ద్వారా ట్రిబ్యునల్ ముందు నకిలీపత్రాలు దాఖలు చేయడానికి బాధ్యులైన వారిని కూడా నిర్ధారించాలని స్పష్టంచేసింది.

### విశాఖ స్టేషన్‌లో 'బల్బ్ లైన్'కు స్థలం కేటాయించండి

- సైనిక్ భవన్ నిర్మాణానికీ సహకరించండి
- కేంద్ర షిప్పింగ్ శాఖ మంత్రిని కోరిన బీజేపీ ఎంపీ జీవీఎల్



సాక్షి, న్యూఢిల్లీ : విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో 'బల్బ్ లైన్' నిర్మాణం కోసం విశాఖ పోర్టు స్థలాన్ని కేటాయించాలని కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్ శాఖ మంత్రి శర్బానంద సోనోవాల్‌ను బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు కోరారు. ఆయన గురువారం ఢిల్లీలో కేంద్రమంత్రిని కలిశారు. విశాఖ రైల్వే స్టేషన్‌లో క్విక్ ప్లాట్‌ఫాం క్లియరెన్స్, లోకో రివర్సల్, షంటింగ్ వంటి అవసరాల కోసం ఈస్ట్ కోస్ట్ రైల్వే జోన్ 2016లోనే రూ.85.28 కోట్లతో బల్బ్ లైన్ నిర్మించాలని నిర్ణయించిందని జీవీఎల్ తెలిపారు. ఇందుకు అవసరమైన భూమిని ఇవ్వడానికి విశాఖ పోర్టు ట్రస్ట్ గతంలో నిరాకరించిందన్నారు. విశాఖ రైల్వేస్టేషన్‌లో బల్బ్ లైన్ నిర్మాణానికి వాల్తేరు రైల్వే డివిజన్‌కు అవసరమైన భూమిని ఇచ్చేలా విశాఖ పోర్ట్ అథారిటీకి సూచించాలని కేంద్ర మంత్రిని కోరారు. విశాఖలో సైనిక్ భవన్, సైనిక్ రెస్ట్ హౌస్ నిర్మాణానికి కూడా విశాఖ పోర్టు భూమిని కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. తన ప్రతిపాదనలపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించి వెంటనే పరిశీలించాలని అధికారులను ఆదేశించారని ఎంపీ జీవీఎల్ మీడియాకు తెలిపారు.

### ఆయుష్ ఆస్పత్రులకు మందుల సరఫరా

- కమిషనర్ జె.నివాస్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ఆయుష్, హోమియో, యునాని డిస్పెన్సరీలు, ఆస్పత్రులకు రూ.3.9 కోట్ల విలువ చేసే మందులను సరఫరా చేసినట్లు కమిషనర్ జె.నివాస్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 735 డిస్పెన్సరీలు, నాలుగు జిల్లా ఆస్పత్రులు, నాలుగు మినీ ఆస్పత్రులు ఆయుష్ విభాగం కింద నడుస్తున్నాయన్నారు. వీటిలో రోజుకు సగటున ఎనిమిది నుంచి తొమ్మిది వేల ఓపీలు నమోదు అవుతుంటాయని చెప్పారు. ఈ క్రమంలో రోగుల తాకిడికి అనుగుణంగా మందులకు కొరత ఏర్పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. ఆయుష్ వైద్య సేవలను మరింత మెరుగుపరచడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని చెప్పారు.

# ఇళ్లు ఫుల్ స్పీడ్!

▶ మొదటి పేజీ తరువాయి

జంగిల్ క్లియరెన్స్, ల్యాండ్ లెవలింగ్ పనులు ముగిసినట్లు అధికారులు వెల్లడించారు. గుంటూరు జిల్లాకు చెందిన లబ్ధిదారులకు పది లేఅవుట్లలో, ఎన్టీఆర్ జిల్లా లబ్ధిదారులకు 11 లే అవుట్లలో ఇళ్ల పట్టాలు కేటాయించనున్నారు. దాదాపు 180 కి.మీ మేర అంతర్గత గ్రావెల్ రోడ్ల పనులు కూడా చేపడుతున్నట్లు తెలిపారు. హైకోర్టు అదనపు భవన నిర్మాణం కూడా పూర్తవుతున్నట్లు చెప్పారు. 76,300 చదరపు అడుగుల విస్తీర్ణంతో ఈ భవనం అందుబాటులోకి వస్తోందని, 14 కోర్టు హాళ్లకు అవసరమైన సదుపాయాల కల్పన పనులు కూడా జరుగుతున్నట్లు వివరించారు.

### సుందరంగా బెజవాడ రివర్ బెడ్

విజయవాడలో కృష్ణానది వరద ముప్పు తప్పించేందుకు నిర్మించిన రిటైనింగ్ వాల్ ద్వారా ఏర్పడిన రివర్ బెడ్‌ను అందంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి జగన్ ఆదేశించారు. రివర్ బెడ్‌పై వాకింగ్ ట్రాక్ సహా వివిధ సుందరీకరణ పనుల గురించి అధికారులు వివరించారు. నగర వాసులకు ఆహ్లాదం కలిగించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు.



పురపాలక, పట్టణాభివృద్ధి శాఖపై ఉన్నత స్థాయి సమీక్షలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

### గుడివాడ టిడ్కో ఇళ్లు జూన్‌లో పంపిణీ

ఫేజ్-1 కింద 1,50,000 టిడ్కో ఇళ్లకు సంబంధించి 1.39 లక్షల గృహాల నిర్మాణం పూర్తి కాగా ఇప్పటికే 30 ప్రాంతాల్లో 51,564 ఇళ్లను అప్పగించినట్లు అధికారులు తెలిపారు. జూన్ నాటికి మిగతా ఇళ్లను కూడా లబ్ధిదారులకు అప్పగిస్తామన్నారు. రెండో విడతకు సంబంధించి 1,12,092 ఇళ్లను సెప్టెంబరు - డిసెంబరు మధ్య లబ్ధిదారులకు అందిస్తామన్నారు. గుడివాడలో 8,912 టిడ్కో ఇళ్లను జూన్ మొదటి వారంలో సీఎం చేతుల మీదుగా పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. సమీక్షలో పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, సీఎస్ డాక్టర్ కే ఎస్ జవహర్‌రెడ్డి, పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ స్పెషల్ సీఎస్ వై.శ్రీలక్ష్మి, ఆర్థికశాఖ స్పెషల్ సీఎస్ ఎస్ఎస్ రావత్, ఏపీ టిడ్కో ఎండీ సీహెచ్ శ్రీధర్, ఏపీసీఆర్డీఏ కమిషనర్ వివేక్‌యాదవ్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ పి.బసంత్‌కుమార్, విజయవాడ మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, రీసర్వే ప్రాజెక్టు స్పెషల్ ఆఫీసర్ సుబ్బారావు, మెప్మా ఎండీ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### పరిశుభ్రంగా విశాఖ బీచ్‌లు

విశాఖలో బీచ్‌ల పరిశుభ్రతపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి జగన్ ఆదేశించారు. అందుకు అవసరమైన ప్రత్యేక యంత్రాలను బీచ్‌లో అందుబాటులో ఉంచాలని సూచించారు. వీటి ద్వారా ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించాలన్నారు. పరిశుభ్రమైన బీచ్‌లతోనే పర్యాటక రంగం మెరుగుపడుతుందన్నారు.

## ఏపీ ఎస్టీ కమిషన్ యాప్‌ను ఆవిష్కరించిన సీఎం జగన్



సాక్షి,అమరావతి: గిరిజనుల అభ్యున్నతి.. వారి సమస్యల పరిష్కారం కోసం దేశంలోనే తొలిసారిగా 'ఏపీ ఎస్టీ కమిషన్ యాప్'ను రాష్ట్ర షెడ్యూల్డ్ తెగల కమిషన్ రూపొందించింది. దీనిని సీఎం వైఎస్ జగన్ ఆవిష్కరించారు. గురువారం సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు, సభ్యులు వడిత్యా సోమశంకర్ నాయక్, మత్స్యరాస విశ్వేశ్వరరాజు, కొర్ర రాము, చిచ్చడి మురళి, గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ మురళి, ఎస్టీ కమిషన్ సెక్రటరీ డాక్టర్ గంగాధర్ తదితరులు కలిశారు. సీఎం జగన్‌కు వార్షిక నివేదికను అందజేశారు. ఈ సందర్భంగా కమిషన్‌కు సంబంధించిన పూర్తి సమాచారంతో కూడిన బ్రోచర్‌ను, ఏపీఎస్టీసీ.ఇన్ వెబ్‌సైట్‌ను, ఏపీ ఎస్టీ కమిషన్ యాప్‌ను సీఎం జగన్ ఆవిష్కరించారు.

## 'చుక్కల భూముల' చిక్కులకు చెల్లు

- 2,06,171 ఎకరాల భూములకు సంపూర్ణ హక్కు
- వీటి మార్కెట్ విలువ రూ.20 వేల కోట్లు
- రాష్ట్రవ్యాప్తంగా 97,471 రైతు కుటుంబాలకు మేలు
- నెల్లూరు జిల్లా కావలిలో నేడు సీఎం జగన్‌చే ప్రారంభం

సాక్షి, అమరావతి : దశాబ్దాలుగా రైతన్నల కంటి మీద కునుకు లేకుండా చేస్తున్న చుక్కల భూముల సమస్యలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెక్ పెడుతున్నారు. వాటికి శాశ్వత పరిష్కారం చూపిస్తూ రైతన్నలకు ఆ భూములపై సంపూర్ణ హక్కులు కల్పిస్తున్నారు. శుక్రవారం శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ లాంఛనంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా 97,471 రైతన్నల కుటుంబాలకు మేలు కలుగుతుంది. దాదాపు రూ.20,000 కోట్ల మార్కెట్ విలువ కలిగిన 2,06,171 ఎకరాల భూములపై రైతులకు సర్వ హక్కులు కలగనున్నాయి. వందేళ్ల క్రితం బ్రిటిష్ కాలంలో భూసర్వే జరిగినప్పుడు 'ప్రభుత్వ లేదా ప్రైవేటు భూమి' అని నిర్ధారణ చేయని కారణంగా రెవెన్యూ రికార్డులలో (రీ సెటిల్మెంట్ రిజిస్టర్ - ఆర్ఎస్ఆర్) పట్టాదారు గడిలో 'చుక్కలు' పెట్టి వదిలేశారు. అవే చుక్కల భూములు. వీటిని రైతులు అనుభవిస్తున్నా, సంపూర్ణ హక్కులు లేక దశాబ్దాలుగా అనేక ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వం వీరి కష్టాలను మరింత సంక్లిష్టం చేస్తూ అనాలోచితంగా ఒక్క కలం పోటుతో నిషేధిత భూముల జాబితాలో చేర్చింది. దీంతో రైతులకు కోలుకోలేని దెబ్బ తగిలింది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ఈ భూములపై రైతులకే సంపూర్ణ హక్కులు ఉండాలని నిర్ణయించారు. రైతులు రెవెన్యూ కార్యాలయాలు, కోర్టుల చుట్టూ తిరిగే అవసరం లేకుండా, ఒక్క పైసా ఖర్చు కూడా లేకుండా ఈ భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతూ నిషేధిత జాబితా నుంచి తొలగించారు. జిల్లా కలెక్టర్ల ద్వారా చుక్కల భూములను పట్టా భూములుగా మారుస్తూ 22ఏ(1)(ఈ) నుండి డీ నోటిఫై చేశారు. ప్రభుత్వ నిర్ణయం వల్ల ఈ భూములపై రైతులకు సర్వ హక్కులు లభించాయి. వారు వాటిని అమ్ముకొనేందుకు, రుణాలు పొందడానికి, తనఖాకు, బహుమతిగా ఇవ్వడానికి, వారసత్వపు ఆస్తిగా అందించడానికి వెసులుబాటు కలిగింది. వీటిపై రెవెన్యూ సమస్యలు, సలహాల కోసం రైతులు టోల్ ఫ్రీ నంబర్ 1902 సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు. కాగా, సీఎం జగన్ శుక్రవారం ఉదయం 8.25 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియానికి చేరుకుంటారు. అక్కడ ఏర్పాటు చేసిన అష్టోత్తర శతకుండాత్మక (108) చండీ, రుద్ర, రాజశ్యామల, సుదర్శన సహిత శ్రీలక్ష్మీ మహాయజ్ఞంలో పాల్గొంటారు. అనంతరం తిరిగి తాడేపల్లికి చేరుకుంటారు. ఉదయం 9.35 గంటలకు తాడేపల్లి నుంచి బయలుదేరి 10.30 గంటలకు కావలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానానికి చేరుకుని, బహిరంగ సభలో పాల్గొంటారు. చుక్కల భూములను 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించి రైతులకు పూర్తి హక్కు కల్పించే కార్యక్రమాన్ని సీఎం ప్రారంభిస్తారు. అక్కడి నుంచి బయలుదేరి సాయంత్రానికి తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు.

## ప్రతి రోగి సంతృప్తిగా ఇంటికి వెళ్లాలి

- వైద్యులు ఆస్పత్రిలో అందుబాటులో ఉండాల్సిందే
- వైద్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు

సాక్షి, అమరావతి: బోధనాస్పత్రులకు వచ్చే ప్రతి రోగి మెరుగైన వైద్యం పొంది.. సేవల పట్ల సంతృప్తితో ఇంటికి తిరిగి వెళ్లాలని వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు అన్నారు. వైద్య సేవలను మరింత మెరుగుపరచడానికి రోగుల నుంచి అభిప్రాయసేకరణ కూడా చేపట్టాలని బోధనాస్పత్రుల సూపరింటెండెంట్‌లను ఆయన ఆదేశించారు. ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రిన్సిపాళ్లు, బోధనాస్పత్రుల సూపరింటెండెంట్లకు విజయవాడలో నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో గురువారం కృష్ణబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్య రంగంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. ప్రజల్లో ప్రభుత్వాస్పత్రుల ప్రతిష్టను పెంచేలా వైద్యులు, సిబ్బంది పనిచేయాలని సూచించారు. ప్రతి ఒక్క వైద్యుడు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆస్పత్రిలో అందుబాటులో ఉండాల్సిందేనన్నారు. ఆస్పత్రుల్లో శాంక్షన్ పోస్టుల్లో ఒక్కటి కూడా ఖాళీగా ఉండటానికి వీల్లేదని సీఎం జగన్ ఆదేశించారన్నారు. ఇప్పటికే 49 వేలకు పైగా పోస్టులను భర్తీ చేశామన్నారు. బోధనాస్పత్రుల్లో ఖాళీగా ఉన్న పారామెడికల్ సిబ్బంది పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఆదేశించారు. సీనియర్ రెసిడెంట్ డాక్టర్ ఖాళీల భర్తీని ప్రిన్సిపాళ్ల స్థాయిలోనే చేపట్టేలా నిర్ణయించామన్నారు. త్వరలోనే ఈ ప్రక్రియ కూడా పూర్తవుతుందన్నారు. రోగులకు వైద్య పరీక్షల ఫలితాలు వెంటనే అందించి.. మందులను సూచించి.. ఒకే రోజులో ఇంటికి తిరిగి వెళ్లేలా ఓపీ నిర్వహణ సమయాన్ని పెంచాలని సూచించారు. వైద్య శాఖకు అవసరమైన అన్నింటినీ ప్రభుత్వం సమకూరుస్తోందని.. పెద్ద ఎత్తున నిధులు ఇస్తోందని చెప్పారు. కానీ కొందరు సిబ్బంది నిర్లక్ష్యం వల్ల మొత్తం వ్యవస్థకే చెడ్డ పేరు వచ్చే అవకాశం ఉందన్నారు. అలాంటి వారి పట్ల కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సీఎం ఆదేశాల మేరకు ఆరోగ్యశ్రీ పెండింగ్ బిల్లులను వేగంగా క్లియర్ చేస్తున్నామని కృష్ణబాబు చెప్పారు. కాగా, సిబ్బందికి ఏర్పాటు చేసిన రెండు రోజుల శిక్షణా కార్యక్రమం గురువారంతో ముగిసింది. కార్యక్రమంలో డీఎంఈ డాక్టర్ నరసింహం, ఏడీఎంఈ డాక్టర్ సత్యవరప్రసాద్, డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

## ఇంజినీరింగ్ విద్యార్థుల దాతృత్వం




భీమవరం ఎస్ఆర్‌కేఆర్ కళాశాల వద్ద శ్రీరామ్‌నాయక్ తల్లిదండ్రులకు చెక్కును అందజేస్తున్న దృశ్యం

### మిత్రుడి వైద్యానికి రూ.14 లక్షల సేకరణ

సాక్షి, భీమవరం: అనారోగ్యంతో బాధపడుతోన్న తమ తోటి విద్యార్థికి వైద్యం కోసం రూ.14 లక్షలు సహాయం అందించారు పశ్చిమ గోదావరి జిల్లా ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటకు దగ్గరలోని బుధవాడకు చెందిన ధరావత్ శ్రీరామ్‌నాయక్ ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో సీఎస్ఈ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. బోన్ క్యాన్సర్‌తో బాధపడుతోన్న శ్రీరామ్‌నాయక్‌ను అతని కుటుంబసభ్యులు విజయవాడలోని హెచ్‌సీజీ క్యాన్సర్ ఆసుపత్రిలో చేర్పించి వైద్యం అందిస్తున్నారు. చికిత్సకు పెద్ద మొత్తం అవసరమవుతుందని వైద్యులు చెప్పడంతో విద్యార్థి తల్లిదండ్రులు ధరావత్ కుమారి, శ్రీనివాసరావు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న సహచర విద్యార్థులు సాయం అందించాలని నిర్ణయించారు. హెల్పింగ్ హ్యాండ్స్ సీఎస్సీ పేరుతో బృందంగా ఏర్పడి కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు సహా దాతల నుంచి నిధులు సేకరించారు. రూ.14 లక్షలను చెక్కును విద్యార్థి తల్లిదండ్రులకు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మురళీకృష్ణంరాజు అందజేశారు.

# కృష్ణా జలాలపై తెలంగాణ తొండాట

**1976లోనే నీటి కేటాయింపులు చేసిన బచావత్ ట్రిబ్యునల్**

- వాటి ఆధారంగానే ఏపీకి 512, తెలంగాణకు 299 టీఎంసీలు పంపిణీ
- ఆ మేరకు 2015లో తాత్కాలిక సర్దుబాటు చేసిన కేంద్రం
- ఆ ఒప్పందంపై సంతకం చేసిన తెలంగాణ
- ఇరు రాష్ట్రాలకు నీటి పంపిణీ బాధ్యత బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌కే అప్పగింత
- బచావత్ ట్రిబ్యునల్ కేటాయించిన 811 టీఎంసీల జోలికి వెళ్లబోమన్న బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్
- తాము అదనంగా కేటాయించిన 194 టీఎంసీలే పంపిణీ చేస్తామని స్పష్టీకరణ
- వాస్తవాలు ఇలా ఉంటే అవాస్తవాలు వల్లె వేస్తున్న తెలంగాణ
- తెలంగాణ ప్రభుత్వం వివాదాన్ని రాజేస్తోందంటోన్న నిపుణులు



సాక్షి, అమరావతి: కృష్ణా జలాల పంపిణీపై తెలంగాణ సర్కారు పదే పదే తొండాట ఆడుతోంది. పరిష్కారమైన అంశాన్ని, అవాస్తవాలను వల్లె వేస్తూ వివాదాన్ని రాజేస్తోందని నీటి పారుదల రంగ నిపుణులు తప్పుపడుతున్నారు. ప్రాజెక్టుల వారీగా బచావత్ ట్రిబ్యునల్ చేసిన కేటాయింపుల ఆధారంగానే ఏపీకి 512 టీఎంసీలు (66 శాతం), తెలంగాణకు 299 టీఎంసీలు (34 శాతం) కేటాయిస్తూ 2015 జూన్ 19న కేంద్రం తాత్కాలిక సర్దుబాటు ఒప్పందం చేసింది. ఆనాటి కేంద్ర జల్‌శక్తి శాఖ కార్యదర్శి అమర్జీత్‌సింగ్ సమక్షంలో రెండు రాష్ట్రాల జలవనరుల శాఖ ఉన్నతాధికారులు ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. విభజన నేపథ్యంలో ఉమ్మడి రాష్ట్రానికి కేటాయించిన కృష్ణా జలాలను రెండు రాష్ట్రాలకు పంపిణీ చేసే బాధ్యతను మళ్లీ బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌కే కేంద్రం అప్పగించింది. ఈ ట్రిబ్యునల్ తీర్పు వెలువడే వరకు ప్రతి నీటి సంవత్సరం ప్రారంభంలో సర్వ సభ్య సమావేశంలో చర్చించి తాత్కాలిక సర్దుబాటు ప్రకారమే రెండు రాష్ట్రాలకు పంపిణీ చేయాలని కృష్ణా బోర్డుకు కేంద్రం చెప్పింది. అయితే, తాత్కాలిక సర్దుబాటు ఒప్పందానికి అంగీకరించిన తెలంగాణ ఆ తర్వాత ప్రతి నీటి సంవత్సరం ప్రారంభంలో కృష్ణా జలాల్లో సగ భాగం కావాలంటూ వివాదాన్ని రాజేస్తోంది. బుధవారం జరిగిన కృష్ణా బోర్డు 17వ సర్వ సభ్య సమావేశంలోనూ అదే డిమాండ్‌ను తెరపైకి తెచ్చింది.

### బచావత్ ట్రిబ్యునల్ అవార్డే ప్రామాణికం

ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు కృష్ణా జలాల పంపిణీని విచారిస్తున్న క్రమంలో మార్చి 24న బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ కీలక వ్యాఖ్యలు చేసింది. విభజన చట్టంలో సెక్షన్-89 ప్రకారం కృష్ణా జలాల పంపిణీలో తమ పరిధి పరిమితమని చెప్పింది. నిర్దిష్టంగా నీటి కేటాయింపులు లేని ప్రాజెక్టులకు నీటి కేటాయింపులు చేయడమే తమ బాధ్యతని స్పష్టం చేసింది. ఇప్పటికే నీటి కేటాయింపులు ఉన్న ప్రాజెక్టుల జోలికి వెళ్లబోమని సంకేతాలిచ్చింది. అంటే.. బచావత్ ట్రిబ్యునల్ అవార్డే ప్రామాణికమని బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ ఉద్ఘాటించింది. తద్వారా నీటి లభ్యత 75 శాతం ఆధారంగా బచావత్ ట్రిబ్యునల్ కేటాయించిన 811 టీఎంసీలను మినహాయించి, 65 శాతం లభ్యత ఆధారంగా తాము అదనంగా కేటాయించిన 194 టీఎంసీలను రెండు రాష్ట్రాలకు పంపిణీ చేయడంపైనే విచారిస్తామని బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ పేర్కొన్నట్లు నిపుణులు చెబుతున్నారు.

### అర్థభాగం అసాధ్యం

నీటి లభ్యత 75 శాతం ఆధారంగా కృష్ణా నదిలో 2,130 టీఎంసీలు ఉంటాయని అంచనా వేసిన బచావత్ ట్రిబ్యునల్.. మహారాష్ట్రకు 585 టీఎంసీలు, కర్ణాటకకు 734, ఉమ్మడి ఏపీకి 811 టీఎంసీలు పంపిణీ చేస్తూ 1976 మే 27న తీర్పు ఇచ్చింది. కృష్ణా జలాల పునఃపంపిణీకి 2004 ఏప్రిల్ 2న ఏర్పాటైన బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ 2010, 2013లో ఇచ్చిన ప్రాథమిక, తుది నివేదికలను ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు సుప్రీం కోర్టులో సవాల్ చేయడంతో వాటిని కేంద్రం అమల్లోకి తేలేదు. ఈ ట్రిబ్యునల్ తుది నివేదికలో బచావత్ ట్రిబ్యునల్ కేటాయింపులు 811 టీఎంసీలను యథాతథంగా కొనసాగించింది. అదనంగా 65 శాతం లభ్యత ఆధారంగా 194 టీఎంసీలను కేటాయించింది. అంటే మొత్తం 1,005 టీఎంసీలను కేటాయించింది. బచావత్ ట్రిబ్యునల్ తీర్పు సుప్రీం కోర్టు డిక్రీతో సమానం. దాన్ని పునఃసమీక్షిస్తే న్యాయ ఉల్లంఘనకు పాల్పడినట్లే. అందుకే బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ కూడా ఆ తీర్పు జోలికి వెళ్లలేదని న్యాయ, సాగునీటి రంగ నిపుణులు గుర్తు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి రాష్ట్రానికి కేటాయించిన కృష్ణా జలాల్లో సగ భాగం కావాలని తెలంగాణ కోరడం చట్టవిరుద్ధమని నీటి పారుదల రంగ నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

## పవన్ ఎందుకొచ్చారు.. ఏం చూశారు

ఎంపీ మార్గాని భరత్‌రామ్

రాజమహేంద్రవరం రూరల్: పంటల పరిశీలన.. రైతుల పరామర్శ పేరిట పర్యటించిన పవన్‌కల్యాణ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించడం సరికాదని ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. గురువారం రాజమహేంద్రవరంలో మీడియాతో మాట్లాడుతూ.. పవన్ ఎందుకొచ్చారు.. ఏం చూశారని ప్రశ్నించారు. రైతులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, బాధ్యత వహించాలి లాంటి రాజకీయ విమర్శలు చేసి పబ్బం గడుపుకోవాలంటే ఇక్కడ ఎవరూ అమాయకులు కారని పవన్ గుర్తించాలన్నారు. వేసవిలో అకాల వర్షాలకు రైతులకు నష్టం, కష్టం వచ్చిందన్నారు. ప్రభుత్వం రైతులను అన్నిరకాలుగా ఆదుకుంటోందన్నారు. ప్రతి ధాన్యం గింజనూ కొనుగోలు చేయాలని సీఎం జగన్ ఆదేశించారన్నారు. ఇప్పటివరకూ ఉభయ గోదావరి జిల్లాల్లో 86 శాతం ధాన్యం కొనుగోలు చేశారన్నారు. ఈ ప్రక్రియ సహజంగా 75 రోజుల్లో జరగాలన్నారు. కానీ 20 రోజుల్లోనే 86 శాతం ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తయిందన్నారు. రైతులపై రాష్ట్ర ప్రభుత్వం చూపిస్తున్న శ్రద్ధకు ఈ గణాంకాలే సాక్ష్యమన్నారు. వారం రోజులుగా ఎండలు విపరీతంగా మండుతుంటే పవన్ తడిసిన ధాన్యం చూశారంటే జనం నవ్వుతున్నారని ఎంపీ ఎద్దేవా చేశారు. మొక్కుబడిగా పలకరించి, ప్రభుత్వంపై బురద చల్లడానికే పవన్ వచ్చారని ప్రజలే వ్యాఖ్యానిస్తున్నారన్నారు. నష్టపోయారని భావిస్తున్న రైతులను పరామర్శిస్తే ప్రభుత్వం ఏ విధంగా ఆదుకుందో చెప్పేవారన్నారు. రైతుల పరామర్శ పేరుతో చంద్రబాబు, పవన్ చేసిన పర్యటనల మర్మం అందరికీ తెలుసని ఎంపీ పేర్కొన్నారు. రైతులకు న్యాయం జరిగే వరకూ ఉంటానన్న చంద్రబాబు మరునాడే వెళ్లిపోయారన్నారు. పవన్ కనీస పరిజ్ఞానం లేకుండా ప్రభుత్వంపై విమర్శలు చేశారన్నారు.

## సుఖప్రసవాలే లక్ష్యం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో సిజేరియన్ ప్రసవాల సంఖ్య తగ్గించి, సహజ ప్రసవాల సంఖ్య పెంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) మార్గదర్శకాల ప్రకారం మొత్తం ప్రసవాల్లో 10 శాతానికి మించి సిజేరియన్‌లు ఉండకూడదు. అయితే రాష్ట్రంలో ప్రభుత్వాస్పత్రుల్లో జరుగుతున్న ప్రవవాల్లో 35 శాతం, ప్రైవేట్ ఆస్పత్రుల్లో 55% సిజేరియన్‌లు ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో సిజేరియన్ ప్రసవాలకు అడ్డుకట్ట వేయడంతోపాటు మాతృ, శిశు మరణాలు గణనీయంగా తగ్గించడం వంటి కార్యకలాపాలపై వైద్య, ఆరోగ్యశాఖ దృష్టి సారించింది. ఇందులో భాగంగా ప్రభుత్వాస్పత్రుల్లో క్రమంగా మిడ్ వైఫరి లెడ్ కేర్ యూనిట్ (ఎంఎల్‌సీయూ)లను నెలకొల్పుతున్నారు. ఇటీవల తిరుపతి ప్రసూతి ఆస్పత్రిలో ఈ యూనిట్‌ను ప్రారంభించారు. ఈ నెలాఖరులోగా గుంటూరులోను ప్రారంభించనున్నారు. వీటితో కలిపి తొలివిడతలో 10 చోట్ల ప్రణాళిక రచించారు. యూనిసెఫ్ సంస్థ టెక్నికల్ సహకారం అందిస్తోంది.

**యూనిట్‌లో సుశిక్షితులైన నర్సులు**

ప్రభుత్వాస్పత్రుల్లో పనిచేస్తున్న స్టాఫ్ నర్సులకు వైద్యశాఖ నర్స్ ప్రాక్టిషనర్ ఇన్ మిడ్‌వైఫరి (ఎన్‌పీఎం) 18 నెలల శిక్షణ ఇస్తోంది. గత ఏడాదిలో రాష్ట్రవ్యాప్తంగా 60 మందిని ఎంపిక చేసి బ్యాచ్‌కు 30 మంది చొప్పున రెండు బ్యాచ్‌లుగా గుంటూరు, తిరుపతిల్లో శిక్షణ ఇస్తున్నారు. కాగా, గర్భిణులను సుఖ ప్రసవానికి సిద్ధం చేయడమే ఎంఎల్‌సీయూ ఏర్పాటు ముఖ్య ఉద్దేశ్యం. గర్భిణులను సుఖప్రసవానికి సిద్ధం చేయడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు ఉంటాయి.

### సుఖప్రసవమే శ్రేయస్కరం



సిజేరియన్ ప్రసవాల అనంతరం వివిధ రకాల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. దీర్ఘకాలికంగా మహిళల ఆరోగ్యంపై సిజేరియన్‌లు ప్రభావం చూపుతాయి. ఈ క్రమంలో వీలైనంతవరకు సుఖప్రసవం కోసం గర్భిణులు సిద్ధపడాలి.

– డాక్టర్ కె.వి.ఎస్.ఎస్.అనిల్‌కుమార్, అదనపు డైరెక్టర్, వైద్యశాఖ

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు
- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఏడాది పూర్తి
- కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకొన్న పార్టీ శ్రేణులు

సీతంపేట (విశాఖ ఉత్తర): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఉత్తమ పాలన అందిస్తున్నారని విశాఖ ఉత్తర నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె. రాజు చెప్పారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 43వ వార్డు అక్కయ్యపాలెం పోస్టాఫీస్ వీధి ప్రాంతంలో గురువారం సాయంత్రం ఆయన పర్యటించారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ప్రారంభించి ఏడాది పూర్తయిన సందర్భంగా కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలందరికీ మేలు జరిగేలా ఎన్నో సంక్షేమ పథకాలను నిష్పక్షపాతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ అందేలా పాలన సాగిస్తున్నారని చెప్పారు. ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న సీఎం జగన్‌కు ప్రజలంతా మద్దతు తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, కార్పొరేటర్లు పెద్దిశెట్టి ఉషశ్రీ, సాడి పద్మారెడ్డి, ఆళ్ల లీలావతి శ్రీనివాస్, కంటిపాము కామేశ్వరి, వావిలపల్లి ప్రసాద్, చల్లా రజని ఈశ్వరరావు, కేవీఎస్.శశికళ తదితరులు పాల్గొన్నారు.



అక్కయ్యపాలెంలో కరపత్రం అందజేస్తున్న కె.కె.రాజు, ఉషశ్రీ

## ప్రతిదానికి పిల్ ఏమిటి?

సాక్షి అమరావతి: విశాఖపట్నం మధురవాడలో రామానాయుడు స్టూడియో కోసం కేటాయించిన భూమిలో రెసిడెన్షియల్ లేఅవుట్ ఏర్పాటు చేసేందుకు అనుమతి ఇస్తూ విశాఖ మునిసిపల్ కమిషనర్ ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ విశాఖపట్నం తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని (పిల్‌ను) గురువారం హైకోర్టు కొట్టేసింది. బాధ్యతాయుత ఎమ్మెల్యే పదవిలో ఉంటూ ఇలాంటి పిల్ వేయడం ఏమిటని హైకోర్టు అభ్యంతరం వ్యక్తం చేసింది. వివాదం ప్రైవేటు వ్యక్తుల మధ్య ఉంటే దానిపై పిల్ దాఖలు చేయడం ఏమిటని ప్రశ్నించింది. అది ఫిల్మ్ స్టూడియోకి ఇచ్చిన భూమి అని, ప్రైవేట్ భూ వివాదంలో ప్రభుత్వానికి ఏం సంబంధం ఉందని అడిగింది. ఇది ధనికుల మధ్య వివాదమని, ఇందులో తాము జోక్యం చేసుకోబోమని స్పష్టం చేసింది. ప్రతి దాంట్లో ఉల్లంఘన ఉందంటూ పిల్ దాఖలు చేయడం సరికాదని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ వ్యాజ్యంలో ప్రజాప్రయోజనాలు ఎంతమాత్రం లేవని పేర్కొంది.

## క్లుప్తంగా...

### దివ్యాంగ ఉద్యోగులపై వివక్ష వద్దు

**మార్గదర్శకాలు విడుదల చేసిన ప్రభుత్వం**

**సాక్షి, అమరావతి:** దివ్యాంగ ఉద్యోగులపై వివక్షను నిరోధించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దివ్యాంగుల హక్కుల చట్టం అమల్లో భాగంగా వారి పట్ల వ్యవహరించాల్సిన మార్గదర్శకాలను ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ముద్దాడ రవిచంద్ర గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. చట్టం అమల్లో భాగంగా దివ్యాంగుల హక్కుల పరిరక్షణకు ఇప్పటికే ప్రభుత్వం నియమాలను జారీ చేసిన విషయం తెలిసిందే. తాజాగా పనిచేసే చోట దివ్యాంగ ఉద్యోగుల పట్ల వివక్ష లేకుండా చర్యలు చేపట్టింది. ఉత్తర్వుల ప్రకారం..ఉద్యోగం చేస్తూ దివ్యాంగులైన వారిని ప్రస్తుతం పనిచేస్తోన్న స్థానం (ర్యాంక్) నుంచి తొలగించకూడదు, తగ్గించకూడదు. ఒక ఉద్యోగి దివ్యాంగుడైన తర్వాత అతను పనిచేసే పోస్టు నుంచి పదోన్నతికి అర్హత లేదని నిర్ణయించకూడదు. ఒకవేళ పైపోస్టు తగినది కాకపోతే అదే పే స్కేల్, సేవా ప్రయోజనాలు వర్తింపజేసి వేరొక పోస్టు ఇవ్వాలి. తగిన పోస్టు అందుబాటులో లేకపోతే అది ఇచ్చే వరకు ఆర్థిక శాఖ సమ్మతితో సూపర్ న్యూమరీ పోస్టు సృష్టించి ఇవ్వాలి.

### టీడీపీది దుష్ప్రచారం

- గిరిజనులకు అండగా వైఎస్సార్‌సీపీ
- ఉప ముఖ్యమంత్రి రాజన్న దొర



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర

**మహారాణిపేట(విశాఖ దక్షిణ):** కొంత మంది టీడీపీ నాయకులు తనపై దుష్ప్రచారం చేస్తున్నారని, నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన తనకు నియోజకవర్గంలోని ప్రజలంతా సుపరిచితులని డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పి.రాజన్నదొర చెప్పారు. నగరంలోని ఓ హోటల్లో గురువారం నిర్వహించిన గిరిజన సహకార సంస్థ(జీసీసీ) సమీక్షలో పాల్గొని, జీసీసీ ఉద్యోగులకు హెల్త్ కార్డులు, జీసీసీ నూతన ఉత్పత్తులను విడుదల చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ తన మాటలను టీడీపీ నాయకులు వక్రీకరించి చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. సెటిలర్స్ అనే సంస్కృతి తనకు లేదన్నారు. సాలూరు నియోజకవర్గంలో భారీ వాహనాల వల్ల రోడ్లు పాడవుతున్నాయని, దాని కోసం తాను మాట్లాడితే.. తన ఎదుగుదలను చూసి టీడీపీ వారు ఓర్వలేకపోతున్నారని విమర్శించారు. జీసీసీలో 430 మంది ఉద్యోగులు ఉన్నారని, ఇంకా 600 పైగా ఖాళీలు ఉన్నాయని, అంచెలంచెలుగా వాటిని భర్తీ చేస్తామన్నారు. అరకు ఎంపీ జి.మాధవి, ఎమ్మెల్యేలు భాగ్యలక్ష్మి, కళావతి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర, జీసీసీ చైర్‌పర్సన్ డాక్టర్ శోభా స్వాతిరాణి, ఏపీ ట్రైకార్ చైర్మన్ ఎస్.బుల్లిబాబు, జీసీసీ ఎండీ సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

• తెలంగాణ

### ఐశ్వర్యారెడ్డి అంత్యక్రియలు పూర్తి

**హుడాకాంప్లెక్స్ (హైదరాబాద్):** అమెరికాలో దుండగుల కాల్పుల్లో ఇటీవల మృతి చెందిన తాటికొండ ఐశ్వర్యారెడ్డి (26) అంత్యక్రియలు గురువారం నాగోల్ వైకుంఠధామంలో జరిగాయి. హుడా కాలనీకి చెందిన ఐశ్వర్య ఎంఎస్ కోసం అమెరికా వెళ్లి.. చదువు పూర్తయ్యాక అక్కడే స్థిరపడ్డారు. టెక్సాస్ రాష్ట్రంలోని అలెన్ పట్టణంలో ఫర్‌పెక్ట్ జనరల్ కాంట్రాక్ట్ సంస్థలో మూడేళ్లుగా ప్రాజెక్టు మేనేజర్‌గా పని చేస్తున్నారు. శనివారం మధ్యాహ్నం అలెన్ ప్రీమియర్ షాపింగ్‌మాల్‌లో దుండగులు కాల్పులు జరపగా ఆమె అక్కడికక్కడే మృతి చెందడం తెలిసిందే. ఆమె మృతదేహం బుధవారం రాత్రి హైదరాబాద్‌కు చేరుకుంది. ఐశ్వర్య తండ్రి తాటికొండ నర్సిరెడ్డి రంగారెడ్డి జిల్లా కోర్టులో ఆర్థిక వివాదాల పరిష్కారాల కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పని చేస్తున్నారు. కుమార్తె మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.



విశాఖలోని డాక్టర్ వైఎస్సార్ ఏసీఏ-వీడీసీఏ స్టేడియం వద్ద వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించిన సీఎం జగన్



యువ క్రికెటర్లతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



విశాఖ బీచ్ రోడ్డులో సీ హారియర్ యుద్ధ విమాన మ్యూజియం ప్రారంభిస్తున్న సీఎం వైఎస్ జగన్

# క్రీడలకు ప్రోత్సాహం

## విశాఖ పర్యటనలో క్రీడాకారులతో సీఎం జగన్ ఆత్మీయ భేటీ

- రాష్ట్రం నుంచి మరింత మంది రాణించాలి
- అపోలో క్యాన్సర్ ఆసుపత్రిని ప్రారంభించిన సీఎం
- సీ హారియర్ యుద్ధ విమానాల మ్యూజియం, స్పోర్ట్స్ ఎరీనాకు ప్రారంభోత్సవం
- భీమిలి ఫిష్ ల్యాండింగ్ సెంటర్‌కు శంకుస్థాపన

**సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:** ఆంధ్రప్రదేశ్ నుంచి మరింత మంది జాతీయ స్థాయి క్రికెటర్లు తయారు కావాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్షించారు. రాష్ట్రంలో ఎంతోమంది ప్రతిభ కలిగిన క్రీడాకారులున్నారని, వారిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. జాతీయ స్థాయిలో రాణించేందుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించాలని, వారికి సహాయ సహకారాలను ప్రభుత్వం అందిస్తుందని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) కార్యదర్శి గోపినాథ్‌రెడ్డికి సూచించారు. గురువారం విశాఖ పర్యటన సందర్భంగా సీఎం జగన్ పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

### మహిళా క్రికెటర్లకు నగదు ప్రోత్సాహం

గన్నవరం విమానాశ్రయం నుంచి విశాఖ చేరుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తొలుత పీఎం పాలెంలోని డాక్టర్ వైఎస్సార్ ఏసీఏ-వీడీసీఏ స్టేడియం వద్ద దివంగత వైఎస్సార్ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించి ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. జాతీయ మహిళా క్రికెటర్ అంజలి శర్వాణి, అండర్-19 వరల్డ్ కప్ క్రికెట్ కప్‌లో ఆడిన షబ్నంకు రూ.10 లక్షల చొప్పున నగదుతో పాటు జ్ఞాపిక అందించి సత్కరించారు. క్రికెట్ అసోసియేషన్ సభ్యులతో పాటు క్రీడాకారులతో సీఎం జగన్ ఆత్మీయంగా సమావేశమయ్యారు. వారిని పేరుపేరునా పలకరించారు. మరింత రాణించేలా ప్రభుత్వం నుంచి సహాయం అందిస్తామని హామీనిచ్చారు.

### బీచ్ రోడ్డులో 'సీ హారియర్'

విశాఖ బీచ్ రోడ్డులో రూ.10 కోట్లతో నూతనంగా ఏర్పాటు చేసిన 'సీ హారియర్' యుద్ధ విమానాల మ్యూజియంను సీఎం జగన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా యుద్ధ విమానాలకు చెందిన విడి భాగాలను పరిశీలించారు. వాటి పనితీరును తూర్పు నౌకాదళాధిపతి వైస్ అడ్మిరల్ బిశ్వజిత్ దాస్‌గుప్తాను అడిగి తెలుసుకున్నారు. రూ.25.50 కోట్లతో ఎంవీపీ కాలనీలో నిర్మించిన ఇండోర్ స్పోర్ట్స్ ఎరీనాకు అక్కడి నుంచే సీఎం ప్రారంభోత్సవం చేశారు. రూ.13.5 కోట్లతో అభివృద్ధి చేసిన వీఎంఆర్‌డీఏ వాణిజ్య సముదాయాన్ని కూడా ప్రారంభించారు. రూ.24.86 కోట్లతో భీమిలిలో ఏర్పాటు కానున్న ఫిష్ ల్యాండింగ్ సెంటర్‌కు శంకుస్థాపన చేశారు.



అపోలో క్యాన్సర్ ఆసుపత్రిని ప్రారంభించిన అనంతరం ల్యాబ్‌ను పరిశీలిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

### ట్రూ బీమ్ టెక్నాలజీతో తొలి క్యాన్సర్ ఆసుపత్రి

విశాఖ పర్యటన సందర్భంగా ముఖ్యమంత్రి జగన్ ఆరిలోవలోని హెల్త్‌సిటీలో ఏర్పాటైన అపోలో క్యాన్సర్ ఆసుపత్రిని అపోలో హెల్త్ ఎంటర్ ప్రైజెస్ వైస్ చైర్‌పర్సన్ ప్రీతారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) ఆనందిత్‌రెడ్డి, హర్షత్‌రెడ్డి, రీజనల్ సీఈవో సుబ్రహ్మణ్యం తదితరులతో కలిసి ప్రారంభించారు. రేడియేషన్ సెంటర్‌ను పరిశీలించారు. 54 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ట్రూ బీమ్ ఎస్‌టీఎక్స్ టెక్నాలజీతో రాష్ట్రంలోనే తొలి క్యాన్సర్ ఆసుపత్రిని నిర్మించినట్లు అపోలో ప్రతినిధులు తెలిపారు.

### ఎమ్మెల్యే బాబురావు కుమారుడి పెళ్లి రిసెప్షన్‌లో సీఎం వైఎస్ జగన్

**సాక్షి, విశాఖపట్నం:** పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు కుమారుడు సాయి కార్తికేయ, సాహితీ దంపతుల వివాహ రిసెప్షన్ విశాఖలో ఘనంగా జరిగింది. నగర పర్యటన ముగించుకుని తిరుగు ప్రయాణంలో బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన రిసెప్షన్‌కి హాజరైన ముఖ్యమంత్రి జగన్ నూతన వధూవరులకు ఆశీస్సులు అందజేశారు. సీఎం జగన్ వెంట టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, డిప్యూటీ సీఎంలు బూడి ముత్యాలనాయుడు, పీడిక రాజన్నదొర, నారాయణస్వామి, మంత్రులు విడదల రజని, ఆర్కే రోజా, గుడివాడ అమర్‌నాథ్, ఆదిమూలపు సురేష్, ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, భీశెట్టి వెంకట సత్యవతి, గొడ్డేటి మాధవి, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ,, వైఎస్సార్ సీపీ విశాఖ అధ్యక్షుడు పంచకర్ల రమేష్ బాబు, ఎమ్మెల్సీలు పండుల రవీంద్రబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, కల్యాణి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, కన్నబాబురాజు, తిప్పల నాగిరెడ్డి, ధర్మాన కృష్ణదాస్, పెట్ల ఉమాశంకర్ గణేష్, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె రాజు, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, ఎంఎస్‌ఎంఈ చైర్మన్ ఆడారి ఆనంద్ తదితరులున్నారు.



వానపల్లి పార్వతి విజ్ఞప్తి మేరకు కాన్వాయ్ ఆపి ఆమె కుమారుడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న సీఎం వైఎస్ జగన్



సీఎం వైఎస్ జగన్ ఆదేశం మేరకు పార్వతి కుమారుడికి రూ.లక్ష చెక్కు అందిస్తున్న జేసీ విశ్వనాథ్

## తల్లడిల్లిన తల్లి గుండెకు ఊరట

**ఆరిలోవ (విశాఖ తూర్పు):** పసి వయసులోనే ఓపెన్ హార్ట్ సర్జరీ జరగడంతోపాటు తండ్రిని కోల్పోయి హృద్రోగం బారినపడ్డ ఓ బాలుడి వ్యథ తెలిసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తక్షణమే స్పందించారు. సీఎం విశాఖ పర్యటన సందర్భంగా ఈ ఘటన చోటు చేసుకుంది. ఆరిలోవలోని శ్రీకాంత్‌నగర్‌కు చెందిన వానపల్లి పార్వతి కుమారుడు వానపల్లి చరణ్ సాయి మణికంఠ(12)కు మూడేళ్ల వయసులోనే ఓపెన్ హార్ట్ సర్జరీ జరిగింది. అయితే ఇప్పుడు మరోసారి శస్త్ర చికిత్స అవసరమని, అందుకు రూ.8 లక్షలు వరకు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పడంతో ఆ తల్లి గుండె తల్లడిల్లింది. నిరుపేద కుటుంబానికి చెందిన ఆమె భర్త రెండేళ్ల క్రితం చనిపోయారు. అపోలో క్యాన్సర్ ఆస్పత్రి ప్రారంభోత్సవ కార్యక్రమం ముగిసిన అనంతరం ముఖ్యమంత్రి కాన్వాయ్ వెళ్తుండగా పెదగదిలి కూడలి వద్ద 'నా కుమారుడిని రక్షించండి జగనన్నా..' అంటూ కేకలు వేసింది. దీన్ని గుర్తించిన ముఖ్యమంత్రి జగన్ తన కారు ఆపి విషయం తెలుసుకుని చలించిపోయారు. తక్షణ సహాయం అందించాలని జిల్లా కలెక్టర్ మల్లికార్జునను ఆదేశించారు. జేసీ విశ్వనాథన్, రూరల్ తహశీల్దారు పి.రమణయ్య సాయంత్రం బాలుడి ఇంటికి వెళ్లి తక్షణం సాయంగా రూ.లక్ష చెక్కు అందజేశారు. ముఖ్యమంత్రి జగన్ ఆదేశాల మేరకు బాలుడికి వైద్య సాయం కూడా అందిస్తామని భరోసా ఇచ్చారు. ముఖ్యమంత్రి జగన్ దేవుడిలా తన కుమారుడిని కాపాడేందుకు వచ్చారని బాలుడి తల్లి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు రుణపడి ఉంటానని పేర్కొన్నారు.

## రైతు పక్షపాత ప్రభుత్వంపై దుష్ప్రచారమా?

- చంద్రబాబు, పవన్‌పై మాజీ మంత్రి కన్నబాబు మండిపాటు
- అకాల వర్షాల సాకుతో వారిద్దరూ డ్రామాలాడుతున్నారు
- సీఎం జగన్ నిబంధనలు సడలించి మరీ ధాన్యం కొంటున్నారు



**కాకినాడ:** వైఎస్ జగన్ ప్రభుత్వం రైతుల పక్షపాత ప్రభుత్వమని, అన్నదాత సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ఈ సర్కారుపై మాజీ సీఎం చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ దుష్ప్రచారం చేస్తారా... అంటూ వ్యవసాయ శాఖ మాజీ మంత్రి కురసాల కన్నబాబు మండిపడ్డారు. ఆయన గురువారం ఇక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఇటీవలి అకాల వర్షాలను సాకుగా తీసుకుని రైతుల పక్షాన మాట్లాడుతున్నట్టు ఆ ఇద్దరు నేతలు డ్రామాలు ఆడుతున్నారని అన్నారు. ఏ ఒక్క రైతు నష్టపోకూడదనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్ నిబంధనలను సడలించి మరీ తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయిస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా సివిల్ సప్లైస్ ద్వారా ఖరీఫ్‌లో 6.40 లక్షల రైతుల నుంచి 35,41,564 టన్నుల ధాన్యం కొన్నారని తెలిపారు. సుమారు రూ.7,233 కోట్లలో రూ.7,212 కోట్లు.. అంటే 99 శాతం చెల్లింపులు జరిగాయని చెప్పారు. ప్రస్తుత సీజన్‌లో రూ.1,629 కోట్ల విలువైన ధాన్యాన్ని కొని రూ.1,277 కోట్ల చెల్లింపులు కూడా చేశారన్నారు. 21 రోజుల్లో చెల్లించాలనే నిబంధన ఉన్నప్పటికీ రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఆరు రోజులకే చెల్లించారన్నారు. ఎఫ్‌సీఐ బొండాలు ధాన్యాన్ని కొంతకాలంగా కొనడం లేదని, అయితే ఈసారి అధిక విస్తీర్ణంలో ఈ రకం పండించడంతో ముఖ్యమంత్రి కేంద్రం దృష్టికి తీసుకెళ్లి వాటినీ కొనుగోలు చేస్తున్నారని చెప్పారు. 17 శాతంకన్నా తేమ అధికంగా ఉంటే రైతులు నష్టపోకూడదని నిబంధనలు సడలించారన్నారు. తడిసిన ధాన్యం కళ్లాల్లో ఉండడం వల్ల ఆఫ్‌లైన్‌లో సైతం ప్రొక్యూర్‌మెంట్ జరిగిందన్నారు. ఇవన్నీ విపక్ష నేతలకు కనిపించలేదా.. అని ప్రశ్నించారు.

### బాబుది దగా యాత్ర

**తణుకు టౌన్:** అకాల వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతుల కోసమంటూ ప్రతిపక్ష నేత చంద్రబాబు చేపట్టింది రైతు పోరుబాట కాదని.. అది రైతుల దగాయాత్రగా మిగిలిపోతుందని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు విమర్శించారు. పశ్చిమ గోదావరి జిల్లా తణుకు మండలం దువ్వ గ్రామంలో గురువారం రాత్రి రైతులు ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా రాష్ట్రంలో 5 లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ కొనుగోలుకు కేంద్ర ప్రభుత్వ సంస్థలతో ఒప్పందం చేసినట్టు తెలిపారు.



## కొర్రీలు పెట్టొద్దు.. ఉదారంగా ఉండండి

- నష్టపోయిన ప్రతి రైతుకూ అండగా నిలబడండి
- దెబ్బతిన్న ధాన్యం, మొక్కజొన్నను కనీస మద్దతు ధరలకు కొనండి
- ఉన్నతాధికారుల సమీక్షలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



**సాక్షి, అమరావతి:** అకాల వర్షాలవల్ల పంటలు దెబ్బతిన్న సన్న, చిన్నకారు రైతులను ఆదుకునే విషయంలో ఉదారంగా ఉండాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పంట నష్టం అంచనాలు తయారు చేయడంలోగానీ, పరిహారం అందించడంలోగానీ ఎలాంటి కొర్రీలు వేయకుండా ఆదుకోవాలన్నారు. ఆ మేరకు క్షేత్రస్థాయి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీచేయాలన్నారు. వ్యవసాయ, ఉద్యాన, మార్కెటింగ్ శాఖల ఉన్నతాధికారులతో గురువారం మంగళగిరిలోని వ్యవసాయ శాఖ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో మంత్రి మాట్లాడుతూ.. సీఎం ఆదేశాల మేరకు రైతులకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు అధికార యంత్రాంగం ఎల్లవేళలా సిద్ధంగా ఉండాలన్నారు. అలాగే, రబీ పంటలు చేతికొచ్చే వేళ ఇటీవల కురిసిన అకాల వర్షాలు రైతులను కోలుకోలేని దెబ్బతీసాయని, ఇలాంటి సందర్భంలో వారికి అన్ని విధాలా అండగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే, దెబ్బతిన్న పంటలకు కనీస మద్దతు ధరలు దక్కేలా చూడాలన్నారు. అవసరమైతే మార్కెట్ ఇంటర్‌వెన్షన్ స్కీమ్ కింద మార్కెట్‌లో జోక్యం చేసుకుని రైతుల వద్ద ఉన్న ఉత్పత్తులను కనీస మద్దతు ధరలకు కొనుగోలు చేయాలన్నారు. తడిసిన, మొలకెత్తిన, రంగుమారిన ధాన్యం సేకరణలో కూడా రైతులకు అండగా నిలవాలని కాకాణి అన్నారు.

**పక్కాగా ఖరీఫ్ కార్యాచరణ..**

ఇక పంట నష్టం అంచనా కోసం ఏర్పాటుచేసిన ఎన్యూమరేషన్ బృందాలు క్షేత్రస్థాయిలో రైతులను ఇబ్బంది పెట్టకుండా నిబంధనల మేరకు ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జూన్ నుంచి ప్రారంభం కానున్న ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన అన్ని ఏర్పాట్లను అధికారులు చెయ్యాలన్నారు. ఖరీఫ్ సీజన్‌లో 6.18 లక్షల క్వింటాళ్ల విత్తన పంపిణీ కోసం తయారుచేసిన యాక్షన్ ప్లాన్‌ను పక్కాగా అమలుచేయాలని మంత్రి సూచించారు. డిమాండ్ మేరకు ఆర్బీకేల ద్వారా విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులను సిద్ధంచేయాలన్నారు. సమీక్షలో వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది, సహకార, మార్కెటింగ్ శాఖ ప్రధాన కార్యదర్శి చిరంజీవి చౌదరి, వ్యవసాయ శాఖ ప్రత్యేక కమిషనర్ చేవూరు హరికిరణ్, ఉద్యాన, మార్కెటింగ్ శాఖ కమిషనర్లు డాక్టర్ ఎస్ఎస్ శ్రీధర్, రాహుల్ పాండే, ఏపీ సీడ్స్, ఆగ్రోస్ ఎండీలు డాక్టర్ గెడ్డం శేఖర్‌బాబు, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

## బాబు పల్లకీ మోయడమే పవన్ అజెండా

**వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి**



**సాక్షి, అమరావతి/శంషాబాద్ (హైదరాబాద్):** టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు పల్లకీ మోయడమే తన అజెండా అని జనసేన అధ్యక్షుడు, సినీ నటుడు పవన్ కళ్యాణ్ చాటి చెప్పారని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి మండిపడ్డారు. హైదరాబాద్‌లోని శంషాబాద్‌లో, తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాజకీయాలలో కులాల గురించి ఆలోచించడం తప్పని, అయితే చంద్రబాబు అదే చేస్తారని ధ్వజమెత్తారు. టీడీపీకి దూరమైన కాపు సామాజిక వర్గానికి పవన్ కళ్యాణ్‌ను ఎరగా వేసి.. ఓట్లు రాబట్టాలని చంద్రబాబు పథకం వేస్తున్నారని ఆరోపించారు. కానీ.. ఆ పథకం చెల్లుబాటు కాదన్నారు. కులాలపరంగా ప్రజలు ఓట్లు వేయరని.. చేసిన సేవ, విశ్వసనీయత ఆధారంగానే ఓట్లు వేస్తారని స్పష్టం చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 151 స్థానాల్లో విజయం సాధించడం.. ఆ తర్వాత స్థానిక సంస్థల ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేయడం, గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజలు బ్రహ్మరథం పట్టడమే అందుకు నిదర్శనమని గుర్తు చేశారు. తాను సీఎం అయితే చూడాలనుకున్న అభిమానులు, కాపు సామాజికవర్గం కలలను చంద్రబాబుకు పవన్ కళ్యాణ్ తాకట్టు పెట్టారన్నారు. తమ కలలను పవన్ కల్లలుగా మార్చిన నేపథ్యంలో అభిమానులు, కాపులు వారి వెంట నడవరని స్పష్టం చేశారు. పవన్ కళ్యాణ్ ఇష్టపూర్వకంగా బలి పశువుగా మారారని చెప్పారు. సజ్జల ఇంకా ఏమన్నారంటే..

**చంద్రబాబు కోసమే జనసేన**

- సీఎం వైఎస్ జగన్ కంటే ముందే పవన్ కళ్యాణ్ రాజకీయ ప్రయాణం ప్రారంభించారు. చంద్రబాబు కోసమే జనసేనను స్థాపించారు.
- జనసేన పోటీ చేసిన 137 స్థానాల్లోనూ ఆ పార్టీ అభ్యర్థులను చంద్రబాబే ఖరారు చేశారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబును సీఎం పీఠంపై కూర్చోబెట్టడమే ధ్యేయంగా పవన్ కళ్యాణ్ పని చేస్తున్నారు. రాజకీయ ప్రస్థానంలో సీఎం వైఎస్ జగన్‌లా ప్రజలతో మమేకమై.. వారి మన్ననలు పొంది, రాజకీయ శక్తిగా ఎదగాలని పవన్ ఎన్నడూ ఆలోచించలేదు. తాను రాజకీయ శక్తిగా ఎదిగితే చంద్రబాబుకు ఇబ్బంది అవుతుందని పవన్ కళ్యాణ్ భావించారేమో.
- గత ఎన్నికల్లో 175 స్థానాల్లో పోటీ చేసిన టీడీపీ.. గెలిచింది 23 స్థానాల్లోనే. జనసేన పోటీ చేసిన 137 స్థానాల్లో గెలిచింది ఒక్క స్థానమే. ప్రస్తుతం రాష్ట్రంలో ఒంటరిగా 175 స్థానాల్లో అభ్యర్థులను పోటీకి పెట్టలేని దుస్థితిలో చంద్రబాబు ఉన్నారు. టీడీపీ శ్రేణుల్లో నైతిక స్థైర్యం నింపడానికే పొత్తులు అంటూ పవన్ కళ్యాణ్‌తో చంద్రబాబు మాట్లాడిస్తుంటారు.
- 2019 ఎన్నికల్లో 30 స్థానాల్లో గెలిపించి ఉంటే.. వచ్చే ఎన్నికల్లో 175 స్థానాల్లోనూ జనసేన అభ్యర్థులను పోటీకి పెట్టేవాడినని పవన్ కళ్యాణ్ అనడం అవివేకం. సీఎం పదవి రేసులో తాను లేనన్న పవన్.. మారీచులైన రామోజీ, రాధాకృష్ణ, టీవీ5 నాయుడులతో కలిసి చంద్రబాబును తక్షణమే సీఎం పీఠంపై కూర్చోబెట్టడమే తన ధ్యేయమని చాటిచెప్పుకున్నారు. పవన్ కళ్యాణ్ చెబుతున్నట్టుగా ప్రభుత్వ వ్యతిరేక ఓటు లేదు. ప్రభుత్వ సానుకూల ఓటు విపరీతంగా ఉంది. టీడీపీ తరఫున పోటీ చేయడానికి అభ్యర్థులు దొరకకే ముందస్తు ఎన్నికలంటూ చంద్రబాబు డ్రామాలాడుతున్నారు. ప్రజల ఆశీస్సులు, ఆదరణతో వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీ అఖండ విజయం సాధించడం ఖాయం.

మీరు పరస్పరం ఎత్తిపొడుచుకోకండి. చెడ్డపేర్లతో పిలుచుకోకండి. ఒకనిని చెడ్డపేరుతో పిలవటం ఎంతో నీచమైన విషయం. (ఇలా చేసిన పిదప) పశ్చాత్తాప పడకుంటే, అలాంటి వారు దుర్మార్గులు.

– ఇస్లాం ధర్మం



సాక్షి

శుక్రవారం, 12 మే 2023

# సరిదిద్దలేని మహా తప్పిదాలు

ఉత్కంఠగా ఎదురుచూసిన కోర్టు తీర్పు వచ్చింది. కానీ, న్యాయం మాత్రం ఇంకా జరగాల్సి ఉంది. శివసేన రెండు ముక్కలై వీధికెక్కిన వివాదంలో అయిదుగురు సభ్యుల సుప్రీమ్ కోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఏకగ్రీవంగా గురువారం ఇచ్చిన తీర్పు తర్వాత పరిస్థితి అదే. ఉద్ధవ్ ఠాక్రే, ఏక్‌నాథ్ శిందే వర్గాల మధ్య శివసేనలో అంతర్గత కలహాలు చివరకు ప్రభుత్వ మార్పిడిగా పర్యవసించినప్పుడు మహారాష్ట్ర గవర్నర్, శాసనసభ స్పీకర్‌లు అత్యుత్సాహం చూపిన తీరును కోర్టు తీవ్రంగా తప్పు బట్టింది. వారు చట్టప్రకారం నడుచుకోలేదని కుండబద్దలు కొట్టింది. కానీ, శివ సేనను వీడి, పార్టీని శిందే రెండు ముక్కలు చేసిన సందర్భంలో సభలో బలపరీక్షకు నిలవకుండానే రాజీనామా సమర్పించిన ఉద్ధవ్ సర్కార్‌ను పునరుద్ధరిస్తూ ఆదేశాలివ్వలేమనీ పేర్కొంది. జరిగింది తప్పేనని తీర్పు చెబుతూనే, పాత తప్పును ఇప్పుడు సరిదిద్దలేమని అశక్తత వ్యక్తం చేసింది. అంటే శిందే సర్కార్ కొనసాగేలా ఇప్పటికి ఊరట నిచ్చింది. అదే సమయంలో ఉద్ధవ్ రాజీనామా చేయకుండా, సభలో బలపరీక్షకు దిగుంటే... ఆ బలపరీక్షే చట్టవిరుద్ధం గనక ఆయన సర్కారును పునరుద్ధరించే వీలుండేదని కోర్ట్ అభిప్రాయపడింది. అలా అప్పట్లో విప్‌ను ధిక్కరించిన శిందే అనర్హతకు తలుపు తెరిచే ఉంచింది.

పార్టీ అంతర్గత విభేదాల లెక్క తేల్చేందుకు నాటి మహారాష్ట్ర గవర్నర్ భగత్‌సింగ్ కోషియారీ శాసనసభలో బలపరీక్ష పెట్టాలని నిర్ణయించడం శుద్ధ తప్పు అనే మాట లోతైనది. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న గవర్నర్‌కు రాజకీయ పార్టీల అంతర్గత విభేదాలతో పనేమిటి? ప్రభుత్వం మద్దతు కోల్పోయినట్టు తగిన సాక్ష్యాధారాలేమీ లేకుండానే, స్వయానా గవర్నరే బలపరీక్ష జరపాలని కోరడమంటే... చట్టబద్ధమైన ప్రభుత్వాన్ని అనివార్యంగా మెజారిటీ కోల్పోయేలా చేసి, కూలిపోయేలా చూడడమే! అంటే, కారణాలేమైనా తన చర్యల ద్వారా ఒక నిర్ణీత ఫలితం వచ్చేలా చేయడమే! ఉద్ధవ్ సారథ్యంలోని 'మహా వికాస్ అఘాడీ' (ఎంవీఏ) కూటమి సర్కార్ రాజీనామాకు ఇదే కారణమైంది. ఇది గవర్నర్లు చేయాల్సిన పనేనా? ఈ కేసులో వాదనల సందర్భంగా సుప్రీమ్ ప్రస్తావించిన ఈ అంశాలు ఆలోచించాల్సినవి. కావాల్సిన పార్టీలకు అధికారం కట్టబెట్టేందుకు ఢిల్లీ పెద్దలు గవర్నర్ల వ్యవస్థను వాడుకుంటున్న విషాదానికి ఇవన్నీ మహా చిహ్నాలు.

మరోపక్క శిందే వర్గమే 'అసలైన' శివసేన అని గుర్తిస్తూ, దానికే పార్టీ చిహ్నమైన విల్లంబులను ఎన్నికల సంఘం కేటాయించడమూ తొందరపాటే. అలాగే, అసెంబ్లీ స్పీకర్ సైతం శిందే వర్గానికి అనుకూలంగా ఎన్నికల సంఘం నిర్ణయం ప్రకటించే వరకు ఆ వర్గపు ఎమ్మెల్యేలపై వచ్చిన అనర్హత ఫిర్యాదులను నానబెట్టడం మరో తప్పు. ఇలా గవర్నర్, స్పీకర్, ఎన్నికల సంఘం సహా అన్ని రాజ్యాంగ సంస్థలూ తప్పుదోవ పట్టిన తీరును సుప్రీమ్ తన తీర్పులో బలంగా ప్రస్తావించడం గమనార్హం. శివసేన కథలో తదుపరి ఘట్టం మరింత విస్తృత రాజ్యాంగ ధర్మాసనం ముందున్న వేళ ఇవన్నీ కూడా మళ్ళీ లెక్కలోకి రాక మానవు. అలాగే, విప్ జారీ అయినా సరే చీలిక ముసుగులో పార్టీ ఫిరాయింపులకు పాల్పడితే తిప్పలు తప్పవనీ తేలిపోనుంది. వెరసి, తాజా తీర్పు మన ప్రజాస్వామ్య వ్యవస్థపై దీర్ఘకాలిక ప్రభావం చూపడం ఖాయం అనిపిస్తోంది.

గతంలోకెళితే ఈ కథలో ఎన్నో మలుపులు. 2019 అక్టోబర్‌లో బీజేపీ–శివసేన కూటమి అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచింది. మరిన్ని మంత్రి పదవులు, రెండున్నరేళ్ళ పాటు సీఎం పీఠం కట్టబెట్టాలని ఉద్ధవ్ సారథ్యంలోని శివసేన డిమాండ్ చేసింది. అలాంటి ఒప్పందమేదీ లేదని బీజేపీ అడ్డం తిరిగింది. దాంతో గెలిచిన పక్షం రోజులకే కూటమి విచ్ఛిన్నమైంది. కమలనాథుల సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ రాజీనామా చేయాల్సొచ్చింది. అప్పటి నుంచి మహారాష్ట్రలో కొత్త పొత్తులు, ప్రభుత్వాలు– సీఎంల మార్పులు, కాంగ్రెస్– ఎన్సీపీ– శివసేనల 'ఎంవీఏ' కూటమి ఆవిర్భావం... ఇలా అనేకం జరిగాయి. వాటిలో భాగమే 2022 జూన్‌లో ఏకంగా శివసేన వ్యవస్థాపకుడైన బాల్‌ఠాక్రే కుమారుడూ, అప్పటి మహారాష్ట్ర సీఎం అయిన ఉద్ధవ్‌పై శిందే తిరుగుబాటు. గవర్నర్ బలపరీక్ష నిర్ణయంతో ఉద్ధవ్ జూన్ 29న రాజీనామా చేశారు. ఆ మర్నాడే బీజేపీ అండతో శిందే సీఎం కుర్చీ ఎక్కారు. శిందే, ఆయనతో బయటకొచ్చి పార్టీ తమదేనన్న మరో 15 మంది అనర్హత కథ కొన్నాళ్ళుగా కోర్టులో నలుగుతోంది.

తీర్పు నేపథ్యంలో నైతిక బాధ్యత వహించి శిందే సర్కార్ రాజీనామా చేయాలని ఉద్ధవ్ కోరుతుంటే, కోర్టు వ్యాఖ్యలెలా ఉన్నా తమను కొనసాగనివ్వడమే ప్రజాస్వామ్య విజయమని శిందే, ఫడ్నవీస్‌లు జబ్బలు చరుస్తున్నారు. విస్తృత ధర్మాసనంలో కథ ఏ కొత్త మలుపు తిరుగుతుందో చెప్పలేం. తమను కాదని ప్రత్యర్థులతో కూటమి కట్టిన మునుపటి మిత్రపక్షం శివసేనను నిలువునా చీల్చడంలో బీజేపీ ఇప్పటికే సఫలమైంది. సొంతంగా చక్రం తిప్పేందుకు అదను కోసం చూస్తోంది. అది రుచించకున్నా, బీజేపీ దోస్తీ లేకుండా శిందే సేన మనుగడ కష్టం. మరోపక్క తన వెంట మిగిలిన కొద్దిమందీ చేజారిపోకుండా కాపాడుకోవడం ఉద్ధవ్ ముందున్న సవాలు. ఈ పరిస్థితుల్లో తాజా తీర్పు ఉద్ధవ్‌కు నైతికంగా బలమిచ్చింది. కోర్టు తీర్పుతో కుర్చీ దక్కకున్నా, గవర్నర్ అవాంఛనీయ పాత్రతో ప్రత్యర్థులు అధికారం చేజిక్కించుకున్న తీరును తప్పుబట్టడమే ఊరట. అనర్హతలపై స్పీకర్ సత్వరమే నిర్ణయించాలనీ కోర్ట్ చెప్పడం గమనార్హం. అందుకే, ముందే అన్నట్టు తీర్పు వచ్చినా, న్యాయం ఇంకా జరగాల్సి ఉంది. కోర్టు లోపల ఒక దశ పోరాటం ముగిసి ఉండవచ్చు. మరోదశ మిగిలివుంది. కోర్టు బయట కూడా ఉద్ధవ్ తదితరుల నైతిక పోరాటం దీర్ఘకాలం కొనసాగుతుంది. సుప్రీమ్ వ్యాఖ్యలతోనైనా మన రాజ్యాంగ వ్యవస్థలు దిద్దలేని తప్పిదాలకు దూరంగా ఉంటాయా?

## గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, **తిథి:** బ.సప్తమి ఉ.10.42 వరకు, తదుపరి అష్టమి, **నక్షత్రం:** శ్రవణం ప.2.43 వరకు, తదుపరి ధనిష్ఠ, **వర్జ్యం:** సా.6.24 నుండి 7.55 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.07 నుండి 8.56 వరకు తదుపరి ప.12.22 నుండి 1.13 వరకు, **అమృతఘడియలు:** ఉ.5.04 నుండి 6.32 వరకు.

**సూర్యోదయం :** 5.33
**సూర్యాస్తమయం :** 6.18
**రాహుకాలం :** ఉ.10.30 నుండి 12.00 వరకు
**యమగండం :** ప.3.00 నుండి 4.30 వరకు

# సంక్షోభం నేర్పుతున్న సన్నద్ధ పాఠం

విశ్లేషణ



అరుణ్ ప్రకాశ్

**రష్యా–ఉక్రెయిన్ యుద్ధం దీర్ఘకాలం కొనసాగడం భారత్‌కు సంకటంగా మారుతోంది. బ్రిక్స్, షాంఘై కో–ఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్సీఓ) వంటి ఏర్పాట్ల ద్వారా చైనా, రష్యా రెండింటితో సంబంధం కలిగి ఉండటం ఒక కారణం. క్వాడ్, మలబార్ గ్రూపింగ్ ద్వారా ఇంకోపక్క భారత్ అమెరికాతోనూ జట్టుకట్టింది. భారత్ ఏకకాలంలో అటు ఎస్సీఓ, ఇటు జీ20లకు అధ్యక్ష స్థానాన్ని నిభాయిస్తూండటం చెప్పుకోవాల్సిన అంశం. వ్యూహాత్మకంగా స్వతంత్రంగా ఉంటూనే ఈ పరిస్థితిని తనకు అనుకూలంగా మార్చుకోవాలంటే భారత్ చాలా దార్శనికతతో వ్యవహరించాలి. వాణిజ్యం, వ్యాపారం, దౌత్యం అన్నింటినీ పరిగణనలోకి తీసుకోవాలి. ఈ సమన్వయం ద్వారా మిలిటరీ టెక్నాలజీలను అందిపుచ్చుకునేందుకు ప్రయత్నించాలి.**

రష్యా, ఉక్రెయిన్ యుద్ధ ప్రకంపనలు ప్రపంచం నలుమూలలా వినిపిస్తున్నాయి. యుద్ధం తాలూకూ దుష్ప్రభావం కేవలం రాజకీయాలకు, ఆర్థిక వ్యవస్థలకు మాత్రమే పరిమితం కాలేదు. అన్నిచోట్లా సామాన్యుడిని సైతం ఇబ్బందిపెట్టే స్థాయికి ఈ యుద్ధం చేరుకుంది. గోధుమలు, వంటనూనెలు, ఎరువుల విషయంలో ఉక్రెయిన్ తిరుగులేని స్థానంలో ఉంది. ముడిచమురు, సహజవాయువుల్లో రష్యా పెత్తనం గురించి చెప్పనక్కర్లేదు. వీటన్నింటికీ ఏర్పడ్డ కొరత స్టాక్‌మార్కెట్లను కూల్చేస్తూంటే... పెరిగిపోతున్న ధరలు, ప్రజల్లోని అసంతృప్త రాజకీయ ఉద్యమాలను ప్రేరేపిస్తున్నాయి.

రష్యా అధ్యక్షుడు వ్లాదిమీర్ పుతిన్ అణ్వాయుధ ప్రయోగం గురించి మాట్లాడటం ద్వారా ప్రపంచాన్ని మూడో ప్రపంచయుద్ధం ముంగిట్లో నిలబెట్టారు. తన నిర్లక్ష్య ధోరణితో విపరీతమైన ఆస్తి నష్టానికీ కారణమయ్యారు. రష్యాపై విధించిన ఆంక్షలు ప్రపంచీకరణ ప్రక్రియను నిలిపేశాయని అనలేము. కానీ ఆహారం, ఇంధనం, సరుకులు, ఆయుధాల కోసం దేశాలు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించడం మొదలుపెట్టడంతో కూటముల పునరేకీకరణ, భిన్న ధ్రువాల ఏర్పాటు మొదలైందని చెప్పాలి.

రష్యా–ఉక్రెయిన్ మధ్య యుద్ధానికి దారితీసిన కారణాలపై చర్చలు అంతులేనంతగా సాగవచ్చు. దీనికి ముఖ్యంగా రెండు ముఖాలైతే కనిపిస్తున్నాయి. మొదటగా చెప్పుకొనే పుతిన్ వాదన గురించి చూద్దాం. ఉక్రెయిన్ అనే దేశం అసలు అస్తిత్వంలోనే లేదంటాడు పుతిన్. ఎందుకయ్యా అంటే, ''అది రష్యా చరిత్ర, సంస్కృతి, ఆధ్యాత్మికతల్లో అవిభాజ్యమైన భాగం'' అన్న సమాధానం వినిపిస్తోంది. ఇలాంటి వాదనలు ఇతరులపై తమ పెత్తనమే చెల్లాలని కోరుకునే చోట్ల వినిపిస్తూంటాయి. దక్షిణ చైనా సముద్ర ప్రాంతంలో చైనా చెప్పుకొనే 'నైన్ డాష్ లైన్' మాదిరిగా! లేదా చైనా అక్సాయ్‌చిన్ ఆక్రమణ, అరుణాచల్‌ప్రదేశ్ తమదని నిస్సిగ్గుగా చెప్పుకోవడం ఉదాహరణలుగా పేర్కొనవచ్చు.

ఇంకో పక్క అమెరికా, యూరప్ విశ్వాసరహితంగా వ్యవహరిస్తున్నాయని పుతిన్ ఆరోపిస్తున్నారు. నాటో దళాలు ఒక్క అంగుళం కూడా ముందుకు కదలవని గతంలో యూఎస్ఎస్ఆర్ అధ్యక్షుడు గోర్బచేవ్‌కు ఇచ్చిన మాటను ఆయన గుర్తు చేస్తున్నారు. ఈ మాట ఇచ్చిన పదేళ్లలోనే నాటో వార్సా ఒప్పందంలో భాగమైన పది దేశాలకు సభ్యత్వం ఇచ్చి మాట తప్పిన ఆరోపణలున్నాయి. తాజాగా ఫిన్లాండ్‌కూ చోటు దక్కడంతో 31 దేశాలతో నాటో బలంగా తయారైనట్లు కనిపిస్తోంది. దీంతో తాను బలహీనమవుతున్న భావన రష్యాకు కలుగుతోంది. ఈ విషయాలెలా ఉన్నా, ఓ సార్వభౌమ దేశంపై ఏకపక్ష దాడిని రష్యా ఏ రకంగానూ సమర్థించుకోలేదు. అదే సమయంలో పాశ్చాత్య దేశాలూ ఉక్రెయిన్‌కు నిత్యం ఆయుధాలు సరఫరా చేస్తూ యుద్ధం ఇంత సాగేలా చేయడం కూడా ఆక్షేపించదగ్గదే.



### భారత్‌కు సంకటం...

ఉక్రెయిన్‌పై దాడి వ్యూహం బెడిసికొడుతున్న నేపథ్యంలో రష్యాకు ఇప్పుడు అత్యవసరంగా స్నేహితుల అవసరం ఏర్పడుతోంది. ఈ అవసరాన్ని కాస్తా చైనా తీర్చింది. షీ జిన్‌పింగ్ ఇప్పుడు పక్కాగా రష్యా వైపు నిలబడ్డారని చెప్పవచ్చు. ఫలితంగా ఇకపై చైనాకు రష్యా నుంచి ఆటంకాలు ఎదురుకాకపోవచ్చు. అయితే ఈ క్రమంలో రష్యా కాస్తా చైనా గుప్పిట్లో చిక్కుకునే అవకాశం ఉందా! అదే జరిగితే రష్యా ఇప్పటివరకూ పలు దేశాలతో, మరీ ముఖ్యంగా భారత్‌తో స్వతంత్రంగా నడుపుతున్న సంబంధాలపై చైనా ప్రభావం పడుతుంది. మిలిటరీ అవసరాలను తీర్చే సామర్థ్యం తగ్గిపోయిన నేపథ్యంలో భారత విధాన రూపకర్తలు ఆందోళన చెందాల్సిన పరిస్థితి ఇది. ఇటీవల పూంఛ్‌లో మిలిటరీ దళాలపై జరిగిన దాడి... పాకిస్తాన్ ఆర్మీ, ఐఎస్ఐ ఇప్పటికీ ఉగ్రవాదానికి కలిసికట్టుగా ఊతమిస్తున్న విషయాన్ని స్పష్టం చేస్తోంది.

### స్థిర నిర్ణయానికి సమయం ఇదే...

రెండువైపుల నుంచి ఎదురవుతున్న ముప్పును ఎదుర్కొనేందుకు భారత్ ఒక స్థిర నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉంది. విధానాలతోపాటు ప్రాథమ్యాల పునః సమీక్ష అవసరం. దౌత్య సంబంధాల అజెండాలో టెక్నాలజీ సముపార్జనను కూడా భాగం చేయడం తక్షణ కర్తవ్యం. జపాన్, ఆస్ట్రేలియాలతో కూడిన 'క్వాడ్ అండ్ మలబార్ గ్రూపింగ్' అనేది అమెరికా, భారత వ్యూహాత్మక అవసరాలు కలియడం ఫలితంగా పుట్టుకొచ్చింది. మిలిటరీ, దౌత్య అవసరాలను తీర్చేందుకు మాత్రమే ఇవి ఉపయోగపడుతున్నట్లు కనిపిస్తున్నా ప్రభావం చాలా ఎక్కువే. చైనా తరచూ క్వాడ్‌ను ఉద్దేశించి బెదిరింపులకు దిగడం ఈ గ్రూపింగ్‌ను తన ఆధిపత్య ప్రణాళికలకు గండి కొట్టేదిగా చూడటమే కారణం. అయితే చైనా బెదిరింపులకు కౌంటర్ ఇచ్చే విషయంలో అమెరికా మినహాయించి మిగిలిన దేశాలు తటపటాయించాయి. తమ గ్రూపింగ్ వల్ల భద్రతాపరమైన ప్రభావాలేవీ ఉండవనీ, తమది 'ఆసియా నాటో' కూటమి కాదనీ చెప్పేందుకు ప్రయత్నిస్తుంటాయి. ఈ పరిస్థితిని మార్చి, పదును పెరిగేలా భారత్ చొరవ తీసుకోవాలి.

ఈ విషయంలో అమెరికా చేపట్టిన రెండు పనుల గురించి ప్రస్తావించాలి. 2021 సెప్టెంబరులో ఆస్ట్రేలియా, యూకే, అమెరికా కలిసి త్రైపాక్షిక భద్రత ఒప్పందం కుదుర్చుకున్నాయి. దీని ప్రకారం అమెరికా, బ్రిటన్ రెండూ ఆస్ట్రేలియాతో అత్యాధునిక టెక్నాలజీలను పంచుకుంటాయి. అణ్వస్త్ర సామర్థ్యమున్న జలాంతర్గామిని పొందే విషయంలో కూడా సాయం అందిస్తాయి. యూకే, అమెరికా అణు జలాంతర్గాములను ఆస్ట్రేలియాలో మోహరించడంతోపాటు అణ్వాయుధాల విషయంలో ఆస్ట్రేలియా సిబ్బందికి శిక్షణ ఇచ్చేందుకూ ఏర్పాట్లు జరిగాయి. ఆశ్చర్యకరంగా ఇరుదేశాల మధ్య సంబంధాలు బాగానే ఉన్నప్పటికీ అణు జలాంతర్గాముల విషయంలో భారత్‌కు అమెరికా ఇలాంటి సౌకర్యాలేవీ కల్పించడం లేదు. ఇరుదేశాల వ్యూహాత్మక భాగస్వామ్యం, చారిత్రాత్మక పౌర అణు ఒప్పందం వంటివేవీ అక్కరకు రాలేదు. అయితే అమెరికా 2022 మే నెలలో 'క్రిటికల్ ఇంజినీరింగ్ అండ్ ఎమర్జింగ్ టెక్నాలజీస్' పేరుతో ఒక కార్యక్రమాన్ని ప్రకటించింది. ఇది మనకు అనుకూలమైన ఫలితాలేమైనా సాధిస్తుందా అన్నది వేచి చూడాలి.

మనది అణ్వాయుధాలు కలిగిన దేశం. అంతరిక్ష రంగంలోనూ అగ్రస్థానంలో ఉంది. ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద మిలటరీ వ్యవస్థను కలిగి ఉంది. అయినా... మిలిటరీ విషయంలో మన ప్రయత్నాలు పూర్తిస్థాయిలో లేవనే చెప్పాలి. దిగుమతులపై ఆధారపడే దేశంగానే మిగిలిపోయాం. ఆత్మ నిర్భరత సాధించడం అనేది చాలా ఉదాత్తమైన లక్ష్యమే కానీ, ఒక్క టెక్నాలజీని అభివృద్ధి చేయాలన్నా చాలా సమయం పడుతుంది. ఈ విషయంలో చైనా నుంచి మనం పాఠాలు నేర్చుకోవాలి. 1960లు మొదలుకొని ఇప్పటివరకూ ఆ దేశం ఏకైక లక్ష్యంతో పనిచేస్తోంది. రివర్స్ ఇంజినీరింగ్, బెదిరింపులు, కొన్నిసార్లు దొంగతనాలకూ వెనుకాడకుండా యూఎస్ఎస్ఆర్, పాశ్చాత్య దేశాల నుంచి టెక్నాలజీలను సముపార్జించుకునే ప్రయత్నాలు చేసింది.

ఈ నేపథ్యంలో ఒక్క మాట సుస్పష్టం. ఇకనైనా భారత్ వాణిజ్యం, వ్యాపారం, దౌత్యం అన్నింటినీ పరిగణలోకి తీసుకుని సమీకృత పద్ధతిలో ఇతర దేశాలతో వ్యవహరించడం అలవాటు చేసుకోవాలి. ఈ సమన్వయం ద్వారా మిలిటరీ టెక్నాలజీలను అందిపుచ్చుకునేందుకు ప్రయత్నించాలి. తద్వారా మాత్రమే భారత్ పూర్తిస్థాయిలో ఆత్మనిర్భరత సాధించగలదు.

వ్యాసకర్త భారత నావికాదళ విశ్రాంత ప్రధానాధికారి

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



## సోషల్ మీడియా

### అనైతికం కామన్



మహారాష్ట్ర కథ: ఇంతకుముందు పడిపోయిన ప్రభుత్వం చట్టబద్ధమైనది, కానీ అనైతికమైనది. ఇప్పుడు ఉన్న ప్రభుత్వం కూడా చట్టబద్ధమైనది, కానీ అనైతికమైనది.

– కమలేష్ సింగ్, విశ్లేషకుడు

### మళ్లీ పాలించొచ్చు



పాకిస్తాన్ సైన్యం స్వదేశంలో ఎప్పుడూ ఏ యుద్ధాన్నీ ఓడిపోలేదు. నేననుకోవడం, క్రమంగా వాళ్లు దీన్ని కూడా జయిస్తారు.

– విక్రమ్ సూద్, మాజీ నిఘా అధికారి

### పోరాటం మొదలైంది



జీవితంలోని మంచిచెడ్డలను దేవుడి దయగా మనం అంగీకరించినప్పుడు ప్రతిదీ నదీ ప్రవాహంలా సాగిపోతుంది. దేవుడి సంకల్పానికి లోబడుతున్నాం. 'రజా మే రాజీ'. ఆమెకు మొదటి కీమోథెరపీ జరిగింది. (సిద్ధూ భార్య నవజ్యోత్ కౌర్ క్యాన్సర్‌తో బాధపడుతున్నారు.)

– నవజ్యోత్ సింగ్ సిద్ధూ, క్రికెటర్, కాంగ్రెస్ నాయకుడు

### ఏమీ మిగలదు



మనం చనిపోయి, మన మెదడు కుళ్లిపోవడం మొదలు కాగానే మన జ్ఞాపకాలు గాల్లో కలిసిపోతాయి. చెప్పాలంటే చనిపోయిన 5-10 నిమిషాల్లో మెదడు అన్ని జ్ఞాపకాలను డిలీట్ చేసి ఫార్మాట్ అవుతుంది. అందుకే లేని ఆత్మ గురించిన మతాల ఉపదేశాల బారినపడొద్దు. చావు అనేది అంతం, దాని తర్వాత ఏమీలేదు.

– ఇంతియాజ్ మహమూద్, నాస్తికుడు

### వెదురు వంటకం



అరుణాచల్ ప్రదేశ్ నుంచి ఇప్పుడే తాజా వెదురు చివుళ్ళు వచ్చాయి. ఇవి చాలా ఆరోగ్యకరమైనవీ, విలువైనవీ. అందుకే వాటిని నేనే సిద్ధం చేస్తున్నాను. అరుణాచల్‌ప్రదేశ్‌కు వచ్చే పర్యాటకులంతా వీటితో చేసిన వంటకాలను తప్పకుండా రుచి చూడాలి.

– కిరణ్ రిజిజు, కేంద్ర న్యాయశాఖ మంత్రి

### అసలు భారతం



ఇవ్వాళ పారిశ్రామికవేత్త అజీమ్ ప్రేమ్‌జీని కలిసినప్పుడు ఒక హృద్యమైన సంఘటన చెప్పారు. ఇటీవల ఒక గ్రామ పర్యటనలో ఆయనొక అమ్మాయిని "ఎవరు నువ్వు? ఏం చేస్తుంటావు?" అని అడిగారు. దానికి బదులుగా "నాకు ఆకలేస్తోంది" అని ఆమె చెప్పింది. ఈ విషయం చెప్పి ప్రేమ్‌జీ అన్నారు: మార్పు దిశగా మనం పనిచేయాల్సిన ఇండియా ఇదీ!

– హర్ష్ గోయెంకా, పారిశ్రామికవేత్త

### కర్మ ఫలం



నా జీవితమంతా పాకిస్తాన్ టీవీ ఛానళ్లలో జమ్ము–కశ్మీర్ కోసం భారత సేనలకు వ్యతిరేకంగా దేశభక్తి గేయాలు విన్నాను. కానీ మొదటిసారి అవే దేశభక్తి గేయాలను పాకిస్తాన్ సేనలకు వ్యతిరేకంగా పాకిస్తానీయులు పాడటం వింటున్నాను. ఇదే 'కర్మ'. పాకిస్తానీయులు మొదటిసారి సైన్యం నుంచి స్వాతంత్ర్యాన్ని కోరుకుంటున్నారు.

– నూర్ దాహ్రీ, పరిశోధకుడు

ఇన్‌బాక్స్

## మన నర్సులే మన భవిష్యత్తు

'మన నర్సులు మన భవిష్యత్తు' నినాదాన్ని ఈ ఏడాది అంతర్జాతీయ నర్సుల మండలి ప్రపంచం ముందు ఆవిష్కరిస్తోంది. ఈ సంస్థ గత ఐదు దశాబ్దాలుగా 'ఫ్లోరెన్స్ నైటింగేల్' పుట్టిన రోజైన మే 12ను అంతర్జాతీయ నర్సుల దినోత్సవంగా నిర్వహిస్తోంది. గత నాలుగేళ్ళుగా కోవిడ్ 19 మహమ్మారి సృష్టించిన విలయతాండవం నుంచి అంతర్జాతీయ సమాజం ఎన్నో పాఠాలు నేర్చుకుంది. ఈ అనుభవాలను భవిష్యత్ ప్రణాళికగా రూపొందించి ప్రపంచం ముందుంచడం తక్షణ కర్తవ్యంగా మండలి ఈ వార్షికోత్సవాన్ని నిర్వహిస్తోంది.

ఆరోగ్య సంరక్షణలో అత్యంత ముఖ్యమైన వ్యక్తులు కేవలం వైద్యులే కాదనీ, నర్సులూ ఉన్నారనీ ప్రపంచ ఆరోగ్యసంస్థ వెల్లడించింది. ఈ దినోత్సవం గతించిన వారికి నివాళిగా, వృత్తిలో కొనసాగుతున్న వారికి ప్రోత్సాహంగా నిలుస్తుంది. స్ఫూర్తిప్రదాతగా నిలిచిన ఆధునిక నర్సింగ్ స్థాపకురాలు ఫ్లోరెన్స్ నైటింగేల్... భయంకరమైన 'క్రిమియా' యుద్ధంలో నర్సుల శిక్షకురాలిగా పనిచేసి ఎన్నో ప్రాణాలను కాపాడారు. ఆమె సాహసమే నేడు నర్సింగ్ వృత్తికి గౌరవాన్ని తీసుకొచ్చింది. ఆమె త్యాగమే నర్సులకు రక్షణ వలయంగా మారింది. ఇదే బాటలో ప్రపంచ ఆరోగ్య సంస్థ ఎన్నో మార్గదర్శకాలను జారీ చేసింది.

'స్టేట్ ఆఫ్ ది వరల్డ్ నర్సింగ్ రిపోర్ట్' ప్రచురణలను విడుదల చేయడం ద్వారా అంతర్జాతీయ నర్సింగ్ కౌన్సిల్ ప్రపంచంలో చోటు చేసుకుంటున్న వైద్య సేవల్లో మార్పునకు ఆధారాలను చూపించగలిగింది. ఈ నేపథ్యంలోనే నర్సింగ్‌కు తగిన ప్రాధాన్యంను ఇవ్వాలని నర్సింగ్ మండలి అధ్యక్షురాలు డాక్టర్ ప్రమీలా సిప్రియానో ప్రపంచ సంస్థలను కోరారు. ప్రపంచ మానవాళి భవిష్యత్తు ప్రతి నర్సు స్వరంపై ఆధారపడి ఉందనీ, సమాజంలో మార్పు తీసుకురావడంలోనూ తొలి వరుసలోనే వున్నారనీ నర్సుల సేవలను ఆమె కొనియాడారు.

– జి. యోగేశ్వరరావు, సీనియర్ జర్నలిస్ట్
(నేడు అంతర్జాతీయ నర్సుల దినోత్సవం)

# సచివాలయ వ్యవస్థ మనకు గర్వకారణం

అభిప్రాయం



వి.వి. రమణ

భారత రాజ్యాంగంలోని ఆదేశిక నియమాలు మానవుని ఆర్థిక, సామాజిక లక్ష్యాల సముదాయం. వీటి ఉద్దేశం సమాజంలోని అసమానతలను తొలగించి హక్కులను అందరూ అనుభవించటానికి తగిన 'నూతన సమాజ రూపకల్పన'కు కృషి చేయడం. ఆ ఆదేశిక సూత్రాల లక్ష్యాలను సాధించడానికి రాష్ట్రంలో గ్రామ, వార్డు సచివాలయాలు పాటుపడుతున్నాయి.

సచివాలయాలు ముందుగా ప్రభుత్వ సాయం అందుకోవడానికి అర్హతలు ఉన్నవారిని తమ పరిధిలో గుర్తిస్తాయి. మన రాష్ట్రంలో సుమారుగా 15,004 పైగా సచివాలయాలు ఉన్నాయి. వీటిలో సుమారుగా 1.34 లక్షల మంది ఉద్యోగస్తులు పని చేస్తున్నారు. అంతేకాకుండా ఈ సచివాలయాల కింద ప్రతి 50 ఇళ్లకు సంక్షేమం, సేవలను అందించడానికి 10వ తరగతి చదివిన ఒక వాలంటీర్ చొప్పున సుమారు 2.63 లక్షల మంది పనిచేస్తున్నారు. అవినీతికి గానీ, వివక్షతకు గానీ తావు లేకుండా పరిపాలనా సేవలను ప్రజలందరికీ అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఈ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారు. సుమారు 35 ప్రభుత్వ శాఖలకు సంబంధించిన 540 సేవలు అందిస్తూ సచివాలయ వ్యవస్థ ప్రారంభమయింది.

సచివాలయాల్లో ముఖ్యమైన శాఖలకు సంబంధించిన సేవలను అందించడానికి ఆయా శాఖలకు సంబంధించిన ఉద్యోగులు ఉంటారు. గ్రామ సచివాలయాలలో గ్రామపంచాయతీ కార్యదర్శి మిగిలిన సిబ్బందిని సమన్వయ పరుస్తూ జనన, మరణ ధ్రువీకరణ, వివాహ ధ్రువీకరణ పత్రాలను ఇచ్చే పనులతో పాటు మిగిలిన అన్ని రకాల పనులపై సమీక్షిస్తూ సమాచారాన్ని మండల, జిల్లా అధికారులకు అందుబాటులో ఉంచుతారు. ఇదే పనిని పట్టణాలలో వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ నిర్వహిస్తూ ఆస్తి పన్ను, నీటి పన్నుల వసూలుకు ప్రాధాన్యత ఇస్తారు.

ఇదే కార్యాలయంలో వీఆర్ఓ పన్నులు వసూలు, నివాస ధ్రువీకరణ, కుల ధ్రువీకరణ పత్రాలు అందించే బాధ్యతను కలిగి ఉంటారు. వీరితోపాటు విలేజ్ సర్వేయర్ కూడా ఉంటూ గ్రామ సరిహద్దుల పరిరక్షణ ప్రధాన బాధ్యతగా కలిగి ఉంటారు. పశు సంవర్ధక అసిస్టెంట్ కూడా స్థానికులకు అందుబాటులో ఉండే విధంగా ఇక్కడే ఉంటారు. గ్రామ సచివాలయాలలో ఏఎన్ఎంలు కూడా అందుబాటులో ఉండి గర్భిణులకు, బాలింతలకు, సాధారణ జనానికి అవసరమైన సేవలు అందిస్తారు. సచివాలయంలో వీటి నిర్వహణకు ఒక వార్డు హెల్త్ సెక్రటరీ ఉంటారు. గ్రామంలోని మౌలిక సదుపాయాలైన సీసీ, గ్రావెల్, బీటీ రోడ్లు; చెరువులు, డ్రైనేజీలు, మంచినీటి సరఫరా వంటివాటి వ్యవహారాలను ఇంజనీరింగ్ అసిస్టెంట్లు చూస్తూ ఉంటారు. వార్డు సచివాలయాలలో వార్డ్ ఎమినిటీస్ సెక్రటరీలు ఈ పనులు నిర్వహిస్తుంటారు.



గ్రామాలలో ఉద్యాన పంటల సాగు వివరాలు, రైతుల వివరాలు సేకరించి ఆ పంటలకు సంబంధించి సదుపాయాలను కల్పిస్తుంటారు విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్. గ్రామాలలోని శాంతి భద్రతలు, అలజడుల సమాచారములను ఎప్పటికప్పుడు స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు తెలియపరుస్తూ తన బాధ్యతలను నిర్వహిస్తుంటారు మహిళా పోలీస్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ అసిస్టెంట్. ఇదే పనిని వార్డు సచివాలయాలలో ఒక మహిళా కానిస్టేబుల్ నిర్వర్తిస్తారు. గ్రామ వాలంటీర్లు సేకరించిన కుటుంబ సమాచారాన్ని కంప్యూటరైజ్ చేసి లబ్ధిదారుల వివరాలను, ప్రజల దగ్గరనుండి వినతిపత్రాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తూ డిజిటల్ అసిస్టెంట్ తన సేవలను అందిస్తున్నారు. వార్డు సచివాలయంలో ఈ పనిని ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ చేస్తారు.

సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, మైనారిటీ వెల్ఫేర్, వికలాంగుల సంక్షేమానికి సంబంధించిన లబ్ధిదారుల వివరాలను ఎప్పటికప్పుడు సేకరించి ప్రభుత్వానికి అందించే బాధ్యత వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌ది. ఇదే పనిని వార్డు సచివాలయాలలో వార్డు వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ సెక్రటరీ నిర్వహిస్తుంటారు. నవరత్నాలను, సంక్షేమ పథకాలను వీరు పర్యవేక్షిస్తుంటారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యలను పరిష్కరించడానికి ఎలక్ట్రికల్ అసిస్టెంట్ సచివాలయాల్లో ఉంటారు. వార్డు సచివాలయాలలో ఎనర్జీ అసిస్టెంట్ ఉంటారు. వార్డు సచివాలయాల్లో శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంట్ సెక్రటరీ ఆధ్వర్యంలో వార్డు పరిశుభ్రతలను పర్యవేక్షిస్తుంటారు. ఈ సచివాలయాల సేవలు అద్భుతంగా అందించటంలో వాలంటీర్ వ్యవస్థ సమర్థవంతంగా పని చేస్తోంది. ఈ సచివాలయ వ్యవస్థ ఏపీలో ఉండటం మనందరికీ గర్వకారణం.

వ్యాసకర్త ఈ–మెయిల్: ramanarama10@gmail.com

## మనసు కిటికీ

ఓ వయోవృద్ధుడు ఆశ్రమంలో నివసిస్తున్న ఒక గురువుగారి దగ్గరకు వెళ్లి 'స్వామీ! ఇది వరకటిలా మా ఇంటి కిటికీ నుంచి బయటి ప్రకృతి అందాలను చూడలేకపోతున్నాను. నా కంటి చూపు మందగిస్తోందనిపిస్తోంది. ఏదో ఒకరోజు కంటి చూపు పూర్తిగా కోల్పోతానేమోనని భయం పట్టుకుంది. అలాగే భగవంతుడిని నిలకడగా స్మరిస్తూ ధ్యానం చేయలేకపోతున్నాను. వయసు మీదపడటమే ఇందుకు కారణమా?' అని అడిగాడు.

అందుకు గురువుగారు 'ఒకసారి మీ ఇల్లు చూద్దాం పద' అని వృద్ధుని ఇంటికి వెళ్లారు. గురువుగారు వృద్ధుడు ఉంటున్న గదిని నిశితంగా పరిశీలించారు. అనంతరం ఓ బక్కెట్టుతో నీరు, ఓ గుడ్డ ముక్క తెమ్మన్నారు. ఆయన గుడ్డముక్కను నీటిలో ముంచి గది బయటకు వెళ్ళి అద్దాల కిటికీని తడిగుడ్డతో తుడిచారు. ఆ తర్వాత ఓ పొడి గుడ్డతో తుడిచారు. ఇప్పుడు ఆ పెద్దాయనకు బయటున్న చెట్లు, పువ్వులు, ఆకాశమూ అన్నీ స్పష్టంగా కనిపించాయి. కిటికీ తుడుచుకోవాలనే ఆలోచన తనకు రానందుకు ఆ పెద్దాయన సిగ్గుపడ్డాడు.



జ్యోతిర్మయం

అలాగే భగవంతుని ఏకాగ్రతతో ధ్యానం చేయలేకపోవడానికి వయస్సు మీద పడటం కారణం కానేకాదనీ, మనసులో ఉన్న కోపం, అసూయ వంటివాటివల్ల ఏకాగ్రత కుదరడం లేదనీ గురువుగారు చెప్పారు.

– యామిజాల జగదీశ్

# అప్పులంటూ అబద్ధాలా?

## ఆర్టిస్ట్ జీవీ రావుకు ఆర్థిక నిపుణుడి ముద్ర

### అలాంటి వ్యక్తి నోటితో బాబు కోసం తప్పుడు లెక్కలు వల్లె

- అవే వాస్తవాలంటూ 'ఈనాడు'లో ప్రముఖంగా ప్రచురణ
- సీఎం ప్రత్యేక కార్యదర్శి దువ్వూరి కృష్ణ మండిపాటు
- గత టీడీపీ సర్కారు కంటే జగన్ సర్కారులోనే తక్కువ అప్పులు.. ఎక్కువ మూల ధన వ్యయం
- ఎన్ని కష్టాలున్నప్పటికీ డీబీటీ ద్వారా ప్రజల ఖాతాల్లో రూ.2.10 లక్షల కోట్లు
- విద్యుత్‌పై కూడా బాబు, ఎల్లో మీడియా వంకర రాతలు




సాక్షి, అమరావతి

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, అప్పులపై ఈనాడు, దాని ఆర్థిక నిపుణుడు జీవీ రావు కథనం పచ్చి అబద్ధాలతో కూడుకున్నదని ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి దువ్వూరి కృష్ణ మండిపడ్డారు. ఎటువంటి గణాంకాలు లేకుండా రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని, అంధకారం అయిపోయిందంటూ జీవీ రావు చేసిన వ్యాఖ్యలను నిర్ధారించుకోకుండానే ఈనాడు ప్రచురించడం తీవ్ర అభ్యంతరకరమని, దారుణమని ధ్వజమెత్తారు. ఎవరికీ పరిచయం లేని వ్యక్తిని ఆర్థిక నిపుణుడంటూ అర్థం లేకుండా మాట్లాడించి.. తప్పుడు కథనాన్ని అచ్చేయడం రామోజీరావు కుట్రలో భాగమని స్పష్టం చేశారు. గణాంకాలను చూపకుండానే రాష్ట్రం శ్రీలంక, పాకిస్తాన్ అయిపోయిందనడం తగదని చెప్పారు. గురువారం ఆయన సచివాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈనాడులో వచ్చిన కథనాన్ని తీవ్రంగా ఖండిస్తూ.. ఆర్‌బీఐ, కాగ్ గణాంకాలను పేర్కొంటూ అప్పులపై వాస్తవాలను వివరించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

**వృత్తిపరమైన తప్పిదాలతో రెండేళ్లు సస్పెన్షన్**

**వృత్తి పరంగా అవకతవకలకు (ఒక కంపెనీ తరఫున ఆడిట్లో అవకతవకలు) పాల్పడటంతో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెంట్స్ ఇండియా జీవీ రావును రెండేళ్ల పాటు సస్పెన్షన్ చేసింది. అలాంటి వ్యక్తి ఆర్థిక నిపుణుడంటూ ఈనాడు తెరపైకి తెచ్చి తప్పుడు లెక్కలు చెప్పించడం కుట్రలో భాగమే.**

### ఎవరు ఏం చెబితే అది రాసేస్తారా?

- ▲ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై మూడేళ్లుగా ప్రతిపక్షాలు, వాటి అనుబంధ మీడియా చేస్తున్న దుష్ప్రచారం కొనసాగింపులో భాగంగానే ఎవరికీ పరిచయం లేని వ్యక్తికి ఆర్థిక నిపుణుడనే ముద్ర వేసి నోటికి వచ్చినట్లు మాట్లాడించారు. మళ్లీ ఇదే ప్రభుత్వం వస్తే రాష్ట్రం సర్వనాశనం అయిపోతుందని చెప్పించి, దాన్ని ఈనాడులో ప్రముఖంగా ప్రచురించారు. ఆర్థిక రంగంపై కనీస అవగాహన లేని ఒక చిన్న యాక్టర్ తప్పుడు విశ్లేషణను ఈనాడు బాధ్యతారాహిత్యంగా ఎలా ప్రచురిస్తుంది?
- ▲ అప్రకటిత రుణాలు తెచ్చారని జీవీ రావు చెబితే, కనీసం వాస్తవాలు ఏమిటో తెలుసుకోకుండా ఈనాడు ఎలా రాస్తుంది? రూ.పది లక్షల కోట్ల అప్పులు ఎక్కడున్నాయి? ఎవరు ఏం చెప్పినా, నిర్ధారించుకోకుండానే రాసేస్తారా? అలా రాయడం ఈనాడు దుర్బుద్ధి కాదా? లేక ఈనాడు రామోజీ రావే అలా అబద్ధాలు చెప్పించి, రాయించారా?

## మూలధన వ్యయం ఎక్కువే

- ▲ గత టీడీపీ సర్కారు కంటే కూడా జగన్ సర్కారులో అప్పులు తక్కువ.. మూల ధన వ్యయం ఎక్కువ. కాగ్ (సీఏజీ) నివేదిక ప్రకారం మూలధన వ్యయం (క్యాపిటల్ ఎక్స్‌పెండీచర్) గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్లలో రూ.76,139 కోట్లు. అంటే ఏటా సగటున రూ.15,227.80 కోట్లు.
- ▲ అదే మా ప్రభుత్వ హయాంలో, ఈ నాలుగేళ్లలోనే రూ.75,411 కోట్లు. ఏటా సగటు వ్యయం రూ.18,852 కోట్లు. ఏ విధంగా చూసినా గత ప్రభుత్వం కంటే ఇప్పుడే తక్కువ రుణాలు చేస్తూ.. ఎక్కువ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం.

### అప్పుల తీరు నాడు-నేడు (రూ.కోట్లలో)

| వివరం | రాష్ట్ర విభజన నాటికి | 2019 మే (టీడీపీ ముగింపు) | 2023 మార్చి |
|---|---|---|---|
| రాష్ట్ర ప్రభుత్వ అప్పులు | 1,18,050.93 | 2,71,797.56 | 4,42,442.00 |
| ప్రభుత్వ రంగ సంస్థల ప్రభుత్వ హామీ రుణాలు | 14,028.23 | 59,257.31 | 1,44,875.00 |
| మొత్తం రాష్ట్ర ప్రభుత్వ అప్పులు | 1,32,079.16 | 3,31,054.87 | 5,87,317.00 |
| సగటు వార్షిక పెరుగుదల అప్పులు | 20.17% | 16.13% | |
| **ప్రభుత్వం ఎటువంటి గ్యారెంటీ ఇవ్వని ప్రభుత్వ రంగ సంస్థల అప్పులు** | | | |
| ప్రభుత్వ గ్యారెంటీ లేకుండా విద్యుత్ రంగం అప్పులు | 18,374.41 | 59,692.17 | 56,017.07 |
| విద్యుత్ ఉత్పత్తిదారులకు డిస్కమ్స్ చెల్లించాల్సిన బకాయి | 2,893.23 | 21,540.96 | 8,455.00 |
| విద్యుత్ రంగం మొత్తం అప్పులు | 21,267.64 | 81,233.13 | 64,472.07 |
| విద్యుత్ రంగం అప్పుల పెరుగుదల సగటు | 30.74% | -5.85% | |
| మొత్తం అప్పులు (ప్రభుత్వ గ్యారెంటీ, గ్యారెంటీలేని) | 1,53,346.80 | 4,12,288.00 | 6,51,789.07 |
| సగటు వార్షిక పెరుగుదల అప్పులు | 21.87% | 12.69% | |

### కేంద్ర ప్రభుత్వం 2013-14, 2019-20లో అప్పుల కోసం జారీ చేసిన బాండ్ల కాల వ్యవధి

| కాల వ్యవధి | 2013-14 | 2019-20 (శాతం) |
|---|---|---|
| 5 సంవత్సరాల కంటే తక్కువ | 2 | 20.6 |
| 5 నుంచి 10 సంవత్సరాలు | 40.9 | 25.2 |
| 10 నుండి 15 సంవత్సరాలు | 23.8 | 19.3 |
| 15 సంవత్సరాల పైన | 33.4 | 34.9 |

### గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పుల కోసం జారీ చేసిన బాండ్ల కాల వ్యవధి

| కాల వ్యవధి | శాతం |
|---|---|
| 0 నుండి ఒక ఏడాది | 4.1 |
| 1 నుండి 3 సంవత్సరాలు | 13.38 |
| 3 నుండి 5 సంవత్సరాలు | 14.8 |
| 5 నుండి 7 సంవత్సరాలు | 18.9 |
| 7 సంవత్సరాల పైన | 48.82 |

### 2014 నుంచి 2019 వరకు టీడీపీ హయాంలో మూలధన వ్యయం

| ఆర్థిక ఏడాది | (రూ.కోట్లలో) |
|---|---|
| 2014-15 | 7,265.00 |
| 2015-16 | 15,042.00 |
| 2016-17 | 15,707.00 |
| 2017-18 | 16,280.00 |
| 2018-19 | 21,845.00 |
| మొత్తం | 76,139.00 |
| ఏటా సగటు వ్యయం | 15,227.80 |



### 2019 నుంచి 2023 వరకు మూలధన వ్యయం

| ఆర్థిక ఏడాది | (రూ.కోట్లలో) |
|---|---|
| 2019-20 | 17,601.00 |
| 2020-21 | 20,690.00 |
| 2021-22 | 18,511.00 |
| 2022-23 (అర్‌ఈ) | 18,609.19 |
| మొత్తం | 75,411.19 |
| ఏటా సగటు వ్యయం | 18,852.80 |

## ఇది దుష్ప్రచారం కాదా?

- ▲ లేని అప్పులు ఉన్నట్లు ఎలా చెబుతారు? ఆర్‌బీఐ, కాగ్, కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖలను అపహాస్యం చేయడం కాదా? రెవెన్యూ మాయం అవడం ఏమిటి.. ఎక్కడైనా ఉంటుందా? ఇదేనా జీవీరావు అవగాహన, ఈనాడు జ్ఞానం? ఎక్కువ సంవత్సరాలకు అప్పు తీసుకుంటే భావితరాలపై భారమని ఏ రీతిన చెబుతున్నారు? కేంద్రం కూడా ఎక్కువ సంవత్సరాలకు అప్పులు తీసుకుంటోంది.. అయితే కేంద్రం కూడా భావి తరాలపై భారం వేసినట్లేనని ఎందుకు రాయరు?
- ▲ ఆర్‌బీఐ, కాగ్ లెక్కల ప్రకారం బడ్జెట్, బడ్జెట్ బయట, ప్రభుత్వ పూచీ కత్తు, ప్రభుత్వ రంగ సంస్థల అప్పులన్నీ కలిపి రూ.6,51,789.07 కోట్లే. రూ.పది లక్షలు కోట్లు అప్పులని చెప్పడం దుష్ప్రచారం కాదా? మరి మిగతా అప్పులు ఎక్కడున్నాయో ఆ నిపుణుడు, ఈనాడు చెబితే బాగుంటుంది. రాష్ట్ర ప్రతిష్టను దెబ్బతీసే కుట్రలో భాగంగానే అవాస్తవ కథనాలు రాస్తుండటం నిజం కాదా?

## పబ్లిక్ డొమైన్‌లో వాస్తవాలు

- ▲ ప్రభుత్వానికి సంబంధించిన డాక్యుమెంట్లన్నీ పబ్లిక్ డొమైన్‌లో ఉన్నాయి. వాటిని విశ్లేషించి, అవగాహనతో మాట్లాడితే స్వాగతిస్తాం. కానీ ఏ విశ్లేషణ చేయకుండా, ఎక్కడా లెక్కలు చెప్పకుండా తప్పుడు మాటలు మాట్లాడించి, ప్రచురించడం దారుణం.
- ▲ ఆర్బీఐ నివేదిక ప్రకారం విభజన నాటికి.. అంటే 2014 మార్చి 31 నాటికి ఉమ్మడి రాష్ట్రానికి ఉన్న అప్పులు రూ.1,96,202 కోట్లు. అప్పుడు తొలి రెండు నెలల్లో ఉన్న ద్రవ్య లోటు రూ.7,333 కోట్లు. విభజన తర్వాత 58 శాతం వాటా ప్రకారం లెక్కిస్తే విభజిత ఆంధ్రప్రదేశ్‌కు మిగిలిన అప్పు రూ.1,18,050 కోట్లు. అది ఐదేళ్లలో.. 2019 మార్చి 31 నాటికి రూ.2.64 లక్షల కోట్లకు చేరుకుంది. ఆ తర్వాత రెండు నెలల్లో ద్రవ్యలోటు రూ.7,346 కోట్లు. దాన్ని కూడా కలుపుకుంటే 2019 మే నెలలో గత ప్రభుత్వం దిగిపోయే నాటికి రాష్ట్ర రుణం మొత్తం రూ.2,71,797.56 కోట్లు.
- ▲ మా ప్రభుత్వ హయాంలో, అంటే ఈ నాలుగేళ్లలో రాష్ట్ర రుణం మొత్తం రూ.4,42,442 కోట్లకు చేరింది. ఇది ఆర్బీఐ నివేదికలో స్పష్టంగా ఉంది. ప్రభుత్వ పూచీకత్తుతో, ప్రభుత్వ రంగ సంస్థలు తీసుకున్న రుణాలు 2014లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి రూ.14,028.23 కోట్లు. ఆ ప్రభుత్వం దిగిపోయే నాటికి.. అంటే 2019 మే నాటికి రూ.59,257.31 కోట్లకు పెరిగాయి.
- ▲ ఆ తర్వాత నాలుగేళ్లలో.. ఈ ఏడాది మార్చి నాటికి ఆ రుణాల మొత్తం రూ.1,44,875 కోట్లు. ఇందులో దాదాపు రూ.45 వేల కోట్లు విద్యుత్ రంగానికి చెందినవే. ఆ సంస్థలే ఆ రుణాలు తిరిగి చెల్లిస్తాయి. అందుకే ఆ రుణాలన్నీ ప్రభుత్వానివి అని చెప్పడానికి లేదు. 2014 నాటికి ప్రభుత్వానికి ఉన్న అప్పులు, ప్రభుత్వ పూచీకత్తుతో ప్రభుత్వ రంగ సంస్థలు తీసుకున్న రుణాలు.. రెండూ కలిపి రుణభారం రూ.1.32 లక్షల కోట్లు కాగా.. 2019లో గత ప్రభుత్వం దిగిపోయే నాటికి అవి రూ.3.31 లక్షల కోట్లకు పెరిగాయి. ఆ తర్వాత నాలుగేళ్లలో రాష్ట్ర రుణభారం రూ.5.87 లక్షల కోట్లకు చేరింది.
- ▲ ప్రభుత్వ గ్యారెంటీలు లేకుండా, ప్రభుత్వ రంగ సంస్థలు చేసిన అప్పులు చూస్తే.. 2014 నాటికి విద్యుత్ రంగంలో జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కమ్‌ల అప్పులు రూ.18,374 కోట్లు కాగా, ఆ ప్రభుత్వం దిగిపోయే నాటికి, ఆ అప్పుల మొత్తం రూ.59,692 కోట్లకు చేరింది. ఆ తర్వాత ఇక ఈ ప్రభుత్వ హయాంలో, ఈ ఏడాది మార్చి నాటికి ఉన్న ఆ రుణభారం రూ.56,017 కోట్లు.

### గత ప్రభుత్వం కంటే మేం చేసిన అప్పులు తక్కువే

- ▲ విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు, విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కమ్‌లు) ఇవ్వాల్సిన బకాయిలు 2014లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి రూ.2893 కోట్లు. 2019 నాటికి అవి రూ.21,540 కోట్లకు చేరాయి. ప్రస్తుతం అవి కేవలం రూ.8,455 కోట్లు మాత్రమే.
- ▲ మొత్తం మీద పబ్లిక్ డెట్ టు పబ్లిక్ ఎక్కౌంట్ (ప్రభుత్వ రుణాలు), ప్రభుత్వ పూచీకత్తుతో ప్రభుత్వ రంగ సంస్థలు తీసుకున్న రుణాలు, ఆ పూచీకత్తు లేకుండా చేసిన అప్పులు.. అన్నీ కలిపి 2014లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి ఉన్న మొత్తం రుణాలు రూ.1,53,346.80 కోట్లు. గత ప్రభుత్వం దిగిపోయే నాటికి రూ.4,12,288 కోట్లకు పెరిగాయి. ఈ నాలుగేళ్లలో, అంటే ఈ ఏడాది మార్చి నాటికి రాష్ట్ర రుణ మొత్తం రూ.6,51,789 కోట్లకు చేరింది.
- ▲ టీడీపీ హయాంలో ఐదేళ్లలో దాదాపు రూ.2.58 లక్షల కోట్ల అప్పులు పెరగ్గా.. ఈ ప్రభుత్వ హయాంలో నాలుగేళ్లలో రూ.2.38 లక్షల కోట్లు పెరిగాయి. అంటే ఎలా చూసినా గత ప్రభుత్వంలో కంటే, ఈ ప్రభుత్వ హయాంలో ఎక్కువ రుణాలు తీసుకోలేదని స్పష్టమవుతోంది. టీడీపీ హయాంలో 21.87 శాతం సీఏజీఆర్ పెరగ్గా, ఈ ప్రభుత్వ హయాంలో 12.69 శాతం మాత్రమే పెరిగింది.
- ▲ 2022-23లో కేంద్ర ప్రభుత్వ రుణాలు (డెట్ టు జీడీపీ) 55.89 శాతం కాగా, 2023-24 నాటికి 56.16 శాతం ఉంటుందని అంచనా. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కంటే, ఈ ప్రభుత్వ హయాంలో రుణాల సేకరణ తగ్గింది. ఈ వాస్తవాలను పట్టించుకోకుండా ప్రభుత్వం వృథా ఖర్చు చేస్తోందని చెప్పడం తగదు. ప్రతి రెవెన్యూ వ్యయం వృథా ఖర్చు కానేకాదు. ఉదాహరణకు మనం ఇల్లు కట్టుకుంటే అది క్యాపిటల్ వ్యయం. పిల్లలను స్కూల్‌కు పంపిస్తే అది రెవెన్యూ వ్యయం. దేని ప్రాధాన్యత అదే. గత ప్రభుత్వం ఎన్నికల ముందు హడావిడిగా ఒకే రోజు రూ.5 వేల కోట్ల అప్పు చేసి.. పసుపు-కుంకుమ పథకంలో భాగంగా పంపిణీ చేశారు. దాన్ని ఏ రకంగా సమర్థిస్తారో చెప్పలేదు.

### జీఈఆర్ భారీగా పెరుగుదల

- ▲ విద్యా రంగంలో చేసిన వ్యయం వల్ల కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ విడుదల చేసిన నివేదిక ప్రకారం రాష్ట్రంలో గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో (జీఈఆర్) గణనీయంగా పెరిగింది. గతంలో దేశంలో జీఈఆర్ 99 శాతం ఉంటే, అప్పుడు రాష్ట్రంలో అది 84.48 శాతం మాత్రమే. అన్ని రాష్ట్రాల కంటే తక్కువ. అదే ఈ రోజు మన రాష్ట్ర జీఈఆర్ 100.1 శాతం. అంటే దేశ సగటు కంటే ఎంతో ఎక్కువ. ఇదంతా విద్యా రంగంలో అమలు చేసిన పథకాలు, కార్యక్రమాల వల్లనే సాధ్యమైంది.
- ▲ గత ప్రభుత్వ హయాంలో కంటే దాదాపు రెట్టింపు విద్యా రంగంపై వ్యయం చేస్తున్నాం. గత టీడీపీ హయాంలో విద్యా రంగంపై జీఎస్‌డీపీలో సగటున 0.51 శాతం వ్యయం చేస్తే ప్రస్తుత ప్రభుత్వం సగటున 1.07 శాతం వ్యయం చేసింది.
- ▲ అమ్మ ఒడి, గోరుముద్ద, మనబడి నాడు-నేడు, విద్యాదీవెన, వసతి దీవెన, విద్యా కానుక.. ఇలా అనేక పథకాలు అమలవుతున్నాయి. మధ్యాహ్న భోజన పథకం కోసం గత ప్రభుత్వం ఐదేళ్లలో, ఏటా చేసిన సగటు వ్యయం రూ.553 కోట్లు. ప్రస్తుతం ఏటా సగటున రూ.1209 కోట్లు. కుక్ కమ్ హెల్పర్ల వేతనాలు కూడా పెంచింది. పెన్షన్ల కోసం గత ప్రభుత్వం ఏటా సగటున రూ.5,600 కోట్లు వ్యయం చేయగా, ఈ ప్రభుత్వం ఏటా సగటున రూ.17,694 కోట్లు వ్యయం చేస్తోంది. ఇది వృథా వ్యయం అంటారా?
- ▲ కోవిడ్ వల్ల ఒకవైపు ప్రభుత్వ ఆదాయం తగ్గడం, మరోవైపు కేంద్రం నుంచి రావాల్సిన నిధుల్లో వాటా తగ్గడం వల్ల ప్రభుత్వం దాదాపు రూ.66,116 కోట్ల ఆదాయం కోల్పోయింది. అయినా ఎక్కడా ఏ పథకాలు ఆపలేదు. వివిధ పథకాలకు సంబంధించి రూ.2.10 లక్షల కోట్లకు పైగా ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా ప్రజల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది.
- ▲ వాహనమిత్ర పథకాన్ని ప్రస్తావిస్తూ విపక్షం తప్పుడు ప్రచారం చేస్తోంది. వాహనాల నుంచి ఫైన్లపై అసత్యాలు ప్రచారం చేస్తోంది. గత ప్రభుత్వ హయాంలో వాహనాల నుంచి ఫైన్ల రూపంలో ఏటా సగటున రూ.270.39 కోట్లు వసూలు చేయగా, ఈ ప్రభుత్వ హయాంలో అది రూ.183.94 కోట్లు మాత్రమే.
- ▲ 500 యూనిట్లుపైగా విద్యుత్ వినియోగంపై యూనిట్‌కు 90 పైసలు పెంచితే రూ.1,300 కోట్ల భారమని చంద్రబాబు చెప్పడం పచ్చి అబద్ధం. డిస్కమ్స్‌కు కేవలం 31.5 కోట్లే భారం. ఈ కేటగిరి కింద విద్యుత్ వినియోగదారులు కేవలం 1.05 లక్షల మందే ఉన్నారు.



## 'ఏయ్ ఆగవయ్యా.. నువ్వాగు!'

### సమస్యలు చెప్పబోయిన రైతులపై చంద్రబాబు అసహనం

**తణుకు:** 'ఏయ్.. ఏం మాట్లాడుతున్నావ్. ఆగవయ్యా.. నువ్వాగు. ముందు నేను చెప్పేది వినవయ్యా' అంటూ రైతులపై ప్రతిపక్ష నేత చంద్రబాబు మండిపడ్డారు. పశ్చిమ గోదావరి జిల్లా తణుకు నియోజకవర్గంలో రైతు పోరుబాట పేరుతో పాదయాత్ర నిర్వహించేందుకు గురువారం రాత్రి ఇరగవరం వచ్చిన చంద్రబాబు అక్కడ రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన రైతులు ఆయనను నిలదీస్తుండగా చంద్రబాబు వారిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఓ యువరైతు మాట్లాడుతూ.. 'మీరు సీఎంగా ఉన్నప్పుడు రైతులు నష్టపోతే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారి పరిస్థితుల్ని చూసి చలించిపోయారు. రైతులు నష్టపోయిన విషయాన్ని అసెంబ్లీ సాక్షిగా ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. మీరు అలా ఎందుకు చేయట్లేదు' అని ప్రశ్నించగా.. అతడిపై చంద్రబాబు కస్సుమన్నారు. 'ఏయ్.. ఏం మాట్లాడుతున్నావ్ నువ్వు. ముందు నేను చెప్పేది వినవయ్యా' అంటూ అసహనం ప్రదర్శించారు. ప్రభుత్వ యంత్రాంగం రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్న పరిస్థితులను వివరించేందుకు ప్రయత్నిస్తున్న రైతులను అడ్డుకున్న చంద్రబాబు తాను చెప్పేది మాత్రమే వినాలంటూ ఎప్పటిలా తన సొంత డబ్బా చెప్పుకొంటూ వెళ్లారు. రైతు బిడ్డల్ని కోటీశ్వరులను చేస్తానని, పేదలను ధనికులు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నానని చంద్రబాబు చెప్పుకొచ్చారు. తాను అధికారంలోకి వస్తే ధాన్యం కొనుగోలులో పాత విధానం తీసుకొస్తానని చంద్రబాబు చెప్పారు. మూడు రోజులపాటు గోదావరి జిల్లాల్లో పర్యటించి 72 గంటల్లో తడిసిన ధాన్యం, మొలకలు వచ్చిన ధాన్యం కొనుగోలు చేయాలని అల్టిమేటం ఇస్తే.. ఇప్పుడు తాను తిరుగుతున్న ప్రాంతాల్లో హడావుడిగా ధాన్యం కొనుగోలు చేస్తున్నారన్నారు.

**'సాక్షి'పై మరోసారి అక్కసు**

ఈ పర్యటన సందర్భంలో చంద్రబాబు 'సాక్షి'పై మరోసారి అక్కసు వెళ్లగక్కారు. రైతులను పరామర్శించడానికి వచ్చి రైతులతో మాట్లాడుతుంటే కొందరు సైకో కార్యకర్తలను పంపి గందరగోళం సృష్టించాలని చూస్తున్నారని అన్నారు. దీనిని వక్రీకరిస్తూ 'సాక్షి' పేపర్‌లో 'చంద్రబాబును అడ్డుకున్న రైతులు' అని రాస్తారన్నారు. రైతుల ముసుగులో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు వస్తున్నారని, అప్రమత్తంగా ఉండాలని కోరారు.

## పీజీ డిప్లమో కోర్సులకు దరఖాస్తు గడువు పెంపు

**మధురానగర్ (విజయవాడ సెంట్రల్):** డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ కొత్తగా ప్రవేశ పెట్టిన 4 పీజీ డిప్లమో కోర్సుల్లో ప్రవేశాలకు గడువు ఈనెల 30 వరకు పెంచినట్లు వర్సిటీ సహాయ సంచాలకులు డాక్టర్ ఎం.అజంత కుమార్ గురువారం తెలిపారు. వర్సిటీ పీజీ డ్లిపమో ప్రోగ్రామ్ ఇన్ మార్కెటింగ్, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, ఆపరేషన్ మేనేజ్‌మెంట్ కోర్సులను కొత్తగా ప్రారంభించినట్లు చెప్పారు. ఈ కోర్సుల్లో ప్రవేశాలకు డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులని చెప్పారు. కోర్సుల్లో చేరేందుకు మార్చి 30తో గడువు ముగిసినప్పటికీ విద్యార్థుల కోరిక మేరకు గడువు పెంచినట్లు తెలిపారు. మరింత సమాచారం కోసం మాచవరం ఎస్‌ఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ ప్రాంతీయ అధ్యయన కేంద్రాన్ని సంప్రదించాలని కోరారు.

## పీజీటీకి దరఖాస్తు గడువు పెంపు

**సాక్షి, అమరావతి:** ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తూ పీజీ అర్హత కలిగిన స్కూల్ అసిస్టెంట్లు ప్లస్-2 బోధన (పీజీటీ) కోసం దరఖాస్తు చేసుకునే గడువును ప్రభుత్వం శనివారం వరకు పొడిగించింది. ఇప్పటికే గడువు ముగిసిన నేపథ్యంలో ఉపాధ్యాయుల అభ్యర్థన మేరకు దరఖాస్తు గడువును పెంచినట్టు పాఠశాలవిద్య కమిషనర్ సురేష్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయులు సంబంధిత డీఈవోలకు దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

# ముఖ్యమంత్రి రేసులో లేను

### మీడియా సమావేశంలో జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యలు

**సాక్షి, అమరావతి/సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం):** వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తాను అసలు ముఖ్యమంత్రి పదవి రేసులోనే లేనని జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ పరోక్షంగా తేల్చి చెప్పేశారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీతో జనసేన పొత్తు పెట్టుకోవడం ఖాయమంటూ సంకేతాలిస్తూ, పొత్తుల్లో జనసేన పార్టీకే ముఖ్యమంత్రి పదవి కావాలని అడగడానికి ఓ స్థాయి ఉంటుంది కదా అంటూ వ్యాఖ్యానించారు. మంగళగిరిలోని జనసేన పార్టీ రాష్ట్ర పార్టీ కార్యాలయంలో పార్టీ నేత నాదెండ్ల మనోహర్‌తో కలిసి పవన్ గురువారం మీడియాతో మాట్లాడారు. టీడీపీతో పొత్తు చర్చలు జరుగుతున్నాయి కదా, అవి ఎంతవరకు వచ్చాయని విలేకరులు అడిగిన ప్రశ్నకు బదులిస్తూ.. 'ఖచ్చితంగా పొత్తులు పెట్టుకుంటాం. మాట్లాడతాం. (బీజేపీని ఉద్దేశించి) కొంతమంది ఒప్పుకోకపోవచ్చు. ఒప్పిస్తాం. వాస్తవాలు, గణాంకాలు చూపి ఒప్పిస్తాం'.. అంటూ వ్యాఖ్యానించారు. ఇటీవల చంద్రబాబు-పవన్ భేటీ తర్వాత కొంతమంది జనసేన నేతలు మీరు తగ్గడం ఏమిటని, మీరు ముఖ్యమంత్రిగా అయితే తప్ప పొత్తులు పెట్టుకోకూడదని, మీరు సీఎం అభ్యర్థిగా ఉండాలి కదా అని మాట్లాడడాన్ని పవన్ తప్పుబట్టారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

**30-40 సీట్లు వచ్చి ఉంటే సీఎం పదవి అడిగే వాళ్లమేమో..**

ముఖ్యమంత్రి స్థాయిలో ఉంటే తప్ప పొత్తులు పెట్టుకోకూడదని అనేవాళ్లు ఎవరైనా సరే, అలాంటి ఆలోచనతో ఉంటే వారు ఒకటి గుర్తుపెట్టుకోవాలి.. జనసేన గత ఎన్నికల్లో 137 స్థానాల్లో పోటీచేసింది. ఎన్ని గెలిచాం? పొత్తుల్లో ఇతర పార్టీలను సీఎం స్థానం కోసం డిమాండ్ చేయాలంటే కనీసం 30-40 స్థానాలు ఉండాలి. అప్పుడే ఆ వాదనకు బలం ఉండేది. ఇక తాను ఇప్పటివరకూ ఎవరికైనా పెద్దన్న పాత్ర వహించాలని చెప్పానంటే అది బాధ్యత వహించడం అని అర్థం. అంతేగానీ, ఒక కులానికి సంబంధించిన వ్యవహారం కాదు. రాష్ట్రానికి సంబంధించిన వ్యవహారమది.

**సీఎం పదవి కావాలని కండిషన్లు పెడితే జరగవు..**

ఒక మాట చెబుతున్నా.. పోయిన ఎన్నికల్లో 137 స్థానాల్లో పోటీచేశాం. 30-40 స్థానాల్లో కూడా గెలిపించలేకపోయారు. అలాంటప్పుడు మన వాదన (సీఎం పదవి కావాలనే)కు పస ఉండదు. సినిమాల్లో నన్ను ఎవరూ సూపర్‌స్టార్ చేయలేదు. నేను సాధించుకున్నదే. రాజకీయాల్లో కూడా టీడీపీ కావొచ్చు. బీజేపీ కావొచ్చు.. నన్ను సీఎంను చేస్తామని ఎందుకంటారు. నేను టీడీపీ అధ్యక్షుడిని అయినా ఆ మాటలు అనను. మనం బలం చూపించి, సత్తా చూపించి పదవి తీసుకోవాలి. కండిషన్లు పెడితే, అవి జరగవు. సీఎం పదవి అన్నది తానై వరించాలి తప్ప నేను దాని కోసం వెంపర్లాడను. పొత్తులకు జనసేన పార్టీ పెట్టే కండిషను వైఎస్సార్ సీపీని అధికారం నుంచి దించాలి అంతే. అలాగే, పొత్తులతో ప్రభుత్వం ఏర్పడాలి. నాదెండ్ల మనోహర్ మాట్లాడిన మాటలపై ఎవరైనా అనుచితంగా మాట్లాడితే వాటిని ఉపసంహరించుకోవాలి. ఓటు చీలనివ్వను అంటే ప్రధానంగా బలాలు ఏ పార్టీలకు ఉన్నాయో ఆ పార్టీలు కలవాలన్నది నా ఉద్దేశం. ప్రధాన పార్టీలకు సంబంధించే ఆ వ్యాఖ్యలు చేశాను. ఇక ఎన్నికలు ముందే వస్తాయని అనిపిస్తోంది. అందుకని జూన్ నుంచి రాష్ట్రంలోనే ఉండి పర్యటిస్తా.

**నాతో నడిచే వాళ్లే నా వాళ్లు..**

ఇప్పుడు మీరు మాట్లాడిన మాటలకు మీ అభిమానులు, జనసేన కార్యకర్తల నుంచే విమర్శలు ఎదుర్కొనే అవకాశం ఉంటుందేమోనని ఒక విలేకరి (సాక్షి కాదు) అన్నప్పుడు.. 'విమర్శలు వస్తాయని నాకు భయాలు లేవు. అభిమానులు నిరాశ పడడానికి ఇదేమి సినిమా కాదు. కార్యకర్తలైనా సరే.. నాతో నడిచేవారే నా వాళ్లు. అర్థంచేసుకునే వాళ్లు అర్థంచేసుకుంటారు'.. అంటూ పవన్ వ్యాఖ్యానించారు.

### ఆఖరి గింజ కొనేవరకు పోరాటం

మరోవైపు.. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని పార్టీ కార్యాలయంలోనూ పవన్ మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఆఖరి ధాన్యం గింజ కొనేంత వరకూ రైతుల పక్షాన పోరాటం చేస్తామని చెప్పారు. రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం సకాలంలో కొనుగోలు చేయలేదని విమర్శించారు. ప్రభుత్వ నిర్వాకంవల్ల రైతుల ఇళ్లలో ధాన్యం నిల్వలు పెరిగిపోయాయన్నారు. అలాగే, రైతుల ఖాతాల్లో సకాలంలో డబ్బులు వేయడంలేదన్నారు. క్షేత్రస్థాయిలోని వాస్తవ నివేదికలను సీఎం జగన్ పరిశీలించడంలేదని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వ అధికారులకు వినతిపత్రం ఇద్దామని వెళ్తే రైతుల్ని అరెస్టుచేస్తున్నారని, ఇలా అయితే తీవ్ర పరిణామాలుంటాయని పవన్ హెచ్చరించారు. అంతకుముందు.. పవన్ రైతులతో ముఖాముఖి నిర్వహించారు.

### 'ఇ రక్ష 2023' పోటీలకు ఆహ్వానం

**సాక్షి, అమరావతి:** సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ఎన్‌సీఈఆర్టీ, సైబర్‌పీస్ ఫౌండేషన్‌తో కలిసి ఐదో 'ఇ-రక్ష 2023' పోటీలు నిర్వహిస్తున్నట్లు సమగ్ర శిక్షా ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు గురువారం తెలిపారు. జాతీయ విద్యా విధానం-2020లో డిజిటల్ విద్యా విధానంలో భాగంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు సైబర్ ముప్పు నుంచి తప్పించుకునేలా సవాళ్లు, భద్రతా పద్ధతులను అర్థం చేసుకోవడానికి, గ్రహించడానికి వీలుగా పరిశోధన పత్రాలు, కార్టూన్లు, వీడియోలు, రీళ్లు, లఘుచిత్రాలు, అప్లికేషన్లు తదితర అంశాలపై పోటీలు ఉంటాయని, ఇంగ్లిష్, హిందీ భాషల్లో మాత్రమే ప్రాజెక్టులు పంపాలన్నారు. విద్యార్థి విభాగం, విద్యావేత్తల విభాగం, విద్యా సంస్థల విభాగం, తల్లిదండ్రులు-సంరక్షకులు వంటి కేటగిరిల్లో పోటీలు జరుగుతాయన్నారు. జూలై 30 వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. వివరాలను www.eraksha.net లో పొందుపరిచామన్నారు.

## క్లుప్తంగా

### అగ్నివీర్‌లకు రైల్వే ఉద్యోగాల్లో రిజర్వేషన్‌!

**న్యూఢిల్లీ:** సాయుధ బలగాల్లో నాలుగు సంవత్సరాలు విధులు నిర్వర్తించాక త్రివిధ బలగాల్లో ఉద్యోగం నుంచి బయటికొచ్చిన అగ్నివీర్‌లకు తమ ఉద్యోగ భర్తీల్లో వారికి ప్రత్యేకంగా రిజర్వేషన్‌ కల్పిస్తామని రైల్వే శాఖ యోచిస్తోంది. ఈ వివరాలను సంబంధిత వర్గాలు వెల్లడించాయి. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. వేర్వేరు రైల్వే విభాగాల్లో నేరుగా రిక్రూట్‌మెంట్‌కు సంబంధించి నాన్‌–గెజిటెడ్‌ పోస్టుల్లో వారికి 15 శాతం రిజర్వేషన్‌ కల్పించనున్నారు. ఆయా ఉద్యోగాలకు అర్హత వయసులో సడలింపు అవకాశం ఇవ్వనున్నారు. దేహదారుఢ్య పరీక్షల నుంచి మినహాయింపు కల్పిస్తారు. రైల్వే ప్రొటెక్షన్‌ ఫోర్స్‌(ఆర్‌పీఎఫ్‌)లో అగ్నివీర్‌లకు రిజర్వేషన్‌ విధానాన్ని తెచ్చే యోచనలో ఉన్నారు. నాన్‌–గెజిటెడ్‌ పోస్టుల్లో లెవల్‌ 1లో 10 శాతం , లెవల్‌ 2లో 5 శాతం రిజర్వేషన్‌ కల్పిస్తారు. దివ్యాంగులు, మాజీ సైనికులు, అప్రెంటీస్‌ల రెగ్యులరైజేషన్‌ విధానాలకు అనుగుణంగా వీరి నియామకం ఉంటుంది. తొలి బ్యాచ్‌ అగ్నివీర్‌లకు ఐదేళ్ల వయసు సడలింపు, రెండో బ్యాచ్‌ వారికైతే మూడేళ్ల వయోపరిమితి సడలింపు వర్తింపజేస్తారు.


### విపక్షాల ఐక్యతే ముఖ్యం

**పవార్, ఠాక్రేలతో నితీశ్‌ వేర్వేరుగా సమావేశం**

**ముంబై:** వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో అధికార బీజేపీని ఎదుర్కోవడానికి ప్రతిపక్షాలను ఐక్యం చేసే ప్రయత్నాలను బీహార్‌ ముఖ్యమంత్రి నితీశ్‌ కుమార్‌ తీవ్రతరం చేస్తున్నారు. ఉప ముఖ్యమంత్రి, ఆర్‌జేడీ నాయకుడు తేజస్వి యాదవ్‌తో కలిసి శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్‌ ఠాక్రే, ఎన్సీపీ అధినేత శరద్‌ పవార్‌లను గురువారం వేర్వేరుగా కలుసుకున్నారు. బీజేపీకి వ్యతిరేకంగా విపక్షాలన్నీ ఏకతాటిపైకి రావడానికి తీసుకోవాల్సిన చర్యలపై వారితో చర్చించారు. ఆ తర్వాత విలేకరులతో మాట్లాడుతూ బీజేపీ దేశ ప్రయోజనాల కోసం ఏమీ చేయడం లేదని ఆరోపించారు. అందుకే పార్టీ ప్రయోజనాలతో పాటుగా దేశ ప్రయోజనాలను కూడా కాపాడడానికి కృషి చెయ్యాలని ఇరువురు నేతలకు చెప్పినట్టుగా వెల్లడించారు. ప్రస్తుతం ప్రతిపక్ష పార్టీలు ముందు దేశ ప్రయోజనాలను కాపాడాలన్న ఏకైక లక్ష్యం ఉందని నితీశ్‌ అన్నారు. అందరూ కలసికట్టుగా పోరాడితే బీజేపీపై విజయం సాధించవచ్చునని చెప్పారు. ప్రతిపక్షాల ఐక్యత కోసం త్వరలోనే బీజేపీ వ్యతిరేక పార్టీలన్నింటితో సమావేశం ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు.



# చీతాలు.. చింతలు



దేశానికి స్వాతంత్య్రం వచ్చిన కొత్తల్లోనే అంతరించిపోయిన జాబితాలో చేరిపోయిన చీతాల సంతతిని తిరిగి భారత్‌లో పెంపొందించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చీతాల ప్రాజెక్టుపై నీలినీడలు కమ్ముకున్నాయి. నమీబియా, దక్షిణాఫ్రికా నుంచి ఎన్నో వ్యయప్రయాసలకోర్చి మొత్తం 20 చీతాలను తీసుకువచ్చాము. గత మూడు నెలల్లోనే మూడు చీతాలు మరణించడంపై జంతు ప్రేమికుల్లో ఆందోళన నెలకొంది. మూడు చీతాలను మనం కోల్పోయినప్పటికీ మార్చి నెలలో సియాయా అనే చీతా నాలుగు పిల్లలకి జన్మనివ్వడం వల్ల ఈ ప్రాజెక్టు ముందుకెళుతుందన్న ఆశలు ఇంకా అందరిలోనూ ఉన్నాయి. చీతాలను కాపాడుకోవడానికి ప్రభుత్వం ఇంకా ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటుందనే చర్చ మొదలైంది.

**మూడు నెలల్లో మూడు చీతాల మృతితో ఆందోళనలు**

**చీతాల ప్రాజెక్టులో ఎదురవుతున్న సవాళ్లు**

**మార్చి 27**
నమీబియా నుంచి తీసుకువచ్చిన శష అనే చీతా కిడ్నీపరమైన వ్యాధితో మరణించింది.

**ఏప్రిల్‌ 13**
దక్షిణాఫ్రికా నుంచి తీసుకువచ్చిన ఉదయ్‌ అనే చీతా అనారోగ్య కారణాలతో మృతి చెందింది

**మే 9**
దక్షిణాఫ్రికా నుంచి వచ్చిన చీతాల్లో దక్ష అనే ఆడ చీతాను మేటింగ్‌ సమయంలో మగ చీతాలు క్రూరంగా వ్యవహరించి మీద పడి చంపేశాయి.

**ఎదురవుతున్న సవాళ్లు**

చీతాల మనుగడకు ఎదురవుతున్న అతి పెద్ద సవాల్‌ వాతావరణం. మధ్యప్రదేశ్‌లో కునో జాతీయ ఉద్యానవనంలో వాతావరణం ఆఫ్రికా వాతావరణం కంటే చాలా విభిన్నమైనది. కునోలో వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకు రాల్చే అడవులుంటాయి. ఆఫ్రికాలో గడ్డి మైదానాలు, దట్టమైన వృక్షాలు ఎక్కువ. ఇన్నాళ్లూ అక్కడ వాతావరణానికి అలవాటు పడిన చీతాలకు ఒకేసారి మార్పు రావడం తట్టుకోలేకుండా ఉన్నాయి. మన దేశంలో ఉద్యానవనాలు చీతాలకు నివాసయోగ్యాలుగా మారగలవో లేదోనన్న సందేహాలు కూడా నిపుణుల్లో ఉన్నాయి. ప్రభుత్వం చీతాల ప్రాజెక్టు ప్రారంభించడానికే ముందే జంతు పరిరక్షణ నిపుణులు భారత పర్యావరణ వ్యవస్థకి చీతాలు అలవాటు పడడానికి చాలా ఏళ్లు పడుతుందని హెచ్చరించారు.

ఇక రెండో పెద్ద సవాల్‌ స్థలం. కునో జాతీయ పార్క్‌లో చీతాలు ఉంచిన వాటికి ఎన్‌క్లోజర్‌ సరిపోదు. అవి స్వేచ్ఛగా సంచరించడానికి మరింత దట్టమైన అటవీ ప్రాంతం అవసరముంది. వచ్చే అయిదేళ్లలో మరో 30 చీతాలను తెచ్చే ప్రణాళికలు ఉండడంతో వాటిని ఎక్కడ ఉంచుతారో కూడా ముందుగానే చూడాల్సిన అవసరం ఉంది.

కునోలో జంతువుల మధ్య ఘర్షణ జరుగుతూ ఉండడం అధికమే. చీతా కంటే దూకుడుగా వ్యవహరించే పులులు, చిరుతపులులు పోటాపోటీగా కొట్టుకుంటాయి. ఒక్కోసారి చీతాలను ఉద్యానవనం గేటు వరకు తీసుకొస్తూ ఉంటాయి. అక్కడ మనుషులే వాటికి శత్రువులుగా మారుతుంటారు. ఇక మనుషులు, జంతువుల మధ్య సంఘర్షణలతో ఎంతో విలువైన జంతు సంపదని కోల్పోతున్నాం. దీంతో జీవవైవిధ్యానికి ముప్పు కలుగుతోంది.

చీతాల సంరక్షణకి నియమించిన వారికి కేంద్ర ప్రభుత్వం ఆఫ్రికాకి పంపించి శిక్షణ ఇచ్చింది. కానీ ఆ శిక్షణ సరిపోలేదు. రెండు చీతాలు అనారోగ్య కారణాలతో మరణించాయంటేనే సంరక్షకులకు వాటిపై పూర్తి స్థాయి అవగాహన లేదన్న విషయం తెలుస్తోంది.

భారత్‌లో చీతాలు ప్రధానంగా కృష్ణజింకలు, చింకారాలను వేటాడి తింటాయి. ప్రస్తుతం కునో జాతీయ ఉద్యానవనంలో ఈ జంతువులు అంతగా లేవు. దీంతో చీతాల కడుపు నిండడం కూడా సమస్యగానే మారింది.

### చీతాలను కాపాడుకోవడం ఎలా?

ఆఫ్రికా నుంచి తెచ్చిన చీతాల సంతతి పెరగడానికి చాలా ఏళ్లు ఎదురు చూడక తప్పని పరిస్థితులు ఉన్నాయి. చీతాలకు రేడియో కాలర్‌ ఏర్పాటు చేసి శాటిలైట్‌ ద్వారా ఎప్పటికప్పుడు వాటిని పర్యవేక్షిస్తున్నారు. అయినప్పటికీ ప్రతీ క్షణం వాటి భద్రతని పర్యవేక్షించడం సంక్లిష్టంగా మారింది. అందుకే వాటిని ఎన్‌క్లోజర్లకే పరిమితం చేయడంపై వన్యప్రాణుల నిపుణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పరిమితమైన స్థలంలో వాటిని బంధించి ఉంచడం వల్ల ఎలాంటి ప్రయోజనాలు ఉండవని వరల్డ్‌లైఫ్‌ బయోలజిస్ట్‌ రవి చెల్లం అభిప్రాయపడ్డారు. మగ, ఆడ చీతాలను ఎన్‌క్లోజర్ల నుంచి బయటకి తరచూ వదులుతూ ఉండాలని అప్పుడే వాటి సంతతి అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఇక వాతావరణపరమైన అడ్డంకుల్ని అధిగమించాలంటే మరిన్ని ఏళ్లు గడవడం తప్ప మరో మార్గం లేదన్నది వన్యప్రాణ నిపుణుల అభిప్రాయంగా ఉంది. రుతుపవనాల సీజన్‌ ముగిసిన తర్వాత చీతాలను వేరే అడవులకి కూడా తరలించే ఆలోచనలో కేంద్రం ఉంది.



అనారోగ్యంతో సొమ్మసిల్లిన చీతా ఉదయ్‌ (ఫైల్‌)

సాక్షి, నేషనల్‌ డెస్క్‌

# ఉద్ధవ్‌ను సీఎంగా నియమించలేం

- బల పరీక్ష ఎదుర్కోకుండానే రాజీనామా చేశారు
- అప్పట్లో గవర్నర్‌ తీరు సక్రమంగా లేదు
- సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పు



సుప్రీంకోర్టులో వాదోపవాదాలు

**న్యూఢిల్లీ:** మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా ఏక్‌నాథ్‌ షిండే కొనసాగడానికి సుప్రీంకోర్టు తీర్పుతో మార్గం సుగమమైంది. ఉద్ధవ్‌ ఠాక్రేను తిరిగి ముఖ్యమంత్రిగా నియమించలేమని న్యాయస్థానం స్పష్టం చేసింది. శాసనసభలో బల పరీక్షను ఎదుర్కోకుండా ఆయన స్వచ్ఛందంగా రాజీనామా చేశారని పేర్కొంది. అప్పట్లో గవర్నర్‌ భగత్‌సింగ్‌ కోషియారీ వ్యవహరించిన తీరు సమర్థనీయంగా లేనప్పటికీ ఉద్ధవ్‌ నేతృత్వంలోని మహా వికాస్‌ అఘాడీ(ఎంవీఏ) ప్రభుత్వాన్ని పునరుద్ధరించలేమని తేల్చిచెప్పింది. సీఎం పదవికి రాజీనామా చేయాలని ఏక్‌నాథ్‌ షిండేను ఆదేశించలేమని పేర్కొంది. శివసేన పార్టీలో తలెత్తిన సంక్షోభం, తద్వారా రాష్ట్రంలో ఏర్పడిన రాజకీయ సంక్షోభంపై దాఖలైన 8 పిటిషన్లను విచారించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్‌ డీవై చంద్రచూడ్‌ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం గురువారం తీర్పు వెలువరించింది. 'సభలో ఉద్ధవ్‌ ఠాక్రే మెజార్టీ కోల్పోయినట్లు నిర్ధారణకు రావడానికి తగిన సమాచారం లేకపోయినా మెజార్టీ నిరూపించుకోవాలని ప్రభుత్వానికి గవర్నర్‌ సూచించడం సరైంది కాదు. ఆయన తన విచక్షణాధికారాలను ఉపయోగించి తీరు చట్టబద్ధంగా లేదు. సభలో బల పరీక్ష ఎదుర్కోకుండా ఉద్ధవ్‌ రాజీనామా చేశారు కాబట్టి ఆయన ప్రభుత్వాన్ని పునరుద్ధరించలేం. ఉద్ధవ్‌ రాజీనామా చేసిన తర్వాత బీజేపీ మద్దతున్న షిండేతో గవర్నర్‌ ప్రమాణ స్వీకారం చేయించారు. అది సమర్థనీయమే' అని వెల్లడించింది. ఉద్ధవ్‌ వర్గంపై తిరుగుబాటు చేసి, షిండే పక్షాన చేరిన శివసేన ఎమ్మెల్యేలపై ఇప్పుడు అనర్హత వేటు వేయలేమని తెలియజేసింది. అవిశ్వాస తీర్మానాన్ని ఎదుర్కొంటున్న స్పీకర్‌కు తిరుగుబాటు ఎమ్మెల్యేలకు అనర్హత నోటీసు ఇచ్చే అధికారం ఉందా? అనేది తేల్చడానికి అధ్యయనం చేయాల్సి ఉందని అభిప్రాయపడింది. అందుకే ఈ అంశాన్ని విస్తృత ధర్మాసనానికి బదిలీ చేస్తున్నట్లు తెలిపింది. సుప్రీంకోర్టు తాజా తీర్పుతో ఉద్ధవ్‌ ఠాక్రే వర్గానికి మరో ఎదురుదెబ్బ తగిలినట్లయ్యింది. షిండే వర్గాన్ని అసలైన శివసేనగా ఎన్నికల సంఘం గుర్తించిన సంగతి తెలిసిందే.

**షిండే రాజీనామా చేయాలి: ఉద్ధవ్‌**

సుప్రీంకోర్టు తీర్పు ప్రజాస్వామ్యంపై నమ్మకాన్ని పునరుద్ధరించిందని ఉద్ధవ్‌ ఠాక్రే అన్నారు. అప్పటి గవర్నర్‌ తీరును కోర్టు తప్పుపట్టిందని చెప్రాడు. వారు(షిండే వర్గం ఎమ్మెల్యేలు) తమ పార్టీని, తండ్రి బాల్‌ ఠాక్రే అందించిన వారసత్వానికి దగా చేశారని మండిపడ్డారు. సీఎం పదవికి తాను రాజీనామా చేయడం చట్టప్రకారం పొరపాటే అయినప్పటికీ నైతిక విలువలను పాటిస్తూ పదవి నుంచి తప్పుకున్నానని వివరించారు. వెన్నుపోటుదారులతో ప్రభుత్వాన్ని ఎలా నడిపించాలని ప్రశ్నించారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ముఖ్యమంత్రి ఏక్‌నాథ్‌ షిండే, ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌ రాజీనామా చేయాలని ఉద్ధవ్‌ డిమాండ్‌ చేశారు.

# సాధికారత కోసమే సాంకేతికత

- ఆధిపత్యం కోసం దుర్వినియోగం చేయట్లేదు
- జాతీయ సాంకేతికత దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ:** సాంకేతికతను సాధికారత సాధించేందుకే సద్వినియోగం చేయాలని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. గురువారం ఢిల్లీలో జరిగిన జాతీయ సాంకేతికత దినోత్సవ కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొని ప్రసంగించారు. భారత్‌ పోఖ్రాన్‌ అణుపరీక్షలు జరిపి పాతికేళ్లు పూర్తయిన సందర్భంగా ఆ అంశాన్ని ఆయన ప్రస్తావించారు. 'దేశ చరిత్రలో ఉజ్వలమైన క్షణాల్లో 1998నాటి పోఖ్రాన్‌ అణుపరీక్షలు కూడా ఒకటి. వాజ్‌పేయీ ప్రధానిగా ఉన్నకాలంలో చేసిన అణుపరీక్షలు దేశ శాస్త్రసాంకేతికత సత్తాను చాటడంతోపాటు ప్రపంచస్థాయిలో దేశ ఖ్యాతిని సమున్నత స్థాయిలో నిలిపాయి' అని అన్నారు. కార్యక్రమంలో భాగంగా త్వరలో నిర్మించబోయే లేజర్‌ ఇంటర్‌ఫెరోమీటర్‌ గ్రావిటేషనల్‌ వేవ్‌ అబ్జర్వేటరీ–ఇండియా(లిగో–ఇండియా)కు శంకుస్థాపన చేసిన దానిని జాతికి అంకితం చేశారు. ఈ కేంద్రంలో అరుదైన ఖనిజాల నుంచి మ్యాగ్నెట్‌లను తయారుచేయనున్నారు. విశాఖపట్నంలోని హోమీబాబా క్యాన్సర్‌ ఆస్పత్రి, పరిశోధనాలయంసహా ముంబై, నవీ ముంబైలలోని పలు పరిశోధన, ఉత్పత్తి కేంద్రాలను జాతికి అంకితమిచ్చారు. ' జామ్‌(జేఏఎం) ట్రినిటీ, కోవిన్‌ పోర్టల్, రైతులకు డిజిటల్‌ మార్కెట్‌ ఇలా ప్రతి రంగంలో సాంకేతికతను భారత ప్రభుత్వం సాధికారత, సామాజిక న్యాయం కోసమే వినియోగిస్తోంది. ఆధిపత్యాన్ని ప్రదర్శించేందుకు కాదు. శాస్త్ర,సాంకేతిక రంగ పురోభివృద్ధికి ఎంతగానో మా సర్కార్‌ కృషిచేస్తోంది. పదేళ్ల క్రితం ఏటా 4,000 పేటెంట్లు నమోదయ్యేవి. ఇప్పుడు ఆ సంఖ్య 30వేలకు చేరుకుంది. గతంలో ఏటా 70వేల ట్రేడ్‌మార్క్‌లు నమోదయ్యేవి. ఇప్పుడవి 2.5లక్షలపైమాటే. ఇంక్యుబేషన్‌ కేంద్రాల సంఖ్య ఎనిమిదేళ్ల క్రితం 150 ఉంటే ఇప్పుడవి 650కి చేరుకున్నాయి' అని మోదీ అన్నారు.

# పాలనాధికారం ఢిల్లీ సర్కార్‌దే

**సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం తీర్పు**

- కేంద్రం పరిధిలోనే ఢిల్లీ శాంతిభద్రతలు, పోలీసు శాఖ, భూమి
- స్థానిక ప్రభుత్వ నిర్ణయాలకు లెఫ్టినెంట్‌ గవర్నర్‌ కట్టుబడి ఉండాలి
- కోర్టు తీర్పుపై ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ హర్షం



**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో పరిపాలనా వ్యవహారాలపై అధికారం ఎవరిదన్న వివాదంపై సుప్రీంకోర్టు స్పష్టమైన తీర్పు వెలువరించింది. ఆమ్‌ ఆద్మీ పార్టీ(ఆప్‌) ప్రభుత్వానికి భారీ ఊరట కలిగించింది. శాంతిభద్రతలు(పబ్లిక్‌ ఆర్డర్‌), పోలీసు శాఖ, భూమి మినహా మిగిలిన పరిపాలనా వ్యవహారాలపై శాసన, కార్యనిర్వాహక అధికారాలు స్థానిక ఢిల్లీ ప్రభుత్వానికే ఉంటాయని తేల్చిచెప్పింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్‌ చంద్రచూడ్‌ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం గురువారం తీర్పును ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం, ఢిల్లీ ప్రభుత్వం మధ్య ఎనిమిదేళ్లుగా కొనసాగుతున్న వివాదానికి ముగింపు పలికింది. ఢిల్లీలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వం తీసుకొనే నిర్ణయాలకు కేంద్ర ప్రభుత్వ ప్రతినిధి అయిన లెఫ్టినెంట్‌ గవర్నర్‌(ఎల్‌జీ) కట్టుబడి ఉండాలని ఆదేశించింది. ప్రజల చేత ఎన్నికైన ప్రభుత్వానికే అధికార యంత్రాంగంపై నియంత్రణ ఉండాలని ధర్మాసనం పేర్కొంది. అధికారులు మంత్రుల ఆదేశాలు పాటించకపోతే, వారికి నివేదించకపోతే పరిపాలనపై అది ప్రతికూల ప్రభావం చూపుతుందని వెల్లడించింది. దేశ రాజధాని అయిన ఢిల్లీకి ప్రత్యేక స్వరూపం ఉందని, ఇతర రాష్ట్రాల తరహాలో ఇక్కడ ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం ఉందని ధర్మాసనం గుర్తుచేసింది. కాబట్టి ఢిల్లీలో పరిపాలనపై అధికారాలు ప్రజాప్రతినిధులతో కూడిన స్థానిక ప్రభుత్వానికే ఉంటాయని స్పష్టంచేసింది. ఢిల్లీలో పబ్లిక్‌ ఆర్డర్, పోలీసు శాఖ, భూమిపై అధికారాలు కేంద్రానివేనని ఉద్ఘాటించింది. సహకార సమాఖ్య స్ఫూర్తి ప్రకారం రాజ్యాంగం నిర్దేశించిన పరిధులకు లోబడి కేంద్రం తన అధికారాలను ఉపయోగించాలని సూచించింది. సివిల్‌ సర్వీసు అధికారులు రాజకీయంగా తటస్థంగా వ్యవహరించాలని, ప్రభుత్వం రోజువారీగా తీసుకొనే నిర్ణయాలను అమలు చేయడానికి మంత్రుల పరిపాలనాపరమైన నియంత్రణ కింద పనిచేయాలని పేర్కొంది. సమాఖ్య స్ఫూర్తిని పెంపొందించడానికి కేంద్ర ప్రభుత్వం, ఢిల్లీ ప్రభుత్వం పరస్పరం సహకరించుకోవాలని సూచించింది.

**కేంద్ర హోం శాఖ నోటిఫికేషన్‌తో వివాదం**

ఢిల్లీలో పరిపాలన సర్వీసులపై అధికారాలు కేంద్ర ప్రభుత్వ నియంత్రణలోనే ఉంటాయని తేల్చిచెబుతూ 2015లో కేంద్ర హోంశాఖ నోటిఫికేషన్‌ జారీ చేసింది. ఇతర కేంద్ర పాలిత ప్రాంతాల మాదిరిగా కాకుండా భారత రాజ్యాంగం ఢిల్లీకి విశిష్ట హోదా కల్పించిందని తెలియజేసింది. ఈ నోటిఫికేషన్‌పై అభ్యంతరం వ్యక్తం ఆప్‌ ప్రభుత్వం తొలుత ఢిల్లీ హైకోర్టులో పిటిషన్‌ దాఖలు చేసింది. అక్కడ సానుకూల తీర్పు రాకపోవడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనిపై 2019 ఫిబ్రవరి 14న సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం తీర్పు వెలువరించింది. ఇద్దరు సభ్యులు భిన్నంగా స్పందించారు. ఢిల్లీలో పాలనపై ఢిల్లీ ప్రభుత్వానికి అధికారాలు ఉండవని జస్టిస్‌ అశోక్‌ భూషణ్‌ చెప్పగా, మరో సభ్యుడు జస్టిస్‌ ఏకే సిక్రీ దాన్ని వ్యతిరేకించారు. దీంతో 'ఆప్‌' ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు ఈ వివాదాన్ని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనానికి బదిలీ చేస్తున్నట్లు గతేడాది మే 6న సుప్రీంకోర్టు ప్రకటించింది. వివాదంపై విచారణ జరిపిన రాజ్యాంగ ధర్మాసనం తాజాగా తీర్పు వెలువరించింది. జస్టిస్‌ అశోక్‌ భూషణ్‌ ఇచ్చిన తీర్పును రాజ్యాంగ ధర్మాసనం తోసిపుచ్చింది.

**ఇది ప్రజాస్వామ్య విజయం: కేజ్రీవాల్‌**

సుప్రీంకోర్టు తీర్పుపట్ల 'ఆప్‌' జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్‌ కేజ్రీవాల్‌ హర్షం వ్యక్తం చేశారు. ఇది ప్రజాస్వామ్య విజయమని అభివర్ణించారు. ఢిల్లీ ప్రజలకు న్యాయం చేకూర్చిన సుప్రీంకోర్టుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఇకపై ఢిల్లీలో అభివృద్ధిని వేగవంతం అవుతుందని అన్నారు. సర్వోన్నత న్యాయస్థానం తీర్పు కేంద్ర ప్రభుత్వానికి చెంపపెట్టు ఆమ్‌ ఆద్మీ పార్టీ నాయకులు పేర్కొన్నారు. 'ఇది మైలురాయి లాంటి తీర్పు, సత్యమేవ జయతే' అని 'ఆప్‌' రాజ్యసభ సభ్యుడు రాఘవ్‌ చద్దా ట్వీట్‌ చేశారు.

**కేజ్రీవాల్‌ కార్యాచరణ ప్రారంభం**

సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన కొన్ని గంటల్లోనే అరవింద్‌ కేజ్రీవాల్‌ తన కార్యాచరణ ప్రారంభించారు. ప్రజల సమస్యల పరిష్కారం విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులను హెచ్చరించారు. ఇక తన చేతులను ఎవరూ కట్టిపారేయలేరని, అభివృద్ధిని 10 రెట్లు వేగవంతంగా చేస్తామని చెప్పారు. సర్వీసెస్‌ సెక్రెటరీ పోస్టు నుంచి ఆశీష్‌ మోరేను తొలగించారు. ఆయన స్థానంలో 1995 బ్యాచ్‌ ఐఏఎస్‌ అధికారి ఏకే సింగ్‌ను నియమించారు. ఢిల్లీలో త్వరలో బదిలీ–పోస్టింగ్‌ పరిశ్రమ రాబోతోందని బీజేపీ వ్యంగ్యంగా వ్యాఖ్యానించింది. చరిత్రాత్మక తీర్పు అని కాంగ్రెస్‌ పేర్కొంది.

## ఎరువుల బ్లాక్‌ మార్కెటింగ్‌పై కొరడా

**సాక్షి, న్యూఢిల్లీ:** అంతర్జాతీయంగా ఎరువుల ధరలు ఎగబాకడం, రైతుల నుండి పెరిగిన డిమాండ్, తగ్గిన సరఫరా కారణంగా దేశంలో ఎక్కువైన ఎరువుల బ్లాక్‌ మార్కెటింగ్‌పై కేంద్రం దృష్టిసారించింది. రానున్న ఖరీఫ్‌ సీజన్‌ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఎరువుల బ్లాక్‌ మార్కెటింగ్‌పై కఠిన చర్యలకు దిగింది. బ్లాక్‌మార్కెటింగ్‌ అరికట్టేందుకు కేంద్ర ఎరువులు, రసాయన మంత్రిత్వ శాఖ నేతృత్వంలోని ఫ్లయింగ్‌ స్క్వాడ్‌ బృందాలు దేశవ్యాప్తంగా 15 రాష్ట్రాల్లోని 370 ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాయి. తెలంగాణలో నాలుగు యూరియా డైవర్షన్‌ యూనిట్లలో, ఆంధ్రప్రదేశ్‌లో ఒక మిశ్రమ యూనిట్‌లో తనిఖీలు చేశాయి. మరో వారం పాటు ఈ ఆకస్మిక తనిఖీలు కొనసాగనున్నాయి. తనిఖీల సందర్భంగా గుజరాత్, కేరళ, హరియాణా, రాజస్తాన్, కర్ణాటక రాష్ట్రాల నుంచి ఏకంగా 70,000 బస్తాల నకిలీ యూరియాను స్వాధీనం చేసుకున్నట్లు కేంద్రం ప్రకటించింది. దీనికి సంబంధించి ఇప్పటిదాకా 30 ఎఫ్‌ఐఆర్‌లు నమోదుకాగా, 112 మిశ్రమ తయారీదారులను డీఆథరైజ్‌ చేసినట్లు వెల్లడించింది. దాదాపు రూ. 2,500 ఖరీదు చేసే 45 కిలోల యూరియా బస్తాను రైతులకు వ్యవసాయ అవసరాలకు రాయితీపై రూ.266కే కేంద్రం అందిస్తోంది. అయితే డిమాండ్‌కు సరిపడా యూరియా సరఫరా లేకపోవడంతో సబ్సిడీ ధరకు యూరియాను పొందలేకపోతున్న రైతన్నలు మార్కెట్‌లో అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తోంది.

## బంగ్లాదేశ్‌–మయన్మార్‌ తీరం దిశగా 'మోకా'

**న్యూఢిల్లీ:** మోకా తుపాను మరింత శక్తివంతంగా మారుతోందని, శుక్రవారం ఉదయానికల్లా మరింత తీవ్ర తుఫానుగా మారనుందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ఈ తుఫాను బంగ్లాదేశ్‌–మయన్మార్‌ దిశగా కదిలే అవకాశాలు ఉన్నాయని అధికారులు గురువారం రాత్రి తెలియజేశారు. గంటకు 135 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని అన్నారు. గురువారం సాయంత్రం 5.30 గంటలకు పోర్ట్‌ బ్లెయిర్‌కు పశ్చిమంగా 520 కిలోమీటర్లు, బంగ్లాదేశ్‌లోని కాక్స్‌బజార్‌ నుంచి దక్షిణ దిశగా 1,100 కిలోమీటర్ల దూరంలో ఆగ్నేయ బంగాళాఖాతంపై మోకా తుపాను ఆవరించి ఉంది. ఆదివారం ఉదయం వరకూ ఈశాన్య బంగాళాఖాతం, ఉత్తర అండమాన్‌ సముద్రంలోకి చేపల వేటకు వెళ్లొద్దని వాతావరణ శాఖ సూచించింది.

## లోక్‌సభ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ

**ప్రధానితో భేటీ తర్వాత నవీన్‌ పట్నాయక్‌ స్పష్టీకరణ**

**న్యూఢిల్లీ:** వచ్చే లోక్‌ సభ ఎన్నికల్లో బిజు జనతా దళ్‌ (బీజేడీ) ఒంటరి పోరాటం చేస్తుందని ఆ పార్టీ అధ్యక్షుడు, ఒడిశా ముఖ్యమంత్రి నవీన్‌ పట్నాయక్‌ స్పష్టం చేశారు. గురువారం ప్రధాని మోదీని కలిసి మంతనాలు జరిపారు. బీజేపీకి, కాంగ్రెస్‌కి సమానదూరం పాటిస్తానని తర్వాత మీడియాతో పట్నాయక్‌ చెప్పారు. బీజేపీకి వ్యతిరేకంగా ప్రతిపక్షాలను ఏకతాటిపైకి తీసుకురావడం కోసం బీహార్‌ ముఖ్యమంత్రి నితీశ్‌ కుమార్‌ తాను చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా నవీన్‌ పట్నాయక్‌ను కలుసుకున్న మర్నాడే ఒంటరిగానే ఎన్నికల బరిలో దిగుతామని తేల్చి చెప్పడం విశేషం. నితీశ్‌ భువనేశ్వర్‌కు వచ్చి తనను మర్యాదపూర్వకంగానే కలుసుకున్నారని పట్నాయక్‌ చెప్పారు. 2000 సంవత్సరం నుంచి ఒడిశాలో అధికారంలో ఉన్న నవీన్‌ పట్నాయక్‌ అప్పట్నుంచి బీజేపీ, కాంగ్రెస్‌ మధ్య వచ్చే వివాదాస్పద అంశాల్లో తటస్థ వైఖరి అవలంబిస్తూ వస్తున్నారు.

## ప్రతినిధుల సభలో అమెరికా పౌరసత్వ చట్టం

**వాషింగ్టన్‌:** గ్రీన్‌కార్డుల జారీలో దేశాల వారీ కోటాను ఎత్తివేయడంతోపాటు హెచ్‌–1బీ వీసాల జారీలో మార్పుల కోసం ఉద్దేశించిన అమెరికా పౌరసత్వ చట్టం–2023ను అధికార డెమొక్రాటిక్‌ పార్టీ ప్రతినిధుల సభలో ప్రవేశపెట్టింది. ఈ చట్టం ప్రకారం 1 కోటి మందికిపైగా అమెరికా పౌరసత్వం కల్పించేందుకు రోడ్‌మ్యాప్‌ రూపొందిస్తారు. అక్రమంగా వలస వచ్చిన వారికి, ధ్రువ పత్రాలు లేకుండా అమెరికాలో నివసిస్తున్న వారికి పౌరసత్వం లభించనుంది. గ్రీన్‌కార్డ్‌ జారీ సులభం కానుంది. దేశాలవారీ కోటా రద్దు చేస్తారు. తక్కువ వేతనం ఇచ్చే పరిశ్రమల్లో పనిచేసేవారు కూడా గ్రీన్‌కార్డులు సులువుగా పొందవచ్చు. హెచ్‌1బీ వీసాలు కలిగిన వారి జీవిత భాగస్వాములు అమెరికాలో ఉద్యోగాలు చేసుకోవడానికి అనుమతి ఇస్తారు.



11.16 కేరట్ల ఈ వజ్రపుటుంగరం పేరు లాగూన్‌ బ్లూ. త్వరలో జెనీవాలో వేలంలో ఇది రూ.205 కోట్ల ధర పలకొచ్చని సోత్‌బేస్‌ సంస్థ చెబుతోంది.

## కర్ణాటకలో 73.19 శాతం పోలింగ్‌ నమోదు

**బెంగళూరు:** కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో 73.19 శాతం పోలింగ్‌ నమోదయ్యింది. ఎన్నికలు బుధవారం జరగ్గా, తుది గణాంకాలను ఎన్నికల సంఘం గురువారం విడుదల చేసింది. 73.19 శాతం పోలింగ్‌ నమోదు కావడం ఒక కొత్త రికార్డేనని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి చెప్పారు. అత్యధికంగా చిక్కబళ్లాపుర జిల్లాలో 85.56 శాతం, బెంగళూరు రూరల్‌లో 85.08 శాతం, అత్యల్పంగా బీబీఎంపీ దక్షిణంలో 52.33 శాతం పోలింగ్‌ నమోదయ్యింది. రాష్ట్రంలో మొత్తం 58,545 పోలింగ్‌ కేంద్రాలు ఏర్పాటు చేయగా, రీపోలింగ్‌ నిర్వహించాల్సిన అవసరం ఎక్కడా రాలేదని అధికారులు తెలిపారు.

# చట్టవిరుద్ధం

- ఇమ్రాన్‌ ఖాన్‌ అరెస్ట్‌పై పాక్‌ సుప్రీంకోర్టు వ్యాఖ్య
- ఆయన్ను వెంటనే విడుదల చేయాలని ఆదేశాలు



సుప్రీంకోర్టుకు వస్తున్న ఇమ్రాన్‌ ఖాన్‌(వెనక సీట్లో)

**ఇస్లామాబాద్‌:** పాకిస్తాన్‌ మాజీ ప్రధాని, పాకిస్తాన్‌ తెహ్రీక్‌–ఎ–ఇన్సాఫ్‌(పీటీఐ) పార్టీ అధినేత ఇమ్రాన్‌ ఖాన్‌కు ఆ దేశ సర్వోన్నత న్యాయస్థానంలో భారీ ఊరట లభించింది. అల్‌–ఖాదిర్‌ ట్రస్ట్‌ అవినీతి కేసులో ఇమ్రాన్‌ను అరెస్ట్‌ చేసి జాతీయ జవాబుదారీ బ్యూరో(ఎన్‌ఏబీ) కస్టడీలో ఉంచడాన్ని పాక్‌ సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం తీవ్రంగా తప్పుబట్టింది. ' ఇమ్రాన్‌ను అరెస్ట్‌చేయడం పూర్తిగా చట్టవ్యతిరేకం. ఆయనను వెంటనే విడుదల చేయండి. విడుదలయ్యాక ఇస్లామాబాద్‌లో సురక్షిత ప్రాంతంలో ఉంచి రక్షణ కల్పించండి' అని అధికారులను కోర్టు ఆదేశించింది. దీంతో ఇస్లామాబాద్‌ హైకోర్టులో అరెస్టయిన ఇమ్రాన్‌కు పెద్ద ఉపశమనం లభించింది.

**గంటలో హాజరుపరచండి**

అంతకుముందు మంగళవారం ఇస్లామాబాద్‌ హైకోర్టు ఆవరణలో లాక్కెళ్లి అరెస్ట్‌ చేయడాన్ని ఇమ్రాన్‌ సుప్రీంకోర్టులో సవాల్‌ చేయగా ఆ పిటిషన్‌ గురువారం మధ్యాహ్నం విచారణకు వచ్చింది. ఈ సందర్భంగా ఎన్‌ఏబీ అధికారులపై కోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. 'గంటలోగా ఇమ్రాన్‌ను మా ముందుకు తీసుకురండి' అని మధ్యాహ్నం 3.30కి ఎన్‌ఏబీని ఆదేశించింది. దీంతో వెంటనే ఖాన్‌ను కోర్టుకు తీసుకొచ్చారు.'హైకోర్టు రిజిస్ట్రార్‌ అనుమతి లేకుండా ఒక వ్యక్తిని కోర్టు ప్రాంగణంలో ఎలా అరెస్ట్‌ చేస్తారు? న్యాయం కోసం కోర్టుకొచ్చిన వ్యక్తిని అరెస్ట్‌ చేస్తారా? ఒకవేళ కోర్టులో లొంగిపోవడానికే వస్తుంటే అరెస్ట్‌ చేయడంలో అర్థమేముంది? అరెస్ట్‌ చేసేందుకు ఏకంగా 90 మంది పోలీసులు కోర్టులో చొరబడితే హైకోర్టుకు ఏం విలువ ఇచ్చినట్టు? అని అధికారులపై ప్రధాన న్యాయమూర్తి ఉమర్‌ అతా బందియాల్‌ ఆగ్రహం వ్యక్తంచేశారు. 'తదుపరి న్యాయపర ఆదేశాల అభ్యర్థన కోసం శుక్రవారం ఇస్లామాబాద్‌ హైకోర్టుకు వెళ్లండి. ఆ కోర్టు నిర్ణయమే తుది నిర్ణయం' అని ఇమ్రాన్‌కు సుప్రీంకోర్టు సూచించింది. అరెస్ట్‌తో రణరంగంలా మారిన పాక్‌లో ఇప్పటిదాకా ఎనిమిది మంది చనిపోయారు. 300 మందికిపైగా గాయపడ్డారు. కాగా, 'ఒక నేరగాడిని విడుదల చేస్తూ ప్రధాన న్యాయమూర్తి ఎంతో సంతోషంగా ఉన్నారు. నేరగాడికి రక్షణ కవచంగా ఉంటూ దేశంలో చెలరేగుతున్న హింసకు మరింత ఆజ్యం పోస్తున్నారు' అని పాకిస్తాన్‌ ముస్లింలీగ్‌–నవాజ్‌ పార్టీ నాయకురాలు మరియం నవాజ్‌ ఆరోపించారు.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
శుక్రవారం। 12। మే। 2023



## మెళకువల మేళా

గురువారం మైసూరులోని జాతీయ ఆహార పరిశోధనా సంస్థలో విద్యార్థుల సందర్శన. సాంకేతిక దినోత్సవం సందర్భంగా సంస్థ గురించి విద్యార్థులకు వివరించారు

## న్యూస్‌రీల్

### తుమకూరులో భారీ పోలింగ్



ఈవీఎంలను ఉంచిన గదుల వద్ద భద్రత

**తుమకూరు:** కల్పతరు నాడు అయిన తుమకూరు జిల్లాలో 11 శాసనసభ నియోజకవర్గాల్లో కలిపి సగటున 83.45 శాతంతో భారీ పోలింగ్ జరిగినట్లు అధికారులు తెలిపారు. చిక్కనాయకనహళ్లి క్షేత్రంలో– 85.23 శాతం, తిపటూరులో 83.94, తురువెకెరెలో 85.81, కుణిగల్‌లో 87.19, తుమకూరు సిటీలో 66.81, తమకూరు గ్రామీణలో 86.67, కొరటిగెరెలో 84.43, గుబ్బిలో 87.63, శిరలో 83.80, పావగడలో 86.04, మధుగిరిలో 85.76 పోలింగ్ జరిగింది. తుమకూరు సిటీలో అత్యల్పం, రూరల్‌లో అత్యధిక మంది ఓటేయడం విశేషం . ఇక ఈవీఎంలను, వీవీ ప్యాట్లను తుమకూరు నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో భద్రపరిచారు. గదులను పూర్తిగా చెక్కలతో సీల్ చేసి కేంద్ర బలగాలను మోహరించారు.

### చాముండేశ్వరి కాంగ్రెస్‌లో లుకలుకలు

**మైసూరు:** మాజీ సీఎం సిద్దరామయ్యకు రాజకీయంగా జన్మనిచ్చిన చాముండేశ్వరి నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి సిద్దేగౌడ జేడీఎస్‌కి అమ్ముడుపోయారని సిద్దరామయ్య ఆరోపించడం చర్చనీయాంశమైంది. ఆయన అక్కడ కాంగ్రెస్ ఓడిపోయేలా జేడీఎస్‌తో కుమ్మక్కైనట్లు సిద్దు మండిపడ్డారు. అయితే తాను ఎలాంటి తప్పు చేయలేదని సిద్దేగౌడ ఆవేదన వ్యక్తంచేశారు. తాను ఎవరికీ అమ్ముడుపోలేదన్నారు. తాను మొబైల్‌ఫోన్‌ను స్విచాఫ్ చేయడం వల్ల అనుమానంతో కొందరు వదంతులు పుట్టించారన్నారు. తాను అలాంటి పని చేయలేదని సిద్దేగౌడ చెప్పారు. బయట సోషల్ మీడియాలో వచ్చిన వార్తలను చూసి సిద్దరామయ్య అలా అని ఉంటారన్నారు.

### రాష్ట్రంపై మోచా తుపాన్ ఎఫెక్టు

- పలు జిల్లాలకు వర్షసూచన



**యశవంతపుర:** బంగాళాఖాతంలో ఏర్పడిన మోచా తుపాన్ కారణంగా వచ్చే 24 గంటల్లో కరావళి, బెంగళూరుతో పాటు రాష్ట్రవ్యాప్తంగా భారీ వానలు పడే అవకాశం ఉన్నట్లు వాతావరణశాఖ తెలిపింది. కరావళి ఉడుపి, దక్షిణ కన్నడ, ఉత్తరకన్నడ జిల్లాలతో పాటు మలెనాడు నాలుగు జిల్లాల్లో మూడు రోజుల పాటు కుండపోత వానలు పడే అవకాశం ఉందని అధికారులు ఎల్లో అలర్ట్‌ను ప్రకటించారు. ఉత్తర కర్ణాటక జిల్లాలైన బెళగావి, బాగలకోట, ధారవాడ, గదగ, హావేరి, కొప్పళ, రాయచూరు, యాదగిరి జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడవచ్చు. ఇక బెంగళూరులో రెండు రోజుల నుంచి వానలు రాలేదు. విపరీతంగా ఎండలు కాస్తూ అప్పుడప్పుడు మేఘావృతమవుతోంది. మరో వైపు ఎండలు కూడా మండే అవకాశం ఉన్నట్లు వాతావరణశాఖ పేర్కొంది.

# ఫలితం.. ఉత్కంఠభరితం



గురువారం దావణగెరె విశ్వవిద్యాలయం స్ట్రాంగ్ రూం వద్ద భద్రత



ఈవీఎంలలో దాగిన పార్టీల గుట్టు కొన్ని గంటల్లో రట్టవుతుంది (ఫైల్)

- రేపే అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు
- రాష్ట్రంలో 34 కేంద్రాల్లో కౌంటింగ్
- స్ట్రాంగ్ రూంల వద్ద గట్టి భద్రత

**సాక్షి, బెంగళూరు:** రాష్ట్ర విధానసభ ఎన్నికల పోలింగ్ ముగిసి అందరూ శనివారం జరిగే ఓట్ల లెక్కింపు కోసం వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. ఇక మేధావులు, ఎగ్జిట్ పోల్స్ సర్వేలు ఫలానా పార్టీ అధికారానికి దగ్గరగా వస్తుందని, ఫలానావారు కింగ్ మేకర్ అవుతారని జోస్యాలతో ఊదరగొడుతున్నారు. మొత్తం 224 నియోజకవర్గాల్లో పోటీచేసిన 2,615 మంది అభ్యర్థుల భవితవ్యాన్ని ఓటర్లు ఈవీఎంలల్లో నిక్షిప్తం చేశారు. ప్రజా తీర్పు ఏమిటనేది తెలియాలంటే మరో రోజు వేచి చూడక తప్పదు. ఎన్నికల సంఘం ఆదేశాలతో శనివారం ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపును ప్రారంభిస్తారు.

**కౌంటింగ్ ప్రక్రియ ఇలా**

రాష్ట్రవ్యాప్తంగా 34 ఓట్ల లెక్కింపు కేంద్రాలను ఈసీ ఏర్పాటు చేసి ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తోంది. ప్రతి జిల్లాలో ప్రధాన విద్యాలయాల్లో స్ట్రాంగ్ రూముల్లో ఈవీఎంలను భద్రపరిచారు. ఓట్ల లెక్కింపు సిబ్బంది మూడు విధాలుగా ఉన్నారు. ప్రతి టేబుల్‌కు ఒక మైక్రో అబ్జర్వర్, ఒక పరిశీలకుడు, ఒక సహాయకుడిని కేటాయించారు. ప్రతి ఓట్ల లెక్కింపు గదిలో 10 నుంచి 14 టేబుళ్ల వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఇందులో రెండు టేబుళ్లను ప్రత్యేకంగా బ్యాలెట్ ఓట్లను లెక్కించేందుకు కేటాయించారు. తొలుత ఇళ్ల వద్ద వృద్ధులు, దివ్యాంగులు, ఉద్యోగులు వేసిన బ్యాలెట్ ఓట్లను లెక్కిస్తారు. ఆ తర్వాత ఈవీఎం ఓట్ల లెక్కింపునకు శ్రీకారం చుడతారు.

**మద్యం, ఊరేగింపులు బంద్**

అలాగే ఓట్ల గణన జరిగే కేంద్రాల్లో పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఓట్ల లెక్కింపు కేంద్రాల్లోకి మొబైల్, ఎలక్ట్రానిక్ వస్తువులను తీసుకురావడం నిషేధించారు. అలాగే ఓట్ల లెక్కింపు రోజున మద్య విక్రయాన్ని రాష్ట్రవ్యాప్తంగా నిషేధించారు. కేంద్రానికి సుమారు 200 మీటర్ల దూరం వరకు నిషేధాజ్ఞలు ఉంటాయి. అక్కడ టపాసులు పేల్చడం, ఉత్సవాలు నిషిద్ధం. ఎన్నికల ఏజెంట్లతో పాటు అభ్యర్థులను కేంద్రంలోకి అనుమతిస్తారు. ఉదయం ఆరు గంటల నుంచి లోపలకి అనుమతిస్తారు. ప్రతి జిల్లాలో ముఖ్య పట్టణంలోని ఒక విద్యాలయంలో కౌంటింగ్ జరుగుతుంది.

### రాష్ట్రంలోని 34 లెక్కింపు కేంద్రాలు

| జిల్లా | లెక్కింపు కేంద్రం |
|---|---|
| 1.బెళగావి | రాణి పార్వతి దేవీ కాలేజీ, తిలక్‌వాడి, బెళగావి |
| 2.బాగలకోటె | ఉద్యాన విశ్వవిద్యాలయం, బాగలకోటె |
| 3.విజయపుర | సైనిక్ స్కూల్, విజయపుర |
| 4.యాదగిరి | పీయూ ప్రభుత్వ కాలేజీ, యాదగిరి |
| 5.కలబురిగి | గుల్బర్గా వర్సిటీ, కలబురిగి |
| 6.బీదర్ | బీవీబీ కాలేజీ, బీదర్ |
| 7.రాయచూరు | ఎల్‌వీడీ కాలేజీ క్యాంపస్, రాయచూరు |
| 8.కొప్పళ | శ్రీ గవిసిద్దేశ్వర డిగ్రీకాలేజీ, కొప్పళ |
| 9.గదగ | శ్రీ జగద్గురు ఇంజనీరింగ్ కాలేజీ, గదగ |
| 10.ధారవాడ | వ్యవసాయ విశ్వవిద్యాలయం, ధారవాడ |
| 11.ఉత్తర కన్నడ | డాక్టర్ ఏవీ బాళిగ డిగ్రీ కాలేజీ, కుమట |
| 12.హావేరి | ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీ, హావేరి |
| 13.విజయనగర | ప్రౌఢదేవరాయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, హొసపేటె |
| 14.బళ్లారి | ఆర్‌వై మహాబలేశ్వరప్ప ఇంజనీరింగ్ కాలేజీ, బళ్లారి |
| 15.చిత్రదుర్గ | ప్రభుత్వ సైన్స్ కాలేజీ కొత్త భవనం, చిత్రదుర్గ |
| 16.దావణగెరె | శివగంగోత్రి, దావణగెరె యూనివర్సిటీ |
| 17.శివమొగ్గ | సహ్యాద్రి ఆర్ట్స్‌కాలేజీ, శివమొగ్గ |
| 18.ఉడుపి | సెయింట్ సెసిలీ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్, బ్రహ్మగిరి |
| 19.చిక్కమగళూరు | ఐడీఎస్‌జీ, చిక్కమగళూరు |
| 20.తుమకూరు | ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ, తుమకూరు యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ కాలేజీ తుమకూరు ఆర్ట్స్ కాలేజీ |
| 21.చిక్కబళ్లాపుర | ప్రభుత్వ పీయూ కాలేజీ, చిక్కబళ్లాపుర |
| 22.కోలారు | ప్రభుత్వ బాలుర పీయూ కాలేజీ, కోలార |
| 23.బీబీఎంపీ సెంట్రల్ | బీఎంఎస్ మహిళా కాలేజీ, బసవనగుడి |
| 24.బీబీఎంపీ ఉత్తరం | మౌంట్ కార్మెల్ పీయూ కాలేజీ |
| 25.బీబీఎంపీ దక్షిణం | ఎస్ఎస్ఎంఆర్‌వీ పీయూ కాలేజీ, జయనగర |
| 26.బెంగళూరు పట్టణం | సెయింట్ జోసెఫ్ హైస్కూల్ |
| 27.బెంగళూరు గ్రామీణం | ఆకాశ్ స్కూల్, దేవనహళ్లి |
| 28.రామనగర | ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీ, రామనగర |
| 29.మండ్య | మండ్య విశ్వవిద్యాలయం, మండ్య |
| 30.హాసన్ | ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీ, డెయిరీ సర్కిల్, హాసన్ |
| 31.దక్షిణ కన్నడ | నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, సూరత్కల్ |
| 32.కొడగు | సెయింట్ జోసెఫ్ కాన్వెంట్ |
| 33.మైసూరు | ప్రభుత్వ మహారాణి ఉమెన్స్ కాలేజీ |
| 34.చామరాజనగర | ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీ, చామరాజనగర |

### అర్ధరాత్రి వరకూ పోలింగ్

**యశవంతపుర:** దక్షిణకన్నడ జిల్లా బెళ్తంగడి తాలూకా చార్మాడి పోలింగ్ కేంద్రం వద్ద బుధవారం అర్ధరాత్రి వరకూ పోలింగ్ జరిగింది. చార్మాడి చెక్‌పోస్ట్ సమీపంలోని మూడు పోలింగ్ బూత్‌లలో సాయంత్రం 6 గంటలకు భారీగా ఓటర్లు పోగయ్యారు. అయితే చీకటి పడుతున్నా చాలా నిదానంగా పోలింగ్ జరుగుతోందని క్యూలో ఉన్న ఓటర్లు ప్రశ్నించారు. దీంతో వాగ్వాదం పెరిగి పోలీసులు లాఠీచార్జ్ చేశారు. చివరి ఓటరు ఓటేయడానికి రాత్రి 11:30 గంటలైంది.

### ఎగ్జిట్ పోల్స్ అసత్యం

- కేంద్ర మంత్రి శోభ

**శివాజీనగర:** ఎగ్జిట్ పోల్ సర్వేలు అబద్ధమవుతాని, ఈసారి ప్రభుత్వం తామే ఏర్పాటు చేయబోతున్నామని కేంద్ర మంత్రి శోభా కరంద్లాజె అన్నారు. గురువారం నగరంలో ఓ హోటల్‌లో మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజలు ఉత్సాహంగా ఓటు వేశారని, తమ కార్యకర్తల సర్వేల ప్రకారం వంద శాతం బీజేపీ అధిక మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందన్నారు. 120–125 చోట్ల తాము ఆధిక్యంలో ఉన్నామని, ఇక జేడీఎస్ పాత్ర గురించి తనకు అవగాహన లేదని అన్నారు. పాత మైసూరు ప్రాంతంలో మంచి ఫలితాల కోసం ఎదురుచూస్తున్నామని చెప్పారు. 120 సీట్లు దాటుతామని యడియూరప్ప చెప్పారు, ఆయన జోస్యం అబద్ధం కాబోదన్నారు.

# రాష్ట్రంలో ఫరవాలేని పోలింగ్

- సగటున 73 శాతం
- చిక్కబళ్లాపురంలో అత్యధికంగా 85 శాతం



కూడ్లిగిలో క్యూలో నిలబడలేక నేలపై కూర్చున్న ఓటర్లు

**బనశంకరి:** నెల రోజులుగా దేశ ప్రజలందరూ ఎంతో ఉత్కంఠగా ఎదురుచూసిన కన్నడనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్ పర్వం సజావుగానే ముగిసింది. పల్లె ప్రాంతాల్లో ప్రజలు పోలింగ్ కేంద్రాలకు వెల్లువెత్తగా, నగరాల్లో ఆ జోరు అంతంతమాత్రంగానే కనిపించడం నగర ఓటర్ల బాధ్యతా రాహిత్యాన్ని ఎత్తి చూపిందనే ఆరోపణలు వెల్లువెత్తాయి. రాష్ట్రంలో సగటు పోలింగ్ 73 శాతం జరగడం ఎన్నికల సంఘానికి ఊరటనిచ్చింది. విస్తృతంగా నిర్వహించిన ఓటరు జాగృతి శిబిరాలు కొంతైనా ఫలించాయని చెప్పాలి.

**జిల్లాలవారీగా పోలింగ్ శాతం వివరాలు..**

| ప్రాంతం | పర్సంటేజీ | ప్రాంతం | పర్సంటేజీ |
|---|---|---|---|
| బెంగళూరు సెంట్రల్ | 55.50 | గదగ్ | 75.61 |
| బెంగళూరు నార్త్ | 52.59 | గుల్బర్గా | 66.43 |
| బెంగళూరు దక్షిణ | 52.33 | హాసన | 81.73 |
| బాగల్‌కోటే | 75.92 | హవేరి | 81.50 |
| బెంగళూరురూరల్ | 85.08 | కొడగు | 74.73 |
| బెంగళూరు అర్బన్ | 57.71 | కోలారు | 81.75 |
| బెళగావి | 76.95 | కొప్పళ | 77.81 |
| బళ్లారి | 76.24 | మండ్య | 84.45 |
| బీదర్ | 71.59 | మైసూరు | 75.12 |
| బీజాపూర్ | 71.34 | రాయచూరు | 70.03 |
| చామరాజనగర | 81.48 | రామనగర | 85.04 |
| చిక్కబళ్లాపురం | 85.56 | శివమొగ్గ | 79.15 |
| చిక్కమంగళూరు | 78.30 | తుమకూరు | 83.58 |
| చిత్రదుర్గ | 81.18 | ఉడుపి | 78.57 |
| దక్షిణకన్నడ | 76.25 | ఉత్తరకన్నడ | 77.92 |
| దావణగెరె | 78.12 | విజయనగర | 78.07 |
| ధార్వాడ | 73.45 | యాదగిరి | 68.77 |
| | | మొత్తం | 73.19 |

# ఆమడదూరంలో ఐటీ సిటీ

- బెంగళూరులో గతంలో కంటే తక్కువగా పోలింగ్ నమోదు

**బనశంకరి:** అన్నింటా రాష్ట్ర ప్రజలకు ఆదర్శంగా ఉండవలసిన రాజధాని పోలింగ్‌లో మాత్రం దారి తప్పుతోంది. తక్కువ ఓటింగ్‌తో విమర్శలను మూటగట్టుకుంటోంది. ఈసారి కూడా యథాప్రకారం సగం మంది ఓటర్లే ఓటు వేశారు. నగరంలోని 28 నియోజకవర్గాల్లో 97.13 లక్షలు ఓటర్లు ఉండగా వారిలో 53.40 శాతం మందే పోలింగ్ కేంద్రాలకు వచ్చారు.

**జాగృతి శిబిరాలు వృథాయేనా**

నగర ప్రాంత ప్రజలు ఓటుహక్కు వినియోగించుకోవడంలో నిరుత్సాహం చూపారు. ఉద్యాననగరిలో గత 2018 ఎన్నికల కంటే ఈసారి పోలింగ్‌శాతం తగ్గింది. ఓటింగ్ శాతం పెంపునకు ఎన్నికల కమిషన్, బీబీఎంపీ జాగృతికార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించినప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేకుండాపోయింది. బీబీఎంపీ 73 శాతం లక్ష్యం పెట్టుకోగా, నమోదైనది 53 శాతం మాత్రమే.

**ఐటీ సిటీలో ఓటింగ్ ప్రమాణం తగ్గడానికి కారణాలు కొన్ని**

- కరోనాతో మృతిచెందిన 17 వేల మంది ఓటర్లను జాబితాల నుంచి తొలగించలేదు
- రెండు చోట్ల ఓట్లు ఉండే ఓటర్ల పేర్లను కూడా సక్రమంగా సవరించలేదు
- నగరంలో ఓటరు గుర్తింపుకార్డులు ఉన్నప్పటికీ వర్క్‌ఫ్రం హోం అని స్వంత ఊర్లలో ఉండిపోవడం
- ఓటర్లు జాబితా నుంచి నాయకుల ప్రోద్బలంతో చాలామంది ఓటర్ల పేర్లను రద్దు చేయడం
- చాలా పోలింగ్ కేంద్రాల్లో సాయంత్రం 6 గంటలకు తాపీగా వెళ్లారు, కానీ అధికారులు అనుమతించలేదు
- బుధవారం ఎండ ఎక్కువగా ఉండడంతో చాలా మంది ఇల్లు దాటలేదు
- మేము ఓటేసినంత మాత్రాన పెద్ద మార్పు ఏమైనా వస్తుందా? అనే వ్యతిరేక భావన. తాము ఓటేసినా, ఓటేయకపోయినా ఏమీ ఒరగదులే అనుకోవడం.




నగరంలో ఓ పోలింగ్ కేంద్రంలో ఓటర్లు. అయితే చాలా చోట్ల ఓటర్లు లేక వెలవెలబోయాయి

**బెంగళూరులో గత మూడు ఎన్నికలలో పోలింగ్ శాతం**

2023- 53.40 శాతం
2018- 54.72 శాతం
2013- 52.83 శాతం
2008- 47.30 శాతం

# పార్ట్ టైం ఉద్యోగం.. రూ.48 లక్షలు మోసం



సైబర్ నేరాలు జరుగుతున్నాయని తెలిసినప్పటికీ మేలుకోని యువత



మాయమాటలతో దోచేస్తున్న సైబర్ వంచకులు

- ఐటీ సిటీలో సైబర్ మోసగాళ్ల దందా

**బనశంకరి:** సిలికాన్ సిటీలో సైబర్ కేటుగాళ్లు చెలరేగిపోతున్నారు. విద్యావంతులు, అమాయక ప్రజలు, నిరుద్యోగులను మభ్యపెట్టి డబ్బు లాగేస్తున్న సంఘటనలు నిత్యం వెలుగులోకి వస్తున్నాయి. ఇంటి నుంచి పార్ట్‌టైమ్ ఉద్యోగం చేయవచ్చునని నమ్మించి ఓ యువకుని నుంచి రూ.48.68 లక్షల భారీ మొత్తాన్ని సైబర్ కేటుగాళ్లు కాజేశారు. బెంగళూరు త్యాగరాజనగర నివాసి (30) బాధితుడు. వివరాలు.. గతనెల 13 తేదీన యువకుని మొబైల్‌కు గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి ఇంటినుంచి పనిచేసే పార్ట్‌టైమ్ జాబ్ ఉంది. యూట్యూబ్‌లో వీడియోలను సబ్‌స్క్రైబ్ చేస్తుంటే రోజుకు రూ.10 వేలు సంపాదన చేయవచ్చునని ప్రలోభపెట్టారు. తరువాత అతన్ని తమ టెలిగ్రాం గ్రూప్‌లోకి చేర్చుకుని ఉద్యోగం ఎలా చేయాలని ఒక యువతి ఉత్తుత్తి శిక్షణనిచ్చింది. ప్రారంభంలో కొన్ని వీడియోలను పంపి సబ్‌స్క్రైబ్ చేయగానే కొంత డబ్బును అతని ఖాతాల్లోకి వేశారు. ఇప్పుడు వీఐపీ అకౌంట్ ఇస్తాము దీని ద్వారా కంపెనీ నుంచి అధిక లాభం దక్కుతుంది. రెండువైపులా డబ్బు సంపాదించవచ్చునని ప్రలోభపెట్టారు. నమ్మిన యువకుడు వంచకులు ఇచ్చిన బ్యాంక్ అకౌంట్‌కు దశలవారీగా భారీ మొత్తం నగదు జమచేశాడు. మోసగాళ్లు నమ్మకం కలిగేందుకు కొంత లాభం, మరికొంత కమీషన్ అని అతనికి తిరిగి పంపించారు. లాభం వస్తోంది కదా అని ఆ యువకుడు దఫదఫాలుగా దుండగుల ఖాతాలకు రూ.48.68 లక్షలను జమ చేశాడు. చివరికి కమీషన్ ఏదీ రాకపోవడంతో సంప్రదించగా ఫోన్లు స్విచాఫ్ వచ్చాయి. మోసపోయినట్లు గ్రహించి దక్షిణ విభాగ సీఈఎన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు మోసగాళ్ల మొబైల్ నంబర్లు, బ్యాంక్ అకౌంట్ వివరాలు తీసుకుని గాలింపు చేపట్టారు.

**వెబ్ చానల్‌లో టాస్క్ అని రూ.4.60 లక్షలు టోపీ**

వెబ్ చానల్‌లో టాస్కలను పూర్తిచేస్తే దండిగా డబ్బులు ఇస్తామని యువకున్ని నమ్మించి రూ.4.60 లక్షలు వంచించారు. హాసన్ తాలూకా జేహెచ్ కెరె పోస్ట్ పరిధికి చెందిన యువకునికి ఈ నెల 2వ తేదీన ఒక వాట్సాప్ మెసేజ్ వచ్చింది. అది చూడగా, కొన్ని వెబ్‌చానల్స్ ఓపెన్ కాగా ఒక వీడియోని లైక్ చేస్తే రూ.50 వస్తుందని మెసేజ్ వచ్చింది. యువకుడు మూడు వీడియోలను లైక్‌చేయడంతో బ్యాంక్ ఖాతాలోకి రూ.150 జమ అయింది. నీ అకౌంట్ నుంచి నగదు నా అకౌంట్ కు నగదు జమచేస్తే కొన్ని గంటల్లోనే రెండు రెట్లు చేసి పంపుతామని మోసగాడు ఆశచూపించాడు. బాధితుడు సరేనని దశలవారీగా రూ.4.60 లక్షలు జమచేశాడు. ఆ వెంటనే వంచకుడు మొబైల్‌ను స్విచాఫ్ చేసుకున్నాడు. మోసపోయినట్లు గుర్తించిన యువకుడు 8వ తేదీన హాసన సీఈఎన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

**ఆనందానికి మూల్యం రూ.1 లక్ష**

హనుమంతనగరలో ఒక యువకుడు (22) గూగుల్‌లో కాల్‌గర్ల్ కోసం గాలించాడు. ఈ సమయంలో అతనికి వాట్సాప్ లో గుర్తుతెలియని వ్యక్తి మెసేజ్ పంపించి మీ అడ్రస్ పంపిస్తే కాల్‌గర్ల్‌ను బుక్‌చేస్తామని హామీ ఇచ్చాడు. ఇతడి మాటలు నమ్మిన యువకుడు బుకింగ్ ఫీజు రూ.599 చెల్లించాడు. మరో గుర్తుతెలియని వ్యక్తి ఫోన్‌చేసి హోటల్ లోకేషన్ పంపించి మిగిలిన డబ్బు పంపించాలని సూచించాడు. యువకుడు రూ.12,050 నగదు చెల్లించాడు. తరువాత పోలీస్‌శాఖ వివరాలు పరిశీలించాలని తెలిపి రూ.19,100 వసూలు చేశారు. ఇలా రకరకాలుగా చెప్పి రూ.1.05 లక్షల వరకూ జమ చేయించుకుని ఫోన్లు స్విచాఫ్ చేసుకున్నారు. బాధితుడు దక్షిణ విభాగ సీఈఎన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టారు.

# సర్వేలన్నీ రివర్స్ అవుతాయి

- మళ్లీ మాదే అధికారం: సీఎం

**సాక్షి,బళ్లారి:** కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కొన్ని సర్వేలు చెప్పినట్లుగా కాంగ్రెస్ పార్టీకి ఎక్కువ సీట్లు వచ్చే అవకాశం లేదని, పోలింగ్ జరిగిన సరళిని బట్టి పరిశీలిస్తే తప్పకుండా మళ్లీ బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆపద్ధర్మ సీఎం బసవరాజ్ బొమ్మై పేర్కొన్నారు. ఆయన గురువారం హుబ్లీలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. శిగ్గాంవి ప్రజలు తనపై ఎంతో విశ్వాసం చూపినందుకు వారి రుణం తీర్చుకుంటానన్నారు. రాష్ట్రంలో 224 నియోజకవర్గాల్లో మ్యాజిక్ ఫిగర్ గెలుపుతో మళ్లీ తామే అధికారం చేపడతామన్నారు. గత ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, 107 నుంచి 115 సీట్లు వస్తాయి అని సర్వేలు చెప్పినా ఏమైందని అన్నారు. ఈసారి కూడా సర్వేలు అలాగే ఉన్నాయని, బీజేపీకి ఓటు బ్యాంకు పెరిగిందన్నారు. మోదీ ప్రచారం తర్వాత రాష్ట్రంలో తమకు మరిన్ని సీట్లు పెరిగాయన్నారు.



**తుంగభద్రమ్మ సౌందర్యం**

అద్వితీయమైన ప్రకృతి సౌందర్యం కదా ఇది. గురువారం హంపీలోని చక్రతీర్థం వద్ద తుంగభద్ర నదిలో చేపలు పట్టడానికి వల విసురుతున్న జాలరి

## క్లుప్తంగా

### గాలిపై అపప్రచారం తగదు



మాట్లాడుతున్న వీరేశ్ బలకుంది

గంగావతి రూరల్: కల్యాణ రాజ్య ప్రగతి పక్ష(కేఆర్‌పీపీ) వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ మంత్రి గాలి జనార్దన్‌రెడ్డితో పాటు అతని ఆప్త సహాయకుడు అలీఖాన్‌పై జాతీయ పార్టీల నాయకులు కుమ్మక్కై ఫ్రూట్ బాబాతో లేనిపోని ఆరోపణలతో తనను కిడ్నాప్ చేసినట్లు ఆరోపించడం తగదు అని పార్టీ నగర అధ్యక్షుడు వీరేశ్ బలకుంది పేర్కొన్నారు. ఆయన గురువారం నగరంలో విలేకరులతో మాట్లాడారు. క్షేత్ర ప్రజలకు వారి వృత్తి, ప్రవృత్తి ఏమిటో బాగా తెలుసన్నారు. ఇలాంటి వ్యక్తుల మాటలు నమ్మకూడదని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా నగర ఓబీసీ అధ్యక్షులు ప్రసాద్, కార్యదర్శి బసవరాజ్, జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటేశ్ జబ్బలగుడ్డ, గ్రామీణ అధ్యక్షులు అగోలి నాయక, రుద్రేశ్ జబ్బలగుడ్డ, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

### నన్ను గాలి అనుచరులు కిడ్నాప్ చేశారు

- ఫ్రూట్ బాబా ఆరోపణ



ఎమ్మెల్యే ముందు ఫ్రూట్ బాబా కంట తడి

గంగావతి రూరల్: కల్యాణ రాజ్య ప్రగతి పక్ష(కేఆర్‌పీపీ) నాయకులు అలీఖాన్ నేతృత్వంలో తనను గత ఐదు రోజులుగా బంధించి చిత్రహింసలకు గురి చేశారని బాధితుడు ఫ్రూట్ బాబా ఆరోపించారు. ఆయన గురువారం తన చేతికి అయిన గాయాన్ని చూపుతూ విలేకరులతో మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే పరణ్ణ మునవళ్లి పరామర్శించి మాట్లాడుతూ బాధితునికి అన్ని విధాలుగా తమ సహకారం ఉంటుందన్నారు. పోలీస్ అధికారులతో తనిఖీ చేయించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ఓబీసీ అధ్యక్షులు అమర్‌జ్యోతి వెంకటేశ్‌తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### నకిలీ విత్తనాలు అరికట్టరూ



వినతిపత్రం సమర్పిస్తున్న రైతులు

రాయచూరు రూరల్: ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతుండగా రైతులకు నకిలీ విత్తనాల విక్రయ నియంత్రణకు చర్యలు చేపట్టాలని భారతీయ కిసాన్ సంఘం రైతులు ఆందోళన చేపట్టారు. బుధవారం వ్యవసాయ అధికారి కార్యాలయం వద్ద అధ్యక్షుడు రంగనాథ్ మాట్లాడుతూ రైతులకు విత్తనాల కొరత లేకుండా నిల్వ ఉంచాలని కోరుతూ వ్యవసాయ అధికారికి వినతి పత్రం సమర్పించారు.

### మౌలిక సౌకర్యాలేవీ?



వినతిపత్రం సమర్పిస్తున్న నేతలు

రాయచూరు రూరల్: జిల్లాలోని మాన్వి తాలూకా ఆరోలిలో మౌలిక సౌకర్యాలు కల్పించాలని దళిత సంఘర్ష సమితి నేతలు ఆందోళన చేపట్టారు. బుధవారం కలెక్టరేట్ వద్ద అధ్యక్షులు హనుమంతు మాట్లాడుతూ తాగునీరు, విద్యుత్, ఇతర సౌకర్యాలు కల్పించాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

### 16 నుంచి కాంతయ్య తాత పుణ్యారాధన

కంప్లి: గంగావతి తాలూకాలోని హెబ్బాళ రేణుకా పుణ్యాశ్రమంలో ఈ నెల 16, 17న కాంతయ్య తాత 27వ పుణ్యారాధన కార్యక్రమాలు జరగనున్నాయని పుణ్యాశ్రమ శరణయ్యతాత తెలిపారు. సంగత్రాయ సంస్కృత పాఠశాల ఆవరణలో చేరిన భక్తులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ 16న సాయంత్రం హుడాలోని కంబాళి మఠం అమరేష్ శాస్త్రిచే ఆధ్యాత్మిక జీవన దర్శన ప్రవచనం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో చరిత్ర పరిశోధకులు గంగావతి డాక్టర్ శరణప్ప కోల్కర్, ఇతర మఠాధిపతులు, ప్రముఖులు పాల్గొంటారన్నారు.

### మొరార్జీ విద్యార్థిని సత్తా



విశాలాక్షి

బళ్లారిఅర్బన్: తాలూకాలోని మోకా యరగుడి గ్రామంలోని మొరార్జీ దేశాయి వసతి పాఠశాలలో చదివిన 10వ తరగతి విద్యార్థిని విశాలాక్షి 625కు మార్కులకు గాను 611 మార్కులు సాధించి తన సత్తాను చాటి పాఠశాలకు, తల్లిదండ్రులకు, గ్రామానికి కీర్తిని గడించినట్లు ఆ పాఠశాల ప్రిన్సిపల్ తెలిపారు. అలాగే ఇద్దరు విద్యార్థులు 599 మార్కులతో ద్వితీయ, 598 మార్కులతో తృతీయ స్థానం పొందారన్నారు. మొత్తం 48 మంది విద్యార్థుల్లో డిస్టింక్షన్‌లో 47 మంది, ఒక్కరు ప్రథమ స్థానం సాధించడంతో పాఠశాల ఉపాధ్యాయులు స్వీట్లను పంచి అభినందించారు.

# స్ట్రాంగ్ రూంల్లో ఈవీఎంలు భద్రం



బళ్లారిలో స్ట్రాంగ్ రూంల వద్ద ఏర్పాటు చేసిన గట్టి పోలీసు భద్రత



హొసపేటెలో ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద అధికారుల పర్యవేక్షణ

- ఫలితాలు ఓటింగ్ యంత్రాల్లో నిక్షిప్తం
- ఆర్‌వైఎంఈసీ వద్ద పటిష్ట బందోబస్తు

సాక్షి,బళ్లారి: అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో ఈవీఎంలను స్ట్రాంగ్‌రూంల్లో భద్రపరిచారు. బుధవారం రాత్రి వరకు పోలింగ్ జరగడంతో జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లోని ఈవీఎంలను నగరంలోని ఆర్‌వైఎంఈ కళాశాలకు తరలించారు. గురువారం జిల్లా ఎస్పీ రంజిత్ కుమార్, పలువురు పోలీసు అధికారులు నగరంలోని ఆర్‌వైఎంఈసీని సందర్శించి ఈవీఎంలు భద్రపరిచిన గదుల వద్ద పరిశీలించారు. జిల్లాలోని నగర, గ్రామీణ, కంప్లి, సిరుగుప్ప, సండూరు నియోజకవర్గాల ఓట్ల లెక్కింపునకు 80 టేబుళ్లను ఏర్పాటు చేశారు. నగర నియోజకవర్గంలో ఓట్ల లెక్కింపు 19 రౌండ్లు ఉండగా, గ్రామీణ, కంప్లి, సండూరు నియోజకవర్గాల్లోని ఓట్లను 18 రౌండ్లకు, సిరుగుప్ప నియోజకవర్గ ఓట్ల లెక్కింపు 17 రౌండ్లలో ముగించే విధంగా ఏర్పాట్లు చేశారు.

**డేగ కళ్లతో పోలీసు పహారా**

ఓట్ల లెక్కింపు చేపడుతున్న ఆర్‌వైఎంఈసీలో ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూంల వద్ద రెండు రోజుల పాటు పోలీసులు డేగ కళ్లతో పహారా కాస్తున్నారు. శనివారం ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు జరగనున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లను పూర్తి చేస్తోంది. ఆర్‌వైఎంఈసీ వద్ద ఓట్ల లెక్కింపు రోజు అభ్యర్థులతో పాటు ఏజెంట్లు మినహా మిగిలిన వారికి ఎవరికీ అనుమతి ఉండదని ఎన్నికల అధికారులు ప్రకటించారు. జిల్లా ఎన్నికల అధికారి నియమించిన అధికారులు ఆయా గదుల్లో తమ విధులను సక్రమంగా నిర్వహించే విధంగా శిక్షణ ఇచ్చారు. ఓట్ల లెక్కింపు రోజున మధ్యాహ్నం 1 గంటకల్లా ఫలితం పూర్తిగా వెలువడే అవకాశం ఉంది. ఎస్పీ రంజిత్ కు మార్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపునకు డీఏఆర్, సివిల్ పోలీసులతో గట్టి భద్రత ఏర్పాట్లు చేశామన్నారు.



బెంగళూరులో ఓ కేంద్రం వద్ద భద్రతను పర్యవేక్షిస్తున్న అధికారులు, సిబ్బంది

**స్ట్రాంగ్ రూముల్లో ఈవీఎంలు**

హొసపేటె: విజయనగర జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో జరిగిన సార్వత్రిక అసెంబ్లీ ఎన్నికల ఓటింగ్ యంత్రా(ఈవీఎం)లను బుధవారం రాత్రి జిల్లాధికారి వెంకటేష్ సమక్షంలో స్థానిక పీడీఐటీ ఇంజనీరింగ్ కాలేజీలోని స్ట్రాంగ్ రూముల్లో పటిష్ట బందోబస్తు మధ్య భద్రపరిచారు. ఐదు నియోజకవర్గాల అభ్యర్థుల ఓట్ల లెక్కింపును ఈనెల 13న చేపడతారు.

ఇందుకోసం ముందుగా గురువారం నుంచే లెక్కింపునకు కావాల్సిన కౌంటర్ల పనులు శరవేగంగా సాగుతున్నాయి. విజయనగర జిల్లాలో మొత్తం 10,92,011 మంది ఓటర్లలో 8,52,502 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోవడంతో జిల్లాలో 78.07 శాతం పోలింగ్ జరిగింది. హొసపేటె నియోజకవర్గంలో 71.68 శాతం, హడగలిలో 77.29 శాతం, హగరిబొమ్మనహళ్లిలో 81.56 శాతం, కూడ్లిగిలో 79.69 శాతం, హరపనహళ్లిలో 80.68 శాతం పోలింగ్ నమోదైంది. ఆయా నియోజకవర్గం అభ్యర్థుల గెలుపోటముల ఫలితం కౌంటింగ్ రోజున తేలనుంది. ముఖ్యంగా ప్రతి నియోజకవర్గంలో కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల మధ్య గట్టి పోటీ నెలకొందని చెప్పవచ్చు.

**నగర స్ట్రాంగ్ రూంలకు భద్రత**

బనశంకరి: బెంగళూరు నగరంలోని 28 అసెంబ్లీ నియోజకవర్గాలకు నాలుగుచోట్ల స్ట్రాంగ్ రూముల్లో ఉంచిన ఈవీఎంలకు పటిష్టమైన పోలీస్‌భద్రత కల్పించారు. వసంతనగరలోని మౌంట్ కార్మెల్ కాలేజీ, బసవనగుడి బీఎంఎస్ కాలేజీ, జయనగర ఎస్ఎస్ఎం ఆర్‌వీ కాలేజీ, విఠల్‌మల్యా రోడ్డులోని సెయింట్ జోసెఫ్ కాలేజీలో స్ట్రాంగ్ రూములను సీల్ చేసి పోలీసులతో పాటు బీఎస్ఎఫ్ సిబ్బందితో పహరా పెట్టారు. ఒక స్ట్రాంగ్‌రూమ్ వద్ద 100 మందికి పైగా పోలీసులను భద్రత కోసం నియమించారు.

## జిల్లాల వారీగా పోలింగ్ వివరాలివే

- బళ్లారిలో 76.24 శాతం
- రాయచూరులో 70.03 శాతం

సాక్షి,బళ్లారి: జిల్లాలో బుధవారం రాత్రి వరకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఐదు నియోజకవర్గాల్లో సగటున 76.24 శాతం పోలింగ్ నమోదైనట్లు జిల్లా ఎన్నికల అధికారి గురువారం ప్రకటించారు. జిల్లాలో మొత్తం ఓటర్లు 11,52,411 మంది కాగా వీరిలో మహిళలు 5,84,920 మంది, పురుషులు 5,67,319 మంది. వీరిలో పోలైన ఓట్లలో మహిళలు 4,38,928 మంది, పురుషులు 4,39,609 మంది, ఇతరులు 67 మందితో కలిపి జిల్లా వ్యాప్తంగా మొత్తం 8,78,604 మంది ఓటు వేశారని తెలిపారు. నియోజకవర్గాల వారిగా పోలైన ఓట్ల శాతం వివరాలు ఇలా ఉన్నాయి. కంప్లి నియోజకవర్గంలో 84.43 శాతం, సిరుగుప్పలో 77.03 శాతం, గ్రామీణలో 76.09 శాతం, నగరంలో 68.22 శాతం, సండూరులో 77.08 శాతం పోలింగ్ నమోదైనట్లు తెలిపారు. 2018 ఎన్నికలతో పోలిస్తే పోలింగ్ శాతం కొంత మేర పెరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయి.



మాట్లాడుతున్న జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్

రాయచూరు రూరల్: జిల్లాలో బుధవారం ఓటింగ్ ప్రశాంతంగా ముగిసిన నేపథ్యంలో జిల్లాలో 70.03 శాతం మేర పోలింగ్ నమోదైనట్లు జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్ వెల్లడించారు. గురువారం ఆయన జిల్లాధికారి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. లింగసూగూరులో 72.82 శాతం, రాయచూరులో 62.01 శాతం, రాయచూరు గ్రామీణలో 75.30 శాతం, మస్కిలో 71.01 శాతం, మాన్విలో 67.03 శాతం, సింధనూరులో 72.82 శాతం, దేవదుర్గలో 74.61 శాతం పోలింగ్ జరిగిందన్నారు.


## ఓటు వేసి వెళుతూ వృద్ధుడి మృతి

రాయచూరు రూరల్: ఓటు వేసేందుకు బుధవారం వచ్చి లో బీపీతో వృద్ధుడు మరణించిన ఘటన అరికెరెలో జరిగింది. ముస్టూరు పంచాయతీ పరిధిలోని గెజ్జెబావికి చెందిన రామణ్ణ(55) ఓటు వేసి ఇంటికెళ్లిన అనంతరం సాయంత్రం లో బీపీతో మరణించాడు. కాగా ఓటు వేసేందుకు కుటుంబంతో పాటు ద్విచక్ర వాహనంలో వచ్చి తిరుగు ప్రయాణంలో రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మరణించిన ఘటన ముదుగల్ పట్టణంలో జరిగింది. బైక్‌లో టణకల్ నుంచి వచ్చి ముదుగల్ పోలింగ్ కేంద్రంలో ఓటు వేసి ముగ్గురూ తిరిగి వస్తుండగా టైర్ పగలడంతో ఈ ప్రమాదం సంభవించింది. దేవమ్మ(40) అనే మహిళ మరణించడంతోఖ భర్త గురుడప్ప, ఇద్దరు చిన్నారులకు గాయాలయ్యాయి. వారిని చికిత్స కోసం ముదుగల్ ఆస్పత్రిలో చేర్పించినట్లు పోలీసులు తెలిపారు.


**కార్యకర్తల మధ్య గొడవలో ఒకరికి గాయాలు**

మస్కిలో బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య జరిగిన చిన్నపాటి గొడవలతో ఎమ్మెల్యే సోదరుడు బసనగౌడకు తీవ్ర గాయాలు అయ్యాయి. వివరాలు...మరికాసేపట్లో ఓటింగ్ గడువు ముగుస్తుండగా పట్టణంలో గచ్చినమఠ పోలింగ్ కేంద్రంలో ఓటింగ్ సరళిని తెలుసుకొనేందుకు వెళ్లిన బసనగౌడపై మాజీ ఎమ్మెల్యే, బీజేపీ అభ్యర్థి ప్రతాప్‌గౌడ పాటిల్ మద్దతుదారులు గొడవకు దిగారు. పోలీసులు ఎంత వారించినా బసనగౌడపై మారణాయుధాలతో దాడి చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్నట్లు మస్కి పోలీసులు తెలిపారు.

## రోగులతో విమ్స్ ఆసుపత్రి కిటకిట



విమ్స్ మెడిసిన్ విభాగంలో రోగుల రద్దీ



ఎక్స్‌రే విభాగంలో పరీక్షల కోసం రోగుల క్యూ

- ఎండల్లో జెండాలు మోసి, జేజేలు కొట్టి అనారోగ్యంతో ఆసుపత్రికి
- జలుబు, జ్వరం, దగ్గుతో చికిత్సకు నగర వాసులు బారులు

బళ్లారి రూరల్: ఎన్నికల పండుగలో నామినేషన్ వేసిన రోజు నుంచి ప్రచారం ముగింపు వరకు వివిధ పార్టీల నాయకుల వెంట జనాలు తండోపతండాలుగా వచ్చారు. పార్టీల జెండాలు మోస్తూ నాయకులకు జేజేలు కొట్టారు. అన్ని పార్టీల వెంట అందరు నాయకుల వెంట తిరిగింది నగరంలోని కాలనీలు, బస్తీల వాసులు. వీళ్లంతా ఆ పార్టీపై, ఆ నాయకుడిపై అభిమానంతో వచ్చిన వారు కాదు కూలి కోసం పని చేసిన సామాన్య ప్రజలు. మండుటెండల్లో తిరిగి తిరిగి జలుబు, దగ్గు, జ్వరాల బారిన పడ్డారు. తీరా ఎన్నికలు అయిపోగానే గురువారం వైద్యం కోసం ఆసుపత్రుల బాట పట్టారు.

దీంతో ఒక్కసారిగా ఆసుపత్రి రోగులతో కిటకిటలాడింది. అంతవరకు ఖాళీగా ఉన్న మెడిసిన్ ఓపీ విభాగం రోగులతో నిండిపోయింది. ఆసుపత్రికి వచ్చిన వారందరూ అధిక శాతం జ్వరం, జలుబు, దగ్గు సమస్యలతో వచ్చిన వారేనని వైద్యులు చెబుతున్నారు.

### ఎవరిపైనా దాడి చేయలేదు

మండ్య : మేలుకోటె నియోజకవర్గంలోని నారాయణపురలో రైతు సంఘం నేతలపై తాను దాడిచేసినట్లు జరిగిన ప్రచారంలో వాస్తవం లేదని మేలుకోటె ఎమ్మెల్యే, జేడీఎస్ అభ్యర్థి సీఎస్.పుట్టరాజు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల సందర్శనకు వెళ్లినప్పుడు ఒక మహిళ తన వద్దకు వచ్చి తన కుమారుడిని కొడుతున్నట్లు వాపోయిందన్నారు. వెంటనే గన్‌మెన్‌ను పంపి గొడవకు దిగిన రౌడీషీటర్‌ను పట్టుకొని పోలీసులకు అప్పగించామన్నారు. అయితే రైతు సంఘం నేతపై దాడి చేసినట్లు మీడియాలో ప్రచారం జరిగిందన్నారు.

# ఫలితాలపై బెట్టింగ్‌ల జోరు

రాయచూరు రూరల్: జిల్లాలో బుధవారం ఓటింగ్ ప్రశాంతంగా ముగియడంతో ఈవీఎంలను నగరంలోని ఎస్ఆర్ పీయూ కళాశాలలోని స్ట్రాంగ్‌రూముల్లో భద్రపరిచారు. ఆ గదుల వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా ఓటింగ్ ముగియడంతో వెలువడిన ఎగ్జిట్ పోల్ ఫలితాలతో ఆయా పార్టీల అభ్యర్థుల గెలుపుపై నాయకులు, కార్యకర్తలు, మద్దతుదారుల మధ్య బెట్టింగ్ జోరు కనిపిస్తోంది. లింగసూగూరులో బీజేపీ అభ్యర్థి వజ్జల్ మానప్ప, కాంగ్రెస్ ఎమ్మెల్యే హులిగేరి, జేడీఎస్ అభ్యర్థి సిద్దూ బండిల మధ్య బెట్టింగ్ కాస్తున్నారు. గ్రామీణలో కాంగ్రెస్ ఎమ్మెల్యే బసనగౌడ, బీజేపీ అభ్యర్థి తిప్పరాజుల మధ్య, దేవదుర్గలో ఎమ్మెల్యే శివన గౌడనాయక్, జేడీఎస్ అభ్యర్థి కరియమ్మల మధ్య, మస్కిలో ఎమ్మెల్యే బసనగౌడ తుర్విహాళ, బీజేపీ అభ్యర్థి ప్రతాప్‌గౌడ పాటిల్ మధ్య, సింధనూరులో ఎమ్మెల్యే వెంకట్రావ్ నాడగౌడ, కాంగ్రెస్ అభ్యర్థి హంపనగౌడ బాదర్లి మధ్య, మాన్విలో ఎమ్మెల్యే రాజా వెంకటప్ప నాయక్, కాంగ్రెస్ అభ్యర్థి హంపయ్య నాయక్, బీజేపీ అభ్యర్థి బి.వి.నాయక్‌ల మధ్య పోటీ ఉంది. ఈ విషయంలో లక్షల్లో బెట్టింగ్‌లు కడుతున్నారు. ప్రధానంగా నగర బీజేపీ అభ్యర్థి, ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్, కాంగ్రెస్ అభ్యర్థి మహ్మద్ శాలంల మధ్య గెలుపుపై బెట్టింగ్ పోరు హోరాహోరీగా ఉంది.

**అభ్యర్థుల గెలుపుపై జోరుగా పందేలు**

కంప్లి: అహోరాత్రులు కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు, కార్యకర్తలు శ్రమించారు. బుధవారం పోలింగ్ ముగిసింది. అభ్యర్థుల జాతకాలు ఈవీఎంల్లో భద్రంగా ఉన్నాయి. శనివారం భవిష్యత్తులు తేలనున్నాయి. అయితే ఇరు పార్టీల నేతల పరంగా కార్యకర్తలు జోరుగా పందేలు వేస్తున్నారు. ఎవరు గెలిచినా కొద్ది పాటి మెజార్టీతో తప్ప వేలల్లో రాదని కొందరు, తమ అభ్యర్థి సుమారు 10 వేల మెజార్టీతో గెలుస్తాడని మరికొందరు ఇలా అంచనాలు వేసుకుంటున్నారు. ప్రతి వాడలో, ప్రతి కట్టపై ఇదే చర్చ. ఇక ఎవరి భవిష్యత్తు ఎలా ఉంటుందో శనివారం మధ్యాహ్నం కల్లా తేలిపోనుంది.

**ఆర్‌ఆర్ నగరలో బెట్టింగ్‌ల జోరు**

యశవంతపుర: బెంగళూరు నగరంలోని ఆర్‌ఆర్ నగర నియోజకవర్గంపై గెలుపు- ఓటమిలపై జోరుగా బెట్టింగ్ జరుగుతుంది. బీజేపీ- కాంగ్రెస్ అభ్యర్థుల మధ్య గట్టి పోటీ ఉందని తలోపార్టీ తరపున పందేలు కడుతున్నారు. ఇక్కడ తెలుగువారి ప్రభావం ఎక్కువ. పోలింగ్ సమయంలోనూ ఇరు పార్టీల నాయకులు జోరుగా డబ్బులు పంచినట్లు ఆరోపణలు ఉన్నాయి. మంత్రి, బీజేపీ అభ్యర్థి మునిరత్న గెలుస్తాడని కొందరు, కాంగ్రెస్ అభ్యర్థి కుసుమదే విజయమని మరికొందరు..చెబుతూ ఎంతైనా బెట్టింగ్‌కు రెడీ అనడం జరుగుతోంది. అలాగే యశవంతపురలో మంత్రి ఎస్‌టీ సోమశేఖర్, జేడీఎస్ అభ్యర్థి జవరేగౌడల గెలుపు- ఓటములపై బెట్టింగ్ నడుస్తోంది. ఈసారి మార్పు ఖాయమని కొందరు పందెందారులు చెబుతున్నారు. బుధవారం రాత్రి నుంచి వివిధ సర్వేలతో కార్యకర్తలు ఉత్సాహంగా ఉన్నారు. ఏ టీ అంగడి వద్ద చూసినా బెట్టింగ్‌లు, అభ్యర్థుల గురించే చర్చలు జరుగుతున్నాయి.

## ఓటమి భయంతోనే డబ్బుల పంపిణీ

- బీజేపీపై జగదీష్ శెట్టర్ ఆరోపణ



మాట్లాడుతున్న జగదీష్ శెట్టర్

హుబ్లీ: ఓటమి భయంతో హుబ్లీ–ధార్వాడ సెంట్రల్ క్షేత్రంలో బీజేపీ వారు మురికి వాడల్లో ఓటుకు రూ.500 నుంచి రూ.1000 వరకు డబ్బులు పంచారు. తాను బీజేపీలో ఉన్నప్పుడు ఈ విధంగా ఎప్పుడూ జరగలేదని ఈ క్షేత్రం కాంగ్రెస్ అభ్యర్థి జగదీష్ శెట్టర్ పేర్కొన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజలపై విశ్వాసంతో తాను చేసిన పనుల ఆధారంగా ఓట్లను అభ్యర్థించాను. ఎటువంటి ప్రలోభాలకు పాల్పడలేదు. ఏ ఎన్నికల్లోను తాను ఓటర్లను డబ్బు పంచే పని చేయలేదు. అతి తక్కువ ఖర్చుతో ఎన్నికలను ఎదుర్కొన్నానని అన్నారు. ఎగ్జిట్‌పోల్ సర్వేలో సెంట్రల్ క్షేత్రంలో తాను విజయం సాధిస్తానన్న సమాచారం లభించిందన్నారు. అంతేకాక రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం అన్నారు. సిద్దరామయ్య, డీకే శివకుమార్‌ల నేతృత్వంలో కాంగ్రెస్ ఐక్యంగా పోరాటం చేసి బీజేపీ సర్కారు వైఫల్యాలను ప్రజలకు తెలిపినందు వల్లే కాంగ్రెస్ మెజార్టీ సాధించిందన్నారు. బీజేపీ లింగాయత్‌లకు అన్యాయం చేసిందన్న అంశం కూడా ప్రభావం చూపిందన్నారు. కాంగ్రెస్ ఓటు బ్యాంక్ కలిగిన వార్డుల్లో 70 శాతం పైగా పోలింగ్ జరిగిందన్నారు. దీని వల్ల భారీ మెజార్టీతో విజయం సాధిస్తానని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

## చించోళిలో బీజేపీ కార్యకర్త ఆత్మహత్య



రాము రాథోడ్(ఫైల్)

రాయచూరు రూరల్: బీజేపీ కార్యకర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన కలబుర్గి జిల్లాలో చోటు చేసుకుంది. బుధవారం చించోళి పోలింగ్ కేంద్రంలో బీజేపీ ఏజెంట్‌గా విధులు నిర్వహించిన రాము రాథోడ్(45) గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. చించోళి తాలూకా సలగర బసంతపుర తాండాలోని పొలంలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు తెలిపారు. అయితే కుటుంబ సభ్యులే అతనిని హత్య చేసి చెట్టుకు ఉరేసినట్లు అనుమానిస్తున్నట్లు చించోళి పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు కలబురగి ఎస్పీ ఇషా పంత్ తెలిపారు.

## కోలారు వార్తలు...

## అభ్యర్థుల భవితవ్యం.. ఈవీఎంల్లో నిక్షిప్తం

- డిగ్రీ కళాశాల చుట్టూ గట్టి భద్రత
- రాత్రి 8 వరకు కొనసాగిన పోలింగ్

కోలారు: జిల్లాలోని 72 మంది అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంల్లో నిక్షిప్తమైంది. ఈవీఎంలను నగరంలోని డిగ్రీ కళాశాలలోని స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచారు. ఈవీఎంలను భద్రపరిచిన డిగ్రీ కళాశాల ముందు నిరంతర కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ముగియడంతో అభ్యర్థులు ఇక రిలాక్స్ మూడ్‌లోకి వెళ్లారు. తమకు ఏయే బూత్‌ల్లో ఏ విధంగా ఓట్లు పడ్డాయో అంచనా వేసుకుంటున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు 13వ తేదీ కౌంటింగ్ రోజున ఫలితాలు తమకు అనుకూలంగా ఉంటాయనే విశ్వాసంతో ఉన్నారు. పలువురు అభ్యర్థులు పోలింగ్ ముగియంతో విజయం తమకే దక్కాలని గుళ్లు, గోపురాలకు తిరుగుతున్నారు. తమ పార్టీనే అధికారంలోకి వస్తుందని, తాము గెలిస్తే ఈసారి మంత్రి పదవి ఖాయమని పలువురు అభ్యర్థులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. అన్ని నియోజకవర్గాల్లోను అభ్యర్థుల గెలుపు ఓటములపై పలు విధాలుగా చర్చలు జరుగుతున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల కంటే ఈసారి పోలింగ్ శాతం అధికం కావడంతో పెరిగిన పోలింగ్ శాతం తమకే అనుకూలంగా ఉంటుందని కాంగ్రెస్, జేడీఎస్, బీజేపీలు ఆత్మవిశ్వాసంతో ఉన్నాయి. జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో మూడు నియోజకవర్గాలు ఎస్సీ రిజర్వుడ్ కాగా మిగిలిన మూడు నియోజకవర్గాలు జనరల్ కేటగిరిలో ఉన్నాయి.



స్ట్రాంగ్ రూం వద్ద గట్టి పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేసిన దృశ్యం

**మంత్రిగిరిపై ఆశలు**

జిల్లాలో పలువురు అభ్యర్థులు మూడు నుంచి నాలుగు సార్లు ఎమ్మెల్యేలుగా గెలిచినందున తమ పార్టీ అధికారంలోకి వస్తే ఈసారి తాము తప్పకుండా మంత్రులం అవుతామనే విశ్వాసంతో ఉన్నారు. శ్రీనివాసపుర నియోజకవర్గం నుంచి నాలుగు సార్లు గెలిచి ఐదోసారి గెలుపు కోసం ఎదురు చూస్తున్న జేడీఎస్ అభ్యర్థి జీకే వెంకటశివారెడ్డి ఈసారి రాష్ట్రంలో జేడీఎస్ అధికారంలోకి వస్తుందని, కుమారస్వామి సీఎం అయి తనకు మంత్రి పదవి కట్టబెడతారనే ఆశలో ఉన్నారు. అలా కాదు కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, తాను మళ్లీ గెలిచి సిద్దరామయ్య సీఎం అయి తనను మళ్లీ మంత్రిని చేస్తారని కాంగ్రెస్ అభ్యర్థి కెఆర్ రమేష్‌కుమార్ ఆశాభావంతో ఉన్నారు. అదే విధంగా బంగారుపేటె నుంచి రెండు సార్లు కాంగ్రెస్ అభ్యర్థిగా గెలిచి మూడో సారి కూడా తాను గెలుస్తునానని, కాంగ్రెస్ ప్రభుత్వంలో తాను మంత్రిని అవుతాననే విశ్వాసంతో ఉన్నారు. కేజీఎఫ్ నుంచి రెండో గెలుపు కోసం ఎదురు చూస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి రూపా శశిధర్ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తనకు మహిళా ఎస్సీ కోటా కింద మంత్రి పదవి వస్తుందనే ఆశాభావంతో ఉన్నారు.

**బోణీ కోసం బీజేపీ ఆరాటం**

కోలారు నియోజకవర్గం నుంచి ఇంతవరకు బీజేపీ అభ్యర్థి ఎంపిక కాలేదు. అయితే ఈ సారి ఇండిపెండెంట్ అభ్యర్థిగా రెండు సార్లు గెలిచిన వర్తూరు ప్రకాష్‌ను బీజేపీలోకి తీసుకుని పార్టీ టికెట్ ఇచ్చింది. వర్తూరు ప్రకాష్ బీజేపీ అభ్యర్థిగా కోలారు నుంచి ఎన్నిక అవుతానని ధీమా వ్యక్తం చే స్తున్నారు.

**బంగారుపేటె బీజేపీ అభ్యర్థి అస్త్రసన్యాసం :**

బంగారుపేట బీజేపీ అభ్యర్థి ఎం నారాయణస్వామి పోలింగ్ ముందు రోజు నుంచి కార్యకర్తలకు అందుబాటులో లేకుండా అజ్ఞాతంలోకి వెళ్లిపోవడంతో బీజేపీ కార్యకర్తలు గందరగోళంలో పడిపోయారు. అంతేకాకుండా నారాయణస్వామి అజ్ఞాతంలోనే ఉండి ఒక వీడియో రిలీజ్ చేశారు. తనకు ఆఖరు సమయంలో డబ్బులు అందలేదని, ఆర్థిక సహాయం చేస్తానని హామీ ఇచ్చిన వారు చేతులెత్తేయడం వల్ల అసహాయకంగా ఉండాల్సి వచ్చిందని తెలిపారు. కార్యకర్తలు తన విజయం కోసం కృషి చేయాలని మనవి చేయడం కార్యకర్తలకు, స్థానిక బీజేపీ నాయకులకు తీవ్ర ఆగ్రహం కలుగ జేసింది. ప్రతిపక్ష పార్టీలతో బీజేపీ అభ్యర్థి కుమ్మక్కయ్యారనే ఆరోపణలు కూడా వినిపించాయి. పోలింగ్ రోజున చాలా పోలింగ్ కేంద్రాల్లో బీజేపీకి ఏజెంట్లు కూడా లేక పోవడం పార్టీ దయనీయ స్థితిని తెలియజేస్తుంది. అభ్యర్థి వైఖరితో విసిగిన బీజేపీ కార్యకర్తలు గత లోక్‌సభ ఎన్నికలలో కూడా ఎం నారాయణస్వామి ఇదే విధంగా పోలింగ్‌కు ముందు రోజున చేతులెత్తేశారని, ఆయనకు టికెట్ ఇవ్వడమే తప్పని అంటున్నారు.

### యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

కోలారు: తాలూకాలోని భట్రహళ్లి గ్రామం వద్ద ఉన్న జ్యోతి టెక్నికల్ ట్రైనింగ్ సంస్థలో గురువారం బెంగళూరు నార్త్ వర్సిటీ పీజీ సెంటర్ ద్వితీయ సంవత్సరపు ఆర్ట్స్ విద్యార్థులకు క్షయరోగం, మాదక వస్తువులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రిసోర్స్ పర్సన్, యువజన అభివృద్ధి సంస్థ యోజన వ్యవస్థాపకురాలు జ్ఞాన సెల్వికుమారి మాట్లాడుతూ యువత మాదక వస్తువులకు దూరంగా ఉండాలన్నారు. క్షయరోగ నియంత్రణ విభాగం సీనియర్ చికిత్సా విభాగం సీనియర్ సూపర్ వైజర్ బీఎం మధుకేశ్ చరిత్ర, లక్షణాలు, చికిత్సా విధానాలు, క్షయరోగానికి ప్రభుత్వం నుంచి లభించే ఉచిత సేవల గురించి వివరించారు. కార్యక్రమంలో క్షయరోగ నియంత్రణ యూనిట్ సంయోజకుడు అంబరీష్, ప్రిన్సిపాల్ మంజునాథ్‌గౌడ, రజని, రుచితశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## కాదేదీ బెట్టింగ్‌కు అనర్హం

- కోళ్లు, మేకలు, గొర్రెలు, పశువులు కూడా
- జయాపజయాలపై జోరుగా పందేలు

కోలారు: కుక్కపిల్ల, సబ్బుబిళ్ల కాదేదీ కవితకు అనర్హం అని మహాకవి శ్రీశ్రీ అన్నట్లుగా జిల్లాలో పోలింగ్ అనంతరం అభ్యర్థుల జయాపజయాలపై జోరుగా బెట్టింగ్ జరుగుతోంది. జిల్లాలోని 6 నియోజకవర్గాల్లోను అభ్యర్థుల గెలుపోటములపై పలువురు బెట్టింగ్ కడుతున్నారు. కోళ్లు, గొర్రెలు, మేకలు, ఆవులు, ట్రాక్టర్లు, ద్విచక్ర, ఐషర్ వాహనాలు, సైట్లు, మొబైల్ ఫోన్లు, నగదు ఇలా పలు విధాలుగా బెట్టింగ్ సాగుతోంది. ఈ బెట్టింగ్ జిల్లాలో కోట్ల రూపాయలకు చేరుకున్నట్లు ఒక అంచనా. కౌంటింగ్ అనంతరం కోట్ల రూపాయలు చేతులు మారే అవకాశం కనిపిస్తోంది. ప్రముఖంగా కోలారు, మాలూరు, శ్రీనివాసపుర నియోజకవర్గాల్లో అభ్యర్థుల గెలుపు ఓటములపై బెట్టింగ్ అధికంగా నడుస్తోంది. శ్రీనివాసపురలో సాంప్రదాయ బద్ధవ్యతిరేకులైన కెఆర్ రమేష్‌కుమార్, జీకే వెంకట శివారెడ్డిలపై బెట్టింగ్ జోరుగా సాగుతున్నట్లు సమాచారం. మామిడి పంటలను కూడా ఏకంగా బెట్టింగ్‌లో పెడుతున్నట్లు తెలుస్తోంది. కోలారులో బీజేపీ అభ్యర్థి వర్తూరు ప్రకాష్, జేడీఎస్ అభ్యర్థి సీఎంఆర్ శ్రీనాథ్, కాంగ్రెస్ అభ్యర్థి కొత్తూరు మంజునాథ్‌లపై బెట్టింగ్ కడుతున్నారు. అదేవిధంగా మాలూరులో కాంగ్రెస్ అభ్యర్థి కెవై నంజేగౌడ, బీజేపీ అభ్యర్థి కెఎస్ మంజునాథ్‌గౌడ, స్వతంత్ర అభ్యర్థి హూడి విజయకుమార్‌ల జయాపజయాలపై బెట్టింగ్ సాగుతోంది. గుట్టుచప్పుడు కాకుండా జరుగుతున్న ఈ బెట్టింగ్‌లో దాదాపుగా కోట్ల రూపాయలు చేతులు మారే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

## క్లుప్తంగా

### రోగుల నమ్మకాన్ని వమ్ము చేయొద్దు


స్నాతకోత్సవాన్ని ప్రారంభిస్తున్న ప్రముఖులు

తుమకూరు: వైద్యులను ప్రజలు దేవుళ్లలా చూస్తారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఉత్తమ వైద్యం అందించాలని బెంగళూరులోని రామయ్య అప్లైడ్ సైన్సెస్ వి.వి. చాన్సలర్, గోకుల విద్యాసంస్థల అధ్యక్షుడు డాక్టర్ ఎం.ఆర్. జయరాం అన్నారు. గురువారం తుమకూరు నగరంలోని శ్రీదేవి వైద్యవిద్యా మహా విద్యాలయంలో పరిశోధన ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన స్నాతకోత్సవంలో ఆయన పాల్గొని 5వ బ్యాచ్ విద్యార్థులకు వైద్య పట్టాలు అందజేసి మాట్లాడారు. రోగి వైద్యం పొంది సంతోషంగా ఇంటికెళ్లినప్పుడే వైద్యుడు దేవుడిలా కనిపిస్తాడన్నారు.

### ప్రజలు మార్పు కోరుకున్నారు



మాట్లాడుతున్న పరమేశ్వర్

తుమకూరు: విధానసభ ఎన్నికల పోలింగ్ సరళిని బట్టి 130కిపైగా స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని డిప్యూటీ మాజీ సీఎం జీ పరమేశ్వర్ అన్నారు. గురువారం తుమకూరులో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో నూటికి నూరుపాళ్లు కాంగ్రెస్ అధికారం చేపడుతుందన్నారు. ప్రజలు బీజేపీపై వ్యతిరేకత వ్యక్తం చేశారని, ప్రజలు మార్పు కోరుకున్న విషయం సర్వేల్లో వెల్లడైందన్నారు. జిల్లాలోని 11 నియోజకవర్గాల్లో ఏడింటిలో విజయం సాధిస్తామన్నారు. సీఎం ఎవరనేది అధిష్టానం నిర్ణయిస్తుందన్నారు.

### సిద్ధూవి ద్వేష రాజకీయాలు

మైసూరు: తన రాజకీయ జీవితంలో ఏనాడూ ఇతరుల మద్దతుతో ఎన్నికల్లో పోటీ చేయలేదని, మాజీ సీఎం సిద్ధరామయ్య చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని జేడీఎస్ చాముండేశ్వరి నియోజకవర్గ అభ్యర్థి, ఎమ్మెల్యే, జీ.టీ. దేవెగౌడ అన్నారు. గురువారం మైసూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నా పైన ఎవరిని పోటీ చేయించాలన్న విషయంపై కూడా సిద్ధుకు అవగాహన లేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి మామినహళ్లి సిద్దేగౌడ నన్ను ఎందుకు బుక్ చేస్తాడని ప్రశ్నించారు. సిద్ధూలా ద్వేషరాజకీయాలు చేయడం తనకు తెలియదన్నారు. తనకు చాముండేశ్వరి ఆశీర్వాదం ఉందని, తప్పకుండా విజయం సాధిస్తానన్నారు.

### తుమకూరులో గీతా శివరాజ్‌కుమార్ సందడి


ఏనుగు లక్ష్మీకి అరటి పండు తినిపిస్తున్న గీతాశివరాజ్‌కుమార్


తుమకూరు: నటుడు శివరాజ్‌కుమార్ భార్య గీతా శివరాజ్‌కుమార్ గురువారం తుమకూరు విచ్చేశారు. హొరపేటెలో ఉన్న డాక్టర్ రాజ్‌కుమార్ అభిమాని హరశూరు శివకుమార్‌కు చెందిన హోటల్‌కు వెళ్లి టిఫిన్ ఆరగించారు. అనంతరం కరిబసవేశ్వర స్వామి మఠానికి చెందిన ఏనుగు లక్ష్మీ..హోటల్ వద్దకు రాగా గీతా శివరాజ్‌కుమార్ అరటిపండు తినిపించి ఆశీర్వాదం తీసుకుంది.

### బెలూన్ కోసం వెళ్లి బావిలో పడి చిన్నారి మృతి


చిన్నారి సియాన్(ఫైల్)

యశవంతపుర: ప్రమాదవశాత్తు చిన్నారి బావిలో పడి మృతి చెందింది. కొడగు జిల్లా పొన్నంపేటె తాలూకా కోటూరు గ్రామంలో నివాసం ఉంటున్న రోషన్ కూతురు సియాన్(3) బెలూన్‌తో ఆడుకుంటుండగా అది గాలిలో ఎగురుకుంటూ వెళ్లి బావిలో పడింది. దాన్ని తీసుకునేందుకు బావిగట్టుపైకి ఎక్కిన చిన్నారి నీటిలో పడిపోయింది. ఈ విషయాన్ని తల్లిదండ్రులు గమనించలేదు. అనంతరం బావిలో గాలించగా చిన్నారి విగతజీవిగా కనిపించింది.

### యువకుడి ఆత్మహత్య


యతిరాజ్ గట్టి (ఫైల్)

యశవంతపుర: ఓకేసులో నిందితుడిగా ఉన్న ఉళ్లాల కుత్తారు ముండోళికి చెందిన యతిరాజ్‌గట్టి(20) అనే యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు.. 2021 మార్చి 10న కుంపల ఆశ్రయ కాలనీ నివాసి యాంకర్ ప్రేక్షా ఆత్మహత్య చేసుకొంది. తన కుమార్తె మృతికి యతిరాజ్‌గట్టి కారణమని తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు అతన్ని అరెస్ట్ చేశారు. బెయిల్‌పై విడుదలైన యతిరాజ్‌గట్టి బుధవారం రాత్రి చిన్నమ్మ ఇంటికి వెళ్లి రేకుల షెడ్‌లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

# జాతీయ రహదారులు రక్తసిక్తం

- వేర్వేరు ప్రమాదాల్లో ఏడుగురి మృతి


మృతులు రామయ్య, నాగరాజ్ (ఫైల్)


ధ్వంసమైన స్కూటర్


దెబ్బతిన్న కారు ముందు భాగం

బనశంకరి: జాతీయ రహదారులు రక్తసిక్తమయ్యాయి. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాలు ఏడుగురి ప్రాణాలు బలిగొన్నాయి. స్కూటర్‌ను కారు ఢీకొని ఇద్దరు మృతి చెందగా మరొకరు గాయపడ్డారు. ఈఘటన యలహంక తాలూకా చల్లహళ్లిగ్రామంలో చోటుచేసుకుంది. అయితే ఉద్దేశపూర్వకంగా కారుతో ఢీకొట్టినట్లు మృతుల బంధువులు ఆరోపిస్తున్నారు. చల్లహళ్లి గ్రామానికి చెందిన రామయ్య(39),నాగరాజ్(42), గోపాల్‌లు గురువారం ఉదయం 6.30 గంటల సమయంలో ఒకే స్కూటర్‌పై రాజానుకుంటే వద్ద ఉన్న కేఎంఎఫ్ దాణా తయారీ కేంద్రానికి బయల్దేరారు. కాకోళు గ్రామ సమీపంలో వాయువేగంతో వచ్చిన కారు స్కూటర్‌ను ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు స్కూటర్ రోడ్డుకు వందమీటర్ల దూరంలో పడింది. రామయ్య, నాగరాజులు మృతి చెందగా గోపాల్ గాయపడ్డాడు. పోలీసులు వచ్చి క్షతగాత్రుడిని విక్టోరియా ఆస్పత్రికి తరలించారు.

**పాతకక్షలతోనే ఢీకొట్టారు**

రామయ్య, దళిత నాగరాజ్ మృతికి యలహంక తాలూకా హనియూరు గ్రామానికి చెందిన భరత్ కారణమని మృతుల బంధువులు ఆరోపిస్తున్నారు. 15 రోజుల క్రితం నాగరాజు హెసరఘట్టలో ఓ రాజకీయ పార్టీ నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నాడు. ఓ హోటల్‌లోకి వెళ్లి నీరుతాగాడు. అయితే నీవు ముట్టిన గ్లాస్‌తో మేము నీరు తాగాలా అంటూ అక్కడే ఉన్న భరత్ మరికొందరు నాగరాజుతో వాగ్వాదానికి దిగి కులం పేరుతో దూషించారని, నిన్ను ఓ గతి పట్టిస్తానని హెచ్చరించారని, ఈక్రమంలో మద్యం మత్తులో ఉంటూ స్కూటర్‌ను ఢీకొన్నారని మృతుడి బంధువు వెంకటేశ్ ఆరోపించారు. కాగా భరత్ అతడి స్నేహితులను రాజానుకుంటె పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపడుతున్నారు.

**పెళ్లికి వెళ్తుండగా మృత్యు పంజా**

యశవంతపుర: పెళ్లికి వెళ్తుండగా మృత్యువు పంజా విసిరి ఒక వ్యక్తితోపాటు చిన్నారిని బలిగొంది. ఈ ఘటన చిక్కమగళూరు జిల్లా కడూరు తాలూకా మతిగట్ట క్రాస్ వద్ద గురువారం ఉదయం జరిగింది. గిరిధర్(46) మయాంక్(3)తో కలిసి హొన్నావర నుంచి బంధువుల పెళ్లికి కారులో వెళ్తుండగా బెంగళూరు-శివమొగ్గ జాతీయ రహదారి 206లో కేరళ నుంచి చిక్కమగళూరు వెళ్తున్న టీటీ వాహనం ఢీకొని బోల్తా పడింది. ప్రమాదంలో గిరిధర్, మయాంక్ అక్కడికక్కడే మృతి చెందారు. టీటీ వాహనంలోని ఏడు మంది పర్యాటకులు గాయపడ్డారు. కడూరు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను శివమొగ్గ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

**బైక్‌ను ఢీకొన్న టిప్పర్..మహిళ మృతి**

దొడ్డబళ్లాపురం: టిప్పర్ బైక్‌ను ఢీకొని మహిళ మృతిచెందిన ఘటన ఆనేకల్ తాలూకా ఇండ్లవాడి వద్ద చోటుచేసుకుంది. జిగణి నుంచి ఆనేకల్ వైపు వస్తున్న టిప్పర్ ఇండ్లవాడి గ్రామం నుంచి ఆనేకల్ పట్టణం వైపు వస్తున్న బైక్‌ను సర్కిల్‌లో వేగంగా ఢీకొంది. బైక్‌పై వస్తున్న ముగ్గురిలో మహిళ మృతిచెందగా ఒక వ్యక్తి, మరో మహిళ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులు మాట్లాడలేని పరిస్థితులు ఉండటంతో వారి వివరాలు తెలియరాలేదు. ప్రమాదం జరిగిన వెంటనే టిప్పర్ డ్రైవర్ భయంతో పరారయ్యాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.


బోల్తా పడిన ఆటో

**ఆటో పల్టీ కొట్టి మహిళ...**


మృతురాలు రామాంజినమ్మ (ఫైల్)

గౌరిబిదనూరు: తాలూకాలోని మేళ్య చెరువు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో హుణసేనహళ్లికి చెందిన నరసింహాచారి భార్య రామాంజినమ్మ(50) మృతి చెందింది. జగరెడ్డిహళ్లి నుంచి ఆటోలో ఇనుప స్క్రాబ్ (వేస్ట్) తీసుకొని ఆటోలో వస్తుండగా చెరువు వద్ద వాహనం పల్టీ కొట్టి ఈ ప్రమాదం జరిగింది. 7 నెలల క్రితం చెరువు మరువ పారడంతో వంతెన శిథిలావస్థకు చేరి రాకపోకలకు కష్టంగా ఉందని అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని, దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోయారు.

**కారు ఢీకొని పాదచారి...**

మండ్య: మండ్య జిల్లా మలవళ్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మారెహళ్లి లేఔట్‌లోని చిన్నయ్య కుమారుడు కుళ్లప్ప(52) మృతి చెందాడు. ఈయన గురువారం వేకువజామున కాలి నడకన వెళ్తుండగా కారు ఢీకొని ఈ ప్రమాదం జరిగింది. గ్రామీణ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

## 130 సీట్లు గ్యారంటీ

- మాజీ సీఎం సిద్ధరామయ్య

మైసూరు: కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళికను ప్రజలు ఆమోదించినట్లు పోలింగ్ సరళిని బట్టి తెలుస్తోందని, 130 నుంచి 150 స్థానాల్లో విజయం సాధిస్తామని మాజీ సీఎం సిద్ధరామయ్య తెలిపారు. మైసూరులో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. కరావళిలో మెజార్టీ స్థానాలు హస్తగతం అవుతాయన్నారు. ప్రజల నాడి తమకు అర్థమైందని, తమ పార్టీ ప్రణాళికను ప్రజలు అర్థం చేసుకున్నారన్నారు. బీజేపీ తప్పుడు ప్రచారాన్ని ఎవరూ నమ్మలేదన్నారు. తాము అనుకున్నది జరిగి తీరుతుందన్నారు. వరుణలో తన విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరన్నారు.

### ప్రత్యేక పోలింగ్ కేంద్రాలకు పోటెత్తిన ఓటర్లు

మైసురు: ఆదివాసీల కోసం హెచ్.డి.కోటె తాలూకాలో జిల్లా స్వీప్ సమితి ఆధ్వర్యంలో 11 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి అందంగా ముస్తాబు చేసి ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా చర్యలు తీసుకున్నారు. బసవనగిరి, ఎ హడి, భీమనహళ్లి, పెంజహళ్లి కాలనీల్లో గిరిజన ఆశ్రయ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో ఆదివాసి ప్రజలు వచ్చి క్యూలో నిలబడి ఓటు వేశారు. భీమనహళ్లి గ్రామ పంచాయతీ పరిధిలో బుడకట్టు గిరిజన ఆశ్రమ పాఠశాలలోని పోలింగ్ కేంద్రంలో ఓటు వేసిన మాస్తిగుడి హాడి ఆదివాసి మహిళ కాళమ్మ మాట్లాడుతూ తనతోపాటు కుటుంబ సభ్యులందరూ వచ్చి ఓటు వేసినట్లు తెలిపారు.

### ఈవీఎంలకు పటిష్ట భద్రత


స్ట్రాంగ్‌రూమ్ వద్ద కలెక్టర్, అదనపు కలెక్టర్

మండ్య: ఓటర్ల తీర్పు నిక్షిప్తమైన ఈవీఎంలను సాయుధబలగాల పహారా ఉన్న స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు. బుధవారం పోలింగ్ ముగిసిన వెంటనే జిల్లాలోని మండ్య, మద్దూరు, మలవళ్లి, మేలుకోటె, కెఆర్ పేటె, శ్రీరంగపట్టణం, నాగమంగల నియోజకవర్గాలకు చెందిన ఈవీఎంలను జిల్లా కేంద్రంలోని వీవీ ఆవరణలోని స్ట్రాంగ్‌రూమ్‌కు తరలించి భద్రపరిచారు. స్ట్రాంగ్‌రూమ్‌ను కలెక్టర్ గోపాలకృష్ణ, అదనపు జిల్లా అధికారి నాగరాజు గురువారం పరిశీలించారు. 40 మంది పోలీసులు 24గంటలూ కాపలా ఉంచినట్లు తెలిపారు.

# రిలాక్స్ మూడ్‌లో నేతలు


హోటల్‌లో టీ తాగుతున్న యోగేశ్వర్, తల్లిని కలిసి ఆశీర్వాదం తీసుకుంటున్న డీకే శివకుమార్

దొడ్డబళ్లాపురం: విధానసభ ఎన్నికల పోలింగ్ ముగియడంతో నెల రోజులుగా బిజీబిజీగా గడిపిన రాజకీయ నాయకులు రిలాక్స్ మూడ్‌లోకి వెళ్లారు. ఓటరు దీవెనల కోసం ఇన్నాళ్లు ప్రచారాన్ని హోరెత్తించిన అభ్యర్థులు పుణ్యక్షేత్రాలను, దేవాలయాలను దర్శించుకుంటున్నారు. మరి కొందరు కుటుంబ సభ్యులతో కాలం గడుపుతున్నారు. డీకే శివకుమార్ గురువారం ఉదయం స్థానిక నాయకులతో కలిసి కేఎన్ఎస్ సర్కిల్‌లోని హోటల్‌కు వెళ్లి ఇడ్లీ తిన్నారు. అనంతరం గ్రామానికి వెళ్లి తల్లి గౌరమ్మ ఆశీర్వాదం పొందారు. కాగా డీకే శివకుమార్‌కు జ్వరం రావడంతో తమ్ముడు డీకే సురేశ్‌తో కలిసి బెంగళూరు వెళ్లిపోయారు. మాజీ సీఎం కుమారస్వామి కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం రాత్రే సింగపూర్ వెళ్లారు. తిరిగి కౌంటింగ్ రోజు 13న మధ్యాహ్నం తిరిగి రానున్నారు. ఎమ్మెల్సీ యోగేశ్వర్ స్నేహితులతో కలిసి గురువారం స్థానిక టీకొట్టులో టీ తాగి రిలాక్స్ అయ్యారు.

శివాజీనగర: ముఖ్యమంత్రి బసవరాజ బొమ్మై తన సతీమణితో కలిసి గురువారం తమ ఇంటి దేవత సవదత్తి యల్లమ్మను దర్శించుకొని పూజలు చేశారు. మాజీ ముఖ్యమంత్రి జగదీశ్ శెట్టర్, మాజీ ఉప ముఖ్యమంత్రి లక్ష్మణ సవది, మాజీ ఉప ముఖ్యమంత్రి డాక్టర్ జీ.పరమేశ్వర్ గ్రామంలోనే ఉంటూ విలేకరుల సమావేశాలు నిర్వహించి గెలుపు తమదేనని తెలిపారు. కేపీసీసీ ప్రచార కమిటీ అధ్యక్షుడు ఎం.బి.పాటిల్ ఇంట్లోనే విశ్రాంతి పొందుతున్నారు.

### 14న అద్వైత యోగంపై ఉచిత వర్క్‌షాప్

బనశంకరి: అద్వైతయోగంపై బెంగళూరుకు చెందిన మహావతార్ ఫౌండేషన్ నేతృత్వంలో ఈనెల 14న ప్యాలెస్‌రోడ్డు, కొండజ్జిబసప్ప ఆడిటోరియంలో ఉచిత వర్క్‌షాప్ నిర్వహిస్తామని ట్రస్టీ రంగస్వామి తెలిపారు. ప్రముఖ ఆధ్యాత్మిక గురువు భిక్షమయ్య గురూజీ హాజరై ధ్యానం, వైద్యం, ఔషధం, బ్రహ్మోపదేశంపై అవగాహన కల్పిస్తారన్నారు. అదేవిధంగా యూనివర్సల్ యోగాథెరపీ ద్వారా వైద్యంచే ఔషధాలు అందిస్తారని, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. వివరాలకు 9008532066 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

### విశ్రాంత చీఫ్ ఇంజినీర్ మృతి

మైసూరు: మైసూరు నగరంలో నివాసం ఉంటున్న విశ్రాంత చీఫ్ ఇంజినీర్ హెచ్ఎల్ ప్రసన్న గురువారం మృతి చెందారు. మండ్య సహాయక ఇంజినీర్‌గా ఉద్యోగంలో చేరిన ఈయన మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార సూపరింటెండెంట్‌గా, నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజినీర్‌గా, చిన్న నీటిపారుదల శాఖ రాష్ట్ర కార్యదర్శిగా విధులు నిర్వహించారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె, సోదరుడు ఉన్నారు. ఆయన అంత్యక్రియలు శుక్రవారం జయపుర సమీపంలో ఉన్న హారోహళ్లిలోని తోటలో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

### లోకాయుక్తకు చిక్కిన జేఈ

బనశంకరి: లంచం తీసుకుంటూ గదగ్-బేటగేరి నగరసభ జూనియర్ ఇంజినీర్ వీరేంద్రసింగ్ కాటేవాలే లోకాయుక్తకు పట్టుబడ్డాడు. గురువారం ఒక కాంట్రాక్టర్ నుంచి రూ.1.50 లక్షల నగదు తీసుకుంటుండగా లోకాయుక్త అధికారులు దాడి చేసి వీరేంద్రసింగ్ కాటేవాలెను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని అరెస్ట్ చేశారు.

### బాలికపై ప్రేమోన్మాది దాడి

యశవంతపుర: బాలికపై ప్రేమోన్మాది కత్తితో దాడి చేసిన ఘటన తుమకూరు జిల్లా చిక్కనాయకనహళ్లి తాలూకా భట్టరహళ్లిలో జరిగింది. గ్రామానికి చెందిన 25 ఏళ్ల యువకుడు మైనర్ బాలిక వెంటపడి ప్రేమించాలని వేధించేవాడు. బాలిక నిరాకరించడంతో యువకుడు కత్తి తీసుకొని మెడపై కోశాడు. గాయాలైన బాలికను తల్లిదండ్రులు హాసన్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. హుళియారు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. యువకుడు పరారీలో ఉన్నాడు.

### అత్యుత్తమ హైస్ట్రీట్ జాబితాలో బెంగళూరు ఎంజీ రోడ్డు

శివాజీనగర: వాతావరణం, జీవనశైలితోపాటు వివిధ అంశాల్లో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన బెంగళూరు నగరానికి మరో ఖ్యాతి దక్కింది. వినియోగదారులు షాపింగ్ చేసేందుకు వివిధ అంశాలను పరిగణలోకి తీసుకొని రూపొందించిన జాబితాలోఎంజీ రోడ్డు దేశంలోనే తొలి స్థానంలో నిలిచింది. రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ నైట్ ఫ్రాంక్ ఇండియా సంస్థ థింక్ రిటేల్ 2023-హై స్ట్రీట్ రియల్ ఎస్టేట్ ఔట్‌లుక్ అనే శీర్షికతో ఈ జాబితా విడుదల చేసింది. రెండో స్థానంలో హైదరాబాద్ సోమాజిగూడ, మూడో స్థానంలో ముంబై లింకింగ్ రోడ్డు నిలిచింది.

### మద్యం విక్రయాలు బంద్

బనశంకరి: శాసనసభ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం సాయంత్రం 6 గంటల నుంచి శనివారం అర్ధరాత్రి వరకు మద్యం విక్రయాలు నిషేధించారు. మంగళ, బుధవారం ఎన్నికల పోలింగ్ సందర్భంగా మద్యం దుకాణాలు మూసివేయడంతో రాష్ట్ర ఆదాయానికి రూ.150 కోట్ల నష్టం వాటిల్లింది.

### ఆస్పత్రిలో చేరిన సీటీ రవి

యశవంతపుర బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్యే సీటీ రవి అనారోగ్యంతో బుధవారం అర్ధరాత్రి ఆస్పత్రిలో చేరారు. ఒక్కసారిగా ఆరోగ్యంలో తేడా కనిపించటంతో చిక్కమగళూరులోని ఆస్పత్రిలో చేరారు. కిడ్నీలో రాయి ఉన్న కారణంగా 15 రోజుల క్రితం ఆస్పత్రిలో చేరి చికిత్స పొందారు. కిడ్నీకి వేసిన స్టంట్ కొద్దిగా జరగటంతో చికిత్స కోసం ఆస్పత్రిలో చేరినట్లు తెలిసింది.

### చిక్కలో ఓటర్ల చైతన్యం

చిక్కబళ్లాపురం: విధానసభ ఎన్నికల్లో చిక్కబళ్లాపురం నియోజకవర్గం ఓటర్లు ఓటింగ్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఫలితంగా 86.90శాతం పోలింగ్‌నమోదైంది. 2,09,791 మంది ఓటర్లు ఉండగా 1,82,302 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఓట్లు వేసిన వారిలో పురుష ఓటర్లు 90746 మంది, మహిళా ఓటర్లు 91556 మంది ఉన్నారు.

### ఎన్నికలు రద్దు చేయాలని వాటాళ్ ధర్నా

మైసూరు: విధానసభ ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని, ఈ ఎన్నికలు రద్దు చేసి మరోసారి నిర్వహించాలని డిమాండ్ చేస్తూ కన్నడ చళవళి వాటాల్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే వాటల్ నాగరాజు గురువారం ఆయన మైసూరులో ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో అభ్యర్థులు భారీగా డబ్బు వెదజల్లి ఓటర్లను ప్రలోభాలకు గురి చేశారని ఆరోపించారు. ఒక్కో ఓటరుకు రూ.వెయ్యి నుంచి రూ.10వేల వరకు పంపిణీ చేశారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 40వేల కోట్ల మేర నగదు పంపిణీ జరిగిందని, ఈ ఎన్నికను రద్దు చేసి మరోమారు పారదర్శకంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.

### కేంద్ర సర్కారుకు వ్యతిరేకంగా ర్యాలీ

హోసూరు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపిస్తూ గురువారం సీపీఐ పార్టీ రాష్ట్ర వ్యాప్త పాదయాత్రకు పిలుపునిచ్చింది. అందులో భాగంగా హోసూరు రామ్‌నగర్ అన్నావిగ్రహం వద్ద ర్యాలీ నిర్వహించారు. తళి ఎమ్మెల్యే టి. రామచంద్రన్, రాష్ట్ర కమిటీ సభ్యుడు మాదయ్యన్ మాట్లాడుతూ బీజేపీ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. గతంలో రూ.400 ఉన్న వంటగ్యాస్ సిలిండర్ ధర రూ. 1200 కు చేరుకొందని, పెట్రోల్, డీజిల్ ధరలు భారీగా పెరిగాయని దుయ్యబట్టారు. నేతలు లగుమయ్య, శంకరయ్య, ఆదిల్, భాస్కరరెడ్డి, చిన్నస్వామి పాల్గొన్నారు.


ర్యాలీలో పాల్గొన్న నాయకులు

# విద్యాదాత పుట్టమ్మ కన్నుమూత


పుట్టమ్మ(ఫైల్)

యశవంతపుర: హావేరి, దావణగెరె, రాణీబెన్నూరులో విద్యాభివృద్ధికి పాటుపడి కర్ణాటక సావిత్రి బాయి పూలేగా పేరుగాంచిన అక్షర దాసోహి పుట్టమ్మ అవ్వ(94) అనారోగ్యంతో గురువారం ఉదయం దావణగెరెలో కన్నుమూశారు. రాణేబెన్నూరు తాలూకా కుమారపట్టణానికి చెందిన పుట్టమ్మ..తన గ్రామంలోనే సొంతంగా పాఠశాలల ఏర్పాటు చేసి విద్యాభివృద్ధికి బాటలు వేశారు. ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయురాలిగా పని చేసి 1988లో ఉద్యోగ విరమణ చేశారు. అనంతరం పింఛన్ డబ్బులతో పాఠశాలను నడిపారు. పేద పిల్లలను గుర్తించి విద్యను బోధించటంతో పాటు ఉచితంగా హాస్టల్ సదుపాయం కల్పించి అక్షర దాసోహిగా పుట్టమ్మ పేరుగాంచారు. ఆమెకు ఏడు మంది సంతానం. వీరిలో ఆరు మందిని ఉపాధ్యాయులుగా తీరిదిద్దారు.

## హోసూరు వార్తలు..

### చెరువుకు కొత్తరూపు

హోసూరు: హోసూరు కార్పొరేషన్ అభివృద్ధికి చేయూతనందజేస్తున్న నెరోల్యాక్ సంస్థ సేవలు హర్షదాయకమని మేయర్ ఎస్.ఏ.సత్య కొనియాడారు. హోసూరు కార్పొరేషన్ పరిధిలో చెరువులను శుద్ధీకరణ కోసం స్థానిక నెరోల్యాక్ సంస్థ రూ. 24 లక్షల ఆర్థిక సాయాన్ని అందజేసింది. ఈ నిధులతో హోసూరు పీపుల్స్ అసోషియేషన్ గత మూడు నెలల క్రితం అలసనత్తం చెరువు శుద్ధి, నూతన హంగుల పనులను ప్రారంభించింది. చెరువు చుట్టూ ముళ్లపొదలను తొలగించి, సుందరంగా తీర్చిదిద్దారు. ఈ చెరువును గురువారం సందర్శించి హర్షం వ్యక్తంచేశారు.

### తల్లికి అనారోగ్యం.. కొడుకు ఆత్మహత్య

కెలమంగలం: అనారోగ్యానికి గురైన తల్లికి పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా ఫలితం లేకపోవడంతో కొడుకు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకొన్నాడు. వివరాలు.. డెంకణీకోట సమీపంలోని బిక్కనపల్లికి చెందిన సోమశేఖర్ (24). ఇతని తల్లి గత కొద్ది నెలలుగా అనారోగ్యంతో బాధపడుతూ వచ్చింది. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా నయం కాలేదు. దీంతో సోమశేఖర్ జీవితంపై విరక్తి చెంది బుధవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకొన్నాడు. డెంకణీకోట పోలీసులు శవాన్ని ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

### ఆస్తి కోసం తండ్రి హతం!


వెంకటరామప్ప (ఫైల్)

హోసూరు: ఆస్తి పంపకాల్లో తేడాల వల్ల కన్న కొడుకే తండ్రిని హతమార్చిన వైనం హోసూరు సమీపంలో తీవ్ర సంచలనం సృష్టించింది. వివరాల మేరకు హోసూరు సమీపంలోని బుక్కసాగరం తిప్పేపల్లి గ్రామానికి చెందిన వెంకటరామప్ప (90). ఇతని భార్య పాపమ్మ దంపతులకు ముగ్గురు కొడుకులు, ముగ్గురు కూతుళ్లున్నారు. తనకున్న 16 ఎకరాల భూమిని పిల్లలకు పంచిపెట్టాలని నిర్ణయించాడు. పంపకాల్లో పెద్ద కొడుకు శివానందం (56), తండ్రికి విభేదాలేర్పడ్డాయి. బుధవారం రాత్రి శివానందం తండ్రిని బయటకు తీసుకెళ్లి తనకు ఎక్కువ ఆస్తిని రాయాలని అడగ్గా ఘర్షణ జరిగింది. ఆవేశం చెందిన కొడుకు శివానందం తండ్రి గొంతును కోసి చేసి పరారైనట్లు స్థానికులు, పోలీసులు తెలిపారు. స్థానికుల ఫిర్యాదుతో బేరికె పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని శవాన్ని స్వాధీనపరుచుకొని క్రిష్ణగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరారీలో ఉన్న శివానందంను గాలించి పట్టుకొని అరెస్ట్ చేశారు.

# బైక్ ప్రమాదంలో కూలీ మృతి

క్రిష్ణగిరి: ద్విచక్రవాహనం నుండి అదుపుతప్పి కిందపడిన భవన నిర్మాణ కార్మికుడు తీవ్ర గాయాలేర్పడి ఆస్పత్రిలో చనిపోయాడు. సింగారపేట పరిధిలో ఈ ఘటన జరిగింది. వివరాల మేరకు తిరువణ్ణామలై జిల్లాకు చెందిన భవన నిర్మాణ కార్మికుడు మహి (60). గత రెండు రోజుల క్రితం సింగారపేట- తిరుపత్తూరు రోడ్డుపై బైక్‌పై వెళ్తూ కిందపడిపోయాడు. తీవ్ర గాయాలేర్పడిన ఇతన్ని స్థానికులు చికిత్స కోసం ధర్మపురి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఫలితంలేక బుధవారం రాత్రి మృతి చెందాడు.

**మద్యం మత్తులో ఆత్మహత్య**

క్రిష్ణగిరి జిల్లా వేపనపల్లి సమీపంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన కూలికార్మికుడు రఘు (24). ఇతనికి తాగుడు అలవాటుండేది. గత నెల 27వ తేదీ మద్యం మత్తులో ఉన్న రఘు ఉరివేసుకొని ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన స్థానికులు చికిత్స కోసం క్రిష్ణగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఫలితంలేక బుధవారం రాత్రి మృతి చెందాడు. వేపనపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

# ముగ్గురికి సైబర్ మోసగాళ్ల బురిడీ

- పార్ట్ టైం ఉద్యోగాలంటూ రూ.38 లక్షలు స్వాహా



హోసూరు: పార్ట్ టైం ఉద్యోగాలతో అధిక లాభాలు ఆర్జించవచ్చునని వాట్సప్‌ల ద్వారా మెసేజ్ పెట్టి ముగ్గురి వద్ద రూ.38.30 లక్షలు కొట్టేసిన చేసిన మోసగాళ్ల కోసం క్రిష్ణగిరి సైబర్ క్రైం బ్రాంచ్ పోలీసులు గాలిస్తున్నారు.

**రూ.7.73 లక్షలు..**

- వివరాల మేరకు హోసూరు తోటగిరి ప్రాంతానికి చెందిన సురేష్ కెలమంగలం సమీపంలోని గ్రానైట్ కంపెనీలో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. గత నెల 16వ తేదీ ఇతని వాట్సప్ నంబర్‌కు వచ్చిన మెసేజ్ ద్వారా వారిని సంప్రదించాడు. పార్ట్‌టైం ఉద్యోగంతో అధిక కమీషన్ పొందవచ్చునని చెప్పడంతో తన బ్యాంకు ఖాతాల నుంచి రూ.7.73 లక్షలు జమ చేశాడు. తరువాత వారి ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో మోసపోయిన సురేష్ క్రిష్ణగిరి క్రైం బ్రాంచ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

**యువతికి రూ.5.85 లక్షలు**

- హోసూరు మూకొండపల్లి ప్రాంతానికి చెందిన గంగేశ్వరి (30) హోసూరులోని ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగిగా పనిచేస్తుంది. గత 30వ తేదీ వాట్సప్ నంబర్‌కు వచ్చిన పార్ట్ టైం ఉద్యోగాల మెసేజ్ చూసి కాల్ చేయగా, అధిక లాభాలు వస్తాయని చెప్పగా నమ్మింది. రూ. 5.85 లక్షల జమ చేసింది. తరువాత వారి ఫోన్ స్విచాఫ్ కావడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది.

**మహిళా టెక్కీకి రూ.24.72 లక్షలు**

- ఆంధ్ర రాష్ట్రం కర్నూలు జిల్లాకు చెందిన శివలీల (30) సూళగిరి మిల్లత్‌నగర్‌లో నివాసముంటూ బెంగళూరులోని ఐటీ ఇంజనీర్‌గా పనిచేస్తుంది. గత 23వ తేదీ వాట్సప్ ద్వారా వచ్చిన పార్ట్ టైం ఉద్యోగంపై స్పందించి రూ.24.72 లక్షలు జమ చేసింది. వారి నుంచి ప్రతిస్పందన లేకపోవడంతో ఫోన్ ద్వారా సంప్రదించగా స్విచ్ ఆఫ్ రావడంతో కంగుతినింది. శివలీల క్రిష్ణగిరి క్రైం బ్రాంచ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి మోసగాళ్ల కోసం విచారణ చేపట్టారు.

# లారీని వేగంగా తాకిన బస్సు

- డ్రైవర్, క్లీనర్, ప్రయాణికులకు గాయాలు


ప్రమాదంలో డివైడర్‌పై నిలిచిన లారీ

హోసూరు: బెంగళూరు నుంచి సేలం వైపు వెళుతున్న లారీని తమిళనాడు ఆర్టీసీ బస్సు సైడు నుంచి ఢీకొనడంతో లారీ డ్రైవర్, క్లీనర్, అలాగే బస్సులో 10 మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. వివరాలు.. సేదమంగలం ప్రాంతానికి చెందిన లారీ డ్రైవర్ తమిళ్ సెల్వన్ (47), అదే ప్రాంతానికి చెందిన క్లీనర్ శివకుమార్‌తో కలిసి గురువారం ఉదయం బెంగళూరు నుంచి సేలంకు ఇనుపలోడు తీసుకెళుతున్నారు. బెంగళూరు నుంచి సేలంకు వెళుతున్న బస్సు.. హోసూరు దర్గా సమీపంలో లారీని ఓవర్‌టేక్ చేస్తూ ప్రమాదానికి గురైంది. బస్సు ఒక పక్క నుంచి తోయడంతో లారీ ఇనుప పట్టాల డివైడర్‌పైకి ఎక్కి నిలిచింది. ఈ ఘటనలో లారీ డ్రైవర్, క్లీనర్‌తో పాటు బస్సులో పయణిస్తున్న 10 మంది ప్రయాణికులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. హోసూరు ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి గురైన వాహనాలను పక్కకు మళ్లించి ట్రాఫిక్ సమస్యను క్రమబద్ధీకరించారు. ఈ ఘటనతో రెండు గంటల పాటు జాతీయ రహదారిపై ట్రాఫిక్ సమస్య ఎదురైంది. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

## రూ.8కోట్ల అక్రమ బంగారం స్వాధీనం

**నలుగురిని అరెస్టు చేసిన విజయవాడ కస్టమ్స్ అధికారులు**

**సాక్షి, అమరావతి:** విదేశాల నుంచి అక్రమంగా తీసుకువచ్చి రవాణా చేస్తున్న రూ.8కోట్ల విలువైన 13 కేజీల బంగారాన్ని విజయవాడ కస్టమ్స్ కమిషనరేట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు చెన్నై–కోల్‌కతా జాతీయ రహదారి వద్ద కాజా టోల్ ప్లాజా, బొల్లాపల్లి టోల్ ప్లాజా వద్ద కస్టమ్స్ అధికారులు గురువారం తెల్లవారుజామున తనిఖీలు చేపట్టారు. ఓ కారుతో పాటు బస్సుల్లో అక్రమంగా తరలిస్తున్న 13 కేజీల బంగారాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఆ బంగారాన్ని స్మగ్లింగ్ చేస్తున్న నలుగురిని అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. వారిని గురువారం విశాఖపట్నంలోని ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరచగా, న్యాయమూర్తి జ్యుడిషియల్ కస్టడీ విధించారు. కస్టమ్స్ అధికారులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. 2022–23, 2023–24లో ఇప్పటివరకు విజయవాడ కస్టమ్స్ కమిషనరేట్ అధికారులు మొత్తం రూ.32.8కోట్ల విలువైన 59.5 కేజీల అక్రమ బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు.

# గురి తప్పని బాణాలు

**ఆర్చరీలో రాణిస్తున్న చిన్నారులు • వేసవి శిబిరాల్లో ప్రత్యేక శిక్షణ**

**పిఠాపురం:** మనసును.. దృష్టిని లక్ష్యంపై కేంద్రీకరించి వంద శాతం ఏకాగ్రతతో ఆడాల్సిన ఆట విలువిద్య. సనాతన భారత ఇతిహాసాలలో కనిపించే విలు విద్యకు పూర్వ వైభవం తెచ్చేందుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుండటంతో ఆర్చరీ క్రీడను నేర్చుకునేందుకు చిన్నారులు క్యూ కడుతున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరం, ఆలమూరు, రాజోలు, రావులపాలెం, అమలాపురం, పిఠాపురం, కాకినాడ తదితర ప్రాంతాల్లో వేసవి విలు విద్య శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేశారు. ఆర్చరీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకున్న క్రీడాకారులు 200లకు పైగా ఉండగా.. రిజిస్టర్ కాని క్రీడాకారులు వెయ్యి మందికి పైగా ఉన్నారు. వీరిలో జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి పతకాలు సాధించిన క్రీడాకారులు ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విలు విద్యా క్రీడాకారులకు స్పోర్ట్స్ కోటాలో ఉపాధ్యాయ నియామకాల్లో ఉద్యోగాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవడంతో ఆర్చరీకి డిమాండ్ పెరిగింది. వేసవి శిబిరాల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు ఏమంటున్నారంటే..


పిఠాపురంలో విలు విద్య శిక్షణ పొందుతున్న విద్యార్థులు

### శిక్షణ బాగుంది



నేను 3వ తరగతి చదువుతున్నాను. బాణాలంటే చాలా ఇష్టం. అది చూసి అమ్మానాన్న విలువిద్య నేర్పించారు. కాకినాడ జిల్లా సర్పవరంలో జరిగిన జిల్లాస్థాయి ఆర్చరీ పోటీల్లో రజత పతకం సాధించా. జాతీయ స్థాయిలో రాణించాలన్న సంకల్పంతో శిక్షణ పొందుతున్నాను. ఇక్కడ శిక్షణ బాగుంది. – ఎస్.కృష్ణ అభిరామ్, పిఠాపురం

### ఆసక్తి పెరిగింది



విలువిద్యపై ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు. ఏటా క్రీడాకారుల సంఖ్య పెరుగుతోంది. రాష్ట్ర, జాతీయ స్థాయి పతకాలు సాధించడమే ధ్యేయంగా విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నాం. ప్రభుత్వం స్పోర్ట్స్ కోటాలో విలువిద్య క్రీడాకారులకూ ఉద్యోగావకాశాలు కల్పిస్తుండటంతో ప్రోత్సాహం పెరిగింది. – పి.లక్ష్మణరావు, ఆర్చరీ కోచ్, పిఠాపురం

### దేశానికి పేరు తెస్తా



చిన్నప్పటి నుంచి విలువిద్య అంటే ప్రాణం. 2016లో జిల్లాస్థాయి పోటీల్లో స్వర్ణ పతకం, 2022లో సీనియర్స్ విభాగంలో స్వర్ణ పతకం, సీనియర్స్ రాష్ట్రస్థాయి పోటీల్లో రజత పతకం సాధించాను. ఇంటర్ చదివిన నేను ప్రస్తుతం తాపీ పని చేసుకుంటూ ఆర్చరీలో మరింతగా శిక్షణ పొందుతున్నాను. ప్రభుత్వం అవకాశం కల్పిస్తే మరిన్ని పతకాలు సాధించి దేశానికి.. రాష్ట్రానికి మంచి పేరు తేవాలన్న సంకల్పంతో ఉన్నాను. – పి.కృష్ణ, పిఠాపురం

### జాతీయ స్థాయిలో రాణిస్తా



పిఠాపురం ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుకుంటున్నా. చిన్నప్పటి నుంచి పుల్లలతో బాణాలు తయారు చేసుకోవడం సరదా. దానిని చూసిన మా స్కూల్ పీడీ మంగయ్యమ్మ నన్ను విలువిద్య నేర్చుకోమని చెప్పారు. అందుకే.. శిక్షణ పొందుతున్నాను. 2016లో కృష్ణా జిల్లా నూజివీడులో జరిగిన రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీల్లో పాల్గొన్నాను. 2023 కాకినాడ జిల్లా సర్పవరంలో జరిగిన జిల్లా స్థాయి ఆర్చరీ పోటీల్లో కాంస్య పతకం సాధించాను. – పి.మహాలక్ష్మి, పిఠాపురం

## విశాఖ పోర్టుకు సాగర్ శ్రేష్ట్ సమ్మాన్ అవార్డు


కేంద్ర మంత్రి నుంచి అవార్డు అందుకుంటున్న విశాఖ పోర్టు చైర్మన్ అంగముత్తు

**దొండపర్తి(విశాఖ దక్షిణ):** విశాఖ పోర్టు 2022–23లో సాధించిన ప్రగతికి 'సాగర్ శ్రేష్ట సమ్మాన్' అవార్డు లభించింది. మేజర్ పోర్టులలో వివిధ రకాల నిర్వహణ సూచీల్లో అసాధారణమైన పనితీరు కనబరిచినందుకు ప్రతి సంవత్సరం ప్రదానం చేసే సాగర్ శ్రేష్ఠ సమ్మాన్ పురస్కారానికి విశాఖ పోర్టు ఎంపికైంది. న్యూ ఢిల్లీలో గురువారం జరిగిన హరిత్ సాగర్ కార్యక్రమం ప్రారంభోత్సవం సందర్భంగా కేంద్ర పోర్టులు, షిప్పింగ్, జలరవాణా శాఖ మంత్రి శర్బానంద్ సోనోవాల్ చేతుల మీదుగా విశాఖపట్నం పోర్టు చైర్మన్ డాక్టర్ మధేయాన్ అంగముత్తు ఈ పురస్కారాన్ని స్వీకరించారు.

**తెలంగాణ**

## సీపీఆర్‌తో నిలిచిన గర్భిణి ప్రాణం

**భైంసా ఏరియా ఆస్పత్రి వైద్యుల కృషి**

**భైంసాటౌన్:** నిర్మల్ జిల్లా భైంసా ఏరియా ఆస్పత్రిలో ఇటీవల మహిళకు సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడిన వైద్యులు.. గురువారం ఓ గర్భిణికి కూడా ప్రాణాలు నిలబెట్టారు. భైంసా పట్టణంలోని కుంట ఏరియాకు చెందిన ఫాతి మా ఐదు నెలల గర్భిణి. వైద్య తనిఖీ కోసం తన అక్కతో కలిసి ఏరియాస్పత్రికి వచ్చి ఒక్కసారిగా కుప్పకూలింది. అక్కడే ఉన్న ఆస్పత్రి సూపరింటెండెంట్ కాశీనాథ్ వెంటనే స్పందించి వైద్యులు సుమల, రమేశ్ రాథోడ్‌ను అప్రమత్తం చేశారు. గర్భిణిని పరీక్షించి రక్తపోటు, షుగర్, నాడి పడిపోయినట్లు గుర్తించి వెంటనే సీపీఆర్ చేశారు. కొద్దిసేపటికి ఆమె స్పృహలోకి వచ్చింది. ఇంతలో మరోమారు గర్భిణి అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో దాదాపు 15 నిమిషాలపాటు శ్రమించి ఆమె ప్రాణాలు నిలిబెట్టినట్లు వైద్యులు పేర్కొన్నారు.

## వామపక్షాలు బహుజన ద్రోహులు

**956వ రోజు రిలే దీక్షలో బహుజన నేతలు**



**తాడికొండ:** పేదలకు ఇళ్ల స్థలాలిస్తుంటే వామపక్షాల నాయకులు విమర్శించడం వారి దిగజారుడు తనానికి నిదర్శనమని, బహుజన హక్కులను అడ్డుకోవడం సిగ్గుచేటని బహుజన పరిరక్షణ సమితి నాయకులు ధ్వజమెత్తారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 956వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో గురువారం పలువురు మాట్లాడారు. రాజధానిలో అసలు పేదలకు భూములిచ్చేందుకు వీల్లేదని అడ్డుతగిలిన కులవాదులు ఇప్పుడు ఒకడుగు వెనక్కు వేసి ఆర్–5 జోన్‌లో కాకుండా ఆర్–3 జోన్‌లో పేదలకు ఇళ్ల స్థలాలిస్తే తమకు ఇబ్బంది లేదని చెబుతుండడంలో ఆంతర్యం ఏమిటన్నారు. ఈ ప్రాంతంలో సెంటు స్థలం ఇస్తుంటే తప్పుడు కేసులు వేసి అడ్డుకున్న కులవాదులను విమర్శించకుండా పేదలకు రెండున్నర సెంట్లు ఇవ్వాలనే కొత్త రాగం అందుకున్న వామపక్షాల నాయకుల మాటలు విడ్డూరంగా ఉన్నాయని చెప్పారు. దళిత దళారులను అడ్డుపెట్టుకుని లబ్ధిపొందాలని చూసిన చంద్రబాబుకు వీరు వత్తాసు పలకడం దుర్మార్గమని తెలిపారు. పేదలను నిరుపేదలుగా మార్చడమే అజెండాగా చంద్రబాబు 14 సంవత్సరాలు సీఎంగా కొనసాగారని, కానీ నేడు ఆ పప్పులు ఉడకవన్నారు. వైఎస్సార్‌సీపీ 175 సీట్లు సాధించడం ఖాయమని చెప్పారు. నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, పెరికే వరప్రసాద్, బేతపూడి సాంబయ్య, ఈపూరి ఆదాం, పులి దాసు, బొలిమేర శ్యామ్యూల్, పాతూరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## విదేశాల్లోని 14 నగరాల్లో శ్రీవారి కల్యాణాలు

**సాక్షి, అమరావతి:** టీటీడీ ఆధ్వర్యంలో అమెరికా, కెనడాల్లో జూన్, జూలైల్లో శ్రీ మలయప్ప స్వామి వారి కల్యాణోత్సవాలను ఏపీఎన్ఆర్టీఎస్ నిర్వహించనుంది. జూన్4 –జూలై 23 తేదీ వరకు 14 నగరాల్లో శ్రీవారి కళ్యాణాన్ని నిర్వహించనున్నట్లు టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. గురువారం తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో ఆయన కెనడా, అమెరికాల్లో కల్యాణాలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. సీఎం వైఎస్ జగన్ ఆదేశం మేరకు రాష్ట్ర, దేశ, విదేశాల్లో శ్రీనివాస కల్యాణాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. కెనడా, అమెరికాల్లో జూన్ 4 – జూలై 23 వరకు 14 నగరాల్లో కల్యాణాలను నిర్వహి ంచనున్నట్లు తెలిపారు. ఏపీ ఎన్ఆర్టీఎస్ అధ్యక్షులు వెంకట్ ఎస్.మేడపాటి మాట్లాడుతూ శ్రీవారి కల్యాణాలు నిర్వహించడానికి ఆయా నగరాల కార్యనిర్వాహకవర్గంతో సంప్రదింపులు జరుపుతూ, అక్కడ ఏర్పాట్లను వారికి కావలసిన సామాగ్రి విషయంలో టీటీడీ అర్చకులు, వేదపండితులతో సమన్వయం చేస్తున్నట్లు చెప్పారు.

## హత్య కేసులో ఐదుగురు నిందితుల అరెస్ట్

- ఇయర్ బడ్ దొంగిలించాడని అజయ్‌సాయిపై దాడి చేసిన నిందితులు
- అపస్మారక స్థితిలోకి.. ఆపై ఆస్పత్రిలో మృతి
- నిందితులపై రౌడీషీట్లు తెరుస్తాం
- పులిపాకలో మృతిచెందిన జీవన్‌కుమార్‌ది ఆత్మహత్యే
- కృష్ణా జిల్లా ఎస్పీ జాషువా వెల్లడి


పెనమలూరు పోలీస్‌స్టేషన్‌లో మీడియాతో మాట్లాడుతున్న ఎస్పీ జాషువా

**పెనమలూరు :** కానూరు వద్ద జరిగిన చెన్నూరి అజయ్‌సాయి(22) హత్య కేసులో ఐదుగురు నిందితులను అరెస్టు చేశామని కృష్ణా జిల్లా ఎస్పీ పి.జాషువా తెలిపారు. పెనమలూరు పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. తాడిగడప వసంతనగర్‌కు చెందిన చెన్నూరి అజయ్‌సాయి అదే గ్రామానికి చెందిన బొమ్మిడి మణికంఠ, పామర్తి మణికంఠ, పుట్టి శ్రీధర్, దొంపల ప్రశాంత్, పటమటకు చెందిన కగ్గా సాయినాగార్జునలు కలిసి ఈ నెల 7వ తేదీన పటమట రాజులబజార్‌లో ఉన్న స్నేహితుడు సంతోష్ ఇంట్లో మద్యం పార్టీ చేసుకున్నారు. ఆ సమయంలో బొమ్మిడి మణికంఠ ఇయర్ బడ్స్ కనిపించలేదు. అజయ్‌సాయిపై అనుమానంతో కొట్టారు. ఎనికేపాడు ఇంజినీరింగ్ కాలేజీ వద్ద బడ్స్ దాచానని అజయ్‌సాయి చెప్పడంతో అదే రోజు రాత్రి అతనిని బైక్ పై అక్కడికి తీసుకెళ్లారు. అక్కడ బడ్స్ దొరక్క పోవడంతో అజయ్‌సాయిపై విచక్షణ రహితంగా దాడి చేశారు. అపస్మారక స్థితిలో ఉన్న అజయ్‌సాయిని సాయినాగార్జున, పామర్తి మణికంఠ పటమట డొంక రోడ్డులోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. అజయ్‌సాయి కంకిపాడు ఫ్లైఓవర్ వద్ద ప్రమాదంలో గాయపడినట్లు వైద్యులను నమ్మించారు. అయితే అజయ్‌సాయి 8న ఆస్పత్రిలో మృతి చెందాడు. మృతి వివరాలు కంకిపాడు పోలీసులకు అందడంతో.. వారు విచారణ నిర్వహించగా అసలు విషయాలు వెలుగులోకొచ్చాయి. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదుతో పెనమలూరు పోలీసులు హత్య కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న నిందితులను సీఐ కిషోర్‌బాబు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు గాలించి పట్టుకున్నాయి. నిందితులపై రౌడీషీట్ కూడా తెరుస్తామని ఎస్పీ చెప్పారు. కాగా, ఇందులో వీరు గంజాయి వాడారన్న వచ్చిన వార్తలో నిజం లేదని ఎస్పీ తెలిపారు. రాజకీయ నాయకులు ఆరోపణలు చేసే ముందు వాస్తవాలు తెలుసుకోవాలని సూచించారు. పోలీసుల విచారణ జరక్క ముందే రాజకీయ నాయకులు అసత్య ఆరోపణలు చేయడం తగదన్నారు.

### జీవన్‌కుమార్‌ది ఆత్మహత్యే

పెదపులిపాక గ్రామంలో కాలినగాయాలతో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన జమ్మలమూడి జీవన్‌కుమార్(21)ది ఆత్మహత్యేనని ఎస్పీ జాషువా తెలిపారు. తన తండ్రి సుధాకర్ తీసుకున్న లోన్‌కు సంబంధించి ఈఎంఐ నగదులో రూ.12,500ను జీవన్‌కుమార్ ఖర్చు చేయడంతో తండ్రి మందలించాడు. దీంతో మనస్థాపంతో ఉన్న జీవన్‌కుమార్ ఈ నెల 9న గురునానక్‌కాలనీలోని రెస్టారెంట్‌లో మిత్రుడు శ్యామ్ బర్త్‌డే పార్టీలో పాల్గొన్నాడు. అనంతరం అదే రోజు రాత్రి యనమలకుదురు పెట్రోల్ బంక్‌లో పెట్రోల్ కొన్నాడు. ఈ విషయం సీసీ కెమెరాలో నమోదైంది. తొలుత జీవన్‌కుమార్‌ది హత్యగా భావించామని, డీఎస్పీ జయసూర్య విచారణలో జీవన్ కదలికల్లో ప్రతి నిమిషాన్ని విచారించి సాంకేతిక సాక్ష్యాలు సేకరించినట్టు ఎస్పీ జాషువా చెప్పారు.

## బీసీ యువతకు సబ్సిడీ రుణాలివ్వాలి: ఆర్.కృష్ణయ్య

**కాచిగూడ:** జాతీయ బీసీ కార్పొరేషన్ ద్వారా రెండు తెలుగు రాష్ట్రాల్లో నిరుద్యోగ బీసీ యువతకు స్వ యం ఉపాధి కోసం సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. గురువారం కృష్ణయ్యను బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, ఓబీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు అంగిరేకుల వరప్రసాద్ యాదవ్ కలిసి సబ్సిడీ రుణాల మంజూరుపై కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కోరుతూ వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర సామాజిక న్యాయ శాఖ ద్వారా రెండు రాష్ట్రాల బీసీ కార్పొరేషన్లకు రూ.300 కోట్ల చొప్పున నిధులు మంజురయ్యేలా కృషి చేయాలన్నారు. ఎంపీ కృష్ణయ్య స్పందిస్తూ త్వరలో ఢిల్లీ వెళ్లి ఈ అంశంపై కేంద్రమంత్రితో చర్చి స్తానని చెప్పారు.

## హరీశ్‌కు సప్లిమెంటరీలో అవకాశం

**సాక్షి, హైదరాబాద్:** కమలాపూర్ జెడ్పీ హైస్కూల్ నుంచి పదో తరగతి హిందీ ప్రశ్నపత్రం వాట్సాప్‌లో చక్కర్లు కొట్టిన వ్యవహారంలో ఐదేళ్లపాటు డిబార్‌కు గురైన విద్యార్థి దొండబోయిన హరీశ్‌కు హైకోర్టులో ఊరట లభించింది. రెగ్యులర్ పరీక్షల సమయంలో రాయలేకపోయిన రెండు (ఇంగ్లిష్, మ్యాథ్స్) పరీక్షలను సప్లిమెంటరీలో రాసుకునేందుకు అవకాశం ఇచ్చింది. ఈ మేరకు విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఏప్రిల్ 5న హరీశ్ హిందీ పరీక్ష రాస్తుండగా శివాజీ అనే వ్యక్తి వచ్చి ప్రశ్నపత్రాన్ని సెల్‌ఫోన్‌లో ఫొటో తీసుకున్నాడు. దీనిపై కేసు కూడా నమోదైంది. తర్వాత ఇంగ్లిష్ పరీక్ష రాసేందుకు హరీశ్ పరీక్ష కేంద్రానికి వెళ్లాడు. అతడి దగ్గరున్న హాల్‌టికెట్‌ను తీసుకున్న డీఈవో పరీక్ష రాసేందుకు అనుమతి ఇవ్వలేదు. దీనిపై హై కోర్టును ఆశ్రయించిన హరీశ్.. సైన్స్, సోషల్ పరీక్షలు రాసేందుకు అనుమతి పొందాడు. అప్పటికే ఇంగ్లిష్, మ్యాథ్స్ పరీక్షలు ముగి శాయి. దీంతో వీటిని సప్లిమెంటరీలో రాసుకునే అవకాశం ఇవ్వాలని హరీశ్ తండ్రి డి.రాజు గురువారం వెకేషన్ బెంచ్ ముందు లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ సుధీర్ కుమార్ విచారణ చేపట్టి మిగిలిన రెండు పరీక్షలను సప్లిమెంటరీలో రాసేందుకు అనుమతి ఇస్తూ ఆదేశాలు జారీ చేశారు.

# వేసవి ప్రత్యేక రైళ్ల పొడిగింపు



**రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ):** వేసవి సీజన్‌లో ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఇప్పటి వరకు నడుస్తున్న కొన్ని ప్రత్యేక రైళ్లను పొడిగిస్తున్నట్లు రైల్వే అధికారులు గురువారం ఒక ప్రకటలో తెలిపారు. హైదరాబాద్–తిరుపతి (07643) జూన్ 5 నుంచి 26 వరకు ప్రతి సోమవారం, తిరుపతి–హైదరాబాద్ (07644) జూన్ 6 నుంచి 27 వరకు ప్రతి మంగళవారం , తిరుపతి–సికింద్రాబాద్ (07481) జూన్ 4 నుంచి 25 వరకు ఆదివారం, సికింద్రాబాద్–తిరుపతి (07482) జూన్ 5 నుంచి 26 వరకు ప్రతి సోమవారం, హైదరాబాద్–నర్సాపూర్ (07631) జూన్ 3 నుంచి 24 వరకు ప్రతి శనివారం నడుస్తాయని పేర్కొన్నారు. నర్సాపూర్–హైదరాబాద్ (07632) జూన్ 4 నుంచి 30 వరకు ప్రతి ఆదివారం, విజయవాడ–నాగర్‌సోల్ (07698) జూన్ 2 నుంచి 30 వరకు ప్రతి శుక్రవారం, నాగర్‌సోల్–విజయవాడ (07699) జూన్ 3 నుంచి జూలై 1 వరకు ప్రతి శనివారం, తిరుపతి–అకోలా (07605) జూన్ 2 నుంచి 30 వరకు ప్రతి శుక్రవారం, అకోలా–తిరుపతి (07606) జూన్ 4 నుంచి జూలై 2 వరకు ప్రతి ఆదివారం, పూర్ణ–తిరుపతి (07607) జూన్ 5 నుంచి 26 వరకు ప్రతి సోమవారం, తిరుపతి–పూర్ణ (07608) జూన్ 6 నుంచి 27 వరకు ప్రతి మంగళవారం నడుస్తాయని తెలిపారు.

## విజయవాడ జీజీహెచ్‌లో అరుదైన శస్త్రచికిత్స


రోగి నుంచి తొలగించిన 10 కేజీల కణితి

**లబ్బీపేట(విజయవాడ తూర్పు):** విజయవాడ ప్రభుత్వాస్పత్రి వైద్యులు అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ఓ రోగికి ఫైలేరియా స్క్రోటమ్ అండ్ రామ్స్ హార్న్ పెనిస్ సర్జరీని విజయవంతంగా నిర్వహించి కణితిని తొలగించారు. ఈ వివరాలను జనరల్ సర్జరీ హెచ్ఓడీ డాక్టర్ కె.అప్పారావు మీడియాకు చెప్పారు. విజయవాడకు చెందిన రోగి (65)కి ఏడేళ్లుగా ఫైలేరియా స్క్రోటమ్ క్రమేణా పెరుగుతూ వచ్చిందని..ప్రైవేటు ఆస్పత్రుల్లో చూపించినా ప్రయోజనం లేకపోవడంతో తమ వద్దకు వచ్చాడని చెప్పారు. ఆయనకు శస్త్రచికిత్స నిర్వహించి 10 కిలోల ఫైలేరియా స్క్రోటమ్ కణితిని తొలగించామన్నారు. బుధవారం శస్త్రచికిత్స నిర్వహించగా.. ప్రస్తుతం ఆరోగ్యంగా ఉన్నాడని, త్వరలో డిశ్చార్జ్ చేయనున్నట్లు తెలిపారు. ఈ శస్త్రచికిత్సలో తనతో పాటు డాక్టర్లు జ్వలిత, సతీష్, యశ్వంత్, విష్ణు, సూర్యశ్రీ పాల్గొన్నట్లు పేర్కొన్నారు.

## టీడీపీ మహానాడు నిర్వహణకు 16 కమిటీలు

**సాక్షి, అమరావతి:** రాజమహేంద్రవరం సమీపంలోని వేమగిరి వద్ద ఈ నెల 27, 28 తేదీల్లో నిర్వహించతలపెట్టిన టీడీపీ మహానాడు నిర్వహణకు ఆ పార్టీ అధినేత చంద్రబాబునాయుడు 16 కమిటీలను నియమించారు. పలువురు సీనియర్ నాయకులకు కమిటీల్లో బాధ్యతలు అప్పగించారు. అచ్చెన్నాయుడు, కాసాని జ్ఞానేశ్వర్ సారథ్యంలో ఆహ్వాన కమిటీని ఏర్పాటు చేశారు. తీర్మానాల కమిటీలో పార్టీ సీనియర్లు యనమల రామకృష్ణుడు, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఎంఎ షరీఫ్, రావుల చంద్రశేఖర్‌రెడ్డి వంటి సీనియర్లకు చోటు కల్పించారు. మహానాడు నిర్వహణ కోసం శుక్రవారం భూమి పూజ చేసి పనులు ప్రారంభిస్తామని పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు వెల్లడించారు.

## వైద్య రంగంలో రాష్ట్రాన్ని నం.1 చేయాలి

**సాక్షి, హైదరాబాద్:** వ్యక్తిగత పర్యటన కోసం అమెరికా వెళ్లిన వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అక్కడి నుంచి కూడా విధులు నిర్వహిస్తుండటం విశేషం. గురువారం సాయంత్రం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బోధనాస్పత్రులపై సమీక్ష నిర్వహించారు. 65 మందికి ప్రొఫెసర్లు, 210 మందికి అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతులు ఇచ్చామని మంత్రి తెలిపారు. అలాగే 1,061 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టులను భర్తీ చేసినట్లు వివరించారు. వీరికి నియామక ఉత్తర్వులను ఈనెల 22న శిల్పకళా వేదికలో జరిగే కార్యక్రమంలో అందజేస్తామన్నారు. వీరందరి సేవలను పూర్తిస్థాయిలో ఉపయోగించుకొని ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేయాలని హరీశ్‌రావు అధికారులను ఆదేశించారు. వైద్య, ఆరోగ్య రంగంలో తెలంగాణ దేశంలోనే మూడో స్థానంలో ఉందని, రాష్ట్రాన్ని ఈ రంగంలో మొదటి స్థానానికి తీసుకువచ్చేందుకు కృషి చేయాలని అధికారులను కోరారు. మెడికల్ కాలేజీల్లో ఎంబీబీఎస్ విద్యార్థులకు టీచింగ్ ఫ్యాకల్టీ ఆదర్శంగా ఉండాలని ఆయన సూచించారు. ర్యాగింగ్ లాంటివి లేకుండా చూడాలన్నారు. కాగా, విదేశాల్లో ఎంబీబీఎస్ పూర్తి చేసుకున్న 900 మంది తెలంగాణ విద్యార్థులకు ఒక ఏడాది ఇంటర్న్ షిప్ కోసం రాష్ట్రవ్యాప్తంగా కౌన్సెలింగ్ ప్రక్రియ ద్వారా పోస్టింగులు ఇచ్చామని ఆయన తెలిపారు.

**డ్యూటీ డాక్టర్లు కచ్చితంగా ఉండాలి..**

24 గంటలూ.. మరీ ముఖ్యంగా రాత్రి వేళల్లో డ్యూటీ డాక్టర్లు ఉండాలని హరీశ్‌రావు సూచించారు. ఎమర్జెన్సీ విభాగంలో డ్యూటీ డాక్టర్లు కచ్చితంగా ఉండాలని కోరారు. ముహూర్తాలు చూసి ప్రసవాలు చేయకూడదని, గర్భిణీల ఆరోగ్య పరిస్థితిని బట్టి సాధారణ లేదా సీ సెక్షన్ డెలివరీ చేయాలని స్పష్టం చేశారు. ఐదు లక్షల రూపాయలకు పైబడి విలువ చేసే వైద్య పరికరాల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. అలాగే అన్ని వైద్య పరికరాలు పని చేసేలా చూసుకోవాల్సిన బాధ్యత సూపరింటెండెంట్లదేనన్నారు. ఈ సమీక్షలో వైద్యాధికారులు రిజ్వీ, రమేశ్ రెడ్డి, శ్వేతా మహంతి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# నేడు వైఎస్సార్ ఉద్యాన వర్సిటీ 5వ స్నాతకోత్సవం

- తొలిసారి హాజరుకానున్న గవర్నర్ అబ్దుల్ నజీర్
- ముఖ్యఅతిథిగా నీతి అయోగ్ సభ్యుడు డాక్టర్ రమేష్‌చంద్
- 1,192 మంది పట్టభద్రులకు పట్టాలు ప్రదానం
- పలువురికి మెమోరియల్ గోల్డ్ మెడల్స్ ప్రదానం

**సాక్షి, అమరావతి:** డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం 5వ స్నాతకోత్సవం శుక్రవారం పశ్చిమగోదావరి జిల్లా వెంకటరామన్నగూడెంలోని వర్సిటీ ప్రాంగణంలో జరగనుంది. వర్సిటీ చరిత్రలో తొలిసారి చాన్సలర్ హోదాలో గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరుకానున్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొనే నీతి ఆయోగ్ సభ్యుడు (వ్యవసాయ విభాగం) రమేష్‌చంద్ స్నాతకోపన్యాసం చేయనున్నారు. స్నాతకోత్సవంలో 1,192 మంది పట్టభద్రులకు గవర్నర్ పట్టాలు ప్రదానం చేయనున్నారు. బీఎస్సీ ఆనర్స్ విభాగంలో 1,069 మందికి, ఎమ్మెస్సీలో 97 మందికి, పీహెచ్‌డీలో 26 మందికి పట్టాలందిస్తారు. అన్నే శిఖామణి మెమోరియల్ గోల్డ్ మెడల్ విభాగంలో ఉద్యాన మహిళా విద్యార్థులకు, దేవరకొండ పుల్లయ్యశాస్త్రి గోల్డ్‌మెడల్ విభాగంలో ఉద్యాన విద్యార్థులకు, షాహీద్ లెఫ్ట్ అమిత్‌సింగ్ గోల్డ్ మెడల్ విభాగంలో ఆల్‌రౌండ్ ప్రతిభ కనబరిచినవారికి, డాక్టర్ టి.బి.దాశరథి గోల్డ్ మెడల్ విభాగంలో ఎమ్మెస్సీ ఉద్యాన విద్యార్థులకు, అడ్డా వెంకాయమ్మ గోల్డ్ మెడల్ విభాగంలో పీహెచ్‌డీ ఉద్యాన విద్యార్థులకు పతకాలు బహూకరిస్తారు.

**దేశంలోనే రెండో విశ్వవిద్యాలయం**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆలోచనకనుగుణంగా 2007 జూన్ 6వ తేదీన దేశంలోనే రెండోది, దక్షిణ భారతదేశంలో మొదటిదైన ఉద్యాన విశ్వవిద్యాలయంగా ఈ వర్సిటీ ఏర్పాటైంది. తొలుత ఆంధ్రప్రదేశ్ ఉద్యాన విశ్వవిద్యాలయంగా ఏర్పాటు కాగా, మహానేత వైఎస్సార్ హఠాన్మరణం తర్వాత ఆయన స్మారకార్థం 2012 ఆగస్టులో ఈ వర్సిటీని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయంగా మార్చారు. వర్సిటీ పరిధిలో 43 సంస్థలున్నాయి. వీటిలో ప్రధానంగా 4 ఉద్యాన, 4 పాలిటెక్నిక్, 4 అనుబంధ ఉద్యాన, 7 అనుబంధ పాలిటెక్నిక్ కళాశాలలు, 20 పరిశోధన కేంద్రాలు, 4 కేవీకేలు ఉన్నాయి. బీఎస్సీ ఆనర్స్, ఎంఎస్సీ, పీహెచ్‌డీ కోర్సులతోపాటు రెండేళ్ల ఉద్యాన డిప్లమో కోర్సులను యూనివర్సిటీ అందిస్తోంది. మహానేత ఆశయాలకు అనుగుణంగా మొక్కవోని సంకల్పంతో సేవలందిస్తూ ఉద్యాన పరిశోధన, విద్యారంగాల్లో అద్భుత విజయాలను సాధించింది. దేశంలోనే మొదటి ర్యాంక్ విశ్వవిద్యాలయంగా అవార్డు దక్కించుకుంది. వర్సిటీ ఏర్పాటైనప్పటి నుంచి ఇప్పటివరకు బీఎస్సీ ఆనర్స్‌లో 3,723 మంది, ఎంఎస్సీలో 564 మంది, పీహెచ్‌డీలో 88 మంది, డిప్లమోలో 2,610 మంది పట్టాలు అందుకున్నారు. 2022–23లో బీఎస్సీ ఆనర్స్‌లో 2,158 మంది, ఎంఎస్సీలో 122 మంది, పీహెచ్‌డీలో 58 మంది, డిప్లమోలో 590 మంది అడ్మిట్ అయ్యారు. వర్సిటీ ఇప్పటివరకు 27 రకాల వంగడాలను అభివృద్ధి చేయగా, వాటిలో 18 రకాలను జాతీయస్థాయిలో వినియోగించేలా కేంద్రం నోటిఫై చేసింది.

# నేటి నుంచి రాజశ్యామల యజ్ఞం

- ప్రజల సంక్షేమం కోసం దేవదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహణ
- ప్రారంభ, పూర్ణాహుతి కార్యక్రమాలకు హాజరుకానున్న సీఎం జగన్

**సాక్షి, అమరావతి:** సనాతన ధర్మ పరిరక్షణతోపాటు రాష్ట్రం సస్యశ్యామలంగా అభివృద్ధి చెందుతూ ప్రజలందరూ కల్యాణ సౌభాగ్యాలతో వర్ధిల్లాలని కాంక్షిస్తూ రాష్ట్ర ప్రభుత్వం దేవదాయ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి అష్టోత్తర శత కుండాత్మక చండీ, రుద్ర, రాజశ్యామల, సుదర్శన సహిత శ్రీలక్ష్మీ మహాయజ్ఞానికి శ్రీకారం చుడుతోంది. విజయవాడ బందరు రోడ్డులోని ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో నిర్వహించే ఈ యజ్ఞంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొంటారు. ఉదయం 5గంటలకు మహామంగళ వాయిద్య హృద్య నాదం, భగవత్ ప్రీతిగా వేదస్వస్తి, గోపూజ, విఘ్నేశ్వర–విష్వక్సేన పూజలు, పుణ్యాహవచనం, దీక్షాధారణ, అజస్ర దీపారాధన తదితర కార్యక్రమాలు మొదలవుతాయి. ఉదయం 8.30 గంటలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి యజ్ఞ సంకల్పం తీసుకున్న అనంతరం మహాయజ్ఞం ప్రారంభమవుతుంది. ఉప ముఖ్యమంత్రి (దేవదాయ శాఖ) కొట్టు సత్యనారాయణ దంపతులు యజ్ఞధారణను స్వీకరిస్తారు.

**నాలుగు ఆగమాల నడుమ..**

మే 17వ తేదీ బుధవారం వరకు 6 రోజులపాటు ఈ మహాయజ్ఞం కొనసాగనుండగా.. వైఖానసం, పాంచరాత్రం, శైవం, వైదిక స్మార్తం ఆగమాలతో ఏర్పాటు చేసిన నాలుగు ప్రధాన యాగశాలల్లో యజ్ఞాలు జరుగుతాయి. ఒక్కొక్క యాగశాలలో 27 కుండాల చొప్పున మొత్తం 108 కుండాలతో రుత్వికులు యజ్ఞ కార్యక్రమాలు నిర్వహిస్తారు. తొలి రోజు ఉదయం మినహా ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు.. సాయంత్రం 6 గంటల నుంచి 9 గంటల వరకు కొనసాగుతాయి. పవిత్ర సప్తనదీ, త్రి సముద్ర జలాలతో 1008 కలశాలతో విశేష అభిషేకాలు నిర్వహించనున్నట్టు దేవదాయ శాఖ వర్గాలు వెల్లడించాయి.

**భక్తుల కోసం నాలుగు క్యూలైన్లు**

యజ్ఞ కార్యక్రమాలను భక్తులు వీక్షించేలా ఉమ్మడిగా యాగశాలల చుట్టూ 4 క్యూలైన్లను ఏర్పాటు చేశారు. యజ్ఞ కార్యక్రమాలను వీక్షిస్తూనే ఆ యాగశాల చుట్టూ ప్రదక్షిణ చేసేలా వీటిని తీర్చిదిద్దారు. వాటిలో ఒకటి వీఐపీల కోసం కేటాయించారు. రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాల ఆధ్వర్యంలో భక్తులకు రోజుకు ఒక ఆలయం చొప్పున ప్రసాదాల పంపిణీ చేపడుతున్నాయి. తొలిరోజు విజయవాడ దుర్గ గుడి ఆధ్వర్యంలో భక్తులకు పులిహోర, చక్రపొంగ లి పంపిణీ చేస్తారు. యజ్ఞం తొలిరోజున శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి, 13న ద్వారకా తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి, 14న అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామి, 15న శ్రీశైల శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి, 16న శ్రీ వరాహలక్ష్మీ నరసింహస్వామి కల్యాణ మహోత్సవాలు జరుగుతాయి. 17వ తేదీన చివరి రోజు సీఎం జగన్ చేతుల మీదుగా విశాఖ శ్రీ శారదా పీఠాధిపతి స్వ రూపానందేంద్ర, పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర అన్వయంతో మహా పూర్ణాహుతితో యజ్ఞ కార్యక్రమాలు ముగుస్తాయి.

## బీఆర్ఎస్, బీజేపీ బంధం బలమైనది

**సాక్షి, హైదరాబాద్:** బీజేపీ–టీఆర్ఎస్ బంధం బలమైనదని, మోదీ, అమిత్ షాకు వ్యతిరేకంగా కేసీఆర్ పోరాడుతున్నారనేది శుద్ధ అబద్ధమని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ విమర్శించారు. కేంద్రంలో సహకార శాఖ మంత్రిగా కూడా బాధ్యతలు నిర్వర్తిస్తున్న అమిత్ షా ఆదేశాలతోనే గుజరాత్ రాష్ట్రానికి చెందిన అమూల్ పాల కంపెనీని తెలంగాణలో ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ఆమోదం తెలిపారని ఒక ప్రకటనలో ఆరోపించారు. ఈ విషయం తలసాని వంటి వారికి తెలియదని చెప్పారు. ఇదే కంపెనీని కర్ణాటకలో ఏర్పాటు చేసి, ఆ రాష్ట్రంలో ఉన్న నందిని అనే పాల కంపెనీని మూసేయాలని చూస్తే అక్కడి ప్రజలు తిరగబడి అమూల్ కంపెనీని వ్యతిరేకించారని తెలిపారు. తెలంగాణలో మాత్రం ముఖ్యమంత్రి కేసీఆర్ తాను ప్రాతినిథ్యం వహిస్తున్న గజ్వేల్‌లోని వర్గల్‌లో అమూల్ కంపెనీ కోసం ఎర్రతివాచీ పరిచారని, తెలంగాణ రాష్ట్ర పాడి రైతులకు అన్యాయం జరుగుతుందని తెలిసినా ముఖ్యమంత్రి పట్టించుకోవడం లేదన్నారు. తెలంగాణకు చెందిన విజయ పాల కంపెనీకి ప్రభుత్వం గత రెండేళ్లుగా కనీసం ఎండీని కూడా నియమించకపోవడానికి కారణమేంటని నిలదీశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రిలయన్స్ కంపెనీ లాభాల కోసం బీఎస్ఎన్ఎల్ కంపెనీని చంపినట్లే, తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో విజయ డెయిరీ, కరీంనగర్, ముల్కనూర్ డెయిరీ వంటి స్థానిక కంపెనీలను చంపి, అమూల్ కంపెనీని తెస్తున్నారని మండిపడ్డారు.

సాక్షి ఫ్యామిలీ
బెంగళూరు
శుక్రవారం ॥ 12-5-2023

నేడు అంతర్జాతీయ నర్సుల దినోత్సవం

# సేవకు విశ్రాంతి లేదు

రోగులకు వైద్యులు ఇచ్చే ఔషధం ఎంత ముఖ్యమో నర్సులు చేసే సేవలూ అంతే ముఖ్యం. 'నీకేం కాదు, ధైర్యంగా ఉండు' అని నర్సు చెప్పే మాట రోగిలో భవిష్యత్తుపైన ఆశలు చిగురింపజేస్తుంది. విధుల్లో ఉన్నా, లేకపోయినా తమ చుట్టూ ఉన్నవారికి నర్సమ్మగా సేవలు అందిస్తూనే ఉంటుంది. తన సేవాగుణాన్ని చాటుకుంటూనే ఉంటుంది. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా ముప్పై, నలభై ఏళ్లుగా రోగులకు సేవలు అందించిన వారిని కలిస్తే వారు పంచుకున్న విషయాలు ఇవి.

## దేవుడిచ్చిన అవకాశం



ఉస్మానియా, గాంధీ హాస్పిటల్స్‌లో .. దాదాపు నలభై ఏళ్ల నర్సుగా, నర్సింగ్ టీచర్‌గా విధులు నిర్వర్తించాను. కర్నూల్‌లోనూ చీఫ్ నర్సింగ్ సూపరింటెండెంట్‌గా వర్క్ చేశాను. ఏడాది క్రితం రిటైర్ అయ్యాను. కొంత కాలం క్రితం మాకు తెలిసిన వారి అమ్మాయికి హార్ట్‌లో హోల్ ఉందని తెలిసింది. ఏ డాక్టర్‌ను కలిస్తే ఎలాంటి చికిత్స అందుతుంది, ఎలాంటి గైడెన్స్ అవసరం అనే విషయాలు చెప్పడంతో పాటు కొన్ని నెలలు వారింట్లోనే ఉన్నాను. టైమ్‌కు మందులు, ఫుడ్ చార్ట్ ప్రకారం ఫాలో అవడంలాంటి జాగ్రత్తల మూలంగా ఆ అమ్మాయి సేఫ్ అయ్యింది. ఇదొక్కటే కాదు హైదరాబాద్, రాం కోఠిలోని మా కాంప్లెక్స్, కాలనీలలో తెలిసిన వారు ఎవరికి ఆరోగ్య సమస్య వచ్చినా, ఏ డాక్టర్ని కలవాలి అని అడగడంతో పాటు, జాగ్రత్తలు చెప్పమని కోరుతారు. ప్రెగ్నెంట్ ఉమన్ కనిపిస్తే చాలు – వారు అడగకపోయినా వారు ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారో కనుక్కుంటాను. ఇన్నేళ్లపాటు వర్క్‌లో ఉన్నాను కాబట్టి నాకు తెలిసినవారి జాబితా ఎక్కువ. ఇతర రాష్ట్రాలలోనూ ఉన్నారు. వారు కూడా ఏ రాత్రి ఏ వైద్య సలహా అవసరం వచ్చినా అడుగుతుంటారు. సేవ అనేది దేవుడు ఇచ్చిన అవకాశంగా భావిస్తాను. అదే ఎంతో మంది రోగులకు స్వస్థత చేకూర్చేలా చేసిందనుకుంటాను. సేవకు ఎప్పుడూ రిటైర్‌మెంట్ ఉండదని నాకు ప్రతిరోజూ ఒక్క సంఘటనైనా రుజువు చేస్తుంటుంది.

**– పంకజ రుతు, రాంకోటి, హైదరాబాద్**

## ఊరటనివ్వడమే ఆనందం



గాంధీలో స్కూల్ ఆఫ్ నర్సింగ్‌లో ట్యూటర్‌గా రిటైర్ అయ్యాను. ఆ తర్వాత ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీ ఉద్యోగుల ఆరోగ్య సలహాల కోసం ఆరేళ్ల వర్క్ చేశాను. మూడేళ్లుగా ఇంటి వద్దే ఉంటున్నాను. కానీ, ఉద్యోగంలో లేను అనే ఆలోచన ఎప్పుడూ రాదు. మా ఏరియాలో నేను అందరికీ తెలుసు. నాకు దాదాపుగా అందరూ పరిచయమే. ఆ విధంగా మా ఏరియాలో ఎవరికి ఆరోగ్య సమస్య వచ్చినా పిలుస్తారు. సలహాలు అడుగుతారు. హాస్పిటల్ నుంచి వారు వచ్చాక వెళ్లి కలుస్తాను. ఏ మందులు ఎలా వాడాలో చెబుతుంటాను. మా ఏరియాలో ఎవరికైనా చంటిపిల్లలు పుడితే, వారు పిలవకపోయినా వెళతాను. ప్రసవం అయ్యాక తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చంటిపిల్లలను ఎలా చూసుకోవాలో సూచనలు ఇస్తుంటాను. ఎవరైనా చనిపోతే వెళ్లి, డెడ్‌బాడీని ఎలా కేర్ చేయాలో, ఎందుకు అవసరమో చెబుతుంటాను. మా ఏరియాలో ఈ మధ్య ఒక అన్నకు యాక్సిడెంట్ అయ్యి కాలు విరిగింది. హాస్పిటల్ నుంచి వచ్చాక నెల రోజుల పాటు రోజూ వారి ఇంటికి వెళ్లడం, కాలుకు వాపు రాకుండా జాగ్రత్తలు చెప్పడం, డ్రెస్సింగ్ చేయడం, మందులు వాడటం గురించి చెబుతుండేదాన్ని. ఇప్పుడు ఆ అన్న నడుస్తున్నారు. సమస్య నుంచి తేరుకున్నాక వారి మొహాల్లో కనిపించే రిలీఫ్ నాకు ఎంతో ఆనందానిస్తుంది.

**– నీరజాక్షి, వికారాబాద్**

## విధుల్లోలేని సమయాల్లోనూ..



నిమ్స్‌లో విధులను నిర్వర్తిస్తున్నాను. మరో రెండేళ్లలో రిటైర్‌మెంట్ ఉంది. అయితే, హాస్పిటల్ వరకే మా సేవలు ఉండవు. నర్సింగ్ సేవకు రోజుకు ఇన్ని గంటలే అనే నియమం ఉండదు. స్వచ్ఛందంగానూ మా కాలనీలోనూ, కాంప్లెక్స్‌లోనూ, తెలిసినవారికి అవసరమైన వారికి సేవలు ఇస్తుంటాను. ఈ మధ్య కాలంలో మా కాంప్లెక్స్‌లో ఒక పెద్దాయనకు పక్షవాతం వచ్చింది. పూర్తిగా బెడ్‌కే పరిమితం అయ్యాడు. ప్రతిరోజూ డ్యూటీకి వెళ్లడానికి ముందు వారింటికి వెళ్లి, ఆ రోజు అతని పరిస్థితి ఎలా ఉందో కనుక్కొని, ఆ రోజు షెడ్యూల్‌ను కచ్చితంగా ఫాలో అయ్యారో లేదో అడిగి తెలుసుకుంటాను. ఆ రోజు ఎలాంటి కేర్ తీసుకోవాలో చెబుతాను. మిగతావాళ్లు తమ ఆరోగ్యస్థితి గురించి అడిగితే చెబుతుంటారు. అలాంటప్పుడు వారికి డాక్టర్ ప్రిస్క్రిప్షన్ చూసి ఇంజక్షన్స్ వంటివి అవసరం ఉన్నవారికి చేస్తుంటాను. ఎవరికి ఆరోగ్యసమస్య వచ్చి, సాయం కోరినా అందుబాటులో ఉండటం కూడా సేవగా భావిస్తాను.

**– అరుణ పాల్వాయి, మియాపూర్, హైదరాబాద్**

**– నిర్మలారెడ్డి,**
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

పేరెంటింగ్

# ఓడినప్పుడు అండగా నిలవండి



**పరీక్షల రిజల్ట్స్ వచ్చాయి.**
**అందరూ గెలవరు.**
**కొందరు ఓడుతారు.**
**గెలవడానికి ఎన్ని కారణాలో**
**ఓడటానికి అన్ని కారణాలు.**
**తల్లిదండ్రుల ఆశలు, ఆకాంక్షలు**
**ఒక క్షణం పిల్లలు తెచ్చిన ఫలితాలతో**
**డిస్టర్బ్ అయినా దండించే సందర్భం ఇది కాదు.**
**పిల్లల ఓటమిని అర్థం చేసుకోవడమే**
**ఇప్పుడు అవసరం.**
**వారిని గమనించి**
**తిరిగి ముందుకు నడపడమే అవసరం.**
**ఓడిన పిల్లలకు అండగా నిలవండి.**

కొందరు లెక్కలేని పిల్లలు ఉంటారు. వీరు ఎగ్జామ్స్ బాగానే రాసినా రిజల్ట్స్ తేడాగా వస్తే పట్టించుకోరు. ఫెయిల్ అయితే మరీ కొంపలు మునిగినట్టుగా కూచోరు. నెక్స్ట్ టైమ్ చూసుకుందాం అన్నట్టు ఉంటారు. ఈజీగా ఉంటారు. కాని కొందరు పిల్లలు పరీక్షలు ఎలా రాశారో ఇంట్లో కచ్చిత అంచనాతో చెప్పరు. ఫెయిల్ అవుతామేమోనని భయపడుతూ ఉంటారు. ఫెయిల్ అయితే ఇక పూర్తిగా ముడుచుకుపోతారు. తల్లిదండ్రుల ముందుకు రారు. బంధువుల్లో పరువుపోయిందని బాగా బెంబేలు పడతారు. ఎవరితోనూ కలవరు. ఇక భవిష్యత్తు ముగిసినట్టే భావిస్తారు. వీరితోనే సమస్య. వీరు ఏ క్షణమైనా పేలే బుడగలాంటివారు. ఇలాంటి వారితో తల్లిదండ్రులు చాలా అప్రమత్తంగా ఉండాలి. స్నేహితుల్ని, బంధువుల్ని అప్రమత్తం చేయాలి. ఈ దశ నుంచి వారిని సక్రమంగా బయటపడేయాలి.

### ఫెయిల్ ఎందుకు?

ఈ ప్రశ్న పిల్లల్ని అడిగే ముందు పెద్దలే ప్రశ్నించుకోవాలి. పిల్లల్ని సరైన బడి/కాలేజ్‌లోనే చేర్చారా? అక్కడ పాఠాలు సరిగా జరిగాయా? సిలబస్ పూర్తి చేశారా? నోట్స్ సరిగా ఇచ్చారా? స్టూడెంట్ ఆ సబ్జెక్ట్స్ ఎలా ఫాలో అవుతున్నాడో ఎందులో వీక్ ఉన్నాడో టీచర్లు ఇంటికి ఫీడ్ బ్యాక్ ఇచ్చారా? పిల్లలకు ట్యూషన్ అవసరమైతే సరైన ట్యూషన్ పెట్టించారా? పిల్లలు చదివే వాతావరణం ఇంట్లో ఉందా? వారు చదువుకునే వీలు లేకుండా అస్తమానం పనులు చెప్తూ, టీవీ మోగిస్తూ, ఇంట్లో నాన్ సీరియస్ వాతావరణం పెట్టారా? పరీక్షల సమయంలో సిలబస్‌ను సరిగా విభజించుకుని చదవగలిగాడా? ఎగ్జామ్‌లో ఇచ్చిన ప్రశ్నలకు టైమ్ మేనేజ్‌మెంట్ చేయగలిగాడా? ఎగ్జామ్ భయంతో ఏమీ రాయలేకపోయాడా?... ఇవన్నీ ఫెయిల్ అవడానికి కారణాలు. టెన్త్ వరకూ అందరికీ తప్పదు కాని ఇంటర్ విషయానికి వచ్చేసరికి ఇష్టమైన కోర్సులో చేర్చారా? చదవే ఆసక్తి, శక్తి ఉన్న సబ్జెక్ట్స్‌లోనే చేర్చారా?... ఇవీ ముఖ్యమైన విషయాలే.

### ఏం చేయకూడదు?

పిల్లలు ఫెయిల్ అయ్యారని తెలియగానే ముందు వారికి నొప్పి కలిగే మాట ఏదీ మాట్లాడకూడదు. వారితో మాట్లాడటం మానేయకూడదు. కొట్టడం ఇంకా చెడ్డ చర్య. ఎవరితో పోల్చకూడదు. బాగా మంచి మార్కులతో పాసైన వారిని చూపించి వీరిని హేళన చేయకూడదు. భోజనాల దగ్గర 'మింగుడూ రా' లాంటి మాటలు పొరపాట్న కూడా మాట్లాడకూడదు. తోబుట్టువులను ఉసిగొల్పకూడదు. కొంత మంది తల్లిదండ్రులు ఏడ్చి, నెత్తి బాదుకుని భయభ్రాంతం చేస్తారు. ఏమాత్రం కూడదు. ఆడపిల్లైతే 'పెళ్లి చేసి పారేస్తాం' అని మగపిల్లలైతే 'నాలుగు గేదెలు కొనిస్తాం. మేపుకో' అని అనడం చాలా ప్రతికూల ప్రభావం చూపుతుంది.

పిల్లలు ఫెయిల్ అయ్యారని తెలియగానే ముందు వారికి నొప్పి కలిగే మాట ఏదీ మాట్లాడకూడదు. వారితో మాట్లాడటం మానేయకూడదు. కొట్టడం ఇంకా చెడ్డ చర్య. ఎవరితో పోల్చకూడదు. బాగా మంచి మార్కులతో పాసైన వారిని చూపించి వీరిని హేళన చేయకూడదు. భోజనాల దగ్గర 'మింగుడూ రా' లాంటి మాటలు పొరపాట్న కూడా మాట్లాడకూడదు. తోబుట్టువులను ఉసిగొల్పకూడదు.

### ఏం చేయాలి?

'మరో అవకాశం ఎప్పుడూ ఉంటుంది. మరేం పర్వాలేదు' అని చెప్పాలి. 'నీకు ఎలాంటి సపోర్ట్ కావాలి? ఈ పరీక్షలు పాస్ కావడంలో నీకు ఎదురైన సమస్య ఏమిటి?' అని తెలుసుకోవాలి. ఒకవేళ పిల్లవాడు బాగా రాశాననే నమ్మకం ఉంటే రీవాల్యుయేషన్‌కు వెళ్లాలి. ప్రతి స్టూడెంట్‌కు ఎవరో ఒక టీచర్/లెక్చరర్ మీద గురి ఉంటుంది. కొంత చనువు ఉంటుంది. అలాంటి వారి దగ్గరకు తీసుకెళ్లి కౌన్సెలింగ్ చేయించాలి. ఇది తాత్కాలిక అడ్డంకి అని దీనిని దాటి ముందుకు పోవచ్చని భరోసా ఇవ్వాలి. పట్టుదలతో ప్రయత్నిస్తే సాధిస్తావ్ అని చెప్పాలి. స్నేహితులతో కూడా ఇవే మాటలు చెప్పించాలి. ఆరోగ్యం, ఆయుష్షు ఉంటే జీవితంలో చాలా సాధించవచ్చని ఆశ కల్పించాలి. ఈ సమయంలో వారిని ఒంటరిగా వదలకూడదు. చదువు ముఖ్యమే కాని చదువు కంటే జీవితం ముఖ్యమనే విషయం బోధపరచాలి. తల్లిదండ్రులు కూడా అదేసంగతి తెలుసుకోవాలి. 'తక్కువ మార్కులతో పాసైన వారు ఎక్కువ మార్కులతో పాసైనవారిని భవిష్యత్తులో జీతానికి పెట్టుకోవచ్చు'. చెప్పలేం కదా.

ఫ్యాషన్









# ఎనీటైమ్ ఇక్కత్ స్టైల్

**వేసవి అనగానే మనకు కాటన్స్ ప్రధానంగా గుర్తుకు వస్తాయి. కంఫర్ట్ సరే స్టైల్ మాటేమిటి.. అనుకునేవారికి ఇక్కత్ కాంబినేషన్‌తో అట్రాక్ట్ చేస్తున్నాయి. మోడర్న్ లుక్‌తో స్టైల్‌లో సాటిరావనిపిస్తున్నాయి. సీజనల్‌గానే కాదు హుందాతనంలోనూ మాకు మేమే పోటీ అంటున్నాయి.**





కాటన్స్ అనగానే వయసుపైబడినవారు వేసుకునేవి... అనే ఆలోచన ఈ రోజుల్లో మారిపోయింది. ఖాదీ కాటన్, ఇక్కత్ కాంబినేషన్‌లో షార్ట్ కుర్తీస్, జాకెట్స్, స్కర్ట్స్, ఫ్రాక్స్, టాప్స్ ఎప్పుడూ ప్రత్యేకంగా ఉంటాయి. కూల్, కంఫర్ట్ లుక్‌తో క్యాజువల్, అఫిషియల్ వేర్‌గానూ ఆకట్టుకుంటున్నాయి. ఎనీ టైమ్ స్టైల్ అంటూ ఈ సీజన్‌లో తమ స్పెషాలిటీ చాటుతున్నాయి.

**కాకర డయాబెటిస్‌ను నియంత్రిస్తుంది.**
**వ్యాధి నిరోధకశక్తిని పెంచుతుంది.**
**అంటువ్యాధులు... వాపులను తగ్గిస్తుంది.**
**రక్తాన్ని శుద్ధి చేస్తుంది... మంచి ఊపిరినిస్తుంది.**
**కళ్లు... ఎముకలు... లివర్ పనితీరును మెరుగుపరుస్తుంది.**
**సెల్ డ్యామేజీని అడ్డుకుని చర్మానికి మేలు చేస్తుంది.**
**ఇన్ని 'మేళ్లు' చేయడం కాకరకాయకే సాధ్యం.**
**అందుకే... ఈ చేదు రుచులను స్వాగతిద్దాం.**
**ఈ వారం మన 'వంటిల్లు'ను కాకరకు వేదిక చేద్దాం.**

వంటిల్లు



# కాకర కరకర

## చిప్స్...



**కావలసినవి:** కాకరకాయలు – పావు కేజీ ; మజ్జిగ – 50 మిలీ ; చింతపండు – అంగుళం ముక్క ; ఉప్పు – టీ స్పూన్ ; మిరప్పొడి– అర టీ స్పూన్ ; నూనె– 2 టేబుల్ స్పూన్‌లు ; ఆవాలు – అర టీ స్పూన్ ; పచ్చి శనగపప్పు – టీ స్పూన్ ; వెల్లుల్లి రేకలు – 4 ; ఎండుమిర్చి –2.

**తయారీ:** ● కాకరకాయలను శుభ్రంగా కడిగి మొదలు, చివరలు తీసేసి చక్రాలుగా (మరీ పలుచగా కాదు, కొంచెం మందంగా) తరగాలి. ఈ ముక్కలను మందపాటి పాత్రలో వేసి అందులో మజ్జిగ, ఉప్పు, చింతపండు వేసి సన్నమంట మీద ఐదు నిమిషాల సేపు (తేమ ఇగిరి పోయేవరకు) ఉడికించాలి. ● మందపాటి బాణలిలో నూనె వేడి చేసి ఆవాలు, పచ్చి శనగపప్పు, ఎండుమిర్చి, వెల్లుల్లి రేకలు వేసి వేగిన తర్వాత ఉడికించి పెట్టుకున్న కాకరకాయ ముక్కలను వేసి వేయించాలి. చివరగా కారం చల్లి దించేయాలి. ఇందులో పల్లీల పొడి లేదా కొబ్బరి కారం కూడా చల్లుకోవచ్చు. ఇది పప్పు, సాంబార్, రసంలోకి చక్కటి సైడ్ డిష్. ● కాకరకాయ చిప్స్‌ను నిల్వ చేసుకోవాలంటే... మజ్జిగలో ఉడికించిన తర్వాత ముక్కలను ఒకరోజు ఎండ బెట్టి ఆ తర్వాత నూనెలో వేయించుకోవాలి. ఇలా చేస్తే వారం పాటు తాజాగా ఉంటాయి.

## తోరన్...



**కావలసినవి:** కాకరకాయలు – అర కేజీ ; పచ్చి కొబ్బరి తురుము – పావు కేజీ ; పచ్చి మిర్చి– 10 (సన్నగా తరగాలి) ; బెల్లం లేదా బెల్లం పొడి– 3 టేబుల్ స్పూన్‌లు ; ఉప్పు – టీ స్పూన్ ; పసుపు– అర టీ స్పూన్ ; కరివేపాకు – 2 రెమ్మలు ; నూనె– 5 టేబుల్ స్పూన్‌లు.

**తయారీ:** ● కాకరకాయలను శుభ్రంగా కడగాలి. చివరలు తొలగించి కాయను నిలువుగా చీల్చాలి. ● స్పూన్‌తో కాయలోని గింజలను, మెత్తటి భాగాన్ని తీసేయాలి. కాయ పై భాగాలను చిన్న ముక్కలుగా తరగాలి. ● ఈ ముక్కలను మందపాటి పాత్రలో వేయాలి. అందులో బెల్లం, పచ్చిమిర్చి తరుగు, కొబ్బరి తురుము వేసి (నీరు పోయకుండా) సన్న మంట మీద ఉడికించాలి. కొద్దిగా వేడెక్కిన తర్వాత పసుపు, పసుపు, నూనె కూడా వేసి కలిపి మూత పెట్టి ఐదు నిమిషాల సేపు ఉడకనివ్వాలి. ఆ తరవాత తరచూ కలుపుతూ ఉడికించాలి. అవసరం అనిపిస్తే మరికొద్దిగా నూనె వేయాలి. కరివేపాకు వేసి కలిపి మూత పెట్టి మగ్గనివ్వాలి. ఈ కేరళ కర్రీ అన్నంలోకి రొట్టెల్లోకి కూడా మంచి కాంబినేషన్.

## పవక్కై తీయర్ కర్రీ ...




**కావలసినవి:** కాకరకాయలు – 2 (ముక్కలు తరగాలి) ; ఉల్లిపాయలు – పది (సాంబారు ఉల్లిపాయలు) ; పసుపు – అర టీ స్పూన్ ; చింతపండు రసం– టేబుల్ స్పూన్ ; చింతపండు – ఒక కణుపు ; ఉప్పు – అర టీ స్పూన్ లేదా రుచిని బట్టి ; కొబ్బరి నూనె లేదా వంట నూనె – టీ స్పూన్ ; ఆవాలు – పావు టీ స్పూన్ ; కరివేపాకు రెమ్మ – 1 ; ఎండుమిర్చి – 2.

**మసాలా కోసం:** మెంతులు – అర టీ స్పూన్ ; ధనియాలు – టేబుల్ స్పూన్ ; ఎండుమిర్చి – 1 ; తాజా కొబ్బరి తురుము – కప్పు.

**తయారీ:** ● కాకరకాయ ముక్కల్లో చింతపండు, ఉప్పు, పసుపు వేసి ఒక మోస్తరుగా ఉడికించాలి. ఇలా చేయడం వల్ల చేదు విరిగిపోతుంది. ● ప్రెషర్ కుకర్‌లో కాకర ముక్కలు, ఉల్లిపాయ ముక్కలు, చింతపండు రసం, ఉప్పు, పసుపు వేసి మూత పెట్టి రెండు విజిల్స్ వచ్చే వరకు ఉడికించాలి. ● ప్రెషర్ తగ్గేలోపు మసాలా సిద్ధం చేసుకోవాలి. ● ఒక బాణలిలో మెంతులు, ధనియాలు, ఎండుమిర్చి వేసి సన్న మంట మీద దోరగా వేగిన తర్వాత కొబ్బరి తురుము వేసి బంగారు రంగు వచ్చే వరకు వేయించాలి. ● ఈ దినుసులన్నీ చల్లారిన తర్వాత తగినంత నీటిని కలుపుతూ మెత్తగా పేస్ట్ చేయాలి. ● కుకర్ మూత తీసి మసాలా వేసి కలిపి మళ్లీ వెలిగించి మూత పెట్టకుండా ఉడికించాలి. అవసరాన్ని బట్టి మరికొంత నీటిని కలిపి రుచి చూసుకుని చిక్కదనం సరిపోయే వరకు పెద్ద మంట మీద ఉడికించి దించేయాలి.
– బాణలిలో నూనె వేడి చేసి ఆవాలు, ఎండుమిర్చి, కరివేపాకు వేయించి కర్రీలో వేసి కలిపితే పావక్క తీయాల్ రెడీ.

## స్టఫ్‌డ్...



**కావలసినవి:** కాకరకాయలు – పావు కేజీ ; పసుపు – అర టీ స్పూన్ ; ఉప్పు – టీ స్పూన్ ; నూనె – 2 టేబుల్ స్పూన్‌లు.

**స్టఫ్ కోసం:** మీగడ లేదా తరిగిన పనీర్– 2 టేబుల్ స్పూన్‌లు మిరప్పొడి– టీ స్పూన్ ; ఉప్పు– టీ స్పూన్ ; చాట్ మసాలా పొడి లేదా గరం మసాలా పొడి– టేబుల్ స్పూన్ ; ఆమ్‌చూర్ పౌడర్– టీ స్పూన్.

**తయారీ:** ● కాకరకాయలను కడిగి మొదలు, చివరలు తీసేసి ఒక్కో కాయను ముక్కలుగా (ఫొటోలో కనిపిస్తున్నట్లు) చేయాలి. ● ఒక పాత్రలో నీటిని మరిగించి, మరుగుతున్న నీటిలో పసుపు, ఉప్పు, కాకరకాయ ముక్కలను వేసి మూతపెట్టి మంట ఆపేయాలి. ● ఐదారు నిమిషాల తర్వాత నీటిలో నుంచి కాకరకాయ ముక్కలను తీసి ఒక ప్లేట్‌లో పెట్టాలి. ● స్టఫ్ కోసం తీసుకున్న దినుసులన్నింటినీ ఒక పాత్రలో వేసి బాగా కలపాలి. కాకరగింజలను తొలగించి ఆ స్థానంలో ఈ మిశ్రమాన్ని స్టఫ్ చేయాలి. ● బాణలిలో నూనె వేడి చేసి స్టఫ్ చేసిన కాకరకాయ ముక్కలను వేసి వేయించాలి.

**గమనిక:** స్టఫ్ కోసం ఉల్లి, వెల్లుల్లి కారం కూడా వాడుకోవచ్చు.



## ఫైనల్లో బెర్త్ కోసం బరిలో భారత బాక్సర్లు

ప్రపంచ పురుషుల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో నేడు ముగ్గురు భారత బాక్సర్లు కీలకపోరుకు సిద్ధమయ్యారు. తెలంగాణకు చెందిన హుసాముద్దీన్ (57 కేజీలు), హరియాణాకు చెందిన దీపక్ భోరియా (51 కేజీలు), నిశాంత్ దేవ్ (71 కేజీలు) సెమీఫైనల్ బౌట్‌లలో పోటీపడనున్నారు. 2022 యూరోపియన్ చాంపియన్ బిలాలా బెనామా (ఫ్రాన్స్)తో దీపక్; సైడెల్ హోర్టా (క్యూబా)తో హుసాముద్దీన్; 2022 ఆసియా చాంపియన్ అస్లాన్‌బెక్ షింబెర్జెనోవ్ (కజకిస్తాన్)తో నిశాంత్ దేవ్ తలపడతారు. సెమీఫైనల్లో గెలిస్తే ఫైనల్ చేరి స్వర్ణ–రజత పతకాల బరిలో ఉంటారు. ఓడితే కాంస్య పతకాన్ని గెల్చుకుంటారు. భారత కాలమానం ప్రకారం నేడు సాయంత్రం గం. 5:30కు దీపక్ బౌట్ ఉంది. ఆ తర్వాత హుసాముద్దీన్, నిశాంత్ దేవ్ బౌట్‌లు జరుగుతాయి. ఫ్యాన్‌కోడ్ యాప్‌లో ఈ బౌట్‌లను ప్రత్యక్షంగా తిలకించవచ్చు. ప్రపంచ చాంపియన్‌షిప్ చరిత్రలో ఇప్పటి వరకు భారత్ నుంచి ఒక్కరే ఫైనల్‌కు అర్హత సాధించారు. 2019లో అమిత్ పంఘాల్ (52 కేజీలు) ఫైనల్లో ఓడిపోయి రజత పతకం గెల్చుకున్నాడు.

# సరబ్‌జోత్–దివ్య జోడీకి స్వర్ణం

ప్రపంచకప్ షూటింగ్ టోర్నీ



బకూ (అజర్‌బైజాన్): ప్రపంచకప్ షూటింగ్ టోర్నమెంట్‌లో భారత్‌కు తొలి స్వర్ణ పతకం లభించింది. గురువారం జరిగిన 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో సరబ్‌జోత్ సింగ్–దివ్య థడిగోల్ సుబ్బరాజు (భారత్) ద్వయం విజేతగా నిలిచింది. స్వర్ణ–రజత పతక ఫైనల్ పోరులో సరబ్‌జోత్–దివ్య జోడీ 16–14తో జొరానా అరునోవిచ్–దామిర్ మికెచ్ (సెర్బియా) ద్వయంపై విజయం సాధించింది. సరబ్‌జోత్ కెరీర్‌లో ఇది రెండో ప్రపంచకప్ స్వర్ణంకాగా... బెంగళూరుకు చెందిన దివ్యకు ప్రపంచకప్ టోర్నీలలో తొలి పతకం కావడం విశేషం. మొత్తం 55 జోడీలు పాల్గొన్న క్వాలిఫయింగ్‌లో సరబ్‌జోత్–దివ్య ద్వయం 581 పాయింట్లు స్కోరు చేసి టాప్ ర్యాంక్‌లో నిలిచి స్వర్ణ–రజత పతక మ్యాచ్‌కు అర్హత సాధించింది. భారత్‌కే చెందిన ఇషా సింగ్–వరుణ్ తోమర్ జంట 578 పాయింట్లు స్కోరు చేసి ఆరో ర్యాంక్‌లో నిలిచి పతక మ్యాచ్‌లకు అర్హత పొందడంలో విఫలమైంది. టాప్–4లో నిలిచిన జోడీలు పతక మ్యాచ్‌లకు అర్హత సాధిస్తాయి. ఈ టోర్నీలో భారత్ ఒక స్వర్ణం, ఒక కాంస్యంతో రెండు పతకాలతో రెండో స్థానంలో ఉంది.

# 'బ్లాక్‌డే' పాటించిన రెజ్లర్లు



న్యూఢిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్‌ఐ) అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు చేసిన రెజ్లర్ల నిరసన జంతర్ మంతర్ వద్ద కొనసాగుతోంది. నిరసనకు 18వ రోజైన గురువారం రెజ్లర్లు 'బ్లాక్‌డే'గా పాటించారు. బ్రిజ్‌భూషణ్‌ను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ వీరంతా నల్ల బ్యాండ్‌లు ధరించి తమ అసంతృప్తిని ప్రదర్శించారు. 'ఈ రోజు మేం బ్లాక్‌డే పాటించాం. దేశం మొత్తం మాకు అండగా నిలుస్తోంది కాబట్టి విజయం సాధిస్తామని నమ్ముతున్నాం. న్యాయం దక్కే వరకు మా నిరసన కొనసాగుతుంది' అని బజరంగ్, సాక్షి మలిక్, వినేశ్ ఫొగాట్ అన్నారు.

## శ్రీకాంత్‌కు విదేశీ కోచ్



న్యూఢిల్లీ: వచ్చే ఏడాది జరిగే పారిస్ ఒలింపిక్స్‌ను దృష్టిలో పెట్టుకొని భారత బ్యాడ్మింటన్ స్టార్ కిడాంబి శ్రీకాంత్ వ్యక్తిగత విదేశీ కోచ్‌ను నియమించుకున్నాడు. ఇండోనేసియాకు చెందిన వీంపి సహోర్డి ఇక నుంచి శ్రీకాంత్‌కు శిక్షణ ఇస్తాడు. 2021 డిసెంబర్‌లో భారత సింగిల్స్ ప్లేయర్లకు విదేశీ కోచ్‌గా ఉన్న అగుస్ ద్వి సాంతోసో తిరిగి వెళ్లిపోయాక భారత సింగిల్స్ ప్లేయర్లకు విదేశీ కోచ్ లేకుండా పోయాడు. కోచ్ కావాలని భారత స్పోర్ట్స్ అథారిటీకి గత జనవరిలో ప్రతిపాదన పంపించినా ఎలాంటి చర్యలు లేకపోవడం... ఒలింపిక్స్ క్వాలిఫయింగ్ టోర్నీలు మొదలుకావడంతో తానే కోచ్‌ను నియమించుకున్నానని శ్రీకాంత్ తెలిపాడు.

## భారత్‌కు క్లిష్టమైన 'డ్రా'

దోహా: ఏషియన్ కప్ పురుషుల ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో భారత జట్టుకు కఠినమైన 'డ్రా' ఎదురైంది. వచ్చే ఏడాది జనవరిలో ఖతర్ వేదికగా ఈ మెగా టోర్నీ జరగనుంది. గ్రూప్ 'బి'లో ఆస్ట్రేలియా (ప్రపంచ 29వ ర్యాంక్), ఉజ్బెకిస్తాన్ (74వ ర్యాంక్), సిరియా (90వ ర్యాంక్) జట్లతో కలిసి భారత్ (101వ ర్యాంక్) ఉంది. వచ్చే ఏడాది జనవరి 12 నుంచి ఫిబ్రవరి 10 వరకు జరిగే ఈ టోర్నీలో మొత్తం 24 జట్లను ఆరు గ్రూప్‌లుగా విభజించారు. 67 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ టోర్నీలో భారత జట్టు 1964లో రన్నరప్‌గా నిలిచింది. ఆ తర్వాత భారత్ 1984లో, 2011లో, 2019లో ఈ టోర్నీకి అర్హత సాధించినా గ్రూప్ దశలోనే నిష్క్రమించింది.

# జై జైస్వాల్...

**47 బంతుల్లో 12 ఫోర్లు, 5 సిక్స్‌లతో 98 నాటౌట్**

- 9 వికెట్లతో రాజస్తాన్ ఘన విజయం
- ఈడెన్‌లో కోల్‌కతా చిత్తు
- చహల్‌కు 4 వికెట్లు



చహల్



యశస్వి జైస్వాల్

తొలి ఓవర్లో 6, 6, 4, 4, 2, 4... ఇలా దూకుడు మొదలు పెట్టిన యశస్వి జైస్వాల్ ఆగలేదు... తొలి 6 బంతుల్లో 26 పరుగులు రాబట్టిన అతను తర్వాతి 7 బంతుల్లో మరో 24 పరుగులు కొట్టేశాడు. అంతే...13 బంతుల్లో ఐపీఎల్‌లో ఫాస్టెస్ట్ ఫిఫ్టీతో కొత్త రికార్డు సృష్టించాడు. 3 ఓవర్లలోపే యశస్వి హాఫ్ సెంచరీ అయిపోయింది. మరో 3 ఓవర్లు ముగిసేసరికి జట్టు స్కోరు 78 పరుగులు. అక్కడే మ్యాచ్‌లో ఎవరు గెలవబోతున్నారో అర్థమైపోయింది! ఇక మిగిలింది యశస్వి ఎంత దూరం, ఎలా వెళతాడనేది... సెంచరీ వరకు చేరగలిగాడు కానీ రెండు పరుగుల తేడాతో శతకం చేజారింది. అయితేనేం ఐపీఎల్‌లో అత్యుత్తమ ఇన్నింగ్స్‌లలో ఒకటి ఆడిన జైస్వాల్ రాజస్తాన్ జట్టును గెలిపించాడు... మరో ఎండ్‌లో కెప్టెన్ సామ్సన్ మెరుపు బ్యాటింగ్‌తో పని సులువైంది. రాజస్తాన్ 41 బంతులు మిగిలి ఉండగానే నైట్‌రైడర్స్‌ను చిత్తు చేసింది.

**ఐపీఎల్ పాయింట్ల పట్టిక**

| జట్టు | ఆ | గె | ఓ | ర | పా | నె.ర. |
|---|---|---|---|---|---|---|
| గుజరాత్ | 11 | 8 | 3 | 0 | 16 | 0.951 |
| చెన్నై | 12 | 7 | 4 | 1 | 15 | 0.493 |
| రాజస్తాన్ | 12 | 6 | 6 | 0 | 12 | 0.633 |
| ముంబై | 11 | 6 | 5 | 0 | 12 | -0.255 |
| లక్నో | 11 | 5 | 5 | 1 | 11 | 0.294 |
| బెంగళూరు | 11 | 5 | 6 | 0 | 10 | -0.345 |
| కోల్‌కతా | 12 | 5 | 7 | 0 | 10 | -0.357 |
| పంజాబ్ | 11 | 5 | 6 | 0 | 10 | -0.441 |
| హైదరాబాద్ | 10 | 4 | 6 | 0 | 8 | -0.472 |
| ఢిల్లీ | 11 | 4 | 7 | 0 | 8 | -0.605 |

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ర-రద్దు పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

**ఐపీఎల్‌లో నేడు**

ముంబై × గుజరాత్ (రాత్రి గం. 7:30 నుంచి)

స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

కోల్‌కతా: ఈడెన్ గార్డెన్స్‌లో రాజస్తాన్ పండగ చేసుకుంది. నైట్‌రైడర్స్ బ్యాటింగ్ చేసినంత సేపూ నెమ్మదిగా అనిపించిన పిచ్‌పైనే పరుగులు వరద పారించి కీలక విజయాన్ని అందుకుంది. గురువారం జరిగిన పోరులో రాజస్తాన్ 9 వికెట్ల తేడాతో కోల్‌కతాపై ఘన విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 149 పరుగులు చేసింది. వెంకటేశ్ అయ్యర్ (42 బంతుల్లో 57; 2 ఫోర్లు, 4 సిక్స్‌లు) మినహా అంతా విఫలమయ్యారు. యజువేంద్ర చహల్ 25 పరుగులకు 4 వికెట్లు పడగొట్టి కోల్‌కతాను కట్టడి చేశాడు. అనంతరం రాజస్తాన్ 13.1 ఓవర్లలో వికెట్ నష్టానికి 151 పరుగులు చేసి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' యశస్వి జైస్వాల్ (47 బంతుల్లో 98 నాటౌట్; 12 ఫోర్లు, 5 సిక్స్‌లు), సంజూ సామ్సన్ (29 బంతుల్లో 48 నాటౌట్; 2 ఫోర్లు, 5 సిక్స్‌లు) చెలరేగి జట్టును లక్ష్యానికి చేర్చారు.

వెంకటేశ్ అయ్యర్ బ్యాటింగ్‌ను మినహాయిస్తే కోల్‌కతా ఇన్నింగ్స్ ఆసాంతం పేలవంగా సాగింది. వెంకటేశ్ కూడా మరీ విధ్వంసకరంగా ఆడకపోయినా... పరిస్థితిని





బట్టి తనవంతు పాత్ర పోషించాడు. వెంకటేశ్ 42 బంతుల్లో 57 పరుగులు చేయగా ... ఇతర ఆటగాళ్లంతా కలిసి 78 బంతుల్లో 89 పరుగులు చేయగలిగారంటే అతని ఇన్నింగ్స్ విలువ తెలుస్తుంది.

**ధనాధన్...**

ఆశ్చర్యకరంగా పార్ట్‌టైమ్ బౌలర్, కోల్‌కతా కెప్టెన్ నితీశ్ రాణా మొదటి ఓవర్ వేశాడు. ఆ ఓవర్లో ఏకంగా 26 పరుగులు రాబట్టి ప్రత్యర్థిని యశస్వి కఠినంగా శిక్షించాడు. సమన్వయ లోపంతో జోస్ బట్లర్ (0) రనౌట్ కావడంతో రాయల్స్ తొలి వికెట్ కోల్పోయింది. అయితే జట్టుపై అది ఎలాంటి ప్రభావం చూపించలేదు. యశస్వి, సామ్సన్ కలిసి వేగం తగ్గకుండా ఇన్నింగ్స్‌ను నడిపించారు. వీరి షాట్లకు నైట్‌రైడర్స్ బౌలర్ల వద్ద సమాధానం లేకపోయింది. సామ్సన్ 16 పరుగుల వద్ద ఉన్నప్పుడు ఇచ్చిన క్యాచ్‌ను నేలపాలైంది. అనంతరం అనుకూల్ వేసిన ఓవర్లో 3 సిక్సర్లతో సామ్సన్ చెలరేగాడు. చివర్లో యశస్వి సెంచరీ విషయంలో కాస్త ఉత్కంఠ నెలకొంది. యశస్వి 94 పరుగుల వద్ద ఉండగా రాయల్స్‌కు 3 పరుగులు కావాలి. 13వ ఓవర్ చివరి బంతికి పరుగు తీయని సామ్సన్ సిక్సర్ కొట్టమన్నట్లుగా సైగ చేస్తూ యశస్వికి అవకాశం ఇచ్చాడు. అయితే తర్వాతి బంతికి ఫోర్ మాత్రమే రావడంతో యశస్వి 98 పరుగుల వద్ద ఆగిపోవాల్సి వచ్చింది. అయితే దానిని పట్టించుకోకుండా అతను విజయానందాన్ని ప్రదర్శించాడు.

**1** ఐపీఎల్ చరిత్రలో అత్యంత వేగంగా అర్ధ సెంచరీ చేసిన క్రికెటర్‌గా యశస్వి (13 బంతుల్లో) నిలిచాడు. గతంలో ఈ రికార్డు కేఎల్ రాహుల్, కమిన్స్ (14 బంతుల్లో) పేరిట ఉంది.

**187** ఐపీఎల్ చరిత్రలో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా చహల్ రికార్డు నెలకొల్పాడు. డ్వేన్ బ్రేవో (161 మ్యాచ్‌ల్లో 183 వికెట్లు) పేరిట ఉన్న రికార్డును చహల్ (143 బంతుల్లో 187 వికెట్లు) సవరించాడు.

## స్కోరు వివరాలు

**కోల్‌కతా నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్:** జేసన్ రాయ్ (సి) హెట్‌మైర్ (బి) బౌల్ట్ 10; గుర్బాజ్ (సి) సందీప్ శర్మ (బి) బౌల్ట్ 18; వెంకటేశ్ (సి) బౌల్ట్ (బి) చహల్ 57; నితీశ్ రాణా (సి) హెట్‌మైర్ (బి) చహల్ 22; రసెల్ (సి) అశ్విన్ (బి) ఆసిఫ్ 10; రింకూ సింగ్ (సి) రూట్ (బి) చహల్ 16; శార్దుల్ (ఎల్బీ) (బి) చహల్ 1; అనుకూల్ (నాటౌట్) 6; నరైన్ (సి) రూట్ (బి) సందీప్ 6; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 149. వికెట్ల పతనం:** 1–14, 2–29, 3–77, 4–107, 5–127, 6–129, 7–140, 8–149. **బౌలింగ్:** బౌల్ట్ 3–0–15–2, సందీప్ శర్మ 4–0–34–1, అశ్విన్ 4–0–32–0, రూట్ 2–0–14–0, యజువేంద్ర చహల్ 4–0–25–4, ఆసిఫ్ 3–0–27–1.

**రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్:** యశస్వి (నాటౌట్) 98; బట్లర్ (రనౌట్) 0; సామ్సన్ (నాటౌట్) 48; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (13.1 ఓవర్లలో వికెట్ నష్టానికి) 151. వికెట్ల పతనం:** 1–30. **బౌలింగ్:** నితీశ్ రాణా 1–0–26–0, హర్షిత్ రాణా 2–0–22–0, శార్దుల్ ఠాకూర్ 1.1–0–18–0, వరుణ్ చక్రవర్తి 3–0–28–0, సునీల్ నరైన్ 2–0–13–0, సుయశ్ 3–0–22–0, అనుకూల్ 1–0–20–0.

# సినిమా



**"ఓ నటుడుగా నన్ను నేనెప్పుడూ విమర్శించుకుంటూనే ఉంటాను... అభినందించుకోను. ఎప్పటికప్పుడు తప్పులు వెతుకుతూనే ఉంటాను.. నటుడిగా నన్ను నేను మెరుగుపరచుకునేందుకు ఇది ఉపయోగపడుతుందని భావిస్తున్నాను" అని అన్నారు నాగచైతన్య. వెంకట్ ప్రభు దర్శకత్వంలో నాగచైతన్య, కృతీ శెట్టి హీరో హీరోయిన్లుగా నటించిన ద్విభాషా (తెలుగు, తమిళం) చిత్రం 'కస్టడీ'. పవన్‌కుమార్ సమర్పణలో శ్రీనివాసా చిట్టూరి నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో నాగచైతన్య చెప్పిన విశేషాలు.**

## ఆ విషయం ఓ సవాల్‌గా మారింది

- నాగచైతన్య

● తమిళ చిత్రం 'మానాడు' విడుదల కాకముందే వెంకట్ ప్రభుగారు నాకు 'కస్టడీ' స్టోరీ చెప్పారు. అయితే 'మానాడు' విడుదలై, హిట్ సాధించిన తర్వాత, ఈ సినిమానే మేం తెలుగులో రీమేక్ చేస్తే బాగుంటుందన్నట్లుగా కొందరు నిర్మాతలు అభిప్రాయపడ్డారు. కానీ 'కస్టడీ' స్టోరీ నన్ను ఎగ్జయిట్ చేసింది. పైగా ప్రీ ప్రొడక్షన్ వర్క్ కొంతవరకు పూర్తయింది. దీంతో 'కస్టడీ'ని సెట్స్‌పైకి తీసుకెళ్లాం. ఈ సినిమాలో భాగంగా కొందరు పోలీసులను కలిశాను. వారి కథలు నన్ను చాలా ఇన్‌స్పైర్ చేశాయి.

● ఈ సినిమాలో నేను పోలీస్ కానిస్టేబుల్ శివ పాత్ర చేశాను. నా కెరీర్‌లో ఎప్పుడూ చేయనటువంటి కొన్ని కొత్త యాక్షన్ సీక్వెన్స్‌లను ఈ సినిమా కోసం చేశాం. కథ రీత్యా ఈ తరహా యాక్షన్ సీక్వెన్స్‌లు అవసరం అయ్యాయి. అయితే కొన్ని యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణ కోసం కొంత రిహార్సల్స్ చేశాం. ఈ సినిమాలోని వాటర్ సీక్వెన్స్ కోసం మూడు రోజులు రిహార్సల్స్ చేసి, దాదాపు 15 రోజులు షూట్ చేశాం. ఈ ఎపిసోడ్ ఓ హైలైట్‌గా ఉంటుంది.

● సినిమా మొదలైన తొలి ఇరవై నిమిషాలు కూల్‌గా ఉంటుంది. ఎప్పుడైతే స్క్రీన్‌పైకి అరవింద్ స్వామిగారు వస్తారో అప్పట్నుంచి స్టోరీ మలుపు తీసుకుని ఆడియన్స్‌ను స్క్రీన్‌పై నుంచి చూపు తిప్పుకోనివ్వకుండా చేస్తుంది. ఈ చిత్రంలో శరత్ కుమార్, అరవింద్ స్వామి, ప్రియమణి వంటి సీనియర్స్ నటించారు. వారి నుంచి నేను కొన్ని విషయాలు నేర్చుకున్నాను. ఇచ్చిన డైలాగ్స్‌ను తనదైన స్టైల్లో ఇంప్రూవ్ చేసి చెబుతుంటారు అరవింద్ స్వామి గారు. ఇది నాకు చాలా కొత్తగా అనిపించింది. వెంకట్‌గారు ఏ స్క్రిప్ట్ అయితే నాకు చెప్పారో అదే తీశారు. ఆయన స్క్రీన్‌ప్లే స్టయిల్ తెలుగు ప్రేక్షకులకు కొత్తగా ఉంటుంది. ఈ చిత్రంలో కమర్షియల్ ఎలిమెంట్స్ స్టోరీకి తగ్గట్లుగానే ఉంటాయి. ఫ్యామిలీ ఎలిమెంట్స్ కూడా ఉన్నాయి. అవుట్‌పుట్ పట్ల చాలా నమ్మకంతో ఉన్నాను. పోలీస్ బ్యాక్‌డ్రాప్ సినిమాల్లో నాకు 'ఘర్షణ', నాన్నగారి 'శివమణి', 'జేమ్స్ బాండ్' యాక్షన్ ఫ్రాంచైజీ చిత్రాలు ఇష్టం.

● నిర్మాత శ్రీనివాసా చిట్టూరిగారు సెట్స్‌లో కూల్‌గా ఉంటారు. 'కస్టడీ' నా కెరీర్‌లోనే అత్యధిక బడ్జెట్‌తో నిర్మించబడింది. ఈ సినిమా 1990 బ్యాక్‌డ్రాప్‌లో ఉంటుంది.

**మా తాతగారు, నాన్నగారు గొప్ప గొప్ప సినిమాలు చేశారు. కొన్ని స్టాండర్డ్స్ క్రియేట్ చేశారు. కొందరు వారితో మాకు పోలికలు పెడుతుంటారు. అయితే ఈ విషయాన్ని నేను ఓ ప్రెజర్‌లా తీసుకోను. చాలెంజ్‌లా స్వీకరించి, నన్ను నేను ప్రూవ్ చేసుకోవడానికి ప్రయత్నిస్తుంటాను. ఆ స్థాయికి నేను రీచ్ అవుతానా? లేదా అనేది నాకు తెలియదు. కానీ నా శక్తివంచన లేకుండా కష్టపడుతూనే ఉంటాను.**

ఇళయరాజాగారు, యువన్ శంకర్‌రాజాగార్లు ఇచ్చిన మ్యూజిక్ 'కస్టడీ'కి ప్లస్. 'కస్టడీ'ని వేరే సినిమాతో పోల్చవద్దు. 'కస్టడీ' చిత్రం 'కస్టడీ'యే.

● నేను తెలుగు డబ్బింగ్ కోసం దాదాపు పది రోజులు తీసుకుంటాను. కానీ తమిళ 'కస్టడీ' సినిమాకు డబ్బింగ్ పూర్తి చేయడానికి నెలరోజుల టైమ్ పట్టింది. నా సొంత వాయిస్ అయితే ఆడియన్స్‌కు యాక్టర్‌గా చేరువ కావొచ్చు. మన పెర్ఫార్మెన్స్ కూడా మెరుగ్గా కనిపిస్తుంది. అందుకే తమిళంలో డబ్బింగ్ చెప్పాను.

● నేను ఫలానా రకమైన సినిమాలు చేస్తేనే ఆడియన్స్‌కు నచ్చుతాయని అదే ట్రాక్‌లోకి వెళితే ఓ యాక్టర్‌గా అది నా బలహీనత అవుతుంది. ఈ విషయంలో నన్ను నేను కన్విన్స్ చేసుకోలేను. గతంలో నేను చేసిన కొన్ని లవ్‌స్టోరీలు వర్కౌట్ అయ్యాయి. అలా అని అవే సినిమాలు చేస్తుంటే ఓ యాక్టర్‌గా ఎదగలేను. చైతన్య ఎలాంటి సబ్జెక్ట్ అయినా బాగా చేస్తాడని ఆడియన్స్‌తో అనిపించుకోవాలి.

● ప్రస్తుత పరిస్థితుల్లో ప్రేక్షకులకు ఏ రకమైన సినిమాలు నచ్చుతున్నాయో తెలుసుకోవడం చాలెంజ్‌లా మారింది. కానీ ఆడియన్స్‌కు నచ్చే సినిమా ఇస్తే వారి ఆదరణ ఓ రేంజ్‌లో ఉంటుంది.

● నా తర్వాతి ప్రాజెక్ట్ గురించి త్వరలో అధికారికంగా చెబుతాను. 'ధూత' వెబ్ సిరీస్ రిలీజ్ అమెజాన్ చేతిలో ఉంది. ఈ ఏడాదే స్ట్రీమింగ్ స్టార్ట్ కావొచ్చు.

**నా గురించిన కొన్ని వార్తలు వస్తూనే ఉన్నాయి (విడాకుల అంశాన్ని పరోక్షంగా ప్రస్తావిస్తూ..). డిఫరెంట్ వార్తలు రాస్తున్నారు. కానీ ఆడియన్స్ ఫూల్స్ కాదు. తెలివైనవారు. ఏది జెన్యూన్ న్యూస్.. ఏది కాదనేది వారికి తెలుసని అనుకుంటున్నాను. నేను అయితే నవ్వుకుని వదిలేస్తున్నాను.**


## గేమ్ స్టార్ట్

'ది కేరళ స్టోరీ' వంటి వివాదాత్మక సినిమా తర్వాత హీరోయిన్ అదా శర్మ ఓ పోలీస్ పాత్రలో కనిపించనున్నారు. 'హేట్ స్టోరీ 2' ఫేమ్ విశాల్ పాండ్య దర్శకత్వంలో శ్రేయాస్ తల్పాడే హీరోగా నటిస్తున్న చిత్రం 'ది గేమ్ ఆఫ్ గిర్గిట్'. ఈ చిత్రంలో అదా శర్మ నటిస్తున్నట్లు చిత్రయూనిట్ గురువారం ప్రకటించింది. ఇటీవల కాలంలో యువతలో బాగా ప్రాచుర్యం పొందిన 'బ్లూ వేల్ గేమ్' (బ్లూ వేల్ ఛాలెంజ్) నేపథ్యంలో థ్రిల్లర్‌గా ఈ కథ సాగుతుంది. ఇందులో అదా శర్మ పోలీస్ పాత్ర చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ– ''గతంలో 'కమాండో' సినిమాలో భావనా రెడ్డి అనే పోలీస్ పాత్ర చేశాను. ఆ పాత్ర మంచి ప్రజాదరణ పొందింది. ఇప్పుడు 'ది గేమ్ ఆఫ్ గిర్గిట్'లో గాయత్రీ భార్గవ్ అనే పోలీస్ పాత్ర చేస్తున్నాను. నా పాత్ర సరదాగా, విభిన్నంగా ఉంటుంది'' అన్నారు.



● అదాశర్మ

## ఓ సరదా ప్రయాణం



● నాగశౌర్య

నాగశౌర్య హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'రంగబలి'. ఈ చిత్రం ద్వారా పవన్ బాసంశెట్టి దర్శకునిగా పరిచయమవుతున్నారు. ఎస్‌ఎల్‌వీ సినిమాస్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న 'రంగబలి'ని జూలై 7న విడుదల చేయనున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించింది. నాగశౌర్య ట్రెండీ గెటప్‌లో కనిపిస్తున్న ఓ పోస్టర్ ద్వారా రిలీజ్ డేట్‌ని అనౌన్స్ చేశారు. ''పల్లెటూరి నేపథ్యంలో సాగే కథతో 'రంగబలి' ఫన్ రైడ్ (సరదా ప్రయాణం) గా ఉండబోతోంది. ఇందులో నాగశౌర్య విభిన్నమైన పాత్రలో కనిపించనున్నారు.. ఇందుకు ప్రత్యేకంగా మేకోవర్ అయ్యారు. ఈ సినిమా షూటింగ్ చివరి దశలో ఉంది. హీరోయిన్, ఇతర వివరాలను త్వరలోనే తెలియజేస్తాం'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: పవన్ సీహెచ్, కెమెరా: దివాకర్ మణి.

## ప్రపంచంలో జరుగుతున్నదే మళ్ళీ పెళ్లిలో చూపిస్తున్నాం

- వీకే నరేశ్

''ఓ మనిషి చావు చివరి దశలో ఉన్నప్పుడు చేయాల్సిన పనులు ఏవైనా మిగిలి ఉన్నాయా? ఏమైనా ప్రదేశాలను చూడాలనుకుని చూడలేకపోయామా? మనవల్ల ఎవరికైనా అన్యాయం జరిగిందా? అనే మూడు అంశాల గురించి ఓసారి ఆలోచిస్తాడు. కానీ ఏ మనిషి జీవితంలో అయినా ఈ మూడు ఆశలు తీరనవిగా ఉండకూడదు. ఇదే 'మళ్ళీ పెళ్లి' సినిమా బేసిక్ కాన్సెప్ట్'' అన్నారు నటుడు వీకే నరేశ్. ఎమ్.ఎస్. రాజు దర్శకత్వంలో వీకే నరేశ్, పవిత్రా లోకేశ్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'మళ్ళీ పెళ్లి'. విజయకృష్ణా మూవీస్ పతాకంపై వీకే నరేశ్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 26న విడుదల కానుంది. గురువారం హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ప్రెస్‌మీట్‌లో విజయకృష్ణా మూవీస్ లోగోను వీకే నరేశ్, పవిత్రాలు రీ లాంచ్ చేశారు. ఎమ్ఎస్ రాజు ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా వీకే నరేశ్ మాట్లాడుతూ– ''ప్రపంచంలో జరుగుతున్న అంశాలనే ఈ చిత్రంలో బోల్డ్‌గా చూపించాం. ఇది నా జీవితానికి సంబంధించిన సబ్జెక్ట్ కాదు'' అని అన్నారు. ''సినిమాలో ఉన్నట్లే జీవితంలో కూడా ఫస్టాఫ్, సెకండాఫ్ ఉంటాయి. ఎవరైనా సెకండాఫ్ చాలా బాగుండాలని కోరుకుంటారు.. అదే 'మళ్ళీ పెళ్లి' కాన్సెప్ట్. ఆడియన్స్‌ను చీట్ చేయడం లేదు. తప్పుని తప్పుగానే చూపిస్తున్నాం.'' అన్నారు ఎమ్ఎస్ రాజు. ''ఈ సినిమాలో నటిస్తున్నప్పుడు ఎమ్ఎస్ రాజుగారి నుంచి చాలా నేర్చుకున్నాను'' అన్నారు పవిత్రా లోకేశ్. ఈ కార్యక్రమంలో సంగీతదర్శకులు సురేష్ బొబ్బిలి, అరుల్‌దేవ్, ఎడిటర్ జునైద్ తదితరులు పాల్గొన్నారు.



● నరేశ్, పవిత్రా లోకేశ్, ఎమ్ఎస్ రాజు


## హ్యాపీ ఎండింగ్

యశ్ పూరి, అపూర్వ రావు జంటగా నటించిన చిత్రం 'హ్యాపీ ఎండింగ్'. కౌశిక్ భీమిడి దర్శకత్వంలో హామ్స్ టెక్ ఫిల్మ్స్, సిల్లీ మాంక్స్ పతాకాలపై రూపొందిన ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. ''అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చేలా ఈ సినిమా ఉంటుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. అజయ్ ఘోష్, విష్ణు ఓయ్, ఝాన్సీ, అనిత చౌదరి, హర్ష రోషన్, జియా శర్మ నటించిన ఈ సినిమాకు సంగీతం: రవి నిడమర్తి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కిరణ్ రామానుజం.



● యశ్ పూరి

## వాస్తవ ఘటనతో...



● నిష్మా, ఇషాన్, శక్తి

ఇషాన్ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'అంతం కాదిది ఆరంభం'. శక్తి మహేంద్రా, నిష్మా, ప్రణాళి హీరోయిన్స్. ప్రభు పాల్‌రాజ్, సిరాజ్ నిర్మించారు. ఈ చిత్రం మోషన్ పోస్టర్‌ని డైరెక్టర్ దశరథ్ విడుదల చేసి, మాట్లాడుతూ– ''తమిళనాడులోని పొల్లాచ్చిలో జరిగిన ఓ వాస్తవ ఘటన ఆధారంగా ఈ సినిమా తీశారు. తమని ట్రాప్ చేసి, నగ్న వీడియోలు తీసి వాట్సప్ గ్రూపుల్లో షేర్ చేసిన వ్యక్తిని బాధిత అమ్మాయిలు ఎలా పట్టుకున్నారు? అనేదే ఈ చిత్రకథ'' అన్నారు. సిరాజ్ మాట్లాడుతూ– ''ప్రస్తుత సమాజంలో జరుగుతున్న వాస్తవ ఘటనలతో ఇషాన్ ఈ చిత్రాన్ని చక్కగా తెరకెక్కించాడు'' అన్నారు. సంగీత దర్శకుడు వినోద్ యాజమాన్య, రచయిత రాంబాబు గోసాల, షేర్ స్టూడియో అధినేత దేవీ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: టి. శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కర్రి మోహన్.

## హీరో ఆఫ్ ఇండియా!



● అంకిత, కిషోర్

కిషోర్ తేజ, అంకిత మూలేర్ జంటగా ఆకుల రాఘవ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'హీరో ఆఫ్ ఇండియా'. తుమ్మలపల్లి రామసత్య నారాయణ నిర్మించిన ఈ సినిమా త్వరలో రిలీజ్ కానుంది. ఈ చిత్రం ట్రైలర్‌ను తెలంగాణ ఫిల్మ్ చాంబర్ అధ్యక్షుడు రామకృష్ణ గౌడ్ లాంచ్ చేశారు. జె. భానుప్రసాద్ స్వరపరచిన మొదటి పాటని తెలుగు ఫిలిం చాంబర్ అధ్యక్షుడు బసిరెడ్డి, రెండో పాటని నిర్మాత సాయి వెంకట్ లాంచ్ చేశారు. ''తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, అమెరికాలోనూ మా సినిమాను రిలీజ్ చేస్తున్నందుకు హ్యాపీ'' అన్నారు తుమ్మలపల్లి రామసత్యనారాయణ.

స్టాక్ మార్కెట్లు

| దేశీ సూచీలు | |
|---|---|
| సెన్సెక్స్ ▽ 36 | నిఫ్టీ ▽ 18 |
| 61,904 | 18,297 |

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

| విదేశీ సూచీలు (గురువారం రాత్రి 11.30 గంటలకు) | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 12,335 | △ | 28 |
| డోజోన్స్ | 33,293 | ▽ | 238 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,727 | ▽ | 14 |
| డాక్స్ | 15,835 | ▽ | 61 |
| షాంఘై | 3,309 | ▽ | 10 |
| నికాయ్ | 29,127 | △ | 4 |

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

| బులియన్ (రూ.లలో) ముంబై | |
|---|---|
| బంగారం (24 క్యారెట్) | 61,585 △ 90 |
| బంగారం (22 క్యారెట్) | 61,339 △ 90 |
| వెండి (కిలో) | 74,795 ▽ 1,466 |



## ఐషర్ మోటార్స్‌కు ఆకర్షణీయ లాభం

- 49 శాతం వృద్ధితో రూ.906 కోట్లు
- షేరుకు రూ.37 చొప్పున డివిడెండ్




**న్యూఢిల్లీ:** ఐషర్ మోటార్స్ ఆకర్షణీయ ఫలితాలను ప్రకటించింది. మార్చితో ముగిసిన త్రైమాసికంలో నికర లాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూసినప్పుడు 49 శాతం వృద్ధితో రూ.906 కోట్లుగా నమోదైంది. ఆదాయం సైతం రూ.3,193 కోట్ల నుంచి రూ.3,804 కోట్లకు వృద్ధి చెందింది. మార్చి త్రైమాసికంలో రాయల్ ఎన్‌ఫీల్డ్ అమ్మకాలు రికార్డు స్థాయిలో నమోదయ్యాయి. 2,14,685 యూనిట్లు అమ్ముడుపోయాయి. క్రితం ఏడాది ఇదే కాలంలో అమ్మకాలతో పోలిస్తే 18 శాతం పెరిగాయి. మార్చితో ముగిసిన గత ఆర్థిక సంవత్సరంలో ఐషర్ మోటార్స్ కన్సాలిడేటెడ్ లాభం రూ.2,914 కోట్లుగా నమోదైంది. అంతక్రితం ఆర్థిక సంవత్సరంలో లాభం రూ.1,677 కోట్లుగా ఉండడం గమనార్హం. ఆదాయం రూ.10,298 కోట్ల నుంచి రూ.14,442 కోట్లకు వృద్ధి చెందింది. గత ఆర్థిక సంవత్సరం మొత్తం మీద రాయల్ ఎన్‌ఫీల్డ్ అమ్మకాలు 38 శాతం అధికంగా 8,34,895 యూనిట్లుగా నమోదయ్యాయి. మొదటి సారి లక్ష యూనిట్లను ఒక ఆర్థిక సంవత్సరంలో ఎగుమతి చేసినట్టు సంస్థ ప్రకటించింది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.1,000 కోట్ల వ్యయాలకు కంపెనీ బోర్డు ఆమోదం తెలిపింది ఎలక్ట్రిక్ వాహనాల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం, ఉత్పత్తుల అభివృద్ధికి ఖర్చు చేయనున్నట్టు ఐషర్ మోటార్స్ తెలిపింది. ఒక్కో షేరుకు రూ.37 చొప్పున డివిడెండ్ ఇవ్వాలని కంపెనీ బోర్డు నిర్ణయించింది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు ఎలాంటి మార్పు లేకుండా రూ.3,407 వద్ద ముగిసింది.

## స్వల్ప నష్టాల్లో మార్కెట్లు


సెన్సెక్స్ 36, నిఫ్టీ 18 పాయింట్లు డౌన్



**ముంబై:** దేశీ సూచీలు గురువారం స్వల్ప నష్టాలతో ముగిశాయి. సెన్సెక్స్ 36 పాయింట్లు క్షీణించి 61,904 వద్ద, నిఫ్టీ 18 పాయింట్లు తగ్గి 18,297 వద్ద ముగిశాయి. సెన్సెక్స్ ఒక దశలో కీలకమైన 62,000 మార్కును కూడా దాటినప్పటికీ తర్వాత పడిపోయింది. రోజులో 62,168–61,823 పాయింట్ల గరిష్ఠ, కనిష్ఠ స్థాయిల మధ్య తిరుగాడింది. ద్రవ్యోల్బణ గణాంకాలు శుక్రవారం విడుదల కానున్న నేపథ్యంలో ముందు రోజున ట్రేడర్లు ఆచితూచి వ్యవహరించడం .. సూచీల స్వల్ప నష్టాలకు కారణమని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. కొన్ని దిగ్గజ సంస్థల ఆర్థిక ఫలితాలు బలహీనంగా ఉండటం సైతం దేశీ సూచీలపై ప్రభావం చూపినట్లు జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ హెడ్ (రీసెర్చ్) వినోద్ నాయర్ తెలిపారు. గురువారం నిఫ్టీ సూచీలో 21 షేర్లు నష్టాల్లో, 29 షేర్లు లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ విషయానికొస్తే.. నాన్–ఎగ్జిక్యూటివ్ చైర్మన్ పోస్టు నుంచి ఏఎం నాయక్ తప్పుకుంటున్నట్లు ప్రకటించడంతో లార్సన్ అండ్ టూబ్రో సంస్థ షేర్లు అత్యధికంగా 5 శాతం క్షీణించాయి. ఐటీసీ, భారతీ ఎయిర్‌టెల్, రిలయన్స్, ఇన్ఫోసిస్, టాటా స్టీల్, టెక్ మహీంద్రా, టీసీఎస్ మొదలైనవి నష్టపోయాయి. హిందుస్తాన్ యూనిలీవర్, ఎన్‌టీపీసీ, మారుతీ మొదలైనవి లాభపడ్డాయి. ఆసియాలో దక్షిణ కొరియా, చైనా, హాంకాంగ్ సూచీలు నష్టాల్లోను, జపాన్ సూచీలు లాభాల్లోనూ ముగిశాయి. యూరప్ మార్కెట్లు లాభాల్లో ట్రేడయ్యాయి. గురువారం విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఎఫ్ఐఐ) నికరంగా రూ. 837 కోట్ల కొనుగోళ్లు జరపగా, దేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (డీఐఐ) రూ. 200 కోట్లు విక్రయించారు. కాగా, డాలరుతో పోలిస్తే రూపాయి 15 పైసలు క్షీణించి 82.09 వద్ద క్లోజయ్యింది.

## ఏషియన్ పెయింట్స్ లాభం హైజంప్

- రూ.1,258 కోట్లుగా నమోదు
- ఆదాయాల్లోనూ చక్కని వృద్ధి
- షేరుకు రూ.21.25 డివిడెండ్




**న్యూఢిల్లీ:** ఏషియన్ పెయింట్స్ మార్చి త్రైమాసికంలో కన్సాలిడేటెడ్‌గా రూ.1,258 కోట్ల లాభాన్ని ప్రకటించింది. ఆదాయం 11 శాతం వృద్ధితో రూ.8,751 కోట్లుగా నమోదైంది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.874 కోట్లుగా, ఆదాయం రూ.7,890 కోట్లుగా ఉన్నాయి. మొత్తం వ్యయాలు సైతం 7 శాతానికి పైగా పెరిగి రూ.7,182 కోట్లుగా నమోదయ్యాయి. ఇక 2022–23 పూర్తి ఆర్థిక సంవత్సరానికి ఏషియన్ పెయింట్స్ నికర లాభం 36 శాతం వృద్ధితో రూ.4,195 కోట్లకు ఎగసింది. ఆదాయం 19 శాతం వృద్ధితో రూ.34,368 కోట్లుగా ఉంది. మార్చి త్రైమాసికంలో అంతర్జాతీయ ఆదాయం 3 శాతం మేర క్షీణించి రూ.794 కోట్లుగా నమోదైంది. కన్సాలిడేటెడ్ స్థాయిలో రూ.34వేల కోట్ల ఆదాయాన్ని అధిగమించినట్టు ఏషియన్ పెయింట్స్ ఎండీ, సీఈవో అమిత్ సింగిల్ తెలిపారు. ప్రస్తుతం తాము హోమ్ డెకరేషన్ విభాగంలో ఏకైక అతిపెద్ద కంపెనీగా అవతరించినట్టు చెప్పారు. ఇక ఒక్కో షేరుకు రూ.21.25 చొప్పున 2022–23 సంవత్సరానికి తుది డివిడెండ్ కింద ఇవ్వాలని కంపెనీ బోర్డు సిఫారసు చేసింది. మధ్యంతర డివిడెండ్ కింద లోగడ ఒక్కో షేరుకు రూ.4.40 చొప్పున చెల్లించడం గమనార్హం.

ఫలితాల నేపథ్యంలో బీఎస్‌ఈలో ఏషియన్ పెయింట్స్ ధర రూ.3,139 వద్ద క్లోజయింది.


### రిలయన్స్-మెట్రో డీల్ పూర్తి




**న్యూఢిల్లీ:** భారత్‌లో తమ వ్యాపార విభాగాన్ని రిలయన్స్ రిటైల్ వెంచర్స్ (ఆర్ఆర్‌వీఎల్)కు విక్రయించే ఒప్పంద ప్రక్రియ పూర్తయినట్లు జర్మనీ రిటైల్ సంస్థ మెట్రో తెలిపింది. ఈ డీల్ కింద 31 హోల్‌సేల్ స్టోర్లు, మొత్తం రియల్ ఎస్టేట్ పోర్ట్‌ఫోలియో ఉన్నట్లు వివరించింది. వ్యాపార బదిలీ ప్రక్రియ జరిగే సమయంలో మెట్రో ఇండియా స్టోర్లన్నీ అదే బ్రాండ్‌తో కొనసాగుతాయని, ఉద్యోగులు.. కస్టమర్ల విషయంలో పెద్ద మార్పులేమీ ఉండబోవని సంస్థ పేర్కొంది. భారత్‌లో మెట్రో కార్యకలాపాలను రూ. 2,850 కోట్లకు కొనుగోలు చేస్తున్నట్లు ఆర్ఆర్‌వీఎల్ గతేడాది డిసెంబర్ 22న ప్రకటించింది. ఇప్పటికే భారీగా కార్యకలాపాలు విస్తరిస్తున్న ఆర్ఆర్‌వీఎల్.. తాజాగా మెట్రో కొనుగోలుతో దేశీయంగా రిటైల్ రంగంలో మరింత పట్టు సాధించనుంది. గత ఆర్థిక సంవత్సరంలో ఆర్ఆర్‌వీఎల్ రూ. 2.30 లక్షల కోట్ల ఆదాయం ఆర్జించింది. అటు మెట్రో ప్రపంచవ్యాప్తంగా 30 దేశాల్లో కార్యకలాపాలు సాగిస్తోంది. 2021–22 ఆర్థిక సంవత్సరంలో 29.8 బిలియన్ యూరోల అమ్మకాలు నమోదు చేసింది.

## ఓటీటీ పరిశ్రమ.. సూపర్ హిట్!

- 2030 నాటికి రూ.30వేల కోట్లకు
- ప్రస్తుత మార్కెట్ రూ.10వేల కోట్లు
- ఏటా 20 శాతం చొప్పున వృద్ధి
- పరిశ్రమ వర్గాల అంచనా




**న్యూఢిల్లీ:** ఓవర్ ది టాప్ (ఓటీటీ) కంటెంట్ పరిశ్రమ శరవేగంగా వృద్ధి చెందుతోంది. ప్రస్తుతం ఓటీటీ మార్కెట్ విలువ రూ.10,000 కోట్లుగా ఉంటే, 2030 నాటికి రూ.30,000 కోట్లకు చేరుకుంటుందని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. 2024 మార్చి నాటికి రూ.12,000 కోట్లకు చేరుకుంటుందని, ఏటా 20 శాతం చొప్పున వృద్ధి చెందుతుందని ఐఎన్10మీడియా సీవోవో, సీఐఐ దక్షిణ్ స్టీరింగ్ కమిటీ సభ్యుడైన అనూప్ చంద్రశేఖరన్ తెలిపారు. ఓటీటీ పరిశ్రమపై చెన్నైలో దక్షిణాది మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ సదస్సును ఉద్దేశించి ఆయన మాట్లాడారు. సీఐఐ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. ''ప్రస్తుతం డిస్నీ ప్లస్ హాట్‌స్టార్‌లో విడుదలవుతున్న వాటితో పోలిస్తే.. వచ్చే 12 నెలల్లో దక్షిణాది భాషల్లో పెద్ద సంఖ్యలో వెబ్ సిరీస్‌లు విడుదల కానున్నాయి''అని స్టార్/డిస్నీ ఇండియా బిజినెస్ హెడ్ కృష్ణన్ కుట్టి తెలిపారు.

### దక్షిణాది సినిమాల జోరు

దేశం మొత్తం మీద దక్షిణాది సినిమాలు అత్యధిక ఆదాయాన్ని సృష్టిస్తున్నాయి. 2022లో దక్షిణాది సినిమాలు రూ.7,000 కోట్ల ఆదాయాన్ని నమోదు చేశాయి. అంతకుముందు ఏడాది ఆదాయంతో పోలిస్తే రెట్టింపు అయింది. అంతేకాదు గతేడాది దేశవ్యాప్తంగా సినీ పరిశ్రమ ఆదాయంలో దక్షిణాది సినిమాల వాటాయే 50 శాతంగా ఉండడం గమనార్హం. ఈ వివరాలను సీఐఐ దక్షిణాది విభాగం రూపొందించిన నివేదికలో పేర్కొంది. 'తమిళం, తెలుగు, కన్నడ, మలయాళంతో కూడిన దక్షిణాది చిత్ర పరిశ్రమ ఆదాయం 2022లో రూ.7,836 కోట్లుగా ఉంది. 2021లో ఆదాయం రూ.3,988 కోట్లే. 2022లో మొత్తం భారత సినీ పరిశ్రమ ఆదాయం రూ.15,000 కోట్లు. దక్షిణాదిలోనూ తమిళ సినిమా రూ.2,950 కోట్లతో అగ్ర స్థానంలో నిలిచింది. ఆ తర్వాత రూ.2,500 కోట్లతో తెలుగు సినీ పరిశ్రమ ఉంటే, కన్నడ పరిశ్రమ ఆదాయం రూ.1,570 కోట్లు, మలయాళ పరిశ్రమ ఆదాయం రూ.816 కోట్లు. ముఖ్యంగా కన్నడ నాట కేజీఎఫ్:చాప్టర్ 1, కాంతార సినిమాలు బంపర్ వసూళ్లతో పరిశ్రమ రూపాన్ని మార్చేశాయి'అని నివేదిక తెలిపింది. మలయాళ పరిశ్రమ స్థానికంగా, విదేశాల్లోనూ ఆదాయాన్ని పెంచుకుంది. దర్శకుడు రాజమౌళి 'ఆర్ఆర్ఆర్' ఒక్కటే రూ. 1,200 కోట్ల ఆదాయాన్ని తెచ్చిపెట్టింది. కమల్ హాసన్ విక్రమ్, మణిరత్నం పొన్నియన్ సెల్వన్ సినిమాలు తమిళనాట ఆదాయాన్ని పెంచాయి. 2022 లో దక్షిణాదిన 916 సినిమాలు విడుదలయ్యాయి. థియేటర్, ఓటీటీలో విడుదలైనవీ ఇందులో ఉన్నాయి.

### కంటెంట్‌కు డిమాండ్

స్క్రిప్ట్‌ను అందించేందుకు తాము ఒక నెల సమయం తీసుకుంటున్నామని అర్హ మీడియా అండ్ బ్రాడ్‌కాస్టింగ్ సహ వ్యవస్థాపకుడు అజిత్ ఠాకూర్ తెలిపారు. ప్రస్తుతం ఏటా వివిధ ప్లాట్‌ఫామ్‌ల కోసం 60 ఒరిజినల్స్ అవసరం ఉంటోందన్నారు. నిర్మాతలు దీన్ని అవకాశంగా తీసుకోవాలని కోరారు. ''తమిళం, తెలుగు ఓటీటీపైనే జీ ఓటీటీ ఇప్పుడు ప్రధానంగా దృష్టి సారించింది. ప్రస్తుతం కన్నడ ఓటీటీ మార్కెట్ చాలా వేగంగా వృద్ధి చెందుతోంది. మలయాళం ఓటీటీ పరిశ్రమకు కావాల్సిన కంటెంట్‌ను ప్రస్తుతం నిర్మాతలు అందించే స్థితిలో ఉన్నారు''అని జీ5 ఓటీటీ చీఫ్ క్లస్టర్ ఆఫీసర్ సిజు ప్రభాకరన్ వివరించారు.

### హ్యుందాయ్ రూ.20,000 కోట్ల పెట్టుబడి

**న్యూఢిల్లీ:** వాహన తయారీ సంస్థ హ్యుందాయ్ మోటార్ ఇండియా భారత్‌లో రూ.20,000 కోట్ల పెట్టుబడి చేయనున్నట్టు వెల్లడించింది. తమిళనాడులో వచ్చే 10 ఏళ్లలో ఈ మొత్తాన్ని దశలవారీగా వెచ్చించనున్నట్టు తెలిపింది. ఎలక్ట్రిక్ వెహికిల్స్ అభివృద్ధి, వాహనాల ప్లాట్‌ఫామ్స్ ఆధునీకరణకు ఖర్చు చేయనున్నట్టు ప్రకటించింది. దీర్ఘకాలిక వ్యూహంలో భాగంగా తమిళనాడు ప్లాంటును ఈవీల తయారీ కేంద్రంగా తీర్చిదిద్దనున్నట్టు హ్యుందాయ్ మోటార్ ఇండియా ఎండీ, సీఈవో ఉన్సూ కిమ్ తెలిపారు. 1,78,000 యూనిట్ల వార్షిక తయారీ సామర్థ్యంతో బ్యాటరీ ప్యాక్ అసెంబ్లీ ప్లాంటును ఏర్పాటు చేయనున్నట్లు హ్యుందాయ్ తెలిపింది. అయిదేళ్ల వ్యవధిలో ప్రధాన రహదార్లలోని కీలక ప్రదేశాలలో 100 ఈవీ ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయనుంది. హ్యుందాయ్ వార్షిక తయారీ సామర్థ్యం 8.5 లక్షల యూనిట్లకు పెంచాలని నిర్ణయించింది.




యువర్స్

### • టెక్... టాక్

#### మోటో వాచ్ ▼

మోటోరోలా త్వరలో మోటో వాచ్ 200 తీసుకురానుంది. దీని వివరాలు...



డిస్‌ప్లే: 1.78 అంగుళాలు బ్యాటరీ: 355 ఎంఏహెచ్ • 5 ఏటియం వాటర్‌ప్రూఫ్; • హార్ట్‌రేట్ మానిటర్ • ఎస్పీవో2 మీటర్ • బ్లూటూత్: 5.3 ఎల్ఈ; • బిల్ట్-ఇన్ జీపీఎస్ • మైక్రోఫోన్, స్పీకర్ కలర్స్: బ్లాక్ అండ్ గోల్డ్

#### వివో ఎక్స్90 ప్రో ▼



డిస్‌ప్లే: 6.78 అంగుళాలు
రిజల్యూషన్: 2800×1260 పిక్సెల్స్
రిఫ్రెష్‌రేట్: 60 హెచ్‌జడ్, 120 హెచ్‌జడ్ బ్లూటూత్: 5.3
బ్యాటరీ: 4,870 ఎంఏహెచ్
కలర్: లెజెండర్ బ్లాక్
• ఫింగర్‌ప్రింట్ సెన్సర్ • ఫ్రంట్ కెమెరా: 32–మెగా పిక్సెల్స్

#### ఇన్‌స్టా రీల్స్ డౌన్‌లోడ్ చేసుకోవడానికి... ▼

థర్డ్–పార్టీ యాప్‌తో అవసరం లేకుండా స్మార్ట్‌ఫోన్ (అండ్రాయిడ్, ఐవోఎస్)లో ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ డౌన్‌లోడ్ చేసుకోవడానికి...

1. ఇన్‌స్టాగ్రామ్ ఓపెన్ చేసిన తరువాత డౌన్‌లోడ్ చేయాలనుకున్న 'రీల్' ప్లే చేయాలి.
2. షేర్ ఐకాన్(పేపర్ ప్లేన్) క్లిక్ చేయాలి.
3. యాడ్ రీల్స్–క్లిక్
4. నెక్స్ట్ పేజీ టాప్ రైట్ కార్నర్‌లో 3 డాట్స్ క్లిక్ చేయాలి. 'సేవ్ నౌ' సెలెక్ట్ చేసుకోవాలి.
5. ఇప్పుడు 'రీల్' ఇన్‌స్టాగ్రామ్ ఫోల్డర్‌లోకి డౌన్‌లోడ్ అవుతుంది.



### • గేమింగ్

## ఖతం పార్టీ



రోల్‌ప్లేయింగ్ వీడియో గేమ్ 'డార్కెస్ట్ డంజెన్–2' ఇటీవల విడుదలైంది. 2021లో వచ్చిన 'డార్కెస్ట్ డంజెన్'కు సీక్వెల్‌గా వచ్చిన గేమ్ ఇది. గత గేమ్‌లాగే దీనిలోనూ రోగ్ లైక్ ఎలిమెంట్స్, మల్టిపుల్ క్యారెక్టర్స్ ఉంటాయి. ప్రతి క్యారెక్టర్‌కు తనదైన బలం ఉంటుంది. ఈ గేమ్ అంతిమలక్ష్యం దుష్టశక్తి ఉన్న కొండ దగ్గరికి చేరుకోవడం. ప్రపంచాన్ని తన స్వాధీనంలోకి తెచ్చుకోవాలనుకుంటున్న దుష్టశక్తి నుంచి ప్రపంచాన్ని రక్షించడం.

ఒరిజినల్‌లోని 2డీ–ఇలస్ట్రేటెడ్ క్యారెక్టర్స్‌ను 3డీ మోడల్స్‌లో అప్‌గ్రేడ్ చేశారు. అయితే గేమ్‌కు సంబంధించిన జనరల్ టోన్ మాత్రం సేమ్ టు సేమ్.

ప్లాట్‌ఫామ్స్: విండోస్ మోడ్స్: సింగిల్ ప్లేయర్ జానర్: రోల్ ప్లేయింగ్ రోగ్ లైక్

## యంత్ర తంత్రం



ఉపాయాలు ఊరకే రావు.
గట్టిగా ఆలోచిస్తేనే వస్తాయి.
ఈ నలుగురు కుర్రాళ్లు అలాగే ఆలోచించారు.
శానిటేషన్, హెల్త్‌కేర్, కెమికల్ ఇండస్ట్రీ,
ఆయిల్ అండ్ గ్యాస్ సెక్టార్‌లకు ఉపయోగపడే
రోబోటిక్స్‌కు రూపకల్పన చేశారు. శాస్త్రానికి
సామాజిక ధర్మం జోడించి 'జెన్ రోబోటిక్స్'తో
ఘన విజయం సాధించారు...

• సక్సెస్ స్టోరీ



ఎడమ నుంచి...
అరుణ్ జార్జ్, రషీద్,
విమల్ గోవింద్, నిఖిల్

సెప్టిక్ ట్యాంకులు శుభ్రం చేసే క్రమంలో ఎంతో మంది అమాయకులు బలైపోతున్నారు. ప్రకటిత గణాంకాల కంటే మృతుల సంఖ్య ఎక్కువగా ఉంటుందని సఫాయి కర్మాచారి ఆందోళన (ఎస్‌కేఏ) అనే స్వచ్ఛంద సంస్థ చెబుతోంది. మాన్యువల్ స్కావేంజింగ్‌ను నిషేధించాలని ఆ సంస్థ డిమాండ్ చేస్తుంది.

కేరళలో ముగ్గురు స్కావెంజర్లు చనిపోయిన విషాదం ఇంజనీరింగ్ చేస్తున్న అరుణ్ జార్జ్, నిఖిల్ ఎన్‌పీ, రషీద్ కె, విమల్ గోవింద్ ఎంకేలను బాగా కదిలించింది.

'ఈ సమస్యకు పరిష్కారం కనుక్కోవాలి' అని గట్టిగా అనుకున్నారు.

మలప్పురం(కేరళ) జిల్లాలోని కుట్టిపురం ఎంఈఎస్ ఇంజనీరింగ్ కాలేజీలో చదువుకునే రోజుల్లో 'రోబోటిక్ స్కావెంజర్' ఆలోచన చేశారు. మొదట కాలేజీ ప్రాజెక్ట్‌గా ఆ ఆలోచనను పట్టాలెక్కించారు.

చదువులు పూర్తై ఉద్యోగాల కోసం కార్పొరేట్ ప్రపంచంలోకి అడుగు పెట్టాక కూడా వారిని 'రోబోటిక్ స్కావెంజర్' ఆలోచన వదల్లేదు. దీంతో ఉద్యోగాలు వదులు కొని 'జెన్ రోబోటిక్స్' అనే స్టార్టప్ మొదలుపెట్టారు.

రోబోటిక్ స్కావెంజర్ 'బ్యాండికూట్'తో ఈ స్టార్టప్ ప్రస్థానం మొదలైంది. 50 కిలోల బరువు ఉండే 'బ్యాండికూట్' రిమోట్–కంట్రోల్డ్ రోబోట్. 360 డిగ్రీల మోషన్స్‌లో పనిచేస్తుంది. సింగిల్ షిఫ్ట్‌లో పది నుంచి పన్నెండు మురుగు కాలువలను శుభ్రపరుస్తుంది. ఒక్కొక్క మురుగు కాలువను, మ్యాన్‌హోల్‌ను శుభ్రం చేయడానికి 30 నుంచి 40 నిమిషాల సమయం పడుతుంది.

స్కై స్క్రాపర్స్‌కు సంబంధించిన గ్లాస్ ఫేసాడ్‌లను శుభ్రం చేసే 'జీ–బిటల్' రోబోట్ కూడా మెగా హిట్ అయింది. ఇక 'వెల్‌బోర్' అనేది ఆయిల్ అండ్ గ్యాస్, కెమికల్ ఇండస్ట్రీలకు సంబంధించిన పెద్ద ట్యాంకులను శుభ్రపరుస్తుంది.

'బ్యాండికూట్'తో మొదలైన జెన్ రోబోటిక్స్ ప్రయాణం హెల్త్‌కేర్, కెమికల్ ఇండస్ట్రీ, ఆయిల్ అండ్ గ్యాస్ సెక్టార్... మొదలైన వాటికి విస్తరించింది.

'శానిటేషన్‌కు సంబంధించి పరిష్కరించుకోవాల్సిన పెద్ద సమస్యలు ఎన్నో ఉన్నాయి. వాటిపై దృష్టి పెడుతున్నాం' అంటున్నాడు కో–ఫౌండర్స్‌లో ఒకరైన విమల్.

'మరి ఈ యంత్రాల వల్ల కార్మికుల ఉపాధి దెబ్బతింటుంది కదా?' అనే సందేహం అందరికీ వస్తుంది.

దీన్ని దృష్టిలో పెట్టుకొని కార్మికులు సులభంగా ఆపరేట్ చేసేలా ఈ యంత్రాలను రూపొందించారు. మూడు వేల మందికి పైగా కార్మికులు ఈ యంత్రాల ద్వారా ఉపాధి పొందుతున్నారు.

> 50 కిలోల బరువుండే రోబోటిక్ స్కావెంజర్ 'బ్యాండికూట్' రిమోట్–కంట్రోల్డ్ రోబోట్. 360 డిగ్రీల మోషన్స్‌లో పనిచేస్తుంది. సింగిల్ షిఫ్ట్‌లో పది నుంచి పన్నెండు మురుగు కాలువలను శుభ్రపరుస్తుంది.

'పారిశుద్ధ్య పనుల్లో మార్పు తీసుకురావడానికి సేఫ్టీ అండ్ డిగ్నిటీ నినాదంతో సాంకేతికతను ఉపయోగించుకుంటున్నాం. పారిశుద్ధ్య కార్మికులకు ఉపయోగపడే కొత్త ఆవిష్కరణలు చేయాలనుకుంటాం' అంటున్నాడు ఫౌండర్స్‌లో ఒకరైన విమల్ గోవింద్.

తిరువనంతపురం కేంద్రంగా మొదలైన 'జెన్ రోబోటిక్స్' పదిహేడు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో పనిచేస్తోంది. బ్రిటన్, ఇండోనేషియ, మలేషియాలతో పాటు ఆఫ్రికన్ దేశాలకు విస్తరించింది.

'ఈ యువ బృందం పాషన్, సామాజిక దృష్టి మమ్మల్ని ఆకట్టుకుంది' అంటున్నాడు 'జెన్ రోబోటిక్స్' ఇన్వెస్టర్ 'యూనికార్న్ ఇండియా వెంచర్స్' ఫౌండర్, మెనేజింగ్ పాట్నర్ అనీల్ జోషి.

### • యంగ్ టాలెంట్

## మేఘన విజయం



• మేఘన కౌర్

**ముం**బైకి చెందిన మేఘన కౌర్ సోషల్‌మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్‌గా పెద్ద పేరు తెచ్చుకుంది. తన యూట్యూబ్ ఛానల్ 'షీ ట్రుబుల్‌మేకర్' బాగా పాపులర్ అయింది. హిందీ, ఇంగ్లీష్, పంజాబీ, సింధీ భాషలు మాట్లాడే మేఘనకు ప్రయాణాలు చేయడం, బ్యాడ్మింటన్ ఆడడం, పుస్తకాలు చదవడం అంటే ఇష్టం.

అమెరికన్ సింగర్ జస్టిన్ బీబర్ పాటలు వినడం అంటే బోలెడు ఇష్టం.

ఎప్పుడూ ఏదో ఒక కొత్త విషయం తెలుసుకోవడానికి ఉత్సాహం చూపే మేఘన జంతుప్రేమి. సామాజిక సేవ కార్యక్రమాల్లో పాల్గొంటుంది.

'క్రియేటర్ ఎకనామీ ఊపందుకున్న ఈ సమయంలో మీదైన సొంత శైలి ఏర్పాటు చేసుకోవడానికి ఏం చేస్తారు?' అని అడిగితే–

'నా నుంచి ఆడియెన్స్ ఏం ఆశిస్తున్నారనే దాని గురించి ఆలోచించడంతో పాటు, నేను ఆడియెన్స్‌లో ఒకరిగా మారి నన్ను నేను విశ్లేషించుకుంటాను. సబ్జెక్ట్ విషయంలో రెలవెంట్‌గా ఉండడం అనేది ముఖ్యమైనది. అందుకే ఆడియెన్స్‌తో ఎప్పటికప్పుడు కనెక్ట్ అవుతాను. మారుతున్న ట్రెండ్స్‌పై ప్రత్యేక దృష్టి పెడతాను. సబ్జెక్ట్ విషయానికి వస్తే అతి తెలివి ఎప్పుడూ ప్రదర్శించవద్దు. ఎందుకంటే ఆడియెన్స్ మనకంటే తెలివైన వాళ్లు' అంటుంది మేఘన.

ఎంతవారికైనా ట్రోలింగ్ తప్పదు. సోషల్ మీడియా స్టార్ ఇన్‌ఫ్లూయెన్సర్ అయిన మేఘన ట్రోలింగ్‌పై ఇలా అంటుంది...

> ఒక్క హేట్ కామెంట్ ఉన్న చోట పది ప్రశంసలు కనిపిస్తాయి. మరి ఆ ఒక్క కామెంట్‌ను చూస్తూ బాధ పడడం ఎందుకు! అందుకే పాజిటివ్ కామెంట్స్ పైనే ఎక్కువ దృష్టి పెడతాను.

'నేను ఎమోషనల్ పర్సన్. చిన్న విషయాలకే చిన్నబుచ్చుకుంటాను. అలాంటి నేను ఇన్‌ఫ్లూయెన్సర్‌గా ప్రయాణం మొదలుపెట్టిన కొత్తలో ట్రోలింగ్ వల్ల చాలా ఇబ్బంది పడ్డాను. దాన్ని తట్టుకోవడం నా వల్ల కాదు అనిపించింది. అయితే ఆ తరువాత నాకు నేను ధైర్యం చెప్పుకున్నాను. ఒక్క హేట్ కామెంట్ ఉన్నచోట పది ప్రశంసలు కనిపిస్తాయి. మరి ఆ ఒక్క కామెంట్‌ను చూస్తూ బాధ పడడం ఎందుకు! అందుకే పాజిటివ్ కామెంట్స్‌పైనే ఎక్కువ దృష్టి పెడతాను. వాటి ద్వారా శక్తిని గ్రహిస్తాను. సక్సెస్‌ఫుల్ కంటెంట్ క్రియేటర్‌గా రాణించడానికి మొదట ఉండాల్సింది సహనం. ఆ తరువాతే ఏదైనా!'

### • ఇంగ్లిష్ ఇడియమ్స్




#### టాక్ త్రూ యువర్ హ్యాట్

ఒక విషయంపై అవగాహన లేకపోయినా, అర్థం కాకపోయినా ఏదో ఒకటి మాట్లాడి అపహాస్యానికి గురయ్యే వారిని ఉద్దేశించి చెప్పే మాట ఇది.

#### టాక్ టర్కీ

ఒక విషయం గురించి నిర్మొహమాటంగా, సూటిగా చర్చించే సందర్భంలో ఉపయోగిస్తారు.

#### టీతింగ్ ప్రాబ్లమ్స్

ఒక వ్యాపారం లేదా ప్రాజెక్ట్ మొదలుపెట్టినప్పుడు ఎదురయ్యే చిన్న చిన్న సమస్యలు.

#### బీ ఏ టాల్ ఆర్డర్

నెరవేర్చడం అసాధ్యం అనుకున్న పని, కష్టతరమైన డిమాండ్... మొదలైన సందర్భాల్లో వాడే మాట ఇది.

ఉదా: బిల్డింగ్ ది బ్రిడ్జి ఇన్ టైమ్ ఫర్ ది ఒలింపిక్స్ విల్ బీ ఏ టాల్ ఆర్డర్



# మళ్లీ గురివింద నిందలే!

## ఖజానాకు ఆదా చేస్తే అక్రమమా రామోజీ?

- నాడు నవయుగకు నామినేషన్‌పై ఇస్తే నచ్చిందా?
- నేడు టెండర్ ద్వారా మేఘాకు ఇస్తే తప్పా?
- పోలవరంలో చంద్రబాబు పాపాలను సరిదిద్దేందుకు రూ.1,615.75 కోట్లతో టెండర్లు
- ఆర్థిక బిడ్‌లో రూ.1,665.84 కోట్లకు కోట్ చేసిన ఓ సంస్థ
- రివర్స్ టెండర్లలో మేఘా, రిత్విక్ (సీఎం రమేశ్‌ది) పోటాపోటీ
- రూ.1,599.21 కోట్లకే మేఘా రెడీ.. ఖజానాకు రూ.66.63 కోట్లు ఆదా




సాక్షి, అమరావతి: ప్రజాధనాన్ని ఆదా చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం పోలవరం పనులను పరుగులెత్తిస్తుంటే రామోజీ కలం మాత్రం బురద రాతలతో పోటీ పడుతోంది! పోలవరం పనుల టెండర్లకు సంబంధించి 'మళ్లీ.. మేఘాకే' శీర్షికన ఈనాడు ప్రచురించిన కథనమే అందుకు నిదర్శనం.

■ **ఈనాడు:** పోలవరం ప్రధాన డ్యాంలో రూ.1,626.48 కోట్ల వ్యయంతో నిర్వహించిన లాంఛనప్రాయ టెండర్లలో ఏమాత్రం పోటీ లేకుండా మేఘా దక్కించుకుంది.

■ **వాస్తవం:** టీడీపీ హయాంలో కమీషన్ల దాహంతో చంద్రబాబు ప్రణాళికారాహిత్యంగా చేపట్టిన పనుల వల్ల 2019లో గోదావరికి వచ్చిన భారీ వరదలకు ప్రధాన డ్యామ్ గ్యాప్-1, గ్యాప్-2 నిర్మాణ ప్రాంతంలో ఇసుక తిన్నెలు కోతకు గురైన నాలుగు చోట్ల భారీ అగాధాలు ఏర్పడ్డాయి. గ్యాప్-2లో డయాఫ్రమ్ వాల్ దెబ్బతింది. అగాధాలను పూడ్చి వైబ్రో కాంపాక్షన్‌తో యథాస్థితికి తేవడం, దెబ్బతిన్న చోట కొత్తగా డయాఫ్రమ్

## ఫ్యాక్ట్ చెక్

వాల్ నిర్మించి పాతదానితో అనుసంధానం పనులకు రూ.1,615.75 కోట్లతో చేపట్టిన టెండర్ షెడ్యూల్‌ను పోలవరం సీఈ జ్యుడీషియల్ ప్రివ్యూకు పంపారు. జ్యుడిషియల్ ప్రివ్యూ ఆమోదించిన షెడ్యూల్‌తో టెండర్ నిర్వహించారు. మేఘాతో పాటు చంద్రబాబుకు సన్నిహితుడైన సీఎం రమేష్‌కు చెందిన రిత్విక్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థలు టెండర్‌లో షెడ్యూళ్లు దాఖలు చేశాయి. బుధవారం పోలవరం సీఈ ఆర్థిక బిడ్‌ను తెరిచారు. రూ.1,665.84 కోట్లు (3.10 శాతం అధిక ధర)కు కోట్ చేసిన సంస్థ ఎల్-1గా నిలిచింది. ఎల్-1 సంస్థ కోట్ చేసిన రూ.1665.84 కోట్లను కాంట్రాక్టు విలువగా పరిగణించి రివర్స్ టెండరింగ్ నిర్వహించారు. ఈ ప్రక్రియలో మేఘా, రిత్విక్ పోటాపోటీగా తలపడ్డాయి. రివర్స్ టెండరింగ్ ప్రక్రియ ముగిసేటప్పటికి

■ **ఈనాడు:** వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి రూ.4,623 కోట్ల విలువైన పనులను మేఘాకే అప్పగించారు.

■ **వాస్తవం:** వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి జ్యుడీషియల్ ప్రివ్యూ ఆమోదించిన షెడ్యూళ్లతో ఈ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్ ద్వారా రివర్స్ టెండరింగ్ నిర్వహిస్తున్నారు. అత్యంత పారదర్శకమైన ఈ విధానంలో నిర్వహిస్తున్న టెండర్లలో పాల్గొనేందుకు కాంట్రాక్టర్లు పోటీ పడుతున్నారు. అతి తక్కువ ధరకు పనులు చేయడానికి ముందుకొచ్చిన సంస్థకే పనులు అప్పగిస్తున్నారు. ఇదే విధానంలో మేఘా సంస్థ పనులు దక్కించుకుందేగానీ నామినేషన్ పద్ధతిలో కాదన్నది రామోజీకి తెలియదా?

రూ.1,599.21 కోట్లకు (1.024 శాతం తక్కువ ధర) కోట్ చేసిన మేఘా సంస్థ పనులను దక్కించుకుంది. దీనివల్ల ఖజానాకు రూ.66.63 కోట్లు ఆదా అయ్యింది. ఇంత పారదర్శకంగా టెండర్ల ప్రక్రియ జరగడం రామోజీరావుకు కంటగింపుగా మారిందేమో! టీడీపీ హయాంలో పోలవరం హెడ్ వర్క్స్ ప్రధాన కాంట్రాక్టర్ ట్రాన్స్‌ట్రాయ్ నుంచి రూ.2,917.78 కోట్ల విలువైన పనులను 60-సీ కింద తొలగించి తన కుమారుడి వియ్యంకుడికి చెందిన నవయుగ సంస్థకు నామినేషన్ పద్ధతిలో కట్టబెట్టినప్పుడు రామోజీ కిమ్మనలేదు. ఎందుకంటే డీపీటీ పద్ధతిలో దోచుకున్నారు కాబట్టి. 2019 మే నాటికి నవయుగ చేయగా మిగిలిన రూ.1,771.44 కోట్ల పనులను తొలగించి రివర్స్ టెండరింగ్ నిర్వహించగా రూ.1,548 కోట్లకే చేసేందుకు మేఘా సంస్థ ముందుకొచ్చింది. ఖజానాకు రూ.223 కోట్లను ఆదా చేయడం ద్వారా చంద్రబాబు-రామోజీ దోపిడీని సీఎం వైఎస్ జగన్ నిరూపించారు.

■ **ఈనాడు:** ప్రభుత్వం చెబుతున్న ప్రకారం రూ.1,548 కోట్లకే పోలవరం ప్రధాన డ్యామ్‌లో మిగిలిన పనులు పూర్తి చేయాలి. కానీ అదనంగా రూ.మూడు వేల కోట్ల విలువైన పనులను చేపట్టి మేఘాకే అప్పగించారు.

■ **వాస్తవం:** కేంద్ర జలసంఘం ఆమోదించిన డిజైన్ల ప్రకారం పోలవరం స్పిల్‌వేకి ఎగువన గైడ్ బండ్, ఇరువైపులా కొండ చరియలు విరిగిపడకుండా పటిష్టం చేసేందుకు రూ.683 కోట్లతో ప్రభుత్వం టెండర్లు నిర్వహించింది. రివర్స్ టెండరింగ్‌లో వాటిని రెండు శాతం తక్కువ ధరకు మేఘా సంస్థ దక్కించుకుంది. గోదావరి వరదను మళ్లించే పనులు పూర్తి చేయకుండా కాఫర్ డ్యామ్‌ను చేపట్టిన చంద్రబాబు అనాలోచిత చర్యల వల్ల 2019లో వరదలకు ప్రధాన డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో ఇసుక తిన్నెలు కోతకు గురై నాలుగు చోట్ల భారీ అగాధాలు ఏర్పడ్డాయి. దీంతో గ్యాప్-2లో డయాఫ్రమ్ వాల్ దెబ్బతింది. సీడబ్ల్యూసీ, డీడీఆర్పీ మార్గదర్శకాల మేరకు చంద్రబాబు పాపాలను సరిదిద్దే పనులను రూ.1,615.75 కోట్లతో ప్రభుత్వం చేపట్టింది. రివర్స్ టెండరింగ్‌లో వాటిని మేఘా దక్కించుకుంది. పశ్చిమ గోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల దాహార్తి తీర్చడానికి పోలవరం కనీస నీటి మట్టం దిగువ నుంచి నీటిని తరలించడానికి రూ.776.94 కోట్లతో ఎత్తిపోతలను ప్రభుత్వం చేపట్టింది. వాటిని రివర్స్ టెండరింగ్‌లో మేఘా దక్కించుకుంది. వీటిని పరిగణలోకి తీసుకుంటే ఈనాడు ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదన్నది స్పష్టమవుతోంది.

# లోకేశ్‌పై చర్య తీసుకోండి

- మైనార్టీ కమిషన్‌కు ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి ఫిర్యాదు
- మైనార్టీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్‌పై భూకబ్జా ఆరోపణలు దారుణం
- లోకేశ్ ఆరోపణలకు ఆధారాలు చూపించాలి
- టీడీపీ ఇన్‌చార్జి భరత్ వక్ఫ్ ఆస్తుల కైంకర్యంపై ఎందుకు మాట్లాడరు?
- సమితి రాష్ట్ర అధ్యక్షుడు నాగుల్‌మీరా మండిపాటు


కె.ఇక్బాల్ అహ్మద్‌ఖాన్‌కు వినతి పత్రం ఇస్తున్న నాగుల్‌మీరా, తదితరులు

సాక్షి, అమరావతి: మైనార్టీ వర్గానికి చెందిన కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్‌పై ఎటువంటి ఆధారాల్లేకుండా భూకబ్జా ఆరోపణలు చేసిన టీడీపీ నేత నారా లోకేశ్‌పై చర్యలు తీసుకోవాలని ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనార్టీ కమిషన్‌ను కోరారు. ఈ మేరకు ఆయన గురువారం మంగళగిరిలో కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.ఇక్బాల్ అహ్మద్ ఖాన్‌కు ఫిర్యాదు చేశారు. 'ఈ నెల 7న లోకేశ్ కర్నూలులో ముస్లిం సమాజాన్ని అవమానపరుస్తూ నిరాధారమైన ఆరోపణలు చేశారు. కర్నూలు బుధవారపేటకు చెందిన 209/1 సర్వే నంబర్లో 1.51 ఎకరాలు, కర్నూలు రూరల్ మండలం దిన్నేదేవరపాడు గ్రామం సర్వే నంబర్ 19లో కొట్టాల మసీదుకు చెందిన రూ.600 కోట్ల విలువైన 59.90 ఎకరాల వక్ఫ్ భూమిని హఫీజ్ ఖాన్ కబ్జా చేసినట్టు ఆరోపించారు. హైకోర్టు ఉత్తర్వులిచ్చినా కర్నూలు నగరంలోని భూమిని ఎమ్మెల్యే ఖాళీ చేయలేదని ఆరోపించారు. హైకోర్టు ఉత్తర్వులిచ్చిన 435/2017 కేసులో ఎమ్మెల్యే ప్రతివాది కూడా కాదు. దిన్నేదేవరపాడు భూమి విషయమై వక్ఫ్ బోర్డుకు, అనుభవంలో ఉన్న వారికి 2007 నుంచి హైకోర్టులో కేసులు నడుస్తున్నాయి. ఈ కేసుల్లో హఫీజ్‌ఖాన్‌కు, ఆయన అనుచరులకు సంబంధం లేకపోయినా ఆరోపణలు చేయడం దారుణం. ఇటువంటి చర్యలతో అమాయక ముస్లిం సమాజం రెండుగా చీలిపోయి ఘర్షణలు జరిగే ప్రమాదం ఉంది. ముఖ్యంగా ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి కార్యకర్తల మనోభావాలు దెబ్బతినేలా లోకేశ్ మాట్లాడారు' అని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం నాగుల్‌మీరా మీడియాతో మాట్లాడుతూ.. లోకేశ్ చేసిన విమర్శలకు ఆధారాలు చూపించాలని డిమాండ్ చేశారు. అదే కర్నూలులో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి టీజీ భరత్ వక్ఫ్ ఆస్తులను కైంకర్యం చేసిన వ్యవహారంపై లోకేశ్ ఎందుకు మాట్లాడరని ప్రశ్నించారు.

### లోకేశ్‌పై చట్టపరమైన చర్యలు

షేక్ నాగుల్‌మీరా ఇచ్చిన ఫిర్యాదుపై అన్ని కోణాల్లో సమగ్ర విచారణ చేసి, న్యాయ నిపుణులను సంప్రదించి లోకేశ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ముస్లిం సమాజం వదంతులను నమ్మి సోషల్ మీడియాలో పోస్టులు పెట్టవద్దు. నిజానిజాలు నిగ్గు తేలే వరకు సంయమనం పాటించాలి.

మైనార్టీ కమిషన్ చైర్మన్
డాక్టర్ కె. ఇక్బాల్ అహ్మద్ ఖాన్

# చంద్రబాబు ఏనాడూ రజకులను పట్టించుకోలేదు..

- రజక సంక్షేమ సంఘం నేత ప్రశ్నతో అవాక్కయిన లోకేశ్

కర్నూలు(అర్బన్)/జూపాడుబంగ్లా: టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీల భద్రతకు రక్షణ చట్టం తెస్తామని ఆ పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్ చెప్పారు. యువగళం పాదయాత్రలో భాగంగా ఆయన గురువారం నందికొట్కూరు నియోజకవర్గం తరిగోపుల క్రాస్ వద్ద బీసీ సామాజికవర్గ ప్రతినిధులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. తాము అధికారంలో ఉన్న సమయంలో రజకులకు ఒక ఎమ్మెల్సీ పదవి ఇచ్చామని, ధోబీఘాట్లు, వాషింగ్ మిషన్లు అందించినట్టు చెప్పారు. రజక సామాజికవర్గాన్ని అన్ని విధాలా ఆదుకునేందుకు చర్యలు చేపడతామన్నారు. అనంతరం రాఘవ అనే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మాట్లాడుతూ చంద్రబాబుపాలనలో తంగడంచ భూముల్లో పరిశ్రమలు స్థాపించి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పి మాట తప్పారని ప్రశ్నించారు. దీనిపై లోకేశ్ సమాధానాన్ని దాటవేశారు. రజక సంక్షేమ సంఘం నేత కేతారం మధు మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో రజకులను ఎస్సీ జాబితాలో చేరుస్తామని చెప్పి మాట తప్పారని, వారి అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోలేదని గుర్తుచేశారు. చంద్రబాబు పాలనలో రజకులకు 50 ఏళ్లకే పింఛన్లు ఇచ్చినట్టు లోకేశ్ అబద్ధం చెప్పగా.. మధు కలగజేసుకుంటూ రజకులకు ఇప్పటిదాకా ఎప్పుడూ 50 ఏళ్లకే పింఛన్లు ఇవ్వలేదన్నారు. ఇచ్చామంటూ లోకేశ్ గట్టిగా చెప్పడంతో రజక నాయకులు అవాక్కయ్యారు.

### చంద్రబాబు అసమర్థతను గుర్తుకు తెచ్చేలా లోకేశ్ సెల్ఫీలు

నంద్యాల జిల్లా నందికొట్కూరు నియోజకవర్గంలో లోకేశ్ సెల్ఫీలు చర్చనీయాంశంగా మారాయి. తన గురించి గొప్పలు చెప్పుకొంటూ ఫొటోలు దిగటం చూసి చంద్రబాబు ఇక్కడేం అభివృద్ధి చేశారని ఈ ఫొటోలు.. అంటూ స్థానికులు నవ్వుకోవడం కనిపించింది. చంద్రబాబు పాలనలో విలువైన తంగడంచ ఫారం భూములను అంబుజా, జైన్ కంపెనీలకు ఎకరం కేవలం రూ.4.50 లక్షలకే కట్టబెట్టారు. మెగా సీడ్ పార్క్, అల్ట్రా మెగా ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలంటూ తంగడంచ ఫారం భూములను దారాదత్తం చేసి.. వాటికి చంద్రబాబు శంకుస్థాపనలు కూడా చేశారు. శంకుస్థాపన చేసి చంద్రబాబు పాలన ముగిసి 2019 ఎన్నికలు వచ్చే దాకా ఒక్క పరిశ్రమనూ స్థాపించిన దాఖలాల్లేవు. 230 ఎకరాలను గుజరాత్ అంబుజా పరిశ్రమ స్థాపన కోసం కేటాయించగా.. అప్పటి టీడీపీ నాయకులకు పర్సెంటేజీలు ఇవ్వలేక యాజమాన్యం వెనుదిరిగింది. వారికి కేటాయించిన 230 ఎకరాల భూములను ఏపీఐఐసీకి కేటాయించగా.. ఇప్పటి దాకా ఒక్కటంటే ఒక్క పరిశ్రమ ఏర్పాటుకాని పరిస్థితి. ఇలాంటి వాటి ముందు బాబు పాలనలో చేసిన గొప్ప పనులని చెప్పుకొంటూ లోకేశ్ సెల్ఫీలు దిగుతున్నారని స్థానిక ప్రజలు ఎద్దేవా చేస్తున్నారు.

తెలంగాణ

# వేటు పడకూడదనే పేరు పెట్టలేదు

- తమ మాడ్యూల్ విషయంలో సలీం జాగ్రత్తలు.. భోపాల్ కోర్టులో ఐదుగురు నిందితులూ హాజరు

సాక్షి, హైదరాబాద్: ఏదైనా విధ్వంసానికి పాల్పడిన తర్వాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమపై నిషేధం విధించకూడదనే వ్యూహంతోనే తమ మాడ్యూల్‌కు ప్రత్యేకంగా పేరు పెట్టలేదని హైదరాబాద్‌లో అరెస్టయిన ఉగ్రవాది మహ్మద్ సలీం భోపాల్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఏటీఎస్) విచారణలో బయటపెట్టాడు. ఇతడితో సహా నగరంలో అరెస్టు చేసిన ఐదుగురు ఉగ్రవాదులనూ ఏటీఎస్ గురువారం భోపాల్ కోర్టులో ప్రవేశపెట్టింది. వీరిని పది రోజులు ఏటీఎస్ కస్టడీకి అనుమతిస్తూ న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది. పరారీలో ఉన్న ఆరో ఉగ్రవాది మహ్మద్ సల్మాన్ (జవహర్‌నగర్) కోర్టులో లొంగిపోయే ప్రయత్నాల్లో ఉన్నట్లు రాష్ట్ర నిఘా వర్గాలు గుర్తించాయి.

**సలీంనే నాయకుడిని చేసిన యాసిర్**

మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌తోపాటు హైదరాబాద్‌లోనూ విస్తరించిన ఈ మాడ్యూల్‌ను అక్కడి షాజహానాబాద్‌కు చెందిన జిమ్ ట్రైనర్ యాసిర్ ఖాన్ ఏర్పాటు చేశాడు. భోపాల్‌కే చెందిన సౌరభ్ రాజ్ వైద్య 2009లో అదే ప్రాంతానికి చెందిన యువతిని వివాహం చేసుకున్నాడు. అతడు యాసిర్ ప్రభావంతో మతం మార్చుకుని మహ్మద్ సలీంగా మారాడు. సలీం చురుకుగా ఉండటంతో యాసిర్ తమ మాడ్యూల్‌కు అతడినే నాయకుడిగా ప్రకటించాడు. స్థానికంగా ముఠా కట్టి, ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడే ముష్కరులు తమ మాడ్యూల్‌కు ఏదో ఒక పేరు పెట్టుకుంటారు. తెహరీక్ గల్బా ఏ ఇస్లాం, ఇండియన్ ముజాహిదీన్, జుందుల్ అల్ ఖలీఫా ఏ హింద్, జుందుల్ ఖిలాఫత్ ఫీ బిలాద్ అల్ హింద్.. ఇవన్నీ ఈ తరహాకు చెందిన ఉగ్ర సంస్థలే. అయితే ఈ విషయంలో సలీం వ్యూహాత్మకంగా వ్యవహరించి తమ మాడ్యూల్‌కు ఓ పేరంటూ పెట్టుకోలేదు. ఉగ్ర సాహిత్యాన్ని సైతం సలీం సొంతంగా రూపొందించినట్లు పోలీసులు ఆధారాలు సేకరించారు. హైదరాబాద్ మాడ్యూల్‌లో ఉన్న ఆరుగురిలో సలీంతోపాటు గోల్కొండ ప్రాంతానికే చెందిన అబ్దుల్ రెహ్మాన్ కీలకంగా వ్యవహరించినట్లు పోలీసులు గుర్తించారు. మంగళవారం అరెస్టయిన ఐదుగురి ఇళ్లతోపాటు పరారీలో ఉన్న సల్మాన్ ఇంటి నుంచీ ఏటీఎస్ అధికారులు సలీం రూపొందించిన ఉగ్ర సాహిత్య ప్రతులను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు సలీం ఇంటి నుంచి ఎయిర్ పిస్టల్స్, పిల్లెట్స్‌ను రికవరీ చేశారు.

# 31న వాల్మీకుల 'చలో ఢిల్లీ'

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో వాల్మీకి బోయలను ఎస్టీల్లో చేర్చాలని కోరుతూ ఈ నెల 31వ తేదీన 'చలో ఢిల్లీ' కార్యక్రమం నిర్వహించనున్నట్లు వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపకుడు మద్దూరు సుభాష్ చంద్రబోస్ తెలిపారు. చలో ఢిల్లీలో భాగంగా జంతర్ మంతర్ వద్ద వాల్మీకుల సంకల్ప దీక్ష చేపడతామని చెప్పారు. ఢిల్లీలోని ఏపీ భవన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో వాల్మీకులను ఎస్టీల్లో చేర్చాలని 15 ఏళ్లుగా పోరాడుతున్నామని తెలిపారు. గత మార్చి 24న సీఎం వైఎస్ జగన్ వాల్మీకిబోయలను ఎస్టీల్లో చేర్చాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి సిఫారసు చేశారని గుర్తుచేశారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లోనే కేంద్ర ప్రభుత్వం వాల్మీకుల ఎస్టీ రిజర్వేషన్ బిల్లును ఆమోదించి చట్టబద్ధం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో బిల్లు ఆమోదం పొందే వరకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేలా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని చెప్పారు.

# క్లుప్తంగా...

## సీపీటీకి దరఖాస్తు చేసుకోండి

సాక్షి, అమరావతి: కారుణ్య నియామకాల ద్వారా గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉద్యోగాలు పొందిన పంచాయతీ సెక్రటరీ (గ్రేడ్-5), వీఆర్వో (గ్రేడ్-2)తోపాటు రెవెన్యూ శాఖలోని వీఆర్వో (గ్రేడ్-1)లు కంప్యూటర్ ప్రొఫిషియెన్సీ టెస్టు(సీపీటీ) కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నెల 12 నుంచి 18వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. ఈ నెల 26వ తేదీన పరీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించింది.

## మెప్మా ఆర్పీలకు రెండు రోజుల శిక్షణ

సాక్షి, అమరావతి: పట్టణాల్లోని స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేసి ప్రభుత్వ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేసేలా మెప్మా రిసోర్స్ పర్సన్(ఆర్పీ)లకు జిల్లా స్థాయిలో 2 రోజుల రెసిడెన్షియల్ శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్టు మెప్మా మిషన్ డైరెక్టర్ వి.విజయలక్ష్మి గురువారం తెలిపారు. జగనన్న మహిళా మార్ట్, జగనన్న ఈ-మార్ట్, మెప్మా అర్బన్ మార్కెట్, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ సున్నావడ్డీ, మహిళల జీవనోపాధుల అభివృద్ధి వంటి అంశాలపై శిక్షణ ఉంటుందని చెప్పారు. శిక్షణ తీసుకున్న ఆర్పీలు వారి పరిధిలోని సంఘ సభ్యులకు 'మన సంఘం-మన సంక్షేమం-మన అభివృద్ధి' పేరుతో ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవడంపై తర్ఫీదు ఇస్తారన్నారు. రాష్ట్రంలో 8,000 మంది ఆర్పీలకు శిక్షణ ఇవ్వడం ద్వారా పట్టణాల్లోని 25 లక్షల కుటుంబాలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. మే 1 నుంచి ఇప్పటి వరకు 1,050 మంది ఆర్పీలకు శిక్షణ ఇచ్చామన్నారు. నెలాఖరులోగా అందరికీ శిక్షణ పూర్తి చేస్తామన్నారు.

## సీఎం జగన్‌ను కలిసిన క్రికెటర్ అంబటి రాయుడు

సాక్షి, అమరావతి: టీం ఇండియా మాజీ క్రికెటర్, ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్(సీఎస్కే)కు ప్రాతినిధ్యం వహిస్తున్న అంబటి రాయుడు గురువారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో క్రీడల అభివృద్ధి, క్రీడారంగంలో యువతకు అవకాశాలు, యువతకు శిక్షణపై సీఎం వైఎస్ జగన్‌తో అంబటి రాయుడు చర్చించారు. రాయుడు చేసిన ప్రతిపాదనను సీఎం వైఎస్ జగన్ స్వాగతించారు. ఈ సీజన్‌లో ఐపీఎల్‌లో సీఎస్కే తరపున ఆడుతున్న అంబటి రాయుడుకు సీఎం వైఎస్ జగన్ శుభాకాంక్షలు తెలిపారు. ఐపీఎల్‌లో మరింత రాణించాలని ఆకాంక్షించారు.

తెలంగాణ

## పాస్‌పోర్టు దరఖాస్తులకు 7,150 అదనపు స్లాట్లు

రాంగోపాల్‌పేట్ (హైదరాబాద్): పాస్‌పోర్టు దరఖాస్తుదారులు స్లాట్‌ల కోసం సుదీర్ఘ కాలంగా వేచి ఉండకుండా ఉండేందుకు ఈ నెల 15వ తేదీ నుంచి 31వ తేదీ వరకు అదనంగా 7,150 స్లాట్స్ విడుదల చేస్తున్నట్లు హైదరాబాద్ ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి దాసరి బాలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 26వ తేదీ నుంచి మే 12వ తేదీ వరకు 5,500 స్లాట్లు అదనంగా విడుదల చేశామని, అలాగే ఏప్రిల్ 29వ తేదీన శనివారం పాస్‌పోర్టు డ్రైవ్‌లో మరో 3,056 స్లాట్లు విడుదల చేసి దరఖాస్తులు స్వీకరించినట్లు పేర్కొన్నారు. అయినప్పటికీ ఇంకా దరఖాస్తుదారులు స్లాట్ల లభ్యతకు సుదీర్ఘకాలం వేచి చూడాల్సి వస్తుండటంతో అదనంగా 7,150 స్లాట్లు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని బేగంపేట, అమీర్‌పేట్, టోలిచౌకితో పాటు కరీంనగర్, నిజామాబాద్‌లలోని పాస్‌పోర్టు సేవా కేంద్రాల్లో తత్కాల్, సాధారణ, పీసీసీల కోసం స్లాట్లు బుక్ చేసికోవచ్చని తెలిపారు. అదనపు స్లాట్లను ప్రతి బుధ, శుక్రవారాల్లో సాయంత్రం 4.30కు విడుదల చేస్తామని వివరించారు. కొత్తగా దరఖాస్తు చేసుకునే వారు, గతంలో దరఖాస్తు చేసుకున్న వారు ఈ అవకాశాన్ని వినియోగించుకుని, తమ అధికారిక పోర్టల్, ఎంపాస్‌పోర్ట్‌సేవా యాప్ ద్వారా షెడ్యూలింగ్, రీ షెడ్యూలింగ్ చేసుకుని కొత్త తేదీల్లో స్లాట్లు పొందవచ్చని తెలిపారు.

## చిలగడదుంప @ 5 కేజీలు



సాధారణంగా చిలగడదుంపలు అరకిలోలోపు ఉంటాయి. బాగా పెరిగితే ఒక కిలో వరకు పెరుగుతాయి. కానీ.. కృష్ణా జిల్లా ఘంటసాలకు చెందిన మూల్పూరి బలరామకృష్ణ ఇంటి పెరటిలో పెరిగిన చిలగడదుంపలు 5 కిలోలకుపైగా పెరిగాయి. మొత్తం 4 దుంపలు తవ్వగా ఒక్కో దుంప 5 కిలోలు ఉంది. ప్రత్యేకంగా ఎలాంటి ఎరువులు వాడలేదని బలరామకృష్ణ చెప్పారు. - ఘంటసాల(అవనిగడ్డ)

# ప్రైవేటు ఉద్యోగాల కల్పనలో అమెరికా కంపెనీలదే హవా

ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగాలు కల్పిస్తున్న కంపెనీలలో అమెరికా కంపెనీలు ముందు వరుసలో ఉన్నాయి. అత్యధికంగా ఉద్యోగాలు కల్పిస్తున్న టాప్-10 కంపెనీల్లో 5 అమెరికా కంపెనీలే ఉన్నాయి.

అమెరికా రిటైల్ స్టోర్ దిగ్గజ సంస్థ వాల్‌మార్ట్, అమెజాన్, యునైటెడ్ పార్సిల్ సర్వీసెస్, కొరేగర్, హోమ్ డిపో సంస్థలు అత్యధిక మందికి ఉద్యోగాలు కల్పించడం ద్వారా టాప్-10లో చోటు దక్కించుకున్నాయి. వాల్‌మార్ట్ కంపెనీ ఒకటే ఏకంగా 23 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించడం ద్వారా మొదటి స్థానంలో ఉన్నట్టు వరల్డ్ స్టాటస్టిక్స్ ఓఆర్‌జీ సంస్థ తాజాగా విడుదల చేసిన గణాంకాల్లో వెల్లడించింది. 15.41 లక్షల మందికి ఉపాధి కల్పించడం ద్వారా ఆన్‌లైన్ మార్కెటింగ్ సంస్థ అమెజాన్ రెండో స్థానంలో, తైవాన్‌కు చెందిన ఫాక్స్ కాన్ 8,26,608 మందికి ఉద్యోగాలు కల్పించడం ద్వారా మూడో స్థానంలో నిలిచాయి.

- సాక్షి, అమరావతి

### ప్రపంచంలో టాప్-10 కంపెనీల్లో 5 అమెరికావే

- 23 లక్షల ఉద్యోగాల కల్పనతో మొదటి స్థానంలో వాల్‌మార్ట్
- 6.16 లక్షల ఉద్యోగాల కల్పనతో 6వ స్థానంలో భారతీయ కంపెనీ టీసీఎస్
- టాప్-100లో నాలుగు భారతీయ కంపెనీలకు చోటు
- 3.46 లక్షల ఉద్యోగాల కల్పనతో 34వ స్థానంలో నిలిచిన ఇన్ఫోసిస్
- 2.60 లక్షల ఉద్యోగాలతో మహీంద్రా 61వ స్థానం
- 2.36 లక్షలతో 74వ స్థానంలో నిలిచిన రిలయన్స్ ఇండస్ట్రీస్



### ఉద్యోగాల కల్పనలో టాప్-10 కంపెనీలివే..




### 6వ స్థానంలో టీసీఎస్

టాప్-10లో ఇండియాకు చెందిన టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) ఒక్కటే చోటు దక్కించుకుంది. టీసీఎస్ 6,16,171 మందికి ఉపాధి కల్పించడం ద్వారా 6వ స్థానంలో నిలిచింది. దేశంలో అత్యధిక మందికి ఉపాధి కల్పిస్తూ టాప్-100లో చోటు దక్కించుకున్న మరో మూడు భారతీయ కంపెనీలు ఉన్నాయి. ఇన్ఫోసిస్ 3,46,845 ఉద్యోగాల కల్పనతో 34వ స్థానంలో నిలవగా.. 2.60 లక్షల ఉద్యోగాల కల్పనతో మహీంద్రా 61వ స్థానం, 2.36 లక్షల ఉద్యోగాలిచ్చి రిలయన్స్ ఇండస్ట్రీస్ 74వ స్థానంలో నిలిచాయి.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943 